భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

జూన్ 1970

★

సంపుటము : 47 : సంచిక : 6 :

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

జూన్ 1970

అక్షైర్మా దీవ్య

శ్రీ కాళూరి హనుమంతరావు

సోమ రస మటు మిగుల మాదకము లగుచు
జయ పరాజయముల నన్ను రేబవళ్లు
జాగరితు జేయుచున్ విభీతక వినిర్మి
తాక్షములు నా ఎదుట త్రుళ్లిపడుచునుండు.

కడు సాధ్వియు ననుకూలయు
మద్గేహిని నన్ దిరస్కరింపదు కోపిం
పదు శాంతమూర్తి నామెను
అకటా! దుఃఖిత నొనర్తు నక్షమ్ములకై.

అత్త నిందించు భార్య రోధించు నింట
బంధువులు కించిత్తు యాచించినన్ ధ
నమ్ము లభ్యము కాదించుకేని ముదుక
గుర్రముకు మూల్యమునుబోలె కితవునకును.

సకల ధనమ్ము నోటువడి ద్యూతమునన్ ఋణబద్ధుడైన నా
సతిని పరాభవింతు రితరుల్ తలిదండ్రులు పుత్రభావమున్
విడిచి త్యజింతు రాడ నిక పై చని నే శపథమ్మొనర్చియున్
గలగలమన్న అక్షరవమున్ విని జారిణివోలె పోవుదున్.

గగనమున రవివోలె లోకమ్మునందు
స్వేచ్ఛ విహరించు నేబదిమూడు పారె
లెంత కోపశాలికిని లొంగవు ధరాధి
నాథుడును వీని ముందు వినమ్రుడగును.


క్షేత్రములయ్యు భూమినయి ధూర్తుల గుండెలపై స్ఫురించు హ
స్తమ్ములు లేనివైన నవలీలగ గెల్చును హస్తవంతులన్
దివ్యములైన నిప్పులు సమింధనహీనములయ్యు వెల్గుచున్
చల్లనివయ్యు మానసములన్ పరితాపముచే దహించెడున్.

జాయ తపియించు మాత దుఃఖార్త అగును
ద్యూతమున ఋణగ్రస్తుడై కితవు డెటకొ
పారిపోవ, నాతడు పవల్ భీతుడగుచు
రేయి ధనలిప్సుడై చౌర్యముకు గడంగు.

వస్త్రములన్ విభూషణములన్ ధరియించి ప్రమోదచిత్తలై
ఇళ్ళ నలంకరించుకొను అన్యులభార్యలజూచి ఆత్మ ప
త్నీ వ్యధకుంగలంగు కితవుండయినన్ మరునాడు ప్రొద్దుటే
వే చని ద్యూతసక్తుడయి రేయికి పూర్ణదరిద్రుడయ్యెడున్.

అక్షవ్యసనము విడువుము
కృషిచేయుము న్యాయయుతసమార్జితవిత్త
మ్మున గోగృహవంతుడవై
జాయాపుత్రులకు గూర్చుమా సౌఖ్యమ్మున్.

(ఋగ్వేదమునుండి అనువాదము)



ఆర్థికశాస్త్ర చారిత్రక వికాసం :

ప్రాచీన సంప్రదాయం - ఆడమ్ స్మిత్

డా॥ ఏ. ఆర్. కె. మూర్తి

ఫ్రాన్సు దేశంలోని ప్రకృతిధర్మవాదులు ఆర్థిక శాస్త్రాన్ని స్థాపించారనడం అంత సమర్థనీయంకాదు. వారి విజ్ఞాన శాఖకు చేసిన సేవఎంతో విలువైనదైనా ఆర్థికసమస్యలను గురించి వారు చేసిన పరిశీలన అంత సమగ్రంగా లేదనే చెప్పవలె. ప్రకృతిధర్మవాదులు చర్చించిన అంశాలు నేడు కేవలం చారిత్రకంగా మాత్రమే ముఖ్యమవుతున్నాయి. ప్రకృతిధర్మవాదుల పరిశీలన పాక్షికమైంది. కేవలం వ్యవసాయమే ప్రధానమైందన్నీ మిగిలిన ఉత్పత్తిశాఖలు నిరుపయోగమైనవని వారు భావించినారు. ఆర్థికశాస్త్రంలో అన్ని విషయాలను కూలంకషంగా చర్చించడానికి ఒక విధానాన్ని రూపొందించవలసిన అవసరం ఉన్నట్లు తోచింది. ఈ లోటును తీర్చే బాధ్యత ప్రాచీనసంప్రదాయుల పైన బడింది. ప్రాచీన సంప్రదాయుల్లో మొదటివాడు ఆడమ్ స్మిత్.

అడమ్ స్మిత్ 1723–1790 :

ఆడమ్ స్మిత్ ఆర్థికశాస్త్ర సంస్థాపకుల్లో ప్రథముడు. అతని రచనలతో ఆర్థిక శాస్త్ర వికాస చరిత్రలో ఒక నూతనశక మారంభమైంది. ఇతణ్ణి ఆర్థికశాస్త్రపిత (Father of Political Economy) అనడం పరిపాటి అయింది. ఇట్లా అనడానికి కొన్ని కారణాలున్నాయి. ఇతరుల రచనలలో నుంచి కొన్ని భావాలను గ్రహించినా వాటికి ఒక నూతన స్వరూపాన్ని ఇచ్చి, నూతన మార్గాల్లో పరిశీలన జరిపి శాస్త్రాభివృద్ధికి ఎనలేని సేవ చేసినాడు. అతడు రూపొందించిన సిద్ధాంతాలు అతని పూర్వుల రచనలలో ధ్వని మాత్రంగా ఉంటే వాటికి ఒక రూపాన్ని ఇచ్చి సిద్ధాంతీకరించినాడు. ఇట్లా చెయ్యడంతో పూర్వుల రచనలన్నీ మరుగున పడిపోయినాయి. అతని రచన దేశసంపద (Wealth of Nations). ఆర్థికశాస్త్రచరిత్రలో మొదటి మైలురాయనవచ్చు. అతణ్ణి ప్రభావితం చేసిన కొందరి రచనలను ఇక్కడ వివరించడం అవసరం. హచ్చిసన్ (Hutchson), మాండ్విల్ (Mandeville), ప్రసిద్ధ తత్వవేత్త అయిన డేవిడ్ హ్యూమ్ (David Hume) మొదలైనవారి రచనలను ఈ సందర్భంలో చెప్పవచ్చు. హచ్చిసన్ శ్రమవిభజనప్రాముఖ్యాన్ని గుర్తించినాడు. ఇట్లానే ద్రవ్యం విలువలో ఏర్పడే ఒడుదుడుకులనూ, ఆ విలువకు ఆధారమైన అంశాలనూ, ఆ విలువలోని అస్థిరతను తొలగించడానికి శ్రమగానీ, ధాన్యంగానీ ఎంతవరకూ ద్రవ్యంగా ఉపయోగించబడుతుందో అనే ప్రశ్నను హచ్చిసన్ వివరంగా చర్చించినాడు. ఈ విషయాలలో ఆడమ్‌స్మిత్ ఉద్దేశాలకూ, హచ్చిసన్ ఉద్దేశాలకు చాలా సామ్యం ఉంది. సహజక్రమాన్ని (Natural Order) గురించి కూడా హచ్చిసన్ ప్రస్తావించినాడు. సహజస్థితి విషయంలో హచ్చిసన్ కన్నా మాండ్విల్ చెప్పిన..... తేనెటీగల నీతి గాథ....(Fable of the bees) ఇక్కడ ముఖ్యంగా చెప్పవచ్చు. ఈ నీతికథలో నాగరికతకుమూలం మానవుని స్వభావప్రవృత్తులనీ, సాంఘిక పురోభివృద్ధికి కారణం, మానవుని స్వార్థపరత మొదలైన దుర్గుణాలేకానీ వానిత్యాగము మొదలైన సద్గుణాలు కావనీ మాండ్విల్ ప్రబోధించినాడు. స్మిత్ నిర్మించిన విజ్ఞాన సౌధంలో భావైక్యము కొంచెం మార్పు చెందింది. జాతీయసంపద

మానవుని సహజగుణాలలో ఒకటైన ఉదాత్త స్వార్థాభిలాష (Enlightened Self-interest) పై ఆధారపడి ఉంటుందని స్మిత్ భావించినాడు.

దేశ సంపద : (Wealth of Nations)

ఆడమ్ స్మిత్ గ్లాస్‌గో విశ్వవిద్యాలయంలో చేసిన ఉపన్యాసాలనే తరువాత విపులీకరించి ఒక గ్రంథం రూపంలో వెలువరించినాడు. తరువాత పంపిణీవిధానానికి సంబంధించిన అధ్యాయాన్ని చేర్చడం జరిగింది. బహుశా ఇది ప్రకృతిధర్మవాదుల ప్రభావం వల్ల జరిగి ఉండవచ్చుననే అభిప్రాయాన్ని కొందరు చరిత్రకారులు వ్యక్తం చేసినారు. పంపిణీ విధానం ప్రకృతి ధర్మవాదుల వాదానికి ఆయువు పట్టు.

స్మిత్ తన గ్రంథాన్ని రచించిన కాలంలో అనేక దేశాలలో ఎన్నో కొత్తకొత్త సంఘటనలు జరిగినాయి — అమెరికా స్వతంత్ర దేశమైంది; వాట్ ఆవిరి యంత్రాన్ని కనిపెట్టినాడు; వాణిజ్య వాదుల ప్రతిపాదనలను ఖండిస్తూ ప్రకృతి ధర్మవాదులు తమ విధానాలను ప్రతిపాదించినారు. వారి విధానాల ఫలితంగా ఫ్రాన్సులో పరిశ్రమలు అభివృద్ధి చెందినాయి; వ్యక్తిగత స్వేచ్ఛ లభించడం వల్ల అనేక కళలు వెలసిల్లినాయి. ఒక్క మాటలో చెప్పాలంటే దేశాలు ఒక నూతనచైతన్యాన్ని పొందినాయి. నూతనమార్గాల్లో ఆలోచిస్తూ కొత్తకొత్త విధానాలను ప్రతిపాదిస్తూ ఉండిన సమయమిది. సంఘంలోని అనేక విషయాలను ఆకళింపు చేసుకొని కట్టుదిట్టమైన ఒకపద్ధతిని రూపొందించడానికి అది సరియైన అదను. అట్లాంటి పరిస్థితుల్లో సాగింది ఈ గ్రంథరచన. ఆనాటి దేశకాలప్రభావాలకు ఆడమ్‌స్మిత్ అతీతుడు కాదు. ఆడమ్‌స్మిత్ రచించిన గ్రంథం ప్రాముఖ్యాలేమిటో, ఆయన సిద్ధాంతాలు ఏమిటో వివరంగా పరిశీలిస్తాము.

సంఘము-వర్గవిభజన :

స్మిత్ చేసిన సిద్ధాంతాలకు మూలం అతను సూచించిన మూడు వర్గాల విభజనే అనేది నిర్వివాదాంశం.

1. భాటకరూపంలో ఆదాయాన్ని సంపాదించుకొనే భూస్వాముల వర్గం.
2. వేతనాల ద్వారా ఆదాయాన్ని ఆర్జించుకొనే శ్రామిక వర్గం.
3. లాభాలను గడించి అభివృద్ధి చెందే పెట్టుబడిదారులవర్గం.

ఈ మూడు వర్గాలకు విభిన్న దృక్పథాలు, వేర్వేరు ధ్యేయాలు ఉంటాయి. మొదటి రెండింటి ఆశయాలు సంఘశ్రేయస్సుతో ముడిపడి ఉంటాయి. మూడోవర్గం సంఘాన్ని అందులోని అనేక వ్యవస్థలను స్వలాభం కోసం ఉపయోగించుకొంటుంది. అధికలాభాలను ఆర్జించడానికి సంఘంపై గుత్తాధిపత్యాన్ని సంపాదించడానికి ప్రయత్నిస్తుంది. ఈ వర్గంగుత్తాధిపత్యంతో ఏర్పడే ధరల విధానాన్నే అనుసరిస్తుంది. ఈ విధమైన వ్యవస్థలో మూడువర్గాలకు లభించే ఆదాయం విషయాలను వేతనాలు (Wages), భాటకం (Rent), లాభాలు (Profits) అనే అంశాలుగా విభజించి వివరంగా పరిశీలించినాడు, ఆడమ్ స్మిత్.

వేతనాల నిర్ణయ సిద్ధాంతం : (Theory of wages)

వేతనాలు శ్రామికుల సప్లై జీవితావసర వస్తువుల ధరలపై ఆధారపడుతాయని అతను భావించినాడు. శ్రమకున్న డిమాండు దేశంలోని సంపత్తి నిధి (Stock) (దీన్నే తరువాతి వారు మూలధనరాశి (Capital Stock) అన్నారు) పై ఆధారపడుతుంది. ఈ సంపత్తిని అభివృద్ధిచెయ్యడం చాలా ముఖ్యం. దేశంలో అభివృద్ధి జరుగుతున్నప్పుడు శ్రామికుల అవసరం (Demand for Labour) ఎక్కువగా ఉంటుంది. అందువల్లనే వేతనాల రేటు కూడా హెచ్చుగా ఉంటుంది. ఏ వ్యాపారరంగంలో నైనా పెరుగుదల ఉంటే ఆరంగంలో వేతనాలస్థాయి హెచ్చుగానే ఉంటుంది. దీన్నిబట్టి ఆడమ్‌స్మిత్ శ్రామికులకు కనిష్ఠ జీవనస్థాయిలో ఉండే వేతనం అవసరమని భావించినట్లు అర్థమవుతుంది. కానీ ఎదుగుబొదుగులు లేని స్థితిలో శ్రామికుల సంఖ్య అత్యధికమవుతుందని అతను గ్రహించినాడు. ఉన్న ఉద్యోగావకాశాలకు మించి శ్రామికుల సంఖ్య పెరుగుతుందని భావించినాడు. అట్లా పెరగడం వల్ల

వేతనాలు పడిపోతాయి. ఈ విధంగా చెప్పడంలో స్మిత్ మాల్థస్ సూచించిన సిద్ధాంతాలకు మార్గదర్శకులనిపిస్తుంది.

ఇతని వేతనసిద్ధాంతం ఇతని తరవాత ప్రాముఖ్యంలోకి వచ్చిన కాఠిన్య సూత్రానికి (Iron Law of Wages) దారితీసింది. ప్రతిసంఘంలోను ప్రతి ఉత్పాదనసాధనానికి సహజప్రతిఫలం ముట్టుతుందని, వస్తువుల విలువ ఈ సహజ ప్రతిఫలాల మొత్తానికి సమానమైతే ఆ విలువ సహజపరిమాణంలో ఉంటుందనీ, అప్పుడు ఆ వస్తువు యథార్థపు విలువకు అమ్ముడుబోతుందని స్మిత్ సిద్ధాంతీకరించినాడు. ఈ సహజపు విలువ సిద్ధాంతాన్ని ఒక విధంగా ఉత్పత్తి వ్యయ సిద్ధాంతం (Cost of Production Theory) అనవచ్చు.

పై సిద్ధాంతాన్ని వేతన నిర్ణయ విధాన వివరణకు ఉపయోగిస్తే సహజవేతనము వైపుకు మార్కెట్టు వేతనాలు మొగ్గుతాయని తెలుస్తుంది. అంటే బాహ్యపరిస్థితిల్లో మారకుండా ఉంటే మార్కెట్టు వేతనాలూ, సహజమైన వేతనాలు సమానంగా ఉంటాయని అర్థం.

భూస్వామి, ధనికవర్గాలు సంఘంలో బయలుదేరడంలో ఇతని శ్రమసిద్ధాంతం నిరుపయోగమైంది. శ్రామికులకు, యజమానులకు ఉండే బేరమాడేశక్తి (Bargaining Power) వల్ల వేతనాల స్థాయి నిర్ణయమవుతుందని స్మిత్ భావించినాడు. ఇది ఇతని రెండో వేతన సిద్ధాంతం. ఇందులో సప్లై డిమాండులు వేతనాల రేటును నిర్ణయించే అంశాలు. శ్రామికుల సంఖ్య పెరిగి యజమానుల సంఖ్య తక్కువగా ఉంటే యజమానులు ఒక కూటమిగా చేరి వేతనాలను తగ్గించి, శ్రామికుల వర్గాన్ని పీడించడానికి అవకాశం ఉంటుందని కూడా స్మిత్ చెప్పినాడు. అంటే యజమానులు తమ ఇష్టం వచ్చిన రేటును ఏర్పాటు చేస్తారని అర్థం కాదు. శ్రామికులసంఖ్య తక్కువగా ఉండాలంటే వేతనాల స్థాయి కనిష్ఠ జీవన స్థాయి కంటే తక్కువగా ఉండకూడదు. శ్రామికుల కనిష్ఠ జీవన ప్రమాణం, వారి వేతనాల కనిష్ఠ ప్రమాణాన్ని నిర్ణయిస్తుందని స్మిత్ భావించినాడనే విషయాన్ని ముందే తెలుసుకొన్నాము. శ్రామికులు తగ్గినా, వారు కూటమిగా ఏర్పడినా వేతన నిధిని (Wage Fund) బట్టి సగటువేతనాలు నిర్ణయమవుతాయని స్మిత్ వేతన సిద్ధాంతాన్ని రూపొందించినాడు. (Wage Fund Theory of Wages) ఇట్లా వేతనాల పరిమాణం, దేశంలోని ఆర్థికస్థితిని సానుపాతంగా సూచిస్తుందని కూడా స్మిత్ ఉద్దేశం. ఇంతేకాక వేతన పరిమాణం జనాభా పరిమాణాన్ని నిర్ణయిస్తుందనే మాల్థస్ సిద్ధాంతాన్ని కూడా స్మిత్ ఊహించినాడు.

మూలధనం పరిమాణం పెరిగే కొద్దీ స్పర్ధ (Competition) పెరగడంతో లాభంరేటు తగ్గుతుంది. కాబట్టి వేతనాలుపెరగడం లాభపురేటు పెరగడంవల్ల ఆర్థిక పురోగమనం క్రమంగా మందగించి తుట్టతుదకు ఆర్థిక వ్యవస్థలో స్తబ్దత ఏర్పడుతుందిఅని స్మిత్ భావించినాడు.

స్మిత్ మరొక సిద్ధాంతం వేతన విభేదాలను విశదీకరిస్తుంది. వేతన విభేదాలు వృత్తులను బట్టి ఉంటాయని వీటి సారాంశం. ఏ వృత్తినైనా ఎంత సులభంగా నేర్చుకోడానికి వీలుంటుందో, అది ఎంత ప్రీతకరమైందిగా ఉంటుందో, ఆ వృత్తిని అవలంబించడానికి ఏ మాత్రం అవకాశం ఉంటుందో, ఎంతకాలం జీవనోపాధిగా సహాయపడుతుందో అనే అంశాలు వేతన విభేదాలను నిర్ణయిస్తాయనే స్మిత్ వాదం, ఒక వృత్తినుండి మరొక వృత్తికి మారడం, రెండువృత్తులకు మధ్య ఉండే విభేదాలను విశదీకరించలేదు. ఇదే ఇందులోని ముఖ్యమైన లోపం. అంటే వృత్తులను స్పర్ధారహితంగా ఉండే వృత్తులుగా విభజించడానికి ఇతడు ప్రయత్నించ లేదనేది స్పష్టమవుతుంది. ఈ విధమైన స్పర్ధారహిత్యమే వేతన విభేదాలను నిర్దేశించేదని ఆధునికుల అభిప్రాయం.

స్మిత్—భాటక వివరణ సిద్ధాంతం : (Theory of Rent)

భూమిని ఉపయోగించుకోడానికి రైతుకు చెందే ధరే భాటకం. ఈ భాటకం వివిధ ప్రాంతాలలో వివిధ పరిమాణాలలో ఉండవచ్చు. మార్కెట్లకు

దూరంగా ఉండే మారుమూల ప్రాంతాల్లో వ్యవసాయానికి ఎక్కువమంది శ్రామికులు అవసరం కాబట్టి వ్యవసాయోత్పత్తిలో నికరోత్పత్తి తక్కువగా ఉంటుంది. అందువల్ల భాటకం కూడా తక్కువగా ఉంటుందంటాడు..

భూస్వాములు రైతులనుండి రాబట్టే అద్దె ఏకస్వామ్యఉత్పత్తిదారుడు నిర్ణయించే ధరవంటిదని స్మిత్ అభిప్రాయం. ఇంతవరకు అతని వాదనలో పటుత్వం ఉంది. కానీ భాటకానికీ ధరకూ ఉండే సంబంధాన్ని వివరించినప్పుడు అతని వాదన మరీ బలహీనంగా ఉంటుంది. భాటకమనేది ధరను నిర్ణయించే ప్రధానాంశంగా భావిస్తాడు. అతని సిద్ధాంతాన్ని మరికొంత విపులంగా పరిశీలిస్తాము.

భూమిని వృద్ధి చెయ్యడానికి ఏ విధంగానూ ప్రయత్నించకుండానే భూస్వామి భూమి ద్వారా వచ్చే భాటకాన్ని అనుభవిస్తాడనే దాన్ని ఆధారం చేసుకొని డేవిడ్ రికార్డో తన భాటకసిద్ధాంతాన్ని రూపొందించినాడు. ఈ విషయంలో ఏకస్వామ్యం ఉంటుందని అతని అభిప్రాయం. ఇది భూమిపై ఉత్పాదనానికి అయ్యే వ్యయం మినహా నికరాదాయం భూమి ఇస్తుందనీ, భాటకం భూస్వామికి దక్కుతుందనీ స్మిత్ భావించినాడు.

ఆర్థిక పురోగమనం అంటే అమ్మదగిన వస్తువుల ఉత్పాదనం ఎక్కువకావడమేనని స్మిత్ భావించినాడు. ఈ పురోగమనానికి కావలసింది ధన సంచయం (Capital Accumulation) ఎక్కువ కావడమే ఇట్లాంటిది స్వార్థపరతవల్ల ఆర్థిక పురోగమనం సాధ్యమవుతుందని స్మిత్ వాదం

లాభాలు, వడ్డీ : (Profits and Interest)

లాభాలన్నీ మూలధనానికి చెల్లించే ప్రతిఫలమనీ (Returns upon capital), వడ్డీ ఋణంగా తెచ్చిన మూలధనానికి చెల్లించే ధర (Price for the use of borrowed capital) అనీ స్మిత్ భావించినాడు.

దేశంలోని సంపద పెరగడంతో వేతనాలు పెరుగుతాయి. లాభాలు తగ్గుతాయి. వ్యాపారస్తులు తమ దగ్గరఉండే మూలధనాన్ని తమ వ్యాపారంలో పెట్టుబడి పెట్టితే వ్యాపారస్తుల మధ్య పోటీ ఏర్పడి లాభాలు తగ్గడానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ అంశాన్నే మరికొంత వివరిస్తూ దేశ సంపత్తి పెరిగే కొద్దీ లాభాలు పడిపోతాయి, వేతనాలు పెరుగుతాయి; అంటే లాభాలు, వేతనాలు రెండు విభిన్న మార్గాల్లో మార్పు చెందుతూ ఉంటాయని స్మిత్ భావించినాడు.

పైన చెప్పిన లాభాలూ వేతనాలలో వచ్చే మార్పుల విషయంలో కొన్ని ప్రత్యేకతలను సూచించినాడు:—

ఎ. కొత్తగా ఏర్పడిన వలస దేశాలలో ఈ రెండూ హెచ్చుస్థాయిలోనే ఉంటాయి.

బి. ఎదుగుబొదుగులు లేని వ్యవస్థలో ఈ రెండు తక్కువ స్థాయిలోనే ఉంటాయి.

శ్రమవిభజనం : (Division of Labour)

శ్రమ విభజన విధానాన్ని అనుసరించడం వల్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి వీలు అవుతుంది. వేలకువేలు శ్రామికుల సహకారం లేనిదే సంఘంలోని కడుపేదల జీవనం కూడా సాధ్యంకాదు. ఈ విధమైన సాంఘిక సహకారం వ్యక్తుల త్యాగబుద్ధి వల్లకాక వారివారి స్వార్థపరత్వం వల్లనే సాధ్యమవుతుంది. అంటే మానవులు తమకు వెంటనే అవసరమైన వస్తువులను వినిమయం ద్వారా కొనగోరుతారు కాబట్టి వాటికి మారుగా చెల్లించడానికి అవసరమైన వస్తువులను ఉత్పత్తి చేస్తారు. దీని ఫలితంగా సాంఘిక ఆర్థిక పురోగమనానికి శ్రమవిభజన మూలమవుతుంది. పదిమంది పనివాళ్లు కలసి శ్రమ విభజన విధానం ద్వారా రోజుకు పన్నెండు పౌన్ల గుండుసూదులను తయారుచేసే విధానాన్ని స్మిత్ సూచించినాడు. బీదవాళ్లు కాబట్టి ఉత్పత్తికి అవసరమైన పరికరాలు, మూలధనం ఎవరికి వారు సమకూర్చుకోలేకపోయినా శ్రమవిభజన ద్వారా సమష్టిగా వారు ఉత్పత్తిని సాధించగలిగినారని స్మిత్ భావించినాడు. ఈ విధమైన శ్రమ విభజన ఉత్పాదనాన్ని ఎట్లా ఎక్కువ చెయ్యగలిగిందో వివరించినాడు.

1. ఒకవ్యక్తి ఒకే పనిని ఎప్పుడూ చేయడం వల్ల దాని నైపుణ్యం పెరుగుతుంది.

2. ఇట్లా చెయ్యడంవల్ల కాలం వృధాకాదు.

3. పనిలో నిమగ్నులైనవారు ఆ పని చెయ్యడంలో నూతన విధానాలనూ, యంత్రాలనూ కనుక్కోవడానికి అవకాశం ఉంటుంది.

ఈ పద్ధతిలోని ప్రయోజనాలను గురించి మాత్రమే చెప్పినాడు కానీ లోపాలను చెప్పలేదు. శ్రమవిభజనవిధానాన్ని అనుసరించాలంటే ఉత్పత్తి అయిన వస్తువులకు ఉన్న మార్కెట్టును కూడా దృష్టిలో ఉంచుకోవాలి. మార్కెట్టు పరిమితంగా ఉంటే ఉత్పత్తిని పెంచితే ఉత్పత్తిదారుకు నష్టం వస్తుంది. మార్కెట్టు అంటే దేశంలో ఉండేది ఒక్కటే అనికాదు. అంతర్జాతీయంగా తయారైన వస్తువులకు గిరాకీ ఉంటే కూడా ఉత్పత్తిని పెంచ వచ్చు. ప్రకృతిధర్మవాదులు చెప్పినట్లుకాక సంఘం లోని ప్రతివర్గం ఉత్పత్తి కార్యక్రమంలో పాలు పంచుకొంటారని స్మిత్ భావించినాడు. దీన్నిబట్టి ప్రభుత్వం విధించే పన్నులు ఏ ఒక్క వర్గం మీదా కాకుండా సంఘంలోని ప్రతివర్గానికి సంబంధించి ఉండాలని స్మిత్ భావించినట్లు అర్థమవుతుంది.కానీ సంఘాన్ని ఉత్పాదకులు, అనుత్పాదకులు అని రెండ వర్గాలుగా విభజించినాడు. ఇది బహుశా స్మిత్‌కు ప్రకృతిధర్మవాదులపట్ల ఉండే గౌరవం వల్లనేమో అనితోస్తుంది. భాటకం భూమివల్లనే వస్తుందని వాదించడం వల్ల ప్రకృతిధర్మవాదంలో ఉండే లోపం ఇతని సిద్ధాంతాలలో కూడా ప్రవేశించిం దనే అనుమానం కలుగుతుంది. ఇంతేగాక స్మిత్‌కు స్వయంగా వ్యవసాయవృత్తిలో నమ్మకం ఎక్కువ. ఇతనికి ఆధునిక పారిశ్రామిక యుగాగమనం తెలుసు నని చాలా మంది పొరపాటు పడినారు. కానీ ఇతని ఆశాజనక ఆర్థికవృద్ధి సిద్ధాంతన్ని అందులో కీలకమైన ఉత్పత్తి క్రమవృద్ధి సూత్రాన్నిచూస్తే అతను పారిశ్రామికయుగాగమనాన్ని గుర్తించినాడా అనే అనుమానం కలక్కమానదు. దీనికి కారణం, అతని సిద్ధాంతాలు కేవలం వ్యవసాయమే ప్రధా నంగా ఉండే ఆర్థిక వ్యవస్థలకు మాత్రమే వర్తిం చేవిగా ఉండకపోవడమే.

స్మిత్–మూల్య నిర్ణయ సిద్ధాంతాలు :
(Theories of value)

శ్రమ విభజన వల్ల ఉత్పాదన శక్తి అధిక మవుతుందనేది స్మిత్ రచనల్లో ప్రధానాంశమని ఇదివరకే తెలుసుకున్నాం. ఈ విధానం జయప్రదం కావడానికి తగిన మార్కెట్టు ఉండవలెననే విషయా యాన్ని కూడా తెలుసుకున్నాం. మార్కెట్టు సక్ర మంగా ఉండడానికి ద్రవ్యం అవసరం. అంటే సాపేక్ష మూల్యాలను (Relative values) సర్వసాధారణ ప్రమాణంలో చెప్పడం అవసరం. ఈ సాపేక్ష మూల్యాలు కాలానుగుణంగా మారుతుంటాయి కాబట్టి మూల్య నిర్ణయాంశాలను గురించి ఇతడు చర్చించి నాడు. మూల్యానికి స్థిరమైన ప్రమాణం ఏది అనే అంశాన్ని కూడా చర్చించినాడు. ఈ రెండింటిలోను ఇతనికి ప్రియమైంది మూల్యానికి స్థిరమైన ప్రమాణం ఏదీ అనేదే అనవచ్చు. వస్తూత్పాదనకుమూలమే కాక వస్తువుల విలువకు ప్రమాణంగా కూడా శ్రమే ముఖ్యమని స్మిత్ అభిప్రాయం. ఒక వస్తువు విలువను ఇంకొక వస్తువు విలువతో పోల్చడానికి ప్రమాణం శ్రమే అని భావించినాడు. ఈ సిద్ధాంతామే మార్క్సుచేతుల్లో విప్లవభేరీనినాదమైంది. లభ్యమయ్యే ఉత్పాదన సాధ నాల జాబితాలో మూలధనం చేరని అనాగరిక సంఘా లకు మాత్రమే ఈ సిద్ధాంతాం వర్తిస్తుందని కొందరి అభిప్రాయం. ఆధునిక సంఘంలో భూమి, మూలధనం ఈ రెండింటివల్ల కూడా నిర్ణయింప బడుతుంది. ఇటువంటి విలువ సిద్ధాంతాలను రెండింటినీ స్మిత్ ప్రతిపాదించినాడనవచ్చు.

అనాగరికసంఘంలో శ్రమ పరిమాణంచేత ఆధునిక సంఘంలో ఉత్పాదన సాధనాలకు లభించే సహజ ప్రతిఫలాల సంకలితరాశివల్ల ప్రతివస్తువు సహజమైన విలువ నిర్ణయమవుతుందని ఈతని ఉద్దేశమనవచ్చు. దీన్నే మరొక విధంగా చెప్పవచ్చు. సాంఘిక చరిత్రలో మూడు దశలుంటాయి. మొదటి దానిలో శ్రమే విలువకు మూలకారణం కాబట్టి శ్రామికులకు విలువ మొత్తం ముట్టుతుంది. రెండో దశలో మూలధనం ఉత్పాదనసాధనాల జాబితాలో చేరడంతో విలువలో కొంతభాగం పెట్టుబడిదారు

లకు గిట్టుతుంది. మూడో దశలో, సంఘంలో భూస్వాముల వర్గం బయలుదేరడంతో ఇంకోవాటా వీరికి పోతుంది. ఇట్లా ఉత్పత్తి అయిన విలువలో వేతనాలు, లాభాలూ, భాటకం అనే మూడు విభాగా లున్నాయని అవి వరుసగా శ్రామికులకు, పెట్టు బడిదార్లకు, భూస్వాములకు చెందుతాయని స్మిత్ సిద్ధాంతం.

ఈ విధంగా నిర్ణయమైన **విలువకూ,** మార్కెట్టు విలువ వస్తువుల కుండే సహజమైన విలువకన్నా ఎక్కువగానీ తక్కువగానీ ఉండడం ఆ వస్తువుల సప్లై డిమాండులపైన ఆధారపడి ఉంటుంది.

ఈ సిద్ధాంతంలోని లోపాలు :

. వస్తువుల ధర నిర్ణయాన్ని విశదీక రించడానికి ఉత్పాదన సాధనాల ప్రతిఫలాలను, ఊహించి, ఈ సహజ ప్రతిఫలం నిర్ణయ విధానాన్ని విశదీకరించడానికి వస్తువుల విలువను ఊహించే మూల్య నిర్ణయాన్ని సిద్ధాంతీకరించడం వల్ల ఏ ప్రయోజనం ఉండదు.

2. ఉత్పాదన క్రియను స్మిత్ సక్రమంగా వివరించలేదనే చెప్పవలె. అతని భాటక సిద్ధాంతంకానీ లాభాల నిర్ణయ సిద్ధాంతంకానీ తృప్తికరంగాలేవు. వేతనసిద్ధాంతం కూడా లోప భూయిష్ఠంగానేవుందని చెప్పవలె.

ప్రభుత్వ విత్తం : (Public Finance)

స్మిత్ ప్రభుత్వాదాయానికి రెండు మార్గా లను సూచించినాడు.

1. నిధులు, లాండ్ రెవెన్యూ, దేశంలోని మూలధనం.
2. పన్నుల ద్వారా వచ్చే ఆదాయం.

ఇందులో రెండో మార్గాన్ని అనుసరించడాన్నే స్మిత్ సమర్థించినాడు. పన్నుల విషయంలో స్మిత్ సూచించిన సూత్రాలు ఈనాటికీ ఎంతో ప్రాము ఖ్యంలో ఉన్నాయి. అవి:

1. పన్నులను చెల్లించేవారి శక్తి సామర్థ్యాలను బట్టి ఉండవలె.
2. వాటివల్ల వచ్చే ఆదాయం ఖచ్చితంగా తెలి యవలె.
3. చెల్లించేవారికి సౌకర్యంగా ఉండే విధంగా వాటిని విధించవలె
4. పన్నులను వసూలు చెయ్యడానికి వీలైనంత తక్కువ ఖర్చు అయ్యే పద్ధతులను అనుస రించవలె.

అన్ని రకాల పన్నులు పైనచెప్పిన మూడు విధాలైన ఆదాయాలనుండే రాబట్టుకోవలె. వేతనాలు, లాభాలు, భాటకం లాభాలు, వేతనాలపైన పన్నులు విధించకూడదు. వాటిని పూర్తిగా భాటకంమీదనే విధించవలె నన్నదే స్మిత్ వాదం. ఈ విషయంలో ప్రకృతిధర్మవాదులకూ, స్మిత్‌కూ మధ్య సామ్యం ఉన్నట్లు అర్థమౌతుంది.

అడమ్ స్మిత్-వృద్ధి సిద్ధాంతాలు : (Growth theories)

ఉత్పత్తి సాధనమైన శ్రమ విలువ ఏకైక ప్రమాణమని భావించినా మిగిలిన ఉత్పత్తి సాధనా లను—మూల ధనరాశి,భూమి కూడా గుర్తించినాడు. శ్రామికులకు ఉన్న భూమినుంచే తమ జీవనోపాధిని ఆర్జించుకొంటారు. వేతనాలూ, లాభాలూ అద్దె రాబడికి ప్రధానమైన మార్గాలనేదాన్ని స్మిత్ స్పష్ట పరచినాడు. వీటినే సంకేతాల ద్వారా కిందివిధంగా చెప్ప వచ్చు.

Y=F (K. L. N) ఈ ఉత్పత్తి ఫలం క్షీణఉపాంత ఉత్పాదకత (Diminishing Marginal Productivity) మీద ఆధారపడి ఉంటుందనీ, తరహా ననుసరించి క్రమంగా వృద్ధిచెందే ప్రతిఫల సిద్ధాంతం దీనికి వర్తిస్తుందనీ భావించినాడు. అతని వాదన ప్రకారం, అసలు ఉత్పత్తి వ్యయం, మార్కెట్టు పరిమాణం మారడంవల్ల ఏర్పడే బాహ్యమైన, అంతరంగికమైన ఆదాలవల్ల, కాలం గడిచేకొద్దీ క్షీణి స్తాయి. తరహాననుసరించి వచ్చే ఆదాలు (Economics of Scale) కాలక్రమేణ ఉత్పత్తి యంత్రాం గంలో వచ్చే మార్పుల ఫలితంగానూ ఒనగూడుతాయి. ఇది ప్రారంభమైతే మొత్తం ఆర్థిక వ్యవస్థ స్వయం పోషకశక్తిని పొంది ప్రగతిమార్గాన నడుస్తుంది.

శ్రమ ఉత్పాదకశక్తి, శ్రమ విభజన, శ్రమ ప్రత్యేకీకరణలమీద ఆధారపడి ఉంటుందనీ, ఇవి అంతర్జాతీయంగా ఉండే పరిస్థితుల ప్రభావాలకు లోనై ఉంటాయనీ భావించినాడు. అందుకే శ్రమ విభజన సాంకేతికంగా సాధ్యమైనా దాని ఆర్థిక ప్రయోజనం మార్కెట్టు పరిమాణంమీద ఆధారపడి ఉంటుందని అన్నాడు. మార్కెట్టు పరిమాణం, మూలధన పరిమాణం, స్వేచ్ఛా వ్యాపారానికి సంస్థలపరంగా ఏర్పడే అవరోధాలమీద ఆధారపడి ఉంటాయని భావించినాడు. శ్రమ, భూముల ఉపాంత ఉత్పాదకత ఉపయోగించే మూలధనం మొత్తం, ఆర్థిక వ్యవస్థలోని పెట్టుబడి సంస్థల పైన ఆధారపడి ఉంటుందని అర్థమవుతుంది. కానీ సాంకేతికరంగంలో ఏర్పడే మార్పుల ప్రభావం ఉత్పాదకతమీద ఎట్లా ఉంది అన్న అంశాన్ని విస్మరించినాడని అనుకోకూడదు. సాంకేతికరంగంలో వచ్చే మార్పులు, నూతన ఉత్పత్తి విధానాలు ప్రత్యేక ప్రయత్నం లేకుండానే ఉత్పత్తిరంగంలో ప్రవేశిస్తాయని అనినాడు. అవి అట్లా ప్రవేశించడానికి మూల ధన రాశి అవసరమవుతుందని భావించినాడు. అంటే మూలధనరాశి ఆవశ్యకతను గుర్తించినాడనే తెలుస్తుంది. ఆధునిక శాస్త్రీయ విజ్ఞానాన్ని ఒక ప్రత్యేక చరరాశిగా (Variable) భావించ నవసరం లేదనినాడు.

అతడి ప్రతిపాదనలో మరొకటి శ్రమను గురించి చేసినది. శ్రామికవర్గం, దాని సప్లైకి సంబంధించినంతవరకు, జనాభా పెరుగుదల మీద ఆధారపడి ఉంటుంది. జనాభా పెరుగుదలకు మూలం ప్రజల జీవనానికి అవసరమైనంత ఆహారం అందుబాటులో ఉండడం. అంటే జనాభా పెరుగుదల శ్రామికులకు ఇచ్చే వేతనాల స్థాయి మీద ఆధారపడి ఉంటుందని అతని ఉద్దేశం. వేతనాలు కనిష్ట జీవన స్థాయిలో ఉంటే జనాభా పెరుగుదలకు అవకాశం ఉంటుంది. స్మిత్ ప్రతిపాదించిన జనాభా సిద్ధాంతాన్ని క్లుప్తంగా చెప్పాలంటే జనాభా పెరుగుదల రేటు dLs/dt. అంటే శ్రమ సప్లై పెరగడమన్నమాట. నగదు రూపంలో వారికి లభించే వేతనాలకూ (W) కనిష్టజీవనస్థాయిలో ఉండే వేతనాలకూ ($\overline{W}$) ఉండే తేడామీద ఆధారపడి ఉంటుంది. అంటే వేతనాలు కనిష్టజీవన స్థాయికి మించి ఉంటే జనాభా పెరుగుతుంది, అంతకన్నా తక్కువఉంటే జనాభా క్షీణిస్తుంది. దీన్నే సంకేతాలలో చెప్పాలంటే

$$\frac{dLs}{dt} = q\ (W-\overline{W})$$

వివిధరకాలైన ఆర్థిక వ్యవస్థలలో వేతనాల స్థాయి వేరువేరుగా ఉంటుంది. పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థలో వేతనాల స్థాయి పెచ్చుగా ఉంటుంది; తిరోగమిస్తున్న ఆర్థిక వ్యవస్థలో వేతనాలు చాలా తక్కువగా ఉంటాయి; ఎదుగుబొదుగులులేనిస్థితిలో నిలకడగా ఉంటాయి.

స్మిత్ తన విశ్లేషణలో మూలధనానికి ప్రాధాన్యం ఇచ్చినాడు. పొదుపు పెట్టుబడిస్థాయిని నిర్ణయిస్తుందనినాడు. పొదుపు చెయ్యవలె, పెట్టుబడి పెట్టవలె అన్నభావాలు సర్వసాధారణమైనవని భావించినాడు. లాభాలు వస్తాయన్న ఆశ ఉన్నంతకాలం పెట్టుబడి నిరవధికంగా సాగుతుందని అతని అభిప్రాయం.

విమర్శ :

ఆడమ్ స్మిత్ రచించిన...దేశ సంపద...అనే గ్రంథం ప్రసిద్ధి చెందడానికి మూడు ముఖ్యమైన కారణాలు ఉన్నాయి.

1. గ్రీకుల రోమన్ల రచనలలో ఉండే ఎన్నో విషయాలను సేకరించి, ఆర్థిక వ్యవస్థ పనిచేసే తీరుతెన్నులను గురించి పరిశీలన జరిపిన తొలి ప్రయత్నం ఇది. తాను సేకరించిన విషయాలను అన్నింటినీ తాను చేసిన సిద్ధాంతాల ప్రతిపాదనకు ఆధారాలుగా ఉపయోగించుకొన్నాడు. ఇది అనేక విషయాల సంకలనం అనవచ్చు. తరువాతి వారికిది మూలగ్రంథం అయిందంటే ఆశ్చర్యం లేదు.

2. అన్ని విషయాలను అవగాహన చేసుకొని, అన్నింటినీ ఒక కట్టుదిట్టమైన పద్ధతిలో అమర్చి, నూతన స్వరూపాన్ని ఇచ్చింది ఈ గ్రంథంలోనే. ఆర్థిక వ్యవస్థలోని అనేక అంశాల మధ్యఉండే కార్యకారణ సంబంధాన్ని హేతుబద్ధంగా నిరూపించి నిర్దేశించింది ఈ గ్రంథంలోనే. వ్యక్తిగతమైన, పోటీ ఉండేటువంటి, పెట్టుబడిదారీవ్యవస్థలో ఆర్థిక విధానాలలోని పోకడలను సహేతుకంగా నిర్ణయించింది ఈ గ్రంథంలోనే అనవచ్చు.

3. అంతకుముందు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను కూలంకషంగా చర్చించి, విమర్శనాత్మక దృష్టితో పరామర్శించి, అందులోని బాగోగులనుచూపి, ప్రత్యామ్నాయవిధానాలను సూచించడానికి స్మిత్ ప్రయత్నించింది కూడా ఈ గ్రంథంలోనే. వ్యక్తుల ఆర్థిక జీవనంలో ప్రభుత్వం జోక్యం కల్గించుకోవడాన్ని నిశితంగా విమర్శించి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండడంవల్ల వ్యక్తుల ఆర్థిక వికాసానికి, జాతీయ జీవన వికాసానికి దోహదం చేస్తాయని వాటిని ప్రబోధించినాడు. ఆనాటి ప్రభుత్వ విధానాలపై ఆయన రచనల ప్రభావం ఎంతైనా ఉంటుంది. అప్పటి ప్రభుత్వాలు చేసిన మార్పులే ఇందుకు ప్రబల సాక్ష్యాలు.

కాని ఒక ముఖ్యమైన లోపముంది. అతని రచనా కార్యక్రమంలో క్రమం లోపించింది. అతని పూర్వులు—వాణిజ్యవాదులు, ప్రకృతి ధర్మవాదులు—అనుసరిస్తూ వచ్చిన ఆర్థికపరమైన నియమ నిబంధనలను ఖండించి ఆర్థిక స్వేచ్ఛను (Economic Liberalism) ప్రచారం చేయడమే, ముఖ్యోద్దేశంగా ఉంచుకొని ఆయన రచన చేసినట్లు కనబడుతుంది. ఇందువల్లనే అతని రచనలో బిగిలేదని కొందరి అభిప్రాయం.

జె. బి. సె:

ఆడమ్ స్మిత్ అనుయాయుల్లో పేర్కొనతగినవాడు జె. బి. సె; స్మిత్ రచనలపట్ల అతనికి అపారమైన గౌరవ ప్రపత్తులు ఉన్నాయి. కాని స్మిత్ సిద్ధాంతాల్లో అతనికి మూఢవిశ్వాసం ఉందని అనుకో కూడదు. అతని సిద్ధాంతాలకు మెరుగులు దిద్ది ప్రచారంలోకి తెచ్చినాడు. స్మిత్‌కు సాటివారిలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించి పెట్టినాడు సె. భావి తరాలవారు చెయ్యిబొయ్యే సిద్ధాంతాలకు ఇతడు మార్గదర్శకుడైనాడు — ముఖ్యంగా జర్మన్ మార్జినలిస్టులకు (German Marginalists)—మానవుల అవసరాలు, వాటికుండే అవసరాన్నిబట్టీ, వ్యక్తులు వాటికిచ్చే ప్రాముఖ్యాన్ని బట్టి ఉంటాయని చెప్పిన వాళ్లలో మొదటివాడు ఇతడే. వస్తువులకు ఉపయోగిత (Utility) అనే లక్షణమే వాటికున్న డిమాండును నిర్ణయిస్తుందనే దాన్ని నిరూపించినాడు. అప్పుడు డిమాండు సప్లైలు పరస్పరం మారుతాయి. ఉత్పత్తి, దానికి అయ్యేవ్యయం మీద ఆధారపడుతుందని, అందువల్ల ఉత్పత్తి వ్యయానికీ సప్లైపరిమాణానికీ సన్నిహిత సంబంధం ఉందని అతను చూపించినాడు. కానీ ధరల నిర్ణయం విషయంలో డిమాండే అధిక ప్రాధాన్యం కలదనీ, ఉత్పత్తి వ్యయం కేవలం సప్లై పరిమాణాన్ని మార్చకలిగేదేనని భావించినాడు. ఈ వాదం రికార్డో వాదానికి భిన్నంగా ఉంటుంది. రికార్డో ధరల నిర్ణయం విషయంలో ఉత్పత్తి వ్యయానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినాడు. ఇట్లా అనడంవల్ల మార్షల్ (Marshall) సిద్ధాంతాలకు ఒక ప్రాతిపదికను సూచించినాడనే అనవచ్చు. విలువ, ధర (Value and Price) అనే వాటిని వేరువేరుగా ఆలోచించి వాటికిఒక సంబంధాన్ని ఆపాదించడం అంతసరియైనది కాదని జె. బి. సె గుర్తించినాడు. ఆ రెండింటి మధ్య అవినాభావ సంబంధం ఉందనడాన్ని గూడా సె అంగీకరించినాడు.

ఆడమ్ స్మిత్ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తే, సె అట్లాకాక పరిశ్రమలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చినాడు. దీనికి కారణం చెప్పవచ్చు. వాళ్ల ఇద్దరి మధ్య నడిచిన సంవత్సరాల కాలంలో ఎన్నో మార్పులు వచ్చినాయి— ఇంగ్లండులో పారిశ్రామిక విప్లవం ప్రారంభమైంది. అది ఫ్రాన్సులో అప్పుడప్పుడే అడుగుపెట్టినది. వ్యాపారరంగంకూడా బాగా మారిపోయింది. అందుకే సె సంఘంలోని ఉత్పత్తి వ్యవస్థల్లో పరిశ్రమలకు ప్రముఖస్థానాన్ని ఇచ్చినాడు.

ఉత్పత్తి కార్యక్రమంలో ఉద్యమదారుడు (Entrepreneur) నిర్వహించే పాత్రను గుర్తించడమే కాకుండా ఆర్థిక విశ్లేషణలో ఉద్యమితత్వానికి కీలకమైన స్థానాన్ని ఇచ్చినాడు. దీన్నే భావి తరాలవారు ఎంతో ప్రశంసించి ఈ విశ్లేషణకు మెరుగులు దిద్దినారు. ఇట్లా చేసినవారిలో ఆచార్య షుంపీటర్ (Schumpeter) పేరు ముఖ్యంగా చెప్పవచ్చు. ఆర్థికవృద్ధి సిద్ధాంతాలకు సంబంధించి చేసిన చర్చల్లో, ఉద్యమితత్వము, (Entrepreneurship)

నవకల్పనాశక్తి (Innovation)లకు ఎంతో ప్రాముఖ్యం ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా (సుంపీటర్ చేసిన విశ్లేషణలో) 'సె' వాదం ప్రకారం ఉద్యమ దారుడు దీర్ఘదృష్టితో ఉత్పత్తికార్యక్రమాన్ని నిర్వహిస్తాడు. ఉత్పత్తికి అవసరమైన సాధనాలను సంవిధానంచేసి నవకల్పనాశక్తియుక్తులను ప్రదర్శించి అధికోత్పత్తిని సాధిస్తాడు. ఫలితంగా దేశం శీఘ్రంగా పురోగమించడానికి ప్రధాన కారకుడు అవుతాడు.

జె. బి. సె తన పంపిణీ సిద్ధాంతానికి సంబంధించి ఇతరుల విశ్లేషణలలోని భావాలను భావాలను గ్రహించినా వాటికి మెరుగులు దిద్ది ఒక సిద్ధాంతానికి రూపకల్పన చేసినాడు. వినిమయము (Exchange) ఉత్పత్తి (Production) సిద్ధాంతాలను మేళవించి పంపిణీ సిద్ధాంతాన్ని (Theory of Distribution) రూపొందించినాడు. ఉద్యమదారులు తెలిసిన ధరలకు ఉత్పత్తిసాధనాలనుకొని తెలియనిధరలకు వస్తువులను అమ్మడంవంటి సాహసకార్యాన్ని చేస్తారు. నష్టభయాన్ని (Risk bearing) భరించగల ధైర్యసాహసాలు ఉన్నవాడే మంచి ఉద్యమదారుడు కాగలడని సె అభిప్రాయం. ఇట్లా సంధానం చెయ్యడం ఉచితం. ఈ విధంగా వినిమయాన్నీ, ఉత్పత్తినీ, పంపిణీనీ సంఘటితంచేసి వాల్రస్ (Walras) కు మార్గదర్శకుడు అయినాడు. (Walras' grand conception of economic equilibrium.)

సె చేసిన మార్కెట్ల సూత్రం (Law of Markets) ఎంతో ప్రఖ్యాతి చెందింది. ప్రాచీన సంప్రదాయుల ఆర్థిక విశ్లేషణ అంతా సే చేసిన మార్కెట్ల సూత్రంపైన ఆధారపడినదే అంటే అతిశయోక్తికాదు. సంఘంలో జరిగే వినిమయంలో ద్రవ్యం నిర్వహించే పాత్ర బహుస్వల్పమనీ, ద్రవ్యం అనేది ఒక మేలిముసుగు వంటిదని (Veil of Money) అతని అభిప్రాయం. కానీ వినిమయం ప్రక్రియలో పాల్గొనే ప్రతివ్యక్తి ఇతర వ్యక్తుల శ్రేయస్సుకు తోడ్పడతాడనే విషయాన్ని మరవ కూడదు. ఈ వాదం వాణిజ్యవాదుల వాదానికి భిన్నంగా ఉండడం గమనించవలసిన అంశం. ఒకరి లాభం మరొకరికి నష్టం అని వాణిజ్యవాదులు విశ్వసించినారని మనము ఇదివరకే తెలుసుకొన్నాము. సె చేసిన మార్కెట్లసూత్రం ఆర్థిక వ్యవస్థలో సంక్షోభం ఏర్పాటుకు సంబంధించిన సిద్ధాంతానికి (Theory of Crisis) మూలమైంది. దీని మూలంగా ఆర్థికవ్యవస్థలో సాధారణంగా అత్యుత్పత్తి ఉండడాన్నీ, తక్కువ వినియోగం (Under Con— sumption) ఉండడాన్నీ సె తిరస్కరించడమే కాకుండా ఇట్లాంటి ఒడుదుడుకులు ఏర్పడినా అవి కేవలం క్షణికాలేననీ అతడు విశ్వసించినాడు. వీటిని తొలగించడానికి ఉత్పత్తిని ఆపుచెయ్యడం మార్గం కాదనీ, ఉత్పత్తిని పెంచడమేమార్గమని భావించినాడు.

విమర్శ :

సె తన సిద్ధాంతాలను ఇతరుల సిద్ధాంతాల ఆధారంతో చేసినా అతనికి ఆర్థిక వేత్తలలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. సుంపీటర్ చెప్పినట్లు కాంటిలాన్, టర్‌గాట్‌ల శకానికి వాల్రస్ ప్రారంభించిన శకానికి చక్కని సంబంధాన్ని ఏర్పరచి ఆర్థికశాస్త్రవికాసచరిత్రలో ఒక ప్రముఖస్థానాన్ని సంపాదించుకొన్నాడు. సె సూచించిన ఉపయోగిత (Utility) అనే భావన (Concept) మార్జినలిస్టు (Marginalists) చేతుల్లో ఒక నూతనరూపందాల్చి ఆర్థిక విశ్లేషణలో అత్యంతప్రధానమైన భావంగా రూపొందింది. ఇట్లా అతను తరువాతి వారికి మార్గదర్శకుడైనాడు. సాధారణ సమరస సిద్ధాంతాలకు (Theories of General Equilibrium) కూడా ఇతడుచేసినవిశ్లేషణ మూలమైనదనే చెప్పవచ్చు. కీన్సు సె చేసిన మార్కెట్ల సూత్రాలను ఖండించేవరకూ అతని వాదనకు అడ్డులేదు.

తెలుగులో బహువచన రూపనిష్పత్తి

శ్రీ చేకూరి రామారావు

తెలుగులో ఏకవచన బోధక నామాలకు—'లు' అనే ప్రత్యయం చేర్చటంవల్ల బహువచన బోధకాలవుతై. కొన్ని భాషల్లో ఏకవచనంతోపాటు, ద్వివచన త్రివచనాలు కూడా ఉంటై. సంస్కృతంలో ఏకవచన, ద్వివచన, బహువచన విభాగాలు మనకు తెలిసిందే. చాలా నామాలకు ఏకవచన, బహువచన విభాగం వర్తించినా కొన్ని నామాలు నిత్యైకవచనాలో నిత్యబహువచనాలో అయిఉంటై. ప్రౌఢ వ్యాకర్త ఉదహరించిన ఆముదం, ఇంగువ, ఉప్పు, చింతపండు, చమురు, పసుపు వంటి సంభారవాచకాలు, ఇత్తడి, ఇనుము, కంచు, బంగారు, వెండి వంటి లోహవాచకాలు నిత్యైకవచనాంతాలు. నిత్య బహువచనాంతాలకు ప్రౌఢ వ్యాకర్త ధాన్యవాచకాలయిన ఆళ్లు, చోళ్లు, వడ్లు, కందులు, పెసలు, మినుములు, మొదలయిన శబ్దా లుదాహరించాడు. 'బియ్యము' శబ్దాన్ని నిత్యైకవచనాంతంగా పేర్కొన్నాడు కాని, 'లు' ప్రత్యయం లేకపోయినా అది బహువచనరూపమే. బియ్యం ఉన్నై, బియ్యం లేవు అని క్రియలో బహువచనానికి బియ్యం శబ్దాన్ని బహువచనంగా గుర్తిస్తేగాని కారణం చూపించలేము. అట్లాగే పాలు, నీళ్లు, పేలాలు, ఉసిళ్లు వంటి పదాలు నిత్య బహువచనాలే. ఆధునిక భాషలో ద్రవవాచక పదాలైన, కాఫీ, టీలు కొందరి భాషలో బహువచనమైతే మరికొందరి భాషలో ఏకవచనాలు.

ఒక పదం ఏకవచనమా? బహువచనమా? అని నిర్ణయించాలంటే ఒక వాక్యంలో ఆ పదంతోవచ్చే క్రియ ఏకవచన ప్రత్యయాన్ని గ్రహిస్తుందా? బహువచన ప్రత్యయాన్ని గ్రహిస్తుందా? అనేదాన్నిబట్టే చెప్పాలి. తెలుగులో క్రియావిభక్తులు లింగ, వచన పురుష బోధకాలు

పైన పేర్కొన్న నామాలను ఇంగ్లీషులో సంలో Mass Nouns అంటారు. అవి నిత్యంగా ఏకవచనమూ కావచ్చు, బహువచనమూ కావచ్చు. నిత్య బహువచనా లనుకున్నవాటికి కొన్నిటికి మళ్లీ బహువచన రూపాలుండవచ్చు. అప్పుడది "కొన్నిరకాలు (Kinds)" అనే అర్థంలో ప్రయుక్తాలవుతై. బియ్యం అనే శబ్దానికున్న బహువచన రూపానికర్థం అట్లాంటిదే. ఇంగ్లీషులో Fish-Fishes కి అట్లాంటి అర్థమే ఉంది.

ఇవిపోగా భాషలో ఉన్న అధిక సంఖ్యాకాలయిన నామాలకు ఏకవచన బహువచన విభాగం వర్తిస్తుంది. ఏకవచన నామాలకు బహువచన ప్రత్యయమైన 'లు' చేర్చటంవల్ల బహువచననామం సిదిస్తుందని వ్యాసాదిని చెప్పబడింది. ఇట్లా చేర్చినప్పుడు నామం ప్రాతిపదిక లోని వర్ణ సంయోజనంలో కొన్ని మార్పులు జరుగుతై. ప్రత్యయంలో కూడా కొన్ని మార్పులు జరుగుతై. బహువచన ప్రత్యయానికి రెండు సపదాంశాలు (Allomorphs) ఉన్నై.—లు, ళు అని. —'లు'ని మూలరూపంగా గ్రహించి '—ళు' ని మారిన రూపంగా చెప్పటం వ్యాకరణంలో సులభ పద్ధతి.

ఒక పదాంశానికి సందర్భా న్ననుసరించి భిన్న రూపాలున్నప్పుడు వాటిని వ్యాకరించటంలో రెండు పద్ధతు లున్నై. (1) వాటి రూపాంతరాలన్నిటిని ఒక పట్టికగా ఇచ్చి వాటి పరిసరాలని నిర్దేశించటం. ఉదాహరణకు—

చేయి — వ్యస్తంగా ఉన్నపుడు

చేతు — బహువచన ప్రత్యయంముందు.

చేతి —విభక్తి ప్రత్యయాలముందు; సమా

1. పై మూడు రూపాలూ, 'చేయు' అని శబ్దానికున్న రూపాంతరాలు. ఆ మూడూ కలిపి ఒక పదాంశం. (Morpheme). అందులో ఒక్కొక్క రూపం ఆ పదాంశానికి సపదాంశం1 అవుతుంది. ఈ సపదాంశానికి మధ్య సంబంధాన్ని వ్యాకరణం నిరూపించాలి. పైన నిరూపించిన పద్ధతి సూత్రాలను స్థితి సూత్రాలు (Item and Arrangement) అంటారు. 2. ఇక రెండోపద్ధతిలో సపదాంశాల్లో ఒకదాన్ని మూలరూపంగా గ్రహించి మిగతా సపదాంశాల్ని వాటి వికారాలుగా చెప్పటం. ఒక్కోసారి భాషలో కనిపించే సపదాంశాల్లో ఒకదాన్ని గ్రహించకుండా, ఒక మూలరూపాన్ని సృష్టించుకొని, సపదాంశాలన్నిటినీ సూత్రాలద్వారా సాధించవచ్చు. సంస్కృత వ్యాకర్తల ధాతువులు అట్లాంటివి. చాలా ధాతువులు వాటి స్వత్వరూపంలో భాషలో కనిపించవు. వాటికి కొన్ని సూత్రాలను అనువర్తిస్తేతప్ప ఇష్టరూపాలు సిద్ధించవు. ఈ పద్ధతి సూత్రాలను గతిసూత్రా లంటారు. (Item and Process). ఉదాహరణకు పై సపదాంశాల్లో 'చేయు' శబ్దాన్ని మూలరూపంగా గ్రహించి 'చేతి, చేతు' అనే రూపాల్ని సూత్రాల ద్వారా సాధించవచ్చు. ఈ వ్యాసంలో ఈ పద్ధతే అనుసరించబడింది. స్థితిసూత్రాలకన్నా, గతిసూత్రాలే బహుకారణాలవల్ల ప్రశస్తాలు. ఆ కారణాలు ప్రత్యేక వ్యాసవిషయాలు గనుక ఇక్కడ వివరించటంలేదు. మన వ్యాకర్తల పద్ధతి గతిసూత్ర పద్ధతే.

పై సపదాంశాల్లో 'చేయు' ని మూలరూపంగా గ్రహించకునడా 'చే' అని మూలరూపాన్ని సృష్టించుకొని, వ్యస్తంగా ఉన్నప్పుడు 'ఇ' అని ఏకవచన రూప నిష్పాదక ప్రత్యయంగా ప్రతిపాదించి ఏ—ఇ అనే అనే స్వరాలమధ్య 'య'కారాగమాన్ని విధించి చేయు అనే రూపాన్ని సాధించవచ్చు. 'తి' ని ఉప విభక్తి ప్రత్యయంగా విధించవచ్చు. 'తి' బహువచనం ముందు 'తు'గా మారినదనవచ్చు. పై దాని కన్నా ఈ పద్ధతి కొంత క్లిష్టంగా పైకి కనిపిస్తున్నా దీనివల్ల చాలా ప్రయోజనాలున్నై. ఒక్కోసారి ఇది భాషాచరిత్రను ఎక్కువగా ప్రతిబింబిస్తుంది. అంతేగాక భాషా లక్షణాన్ని లెస్సగా నిరూపిస్తుంది. అయినా ఈ వ్యాసంలో ఆ పద్ధతిని అనుసరించటంలేదు. ఈ వ్యాసాన్ని అత్యాధునిక పద్ధతిలో తెలుగులో రాయాలంటే కొన్ని ఇబ్బందులున్నై. తగిన పదజాలం లేదు. సూత్రాలర్థమయ్యేట్టుగా రాయటానికి చాలా శ్రమించాలి. ఆ సిద్ధాంతాల్ని గురించి ముందుగా చెప్పకుండా, సూత్రాలు రాసుకుపోతే ఆ సూత్రపద్ధతి అలవాటు లేకపోవటంవల్ల అర్థం చేసుకోటానికి పాఠకులు విపరీతంగా శ్రమపడాల్సి ఉంటుంది. ఈ కారణాలవల్ల సిద్ధాంతం పలచబడ్డా బహుపాఠక సౌలభ్యం కోసం కొంత రాజీమార్గం అయిష్టంగా నైనా అవలంబించాల్సి వచ్చింది.

గతి సూత్రపద్ధతిలో సూత్రాలు 'అల్పాక్షర మసందిగ్ధం, సారవ ద్విశ్వతోముఖం' అనే లక్షణాల్ననుస రించి ఉంటై. సాధ్యమైనంతవరకు సూత్రాలు ఎన్నో రూపాల్లో జరిగిన మార్పుల్ని కొద్దిసూత్రాల్లో చెప్పటానికి అనువుగా రచించాల్సి ఉంటుంది. అంటే 'చేయు' అనే ఒక్క శబ్దానికేకాక ఆ రకపు ప్రవర్తన గలిన శబ్దాలన్నిటికి అన్వయించేట్టుగా గతిసూత్రా లుంటై.

ప్రాచీనాంధ్ర వ్యాకరణాలు గతిసూత్ర పద్ధతి లోనే రచింపబడినై. చిన్నయసూరి బాలవ్యాకరణంలో అవలంచిబిన పద్ధతి ఇదే2.

---

1. పదాంశం, సపదాందాంశం అనే మాటలను క్రమంగా (Morpheme, Allomorph) అనే అర్థాల్లో భద్రిరాజు కృష్ణమూర్తిగారు వాడుతున్నారు. చూ. భద్రిరాజు కృష్ణమూర్తి. పదం—పదాంశం. భారతి, 1970 ఫిబ్రవరి.

2. డా. బొడ్డుపల్లి పురుషోత్తంగారు తమ 'భాష—వ్యాకరణము' (భారతి, ఏప్రిల్ 1970) అనే వ్యాసంలో సూరిగారి 'కురు, చిరు, కడు, నడు, నిడు శబ్దముల ర డ ల కచ్చు పరంబగునపుడు ద్విరుక్తటకారంబగు' అనే సూత్రాన్ని ఉదాహరించి ఇది 'చారిత్రకముగా చెప్పినట్లైనది' అని అనటం ప్రామాదికం. స్థితి గతి సూత్రాల భేదాన్ని, గతి—చారిత్రక సూత్రాల భేదాన్ని గమనిస్తే ఈ ప్రమాదం జరిగిఉండేదికాదు.

ఆధునిక భాషాశాస్త్రంలో గతిసూత్రరచనా పద్ధతి ఈ కింది విధంగా ఉంటుంది.

$XAY \rightarrow XBY$

ఈ సూత్రాలకర్థం X—Y ల పరిసరంలో A అనే అంశం B అనే అంశంగామారుతుంది. X, Y ల రెంటి విలువలూ శూన్యమైతే దీన్ని పరిసర నిరపేక్షక సూత్రం (Context free rule) అంటారు. X, Y లలో ఏ ఒక్కటైనా సార్థకమైతే పరిసరాపేక్షకసూత్రం (Context sensitive rule) అంటారు. ఈ వ్యాసంలో సూత్రాలన్నీ పరిసరాపేక్షక సూత్రాలే.

పై సూత్రాన్నే కుదించి

$A \rightarrow B \mid\mid X—Y$

అనికూడా రాయవచ్చు. ఈ కుదింపువల్ల ప్రయోజనం X, Y లను ఒకసారి మాత్రమే రాయటం. ఈ కుదింపులో కొత్తగా చేర్చిన || రెండు నిలువు గీతల కర్థం ఈ చెప్పబోయే పరిసరాల్లో అని. X—Y ల మధ్యనున్న అడ్డగీత మారిన అంశం స్థానాన్ని సూచిస్తుంది

ఈ సూత్రాలు వర్తించాల్సిన క్రమం నియతం. అంటే ఈ సూత్రాలు ఈ రాసిన క్రమంలో వర్తిస్తేనే సాధురూపాలు సిద్ధిస్తయ్యన్నమాట. ఇట్లాంటి సూత్రాల్ని సంపూర్ణనియతక్రమసూత్రాలు (Completely ordered rules) అంటారు. వీటిల్లో కొన్ని సూత్రాలక్రమం నియతంకాకపోతే వీటిని పాక్షిక నియతక్రమసూత్రాలు (Partially ordered rules) అంటారు.

సాధారణంగా సూత్రాలక్రమం పాక్షికంగానే ఉంటుంది. ఈ వ్యాసంలోని సూత్రాలిట్లాంటివే.

సపదాంశాల్లో రూపభేదానికి ఒక్కోసారి పదాంశాలను కారణంగా చెప్పాల్సి ఉంటుంది. అట్లాంటి సూత్రాలని పదాంశ విధేయ సూత్రాలు (Morphologically conditioned rules) అంటారు. బహువచన ప్రత్యయం ముందు అని ఒక సూత్రానికి పరిసర నిర్దేశం చేశామనుకోండి. బహువచన ప్రత్యయం అనేది పదాంశ సంబంధి (Morphological element) గనుక ఆ సూత్రం పదాంశ విధేయమవుతుంది

ఒక్కోసారి ఈ రూపభేదానికి పదాంశాలతో సంబంధంలేదు. అంటే అర్థవంతమైన శబ్దాల ప్రసక్తి అనవసరమన్నమాట. కేవలం వర్ణాలు (ఒకటికాని, ఎక్కువకాని) మాత్రమే రూపభేదానిక్కారణంగా నిర్దేశిస్తే సరిపోతుంది. అట్లాంటి సూత్రాల్ని వర్ణవిధేయ సూత్రాలు (Phonologically conditioned rules) అంటారు.

వర్ణవిధేయసూత్రాల ప్రవృత్తి పదాంశ విధేయ సూత్రాల ప్రవృత్తి కన్నా విస్తృతం. ఈ విషయం ముందు ముందు విశదమవుతుంది.

ఈ వ్యాసంలో రెండురకాల సూత్రాలూ ఉన్నై. సూత్రక్రమంలో పదాంశవిధేయ సూత్రాలను ముందు అనువర్తించుకోవాలి. ఈ సూత్రాలు నిష్పన్నం చేసిన రూపాలమీద వర్ణవిధేయసూత్రాలు వర్తిస్తై. ఏ సమూహాని కాసమూహంలో మళ్లీ క్రమం పాక్షికంగా నియతం.

భాషలో సర్వత్రా వర్తించే వర్ణ విధేయ సూత్రాల్లో బహువచనాని కవసరమైనంత మట్టుకే ఈ వ్యాసంలో కూర్చబడినై. ఈ రెండోవర్గం సూత్రాలు ప్రస్తుతానికి అసమగ్రాలు. ఆధునికాంధ్రంలో స్వరసంధివర్ణన చాలా కష్టమైన భాగం. అంతేగాక ఈ అనుసరించిన సూత్ర రచనా పద్ధతితో స్వరసంధివర్ణన చెయ్యటానికి ఇప్పుడున్న తెలుగు లిపి చాలదు.

సమగ్రమైన తెలుగు వ్యాకరణంలో ఈ సూత్రాల క్రమమూ, రూపమూ మార్చాల్సి రావచ్చు. ప్రస్తుత సూత్రాల ప్రయోజనం ఆధునికాంధ్రంలో బహువచన రూపనిష్పత్తికి శాస్త్రపద్ధతిలో ఒక స్వల్ప మార్గాన్ని సూచించటమే.

ఈ వ్యాసంలో గుర్తులుగా ఉపయోగించిన అక్షరాలు మాట్లాడే ధ్వనులను సూచించే వర్ణాలకు సంకేతాలుగా గ్రహించాలి. 'సున్నా' తత్పరిసరానికి సంబంధించిన అనునాసికవ్యంజనానికి గుర్తు. పదాంతంలో ఇది 'మ' వర్ణానికి సంకేతం. ట, డ, ళ, ల కింద రాసిన '్ల' అనే గుర్తు మూర్ధన్య పార్శ్విక

వర్ణాన్ని సూచిస్తుంది. వ్యంజనం మీది అకారం ఉచ్చారణార్థం రాసిందిగానే గుర్తించాలి. సూత్రంలో 'డ' అని రాస్తే వ్యంజనమైన 'డ' కార మాత్రం గానే గ్రహించాలి.

సూత్రాల్లో ఉపయోగించిన గుర్తులకు వివరణ:

1. —> ఈ గుర్తుకు ఎడం పక్కనున్న గుర్తు కుడి పక్కనున్న గుర్తుగా మారుతుంది.
2. —ఉ అని రాస్తే పదాంతమైన 'ఉ' అని చదువుకోవాలి.
3. 'ఇ' అంటే ఇకారమనీ, 'క' అంటే కకారమనీ చదువుకోవాలి.
4. ∅ లోపం.
5. * ఈ గుర్తున్న సూత్రం వికల్పసూత్రం. ప్రవర్తించినప్పుడొక రూపం, ప్రవర్తించనప్పుడింకొక రూపం ఉంటై.
6. + ఈ గుర్తున్న చోట పదాంశ విభాగానికి ప్రాముఖ్యముండవచ్చు.
7. ( ) ఈ కుండలీకరణాల్లో ఉన్న గుర్తు ఉండవచ్చు, ఉండక పోవచ్చు.
8. ( )—( ) ఈ కుండలీకరణాల్లో ఉన్న గుర్తుల్లో ఏదో ఒకటైనా విధిగా ఉండాలి.
9. || ఈ చెప్పబోయే పరిసరాల్లో అని చదువుకోవాలి.
10. [ ] ఈ కుండలీకరణంలో ఉన్న గుర్తులన్నీ సూత్రప్రవర్తన కవసరం.

మొదటి వర్గం :
పదాంశ విధేయ సూత్రాలు

ఈ వర్గంలో సూత్రాలన్నిటికి బహువచన ప్రత్యయం సామాన్య పరిసరం. అందువల్ల సూత్రాలన్నిటికీ దీన్ని చేర్చలేదు. ప్రాచీనవ్యాకరణాల్లో అధికార సూత్రంలాగా ప్రతిసూత్రానికి బహువచనంలో అని అన్వయించుకోవాలి.

1. రాయి —> రాలు.

తరువాత వచ్చే ఒక సూత్రం వల్ల ల వర్ణానికి మూర్ధన్యత్వం సిద్ధిస్తుంది.

2. [—యి,—ను,—వు] —> ∅

వేయి, చేను, పేను, పూవు శబ్దాల్లో తుది 'యి, ను, వు' లు లోపిస్తై. ఈ పదాలకు, మాత్రమే ఈ సూత్రం వర్తిస్తుంది.

పై రెండు సూత్రాలు పరిమిత వర్తనం కలిగిన సూత్రాలు. సామాన్య సూత్రాలను ధిక్కరించేవి గనుక మార్గాన్ని నిష్కంటకం చెయ్యడంకోసం వీటినే ముందు చెప్పాల్సివచ్చింది.

3. యి —> తి || [అకారేతర దీర్ఘాచ్చు]—

ద్విమాత్రాపరిమాణంగల శబ్దాల్లో అకారేతర దీర్ఘస్వరపూర్వకమైన 'యి' కి 'తి' ఆదేశ మవుతుంది.

గోయి, చేయి, నూయి, నేయి, పేయి అనే శబ్దాలు ఈ సూత్రానికి విషయాలు.

నిజానికిట్లాంటి శబ్దాలు ఇవి మాత్రమే కనిపిస్తున్నై. అయినా ఈ సూత్రం ప్రకారం ఇట్లాంటి శబ్దాలింకేమైనా దొరికినా, లేక ఇట్లాంటి శబ్దాలు తెలుగువాడు సృష్టించుకున్నా వాటిల్లో 'యి' 'తి' గా మారుతుందని సూత్రం నిర్దేశిస్తున్నది. ఈ పద్ధతి తెలుగుభాషాలక్షణంలోనే ఉన్నదని వ్యాసకర్త ఉద్దేశం.

అకారేతర మనటంవల్ల 'వాయి' రక్షితం. దీర్ఘాచ్చు అనటం 'పొయ్యి' రక్షితం. 'వేయి' లోని 'యి' రెండో సూత్రంవల్లనే లోపించింది కాబట్టి ఈ సూత్రానికి బాధకంకాదు.

చేయి, నేయి వంటి శబ్దాలకు చెయ్యి, నెయ్యి వంటి రూపాలే బహుళంగా వాడుకలోఉన్నై. అయినా వ్యాకరణమూల రూపాలుగా దీర్ఘ స్వర రూపాలే గ్రహించబడ్డై. అది శాస్త్ర సమ్మతమే. వాడుకలోని ఏకవచన రూపాలని ''అకారేతర దీర్ఘ స్వరానికి హ్రస్వస్వరమూ, తరువాత య, వ, లకు ద్విత్వమూ, వికల్పంగా వస్తుంది'' అనే సూత్రం ద్వారా సాధించవచ్చు.

4. పెండ్లి —> పెండ్లిల్లు.

పెళ్లి అనే రూపం వ్యవహరించే వారికి అది కూడా ఈ సూత్రంలో చేర్చుకోవచ్చు. 'పెండ్లి' అనే శబ్దానికి బహువచనంలో, ఇల్లు అనే అనుబంధం చేరుతుందని ఈ సూత్రార్థం. తరువాత సూత్రాల వల్ల పెండ్లిండ్లు, 'పెళ్లిళ్లు' అనే రూపాల్ని సాధించుకోవచ్చు. అనుబంధరూపాన్నే మూలరూపంగా గ్రహించి ఏకవచనంలో ఇల్లు అనే అనుబంధానికి లోపం జరుగుతుందన్నా అదే ఫలితాన్ని సాధించవచ్చు.

5. రాత్రి —> రాత్రిల్లు

పై సూత్రంలాంటిదే ఇదీ. అయితే ఇది వికల్పం కావటంవల్ల రాత్రులు అనే రూపమూ సాధ్యమే.

6. {ఏడు, కాడి, తూడు} —> {ఏండు, కాండి, తూండు}

ఏండ్లు, కాండ్లు, తూండ్లు, అనే బహువచన రూపాలు ఈ సూత్రంవల్ల సిద్ధిస్తై. చరిత్ర ననుసరించి రాస్తే ఈ సూత్రాన్ని తిరగేసి ఏకవచన రూప నిష్పత్తిలో చేర్చుకోవాలి. "దీర్ఘ స్వరపూర్వకమైన వ్యంజన పరకమైన అనునాసికవర్ణానికి లోపమవుతుంద"ని చారిత్రకంగా పూర్వరూపాలైన అనునాసిక వర్ణయుక్త రూపాలనుంచి ఆధునికమైన నిరనునాసిక రూపాల్ని సాధించుకోవచ్చు. నిజానికి అదే సరైన పద్ధతి. ఏకవచన రూపసాధన ఈ వ్యాసంలో గ్రహించలేదుగనుక ఈ సూత్రం ఇక్కడ రాయబడ్డది. ఇక్కడ ఏడు వర్షార్థకం.

7. {—న్ను, —ల్లు} —> ండు

ఇల్లు, కన్ను, శిలార్థకమైన కల్లు, చన్ను, దంతార్థకమైన పల్లు (లేక పన్ను), ముల్లు, విల్లు అనే పదాలు ఈ సూత్ర విషయాలు. ఇవన్నీ ఔపవిభక్తి నామాలు కావటం విశేషం. తెలుగు నామాల్లో ఏ నామాలు ఔపవిభక్తికాలో, ఏవి కావో శబ్ద రూపాల్ని బట్టి నిర్ణయించలేము.

కాబట్టి నామాల్ని ఔపానౌపవిభక్తికాలుగా వ్యాకరణంలోనో, కోశంలోనో సూచించక తప్పదు. ఔపవిభక్తితాకత్వాన్ని సూచించినప్పుడు పై సూత్రం సామాన్యసూత్రమే అవుతుంది. బహువచన రూప నిష్పత్తిలో ఔపానౌపవిభక్తికత్వ ప్రాధాన్యాన్ని బాలవ్యాకర్త కూడా గుర్తించాడు. ("ఔం విభక్తికంబుల రి వర్ణ సలలువర్ణంబులకు బహువచనంబు పరంబగునపుడు పూర్ణ బిందు పూర్వక డు వర్ణంబు బహుళంబుగానగు" (బాల. వ్యా. అచ్ఛిక. సూ. 16). ప్రాచీనభాషలో ఇల్లులు, ఇండులు వంటి రూపాలు కూడా సాధువులే. ఆధునిక భాషల్లో ఇల్లులు అసాధువు. 'ఇండులు'లో ఉల్లోపం నిత్యం. (ఈ లోపానికి వర్ణ విధేయ సూత్రాల్లో ఒక సూత్రం ఉంది.)

4, 5 సూత్రాల్లో అనుబంధంగా చేర్చిన 'ఇల్లు' నకు కూడా ఈ సూత్రం వర్తిస్తుంది. అట్లా అనుబంధించటానికి ప్రయోజనమే ఇది.

8. ం —> ∅ / || — [డి, డు]

ఇక్కడ 'సున్న' ణ వర్ణానికి చిహ్నం. ఇ, ఉ (High Vowels) వర్ణాంతమైన శబ్దాల్లో 'డ' వర్ణానికి పూర్వాన ఉన్న అనునాసిక వ్యంజనానికి వికల్పంగా లోపమవుతుందని ఈ సూత్రార్థం. ఈ సూత్ర వికల్పత్వం నగర గ్రామ భాషా భేదాల్ని సూచిస్తుంది. ఉల్లోపమూ 'డ' కారానికి 'ళ' కారాదేశమూ వర్ణ విధేయ సూత్రాలద్వారా సిద్ధిస్తుంది. అన్ని సూత్రాల ప్రవర్తనతర్వాత రూపాలిట్లా ఉంటై. ఈ సూత్రం ఏకవచన రూపసాధనకుకూడా అవసరం. దీనివల్లనే పెండ్లి— పెళ్లి అవుతుంది.

కన్ను	—	కండ్లు, కళ్లు
పల్లు	—	పండ్లు, పళ్లు
ఏడు	—	ఏండ్లు, ఏళ్లు
బండి	—	బండ్లు, బళ్లు
పండు	—	పండ్లు, పళ్లు

పిండి అనే దానికి పిండ్లు అనే బహువచనప ఉన్నట్టుంది గాని పిళ్లు అనే రూపం వినలేదు.

9. ఎద్దు —> ఎడ్డు

ఎద్దు అనే శబ్దానికి 'ఎద్దులు' 'ఎడ్లు' అనే రెండు రూపాలున్నై కాబటి ఈ సూత్రంవల్ల

వికల్పంగా ఎడ్లు అనే రూపం సాధించబడింది. ఇట్లాంటిది ఒకే శబ్దం కనిపిస్తున్నది. చారిత్రకంగా ఈ శబ్దంలో బహువచనంలో మాత్రమే 'డ' కారం ఎట్లా వచ్చిందో చెప్పలేం. మధ్యోత్తర ద్రావిడ భాషల్లో 'డ' కార ఘటిత రూపాలుండటం గమనించదగిన విశేషం. 'డ' కార ఘటిత రూపాలే ప్రాచీనాలు కావచ్చు.

కొలామీ—ఎడ్ (బహు ఎడ్ల్.)
నాయకి—హెడ్ (బహు—హెడ్ల్.)
కురుఖ్—అడ్డో (DED. 698.)

10. { —అం / —ఎం } —> { —ఆ / —ఏ }

'మ'కారాంతపదాల్లో చివరి 'మ'కారం 'అ'కార పూర్వకంగాని, 'ఎ'కార పూర్వకంగాని అయితే 'మ' వర్ణానికి లోపం తత్పూర్వ స్వరానికి దీర్ఘమూ అవుతుంది. ఈ మార్పు ప్రాచీన భాషలోనూ ఉన్నట్లు బాలవ్యాకరణంలోని 'లు ల న లు పరంబులగునపుడొకానొకచో ముగాగమంబునకు లోపంబును దత్పూర్వస్వరంబునకు దీర్ఘంబును విభాషనగు, (బాల. వ్యా. తత్సమ. సూ. 43)' అనే సూత్రంవల్ల తెలుస్తున్నది. అకార, ఎకార పూర్వకమైన మకారాంతమైన పదాల్లోనే ఇది జరుగుతుందని బాలవ్యాకర్త చెప్పలేదు. ఉదాహరణకు 'కుడుము, ఉడుము' వంటి పదాలో ఈ కార్యం జరగదు. అందువల్ల ఈ సూత్రంలో నిర్దేశించిన స్వరపరిసరం సార్థకం.

సూత్రంలో 'అం, ఎం' బదులు 'అము, ఎము' అని క్రమంగా ఉంచినా వ్యాకరణ కార్యంలో వచ్చేభేదం ఏమీలేదు. పదాంతంలో 'ము' ఉచ్చారణలో 'మ్' అని మాత్రమే అని వ్యాకరణంలో ఇంకోచోట నిర్దేశించుకోవచ్చు. సమగ్ర వ్యాకరణంలో ఈ సూత్రానికి పరిసరాలుగా 'ని' అనే పరిసరం కూడా చేర్చుకోవాలి.

ఈ సూత్రం తత్సమాచ్ఛికశబ్దాలకు రెండింటికి వర్తిస్తుంది

11. —డు—> ∅ || — +

మహదేకవచనాలయిన తత్సమ శబ్దాలు ఈ సూత్రానికి విషయాలు. దేశ్యాలయిన 'తమ్ముడు' వంటి శబ్దాల కీ కార్యం అరుదుగా కన్పిస్తుంది.

తత్సమ, దేశ్యవిభాగం ఆధునిక వ్యాకరణానికైనా తప్పనిసరి. వ్యాకరణ కార్యాలు ఈ విభాగాన్ననుసరించి కూడా ఉంటై.

తత్సమ, తద్భవ విభాగం ఆధునిక భాషలో వ్యవహర్తల్ని బట్టి ఉంటుంది. ఒక వ్యవహర్తకి తత్సమమైన శబ్దం మరోవ్యవహర్తకి తద్భవం కావచ్చు.

ఒకమాట సంస్కృత సమమా కాదా అనేది వ్యవహర్తకున్న సంస్కృత పరిజ్ఞానాన్ని బట్టి ఉంటుంది. గ్రామీణులు తత్సమ శబ్దాల్ని కూడా తద్భవ దేశ్యాల్లాగే భిన్న వ్యాకరణ కార్యాల్లో వ్యవహరించవచ్చు.

'స్నేహితుడు' అనేమాటకు స్నేహితులు అని బహువచనరూపం వాడితే అతనికిది తత్సమ మన్నమాట. 'స్నేహితుళ్లు' అని వాడితే తత్సమం కాదన్నమాట.

12. '—ర'—> —'ల' || — [ఇ, ఉ]

'ఇ, ఉ' కారాలు అంతంలో ఉండి,పూర్వంలో ఉన్న 'ర' కారం ఈ సూత్రంవల్ల 'ల' కారం అవుతుంది. వక్ష్యమాణసూత్రంవల్ల ఇది మూర్ధన్యమవుతుంది. ఈ సూత్రం కొన్ని పదాలకు మాత్రమే వర్తిస్తుంది. శబ్దస్వరూపాన్ని బట్టి ఏ పదంలో అవుతుందో, ఏ పదంలో కాదో చెప్పలేం. ఇంకా పరిశోధిస్తే వీటిల్లోఉన్న అంతస్తత్త్వం కనుక్కోవచ్చేమో. ఈ కింది పదాలు ఉదాహరణప్రాయాలే.

ఉదా:— ఊరు, గోరు, మూలార్థంలో వేరు; వెదురు, కుదురు, కదురు, కూతురు, పందిరి మొ:

ఈ సూత్రాన్ని వికల్పమని చెప్పటానికి కారణం ఊర్లు, గోర్లు అని వ్యవహరించే వాళ్ళుండటమే.

13. ల --> ళ || 1. [అచ్చు]—ఉ
2. [అచ్చు]—ఇ

స్వరపూర్వకమై ఉదంతమైన చివరి ల కారం 'ళ'కార మవుతుంది. ఇ దంతమైన, ద్విమాత్రాధిక సంఖ్యాకశబ్దాల్లో స్వర పూర్వకమై ఉపధవర్ణంగా వచ్చిన ల కారం కూడా 'ళ' కారమవుతుంది. పై సూత్రంలో రెండో పరిసరాన్ని నిర్దేశించినప్పుడీ మాత్రాసంఖ్యను గుర్తులతో సూచించటం కష్టం గనుక వివరణలో సూచించబడింది. పద సిద్ధంగా ఉన్న 'ల'కారం మాత్రమేకాక పూర్వసూత్ర సాధ్యమైన 'ల'కారం మీదకూడా ఈ సూత్రం వర్తిస్తుంది.

స్వరపూర్వకమని అనటంవల్ల రెల్లు, పిల్లి వంటి పదాల్లోనూ, ద్విమాత్రాధికసంఖ్యాకమనటం వల్ల ఉలి, పులి వంటి శబ్దాల్లోనూ ఈ కార్యం జరగకుండా నివారించబడింది.

స్వరలోపానికి వర్ణవిశేయసూత్రం వర్తిస్తుంది.

ఉదా:—	నెమలి	—	నెమళ్లు
	మొసలి	—	మొసళ్లు
	తిరగలి	—	తిరగళ్లు
	నాగలి	—	నాగళ్లు
	చాకలి	—	చాకళ్లు
	పందిలి	—	పందిళ్లు
	కౌగిలి	—	కౌగిళ్లు
	కుందేలు	—	కుందేళ్లు
	తాబేలు	—	తాబేళ్లు
	నాగేలు	—	నాగేళు
	కాలు	—	కాళు
	కీలు	—	కీళ్లు
	వేలు	—	వేళ్లు
	ఊరు	—	ఊళ్లు.

ఏడో సూత్రంకింద ఉదహరించిన బాలవ్యాకరణ సూత్రాన్ని అనుసరించి ఔపవిభక్తికత్వాన్ని ఈ సూత్రంలో ఉపయోగించటానికి వీల్లేకపోయింది. అందుకు కారణాలివి. 1. అసలెప్పుడూ ఔపవిభక్తికాలుకాని నెమలి మొసలి వంటి పదాల్లో ఈ కార్యం జరుగుతున్నది. 2. మిగతా శబ్దాలకైనా ఔపవిభక్తికత్వం నేటి భాషలో వికల్పం. 3. ఔపవిభక్తికత్వాన్ని చెప్పకుండానే పటిష్ఠమైన పరిసర నిర్దేశం చెయ్యటానికి వీలయింది.

14. -ఇ -> -ఉ || 1. (యకారేతర వ్యంజనం) - +
2.— (ట,డ,న,ర,ల లు కాని వ్యంజనం) ఉ

ఈ సూత్రం నిజానికి రెండు సూత్రాలు కుదించటంవల్ల ఏర్పడింది.

పదాంతంలోని 'ఇ' వర్ణం బహువచన ప్రత్యయం ముందు ఉపవర్ణంగా మారుతుంది. ఈ మార్పు ఆ 'ఇ' యకారేతరవ్యంజన పూర్వకమైనప్పుడు మాత్రమే జరుగుతుంది. ఇట్లా అనటంవల్ల, అబ్బాయి, అమ్మాయి, వాయి, పొయ్యి వంటి పదాల్లో పదాంత ఇకారాని కీమార్పు జరగదు. ప్రాచీనభాషలోనూ ఇట్లా జరుగుతుందని చెప్పలేం. పొయ్యికి పొయ్యులు అనే బహువచనం ప్రాచీనభాషలో ఉన్నట్టు కనిపించదు. 'ఇత్తునకు బహువచనంబగు నపు డుత్వంబగు' (బాలవ్యా. తత్సమ. సూ. 45) అనే సూత్రంలో చిన్నయసూరి యకారేతర వ్యంజనమనే పరిసరం చేర్చలేదు.

ప్రాతిపదికలో చివరి 'ఇ' ఈ సూత్రంవల్ల 'ఉ'గా మారిన తర్వాత ఈ 'ఉ' బలంవల్ల ఉపోత్తమ ఇత్వం కూడా ఉత్వంగా మారుతుంది. ఉపోత్తమ ఇత్వం అనటంవల్ల ఈ మార్పు మూడు అచ్చులున్న మాటల్లోనే జరుగుతుంది. (దీన్ని తెలుగు గుర్తులతో సూచించటం కష్టమని సూత్రంలో చెప్పలేదు). అంతేకాక ఈ పద మధ్య 'ఇ'కి పరంలో సూత్రంలోసూచించినట్టుగా ట, డ, న ర,ల లు కాని వ్యంజన ముండాలి. అంటే ఈ వ్యంజనాల ముందు ఈ మార్పు నిరోధిత మవుతుంది. ఇట్లా నిరోధితం కావటానికి కారణం వెతక దగినది. ట, డ న, ర, ల వ్యంజనాలు నాలుకకొనతో (Apex) ఉచ్చరితమవుతై. వీటికి, బహువచన ప్రత్యయమైన 'లు'కి మధ్యనున్న అచ్చు సంధిలో లోపిస్తుంది. ఆ

లోపంవల్ల ఏర్పడ్డ సంయుక్త వ్యంజనం ఈ మార్పుని నిరోధిస్తున్నదేమో. కాని ఇట్లా అనుకోటానికి ఒక ప్రతిబంధకం వుంది. ప్రాచీనభాషలో "పిడికిళులు రాపిడులు, పందిరులు" వంటి రూపాల్లో సంయుక్త వ్యంజన విహితంగానే మార్పు నిరోధితమైంది. సంయుక్త వ్యంజనం లేకుండానే ఈ మార్పు నిరోధితం కావటానికి ఈ వ్యంజనాల ఉచ్చారణ ఎందుక్కారణం కావాలో చెప్పలేం. అటువంటప్పుడు 'ట, డ, న, ల' అనే వ్యంజనాలు ఈ మార్పు నిరోధితం కావటానికి నిమిత్తాలు కావేమో. అట్లాకానిపక్షంలో పై సూత్రాన్ని సవరించాల్సి ఉంటుంది.

బహుశా ఈ మార్పుని నిరోధించేది నామ పదంలోని మాత్రాసంఖ్యేమో! ఈ మార్పు జరగని నామపదాలన్నీ చతుర్మాత్రాకంగా కనిపిస్తున్నై. ఉపోత్తమ 'ఇ' కారానికి పూర్వాక్షర (Preceding syllables) పరిమితి రెండు మాత్రలైతే ఈ మార్పు జరగదని చెప్పవచ్చు. ఇది కూడా నిష్కంటకమైన మార్గమని చెప్పటానికి వీల్లేదు. నిత్య బహువచనంగా నేటి భాషలో కనిపిస్తున్న 'ఉసిళ్లు' అనే రూపంలో పదాంశవిభాగం చేస్తే 'లు' అనే బహువచన ప్రత్యయాన్ని విడదీయవచ్చు. అప్పు డేకవచన రూపం ఉసిరి లేక ఉసిడి అని కావాలి. లేకపోతే ఈ పదంలో మూర్ధన్యమైన 'ళ' కారానికి వేరే మూలంలేదు. అప్పుడీ నామం త్రిమాత్రాకమే అవుతుంది. అయినా మధ్య 'ఇ' 'ఉ' కాలేదు.అంటే త్రిమాత్రాక శబ్దాల్లోనూ ఈ మార్పు నిరోధితమయిందన్నమాట. అంటే మాత్రాసంఖ్య కీ విషయంలో ప్రమేయం లేదనే తేలుతున్నది.

ఈ రెండు మార్గాల్లోనూ క్లేశం ఉంది. ఇంకా పరిశోధిస్తేనే గాని దీని తత్త్వం పూర్తిగా గ్రహించలేం. ఈ మార్పు తత్సమశబ్దాల్లో జరగదు. ఉదా:— సమితులు, అతిథులు.

బాలవ్యాకరణంలో 'ర • ల డోపధ నవార్థాదుల యుపోత్తమేత్వంబున కుత్వంబు గలుగదు' (తత్సమ. సూ. 47) అనే సూత్రంలో ఉత్వనిరోధానికి 'ర, ల, డ,' లను మాత్రమే చిన్నయసూరి పరిగణంగా నిర్దేశించాడు. నిజాని కుదాహరణలు ఈమూడు వ్యంజనాలతో మాత్రమే దొరుకుతున్నై. 'ట, న' అనే వ్యంజనాలు అధికంగా ఈ వ్యాసంలోని సూత్రాలలో చేర్చబడ్డై. అవి ఉన్నా ఈ మార్పు నిరోధితమవుతుందన్న ఊహే ఇవి చేర్చటానిక్కారణం. ఉదాహరణకు 'ముసిటి' అనే ఒక పదం ఒక మండలంలో దొరికిందనుకోండి. దాని బహువచన రూపం 'ముసిట్లు' అని ఉంటుందని ఈ సూత్రం చెప్తుంది.

పై సూత్రంలో 'ఇ' కారం 'ఉ'కారంగా మారటానికి రెండు పరిసరాలు నిర్దేశించబడినై. మొదటి పరిసరంలో మార్పు జరిగిన తర్వాతే రెండో పరిసరంలో మార్పు జరుగుతుంది. అంటే ఈ పరిసరాల క్రమం కూడా నియత మన్నమాట.

ఈ సూత్రాలు పాక్షిక నియత క్రమాలని ఇంతకుముందు చెప్పబడింది. అంటే కొన్ని సూత్రాల వరసని తిరగెయ్యటానికి వీల్లేదు అన్నమాట. 13, 14 సూత్రాలు ఆ వరసలోనే వర్తించాలి. 13 లో లకారానికి మూర్ధన్యత్వం విధించిన తరువాతే దానికి పరంలోఉన్న 'ఇ' ని 'ఉ'గా మార్చాలి. 12, తరవాతనే 13 వర్తించాలి. ఎందుకంటే 12 వల్ల నిష్పన్నమైన 'ల'కారం మీద కూడా 13 వర్తిస్తుంది. 4, 5 సూత్రాల తరవాతనే 7 ప్రవర్తిస్తుంది. లేకపోతే పెళ్లిళ్ళు, రాత్రిళ్లు అనే రూపాలు సాధ్యం కావు. 6, 7 సూత్రాల తరువాతనే 8 వర్తిస్తుంది. లేకపోతే ఏండ్లు—ఏళ్లు, ఇండ్లు—ఇళ్లు అనే వికల్ప రూపాలు సాధ్యంకావు. వేయి వేలి కాకుండా ఉండాలంటే 2 తరువాతనే 3 ప్రవర్తించాలి. ఇట్లా ఎక్కడెక్కడ సూత్రక్రమం అర్థవంతమో పాఠకులు జాగ్రత్తగా పరిశీలిస్తే గ్రహించగలరు.

రెండో వర్గం : వర్ణ విధేయసూత్రాలు

మొదటి వర్గంలో సూత్రాలు ప్రవర్తించిన తరువాత అవి ఉత్పత్తి చేసిన రూపాలమీద ఈ రెండో వర్గం సూత్రాలు ప్రవర్తిస్తై. భాష కంతటికి వర్తించే ఈ వర్గంలో నుంచి బహువచన రూప నిష్పత్తి కవసరమైనంత మట్టుకే ఇక్కడ కూర్చబడినై. వీటివరసకూడా నియతమే.

1. ఉ —> ϕ / | | (ం)
[‘ట’, ‘ట్ట’, ‘డ’, ‘డ్డ’, ‘ళ’] — + ‘ల’

ఇది స్వరలోపసూత్రం. పరిసరంలో కుండలీకరణాల్లో ఉన్న సున్న అనునాసికవ్యంజనాన్ని సూచిస్తుంది. అనునాసిక వర్ణపూర్వకమైనా కాకపోయినా, మూర్ధన్యవర్ణాలు ద్విరుక్తమయినా కాకపోయినా, ఈ వర్ణాల మీద ఉన్న ‘ఉ’ కారం, ‘ల’కారం పరమైనప్పుడు నిత్యంగా లోపిస్తుంది. పై వ్యంజనాల్లో అనునాసికవర్ణయుక్తం కాగలిగినవి ‘ట, డ’ లు మాత్రమే. అనునాసికవర్ణాల తరవాత ద్విరుక్త వర్ణాలు, ‘ళ’వర్ణమూ ఎట్లాగూ ఉండవు కాబట్టి “ంట్ట, ండ్డ, ంళ” అనే సంయోజనం ఈ సూత్రాన్ని ఆటంకపరచదు. ఈ సూత్రం ప్రకారం ఆధునిక భాషలో

అంటు + లు — అంట్లు
కాటు + లు — కాట్లు
చెట్టు + లు — చెట్లు
కోడు + లు — కోళ్లు
గుడ్డు + లు — గుడ్లు
పండు + లు — పండ్లు
కన్ను> కండు + లు — కండ్లు
ఇల్లు> ఇండు + లు — ఇండ్లు
ముల్లు> ముండు + లు — ముండు
రాయి> రాళు + లు — రాళ్లు
కాలు> కాళు + లు — కాళ్లు
నెమలి> నెమళు + లు — నెమళు
మొసలి> మొసళు + లు — మొసళ్లు

అనే విధంగా సంధి నిత్యంగా జరుగుతుంది. ప్రాచీనభాషలో ఈ స్వరలోపం కొన్ని చోట్ల జరగదు. కొన్నిచోట్ల జరిగినా నిత్యంకాదు. ఆధునిక భాషలో “చెట్టులు, గుడ్డులు, ఇండులు, కండులు (<కల్లు), పండులు’ అనేరూపాలు వ్యాకరణ విరుద్ధాలు. మాటలు నేర్చుకొనే దశలో ఉన్న పసివాళ్ల ఉచ్చారణలో ఇట్లాంటి రూపాలు కొన్ని వినిపిస్తాయి.[3]

2. అచ్చు —> ϕ / | | (ం)
(ట, ట్ట, డ, డ్డ, ణ / న, న్న, ర, ర్ర, ల, ల్ల) —(+)‘ల’

బిందుపూర్వమయినా, కాకపోయినా, ద్విరుక్తమయినా కాకపోయినా, మూర్ధన్య, దంతమూలీయ వర్ణాల తరవాత (మీద) ఉన్న అచ్చు ‘ల’ కారం పరమైనప్పుడు వికల్పంగా లోపిస్తుంది. ఈ సూత్ర ప్రవర్తన వ్యవహర్త ఉచ్చరించే వేగంమీద ఆధారపడి ఉంది.

సూత్రంలో బహువచనానికి అవసరం లేనందువల్ల సూచించలేదుగాని మూర్ధన్య దంతమూలీయ వర్ణాలు పరంలో ఉన్నప్పుడుకూడా ఈ లోపం వికల్పంగా జరుగుతుంది.

పై సూత్రంలోలాగే బిందు పూర్వకంకాగలిగిన వర్ణాలు ‘ట, డ’ లు మాత్రమే.

ఉదా: మాను + లు — మాన్లు
పని + లు — పన్లు
పులి + లు — పుల్లు
పేరు + లు — పేర్లు

మిగతా అచ్చులతో ఉదాహరణ లియ్యక పోవటానికి కారణం అచ్చు లోపంవల్ల జరిగే ఇతర వికారాలని ధ్వనివిధేయంగా తెలుగులో సూచించటానికి వీలులేక పోవటమే.[4]

---

3. పిల్లలు వ్యాకరణం నిర్మించుకునే దశను శ్రద్ధగా పరిశీలిస్తే కొన్ని భాషా విషయాలు గ్రహించవచ్చు. ఈ వ్యాసకర్త, ఇటీవలే “బహువచన రూపనిష్పత్తిని” సాధిస్తున్న తన ఐదేళ్ల కుమారుడు కిష్టప్ప భాషలో “చెట్టులు, గుడ్డులు” అనే రూపాల్ని విన్నాడు. అంటే వీడింకా ఈ స్వరలోపసూత్రాన్ని పరవర్ణంముందు ద్విరుక్తం అద్విరుక్తమయ్యే సూత్రాన్ని తన వ్యాకరణంలో నిర్మించుకోలేదన్న మాట.—

4. ఈ సూత్రం సంపూర్ణ స్వరూపం కావాలంటే చూ. C. Ramarao. A Grammatical Sketch of Telugu. (1969). To be Published by the Ministry of Home Affairs, Government of India.

మొదట సూత్రంలో సూచించిన పరిసరాల్లో లోపించగా ఇతరపరిసరాల్లో మిగిలిన ఉకారమూ, మిగతా అచ్చులు ఈ సూత్రానికి విషయాలు. (ఈ స్వరం పదంలో మొదటిదైతే లోపించదు.)

3. 'డ' —> [ళ, ణ] || అచ్చు—(+)['ల','న']

స్వరపూర్వకమైన 'డ'కారం ల, న, లు పరమైనప్పుడు క్రమంగా ళ, ణ లుగా మారుతుంది. ఇది సమీకరణ (Assimilation) సూత్రం. పరిసరంలో ఉన్న 'ల, న' లు కూడా వక్ష్యమాణ సూత్రంవల్ల 'ళ, ణ' లుగా మారతై. అంటే డ+న> ణ్ణ గానూ, డ+ల> ళ్ళ గానూ మారతయ్యన్నమాట. ఈ కార్యం ఏకపదంలోను జరగటానికి వీలుగా పదాంశవిభాగపు గుర్తు కుండలీకరణాల్లో ఉంచబడింది. కోడలు అనే శబ్దాన్ని అవ్యవహితంగా ఉచ్చరించినప్పుడు కూడా ఈ మార్పు జరుగుతుంది. రెండో సూత్రం వర్తించనప్పుడు మూడో సూత్రం కూడా వర్తించదు గనుక 'కోడలు' అనే వ్యవహితోచ్చారణ కూడా రక్షితమే.

ఉదా. కోడులు> కోడ్లు> కోళ్లు
వాడిని> వాడ్ని> వాణ్ని

ఈ సూత్రంలో స్వరపూర్వక మనటంవల్ల గుడ్డు+లు అనే చోట 'డ' కారం ఈ మార్పుకు గురికాదు.

4. ద్విరుక్తవ్యంజనం —> అద్విరుక్తవ్యంజనం ||
—(+) వ్యంజనం

స్వరలోపానంతరం పరవర్ణమైన వ్యంజనం ముందు ద్విరుక్త వ్యంజనం అద్విరుక్త వ్యంజన మవుతుంది.

'గుడ్డులు' అనే రూపం మొదటి సూత్రం వల్ల 'గుడ్డ్లు' కాగా ఈ సూత్రంవల్ల గుడ్లు అవుతుంది. అవ్యవహితోచ్చారణ వల్ల ఏకపదంలో కూడా స్వరలోపం జరిగిన చోట కూడా ఈ సూత్రరే వర్తిస్తుందని చెప్పటానికి పదాంశ విభాగపు గుర్తు కుండలీకరణాల్లో ఉంచబడింది. ఇందుకు 'గొడ్డలి' అనే శబ్దం అవ్యవహితోచ్చారణలో ఉదాహరణయోగ్యమవుతుంది.

5. [ల, న] —> [ళ, ణ] ||
(మూర్ధన్యం)—(+) (మూర్ధన్యం)


అమూర్ధన్యాలైన ల, న లు మూర్ధన్య వర్ణాలకు పరంలో వచ్చినా, పూర్వంలో వచ్చినా మూర్ధన్య వర్ణాలు (ళ, ణ) గా మారతై. మూడో సూత్రంలాగే ఇదీ సమీకరణ సూత్రమే. మొదటి సూత్రానికిచ్చిన ఉదాహరణాల్లో మూర్ధన్యాలకింద రాసిన 'ల' కారానికి ఈ సూత్రంవల్లనే మూర్ధన్యోచ్చారణ విహిత మవుతుంది.

ఈ పై సూత్రాల్లో మొదటి నాలుగుసూత్రాలు, రాసిన క్రమంలోనే వర్ణించాలనే విషయం సూత్రాలను జాగ్రత్తగా పరిశీలిస్తే తెలుసుకోవచ్చు. ఐదో సూత్రం నాలుగో సూత్రంకన్నా ముందువర్తించినా ప్రమాదంలేదు. మూడో సూత్రంకంటె ముందైనా వర్తించవచ్చు గాని అప్పుడు మూడో సూత్రంలో ళ, ణ, లు అదనంగా చేర్చుకోవాల్సి వస్తుంది. అందువల్ల సంక్షిప్తత (Economy) దెబ్బ తింటుంది.

ఇంతటితో బహువచనరూపసాధన కవసరమైన రెండు వర్గాల సూత్రాలూ పూర్తిఅయినై.

ఈ వ్యాసంలో ఇచ్చిన వర్ణ విధేయసూత్రాలు అసమగ్రాలని, తెలుగు స్వరసంధిని సూత్రించటం కష్టమైన పని అనీ, సూత్రరచనకు తెలుగు లిపి చాలటం లేదని వ్యాసంలో అక్కడక్కడ పేర్కొనబడింది. తెలుగు లిపినే కొన్ని మార్పుల్ని చేసి వాడవచ్చునేమో ఈ వ్యాసకర్త ఇంకా ప్రయత్నించలేదు. సూత్ర పద్ధతితోపాటు, లిపిచిహ్నాలు కూడ కొత్తవైతే విషయం దుర్బోధం కావచ్చు. శాస్త్ర విషయాల కోసం తెలుగు లిపిని మలచుకొని ఒక "ధ్వని లిపి"ని తయారు చేసుకుంటేగాని ఈ సమస్య పరిష్కారం కాదు. అట్లాంటి పద్ధతి యూరపియన్ భాషలకుంది. మనం కూడా అట్లాంటి సంప్రదాయా న్నేర్పర్చుకుంటే శాస్త్ర రచన, బోధన సుకర మవుతుంది. అందాకా ఈ క్లేశం తప్పదు. ఈ పరిమితులకు లోబడి ఈ మిగిలిన వ్యాసభాగంలో తెలుగు స్వరసంధి స్వరూపం కొంతవరకు పరిశీలించబడుతుంది.

తెలుగు భాషలో అచ్చుల్ని ఉచ్చారణ స్థాన ప్రయత్నాల్నిబట్టి ఈ కింది విధంగా బొమ్మలో సూచించవచ్చు. హ్రస్వాచ్చులు దీర్ఘాచ్చులకు కూడా గ్రాహ్యాలు.



ఈ అచ్చులకి చుట్టూఉన్న గీతలు వాటి ఉచ్చారణకు హద్దులు. ఈ గీతలలో ఉచ్చరితమైన అచ్చులు స్వల్పమైన మార్పులకు గురి అయినప్పటికీ అర్థ భేదక సమర్థాలు కాకపోతే ఆ మార్పుల్ని గుర్తించక్కర్లేదు. కాని తెలుగులో అతి విస్తృతమైన సంధికార్యంవల్ల ఈ మార్పులు అర్థభేదక సమర్థాలవుతై.

ఒక పదంలో పరంలో ఉన్న వ్యంజనంమీద 'అ'కారం ఉన్నప్పుడు పూర్వంలో అచ్చు బొమ్మలో చూపిన తన స్థానం నుంచి కొద్దిగా కిందికి జరుగుతుంది.

ఉదాహరణకు ఈ కింద పదాలను ఉచ్చరించి భేదాన్ని గమనించవచ్చు:

పిల్లి—పిల్ల గూడు— గూడ
మేడు—మేడ గోడు—గోడ
కంపు—కంప

ఈ భేదం ఈ పదాలతో 'ఉంది' అనే క్రియను చేర్చి ఉచ్చరిస్తే ఇంకా స్పష్టమవుతుంది. వ్యస్తంగా ఉచ్చరించినప్పుడు ఈ మార్పుకు కారణమైన 'అ'కారం ఉంటుంది కాబట్టి ఈ భేదానికి వర్ణత్వం గ్రహించక్కర్లేదు. కాని సంధిలో ఈ 'అ'కారం లోపిస్తుంది కాబట్టి ఈ మార్పు అర్థభేదక సమర్థమవుతుంది. బహువచనం ప్రత్యయం పరమైనప్పుడు కూడా పై పదాల్లో కొన్నిటికి నామపదాంతస్వర లోపం జరుగు తుంది. అప్పుడూ ఇదే పరిస్థితి.

పరంలో అకారం బదులు 'ఎ'కార మున్నప్పుడు కూడా ముందటి అచ్చు తన స్థానం కన్నా కొంత కిందకి జరుగుతుంది. అయితే 'అ'కారం పరమైనప్పుడు జరిగినంత కిందికి జరగదు. స్వరలోపానంతరం ఈ మార్పు కూడా అర్థభేదక సమర్థమవుతుంది. ఉదాహరణకి "కోడు + లు, కోడె + లు, కోడలు" అన్న పదాలని సంధితో వరసగా ఉచ్చరించి చూస్తే ఉచ్చారణలో భేదాన్ని గమనించవచ్చు. 'డ'కారంమీద ఉన్న అచ్చు లోపించటంవల్ల ఈ మార్పు ముందటి అచ్చునే గాక తరవాత అచ్చును గూడ ప్రభావితంచేస్తుంది. ఈ విధంగా సంధిలో పై బొమ్మలో ఇచ్చిన అచ్చులన్నిటికి ఈ మార్పుకలిగి అది అర్థభేదక సమర్థమవుతుంది. అంటే బొమ్మలో ఇచ్చిన సంఖ్య మూడురెట్లు అవుతుంది. వీటికి దీర్ఘస్వరాల సంఖ్య కలిపితే అది రెట్టింపు అవుతుంది. అంటే $5 \times 3 \times 2 = 30$. ఇంతేగాక 'ఉ', 'ఒ' ల ఉచ్చారణలో ఇంకోమార్పు కనిపిస్తుంది. ఉదాహరణకి "కోడు + ఉంది, కోడి + ఉంది, కోడె + ఉంది" అన్న పదాలను అవ్యవహితంగా ఉచ్చరించి చూస్తే ఈ భేదం తెలుస్తుంది అట్లాగే "ఒ" ఉచ్చారణలో కూడా "అది + ఒకటి, అది + ఓడ" అన్న పదాలను ఉచ్చరించి చూస్తే భేదం తెలుస్తుంది. ఈ "ఉ, ఒ" ల ఉచ్చారణలో పూర్వపదాంతమైన 'ఇ, ఎ'లు తాలవ్యత్వాన్ని కలిగిస్తై. ఈ విధమైన మార్పులు ఇంతకు ముందటి మార్పుకి గురైన 'ఉ, ఒ' ల ఉచ్చారణ భేదాలన్నిటికీ తాలవ్యత్వాన్ని కలిగిస్తై. ఇంతకు ముందటి మార్పులో 'ఉ, ఒ'లవంతు $2 \times 3 \times 2 = 12$. వీటి తాలవ్యభేదాలు $12 \times 2 = 24$. మొదటివీ ఇవీ కలిపితే మొత్తం $= 30 + 24 = 54$ అవుతై. వీటితోపాటు అకారభేదాలకు కలిగిన తాలవ్యత్వాన్ని పరిగణిస్తే మరొక ఆరు (3 అకారాలు మొదట పేర్కొన్న స్థానం భేదంవల్ల మరో 3 వాటి తాలవ్య వికారాలు) అదనంగా కలపాలి. అప్పుడు మొత్తం అచ్చుల సంఖ్య 60 అవుతుంది. ఒకవేళ ఈ సంఖ్యాపరిగణనం సరికాక పోవచ్చు. ఇంకోవిధంగా లెక్కిస్తే 60 కి కాసిని

ఏక్కువైనా కావచ్చు తక్కువైనా కావచ్చు. అది ప్రధానం కాదిక్కడ. అకారలోపంవల్ల, ఇ, ఎ,ల లోపం వల్ల పదాల్లో పూర్వపరాచ్చులలో భేదం అర్థ భేదక సమర్థమైనప్పుడు దాన్ని గుర్తించాలా, గుర్తిస్తే వర్ణా లన్నిటికి గుర్తులు కావాలన్నప్పుడు తెలుగు అచ్చులికి 60 రకాల భేదాల్ని సూచించే గుర్తుల్ని స్వీకరించాలా అన్నదే ప్రధాన సమస్య. ఈ భేదాల్ని వ్యాకరణం సూచించాలంటే వ్యాకర్త అవలంబించాల్సిన పద్ధతి ఏమిటి? ఈ మార్పులు కేవలం సంధిలోనే జరగటం వల్ల, సంధిని సమగ్రంగా వర్ణిస్తే ఈ సమస్యను పరిష్కరించవచ్చు. తెలుగుని వర్ణవిధేయంగా రాయా లంటే, బొమ్మలో సూచించిన ఐదు అచ్చులనూ, వాటి దీర్ఘాలనూ మాత్రమే వర్ణాలుగా గుర్తించి, మిగిలిన వికారాలను సంధిలో మాత్రమే జరుగు తయ్యని "ధ్వని సూత్రాల" (Phonatic rules) ద్వారా నిరూపించవచ్చు. అంటే సంధివల్ల జరిగే వికారాలు వర్ణత్వాని కనర్హాలన్నమాట. ఈ సంధిని సమగ్రంగా వర్ణించాలంటే తెలుగు లిపిలో ప్రస్తుతం కష్టసాధ్యం. ఈవ్యాసంలో ఇచ్చిన వర్ణవిధేయ సూత్రాలు అసమగ్రా లనటంలో ఉద్దేశం ఇది.

ఈ వ్యాసంలో పాటించిన సూత్రక్రమం ఒక్కోచోట చారిత్రకక్రమాన్ని సూచించవచ్చు. వర్ణవిధేయ సూత్రాలక్రమం కొంతవరకు చరిత్రలో మారిన క్రమాన్ని సూచిస్తుంది. చరిత్ర దృష్టితో రాస్తే ఈ సూత్రాల్ని మార్చాల్సి రావచ్చు. ఒక కాలపు భాషను వర్ణించే సూత్రాల వరస చారిత్రక క్రమాన్ని సూచించటంలో ఆశ్చర్యంలేదు. సంక్షిప్తత (Economy) ను దృష్టిలో పెట్టుకొని నేటి కాలపు భాషకు రచించిన సూత్రాల ద్వారా చరిత్రను సూచించ గలిగితే అది స్వాగతించదగిందే. వర్ణనాత్మక వ్యాకర ణంలో చారిత్రకాంశాలను జోడించకూడదన్న మూఢ విశ్వాసం ఇప్పటి భాషాశాస్త్రజ్ఞుల కెవరికీలేదు.

తెలుగు సంధిని గురించిన మరో విశేషం: మాటలు అన్న పదాన్ని అవ్యవహితంగా ఉచ్చరిస్తే టకారంమీది అచ్చు లోపించి 'మాట్—లు' అవు తుంది. కాని 'మాట+లు+నాకు రావు' అన్న శబ్ద సమూహాన్ని కలిపి ఉచ్చరిస్తే 'మాటల్నాకు రావు' అని అవుతుంది. అట్లాగే 'కోడలు' అన్న శబ్దాన్ని అవ్యవ హితంగా ఉచ్చరిస్తే 'కోళ్—లు' అవుతుంది. కాని బహు వచన ప్రత్యయం పరమైతే 'కోడళ్లు' అని అవు తుంది. అంటే రెండో సంధి జరిగినప్పుడు మొదటి సంధి జరగదు. ఇది మొదటి ఉదాహరణలోలాగా రెండు పదాలమధ్య జరగవచ్చు. రెండో ఉదాహరణలోలాగ ఏకపదంలోనూ జరగవచ్చు. ఏకపదంలో జరిగిన సంధిని అంతస్సంధి (Internal Sandhi) అనీ, భిన్న పదాలమధ్య జరిగిన సంధిని బహిస్సంధి (External Sandhi) అనీ అంటారు. కాని ఇక్కడ అంతర్బహి స్సంధి విభాగాలతో నిమిత్తం లేకుండానే ఈ కార్యాలు జరిగినై. రెండుచోట్ల వరసగా సంధి కవకాశం ఉన్నప్పుడు, మొదటి సంధి తన అవకాశాన్ని వదులుకొని రెండో సంధికి వీలు కల్పిస్తున్నది. సంధిని సూత్రించేటప్పుడు ఈ విషయాన్ని కూడా సూత్ర కారుడు సూచించాలి.

పైన పేర్కొన్నటువంటిది అన్నిచోట్లా జరగదు. అంటే అన్నిచోట్లా పూర్వసంధి పరసంధికి లొంగిపోదు. కొన్నిచోట్ల మొదట జరిగిన పూర్వ సంధే బలీయమై పరసంధిని జరక్కుండా నిరోధి స్తుంది. ఉదాహరణకు "గుడ్డు+లు" అన్న వర్ణ సంయోజనం స్వరలోపాది సంధికార్యాలు జరిగి "గుడ్లు"అవుతుంది. "గుడ్డు+లు+లేవు" అన్నప్పుడు కూడా పరసంధిని నిరవకాశంచేసి, పూర్వసంధి జరిగి "గుడ్లులేవు" అనే అవుతుంది గాని "గుడ్డుల్లేవు" అని కాదు. దీనికి "గుడ్డు" శబ్దంలో ద్విరుక్త వ్యంజనం ఉండటం కారణంకాదు. అద్విరుక్త వ్యంజన మున్నా అంతే. "కోటు+లు+లేవు" అన్నప్పుడుకూడా "కోట్లులేవు" అనే అవుతుంది గాని "కోటుల్లేవు" అనికాదు.

(1) కోటు+లు+లేవు=కోట్లులేవు.
(2) కోట+లు+లేవు=కోటల్లేవు.
(3) గుడ్డు+లు+లేవు=గుడ్లులేవు.
(4) గుడ్డ+లు+లేవు=గుడ్డల్లేవు.

ఈ పై ఉదాహరణల్లో బేసి ఉదాహరణల్లో పూర్వ సంధి బలీయం. సరిఉదాహరణల్లో పరసంధిబలీయం.

ఈ వ్యాసంలో ఇచ్చిన వర్ణవిధేయ సూత్రాల్లో మొదటి సూత్రపు పరిసరాల్లో పూర్వసంధి బలీయమనీ, రెండో సూత్రపు పరిసరాల్లో పరసంధి బలీయమనీ సూత్రాల్ని ఈ ఉదాహరణల్ని పరిశీలిస్తే గ్రహించగలరు. మొదటిసూత్రం నిత్యం, రెండో సూత్రం వికల్పం. ఈ వికల్పత్వమే పరసంధి కవకాశ మిస్తున్నదని ప్రతిపాదించవచ్చు

ఈ విషయాల్ని న్యాయానికి పై సూత్రాల్లోనే చెప్పి ఉండాల్సింది. ఈ నియమాల్ని ఈ రకపు సూత్ర పద్ధతిలో ఎట్లా చేర్చాలో తెలీకపోవటం వల్ల అది కుదరలేదు.

తెలుగు బహువచన రూపాల్ని ప్రాచీన వ్యాకర్తలు సాధించారు. కాని వారు వ్యాకరించింది కావ్యభాష. ఈ వ్యాసంలో వ్యాకరించింది ఆధునిక వ్యవహార భాష. ఆధునిక భాషలో బహువచన రూపాల్ని వ్యాకరించే ప్రయత్నాలు పూర్వం Arden వంటి వారు చేశారు. ఆధునిక భాషాశాస్త్ర పద్ధతిలో సాధ్యమైనంతవరకు సమగ్రతని, సంపూర్ణతని దృష్టిలో పెట్టుకొని చేసిన మొదటి ప్రయత్నమిది. అయితే ఇందులో అయినా వివిధ మాండలికాల్ని పరిశీలనలోకి తీసుకోలేదు. కొంతవరకు బహు వచన రూప నిష్పత్తిలోనూ, ఇంకా ఎక్కువగా సంధిలోనూ పరిశోధకులు పరిశీలించవలసిన మాండలిక భేదా లెన్నో ఉన్నై.

కారు+లు=కార్లు అని కొన్ని మండలాల్లో అయితే, కొన్నితెలంగాణపుమాండలికాల్లో "క్రాలు" అవుతుంది. పై వర్ణ విధేయ సూత్రాల్లో అదనంగా "ర+ల—> ల+ర" అనే వర్ణవ్యత్యయ (Metathesis) సూత్రాన్ని చేర్చుకొని దీన్ని సాధించవచ్చు. ఇట్లాంటి సంధి విశేషాలు ఎన్నో వ్యాకరించవలసి ఉంటుంది. అటువంటి ప్రయత్నాలకైనా ఈ వ్యాసంలో చూపిన మార్గం ఉపకరిస్తుంది.

[ఈ వ్యాస విషయాన్ని గురించి పరిశోధించమని మొదట (1963) లో నాకు సూచించిన వారు ప్రొఫెసర్ జి. ఎన్. రెడ్డిగారు. ఈ వ్యాసంలో ఉపయోగించిన సూత్రపద్ధతిని మొదటిసారి (1963 లోనే) నాకు పరిచయం చెయ్యటమేగాక, కొన్నిచక్కని సూచనలు కూడా చేశారు, విస్కాన్సిన్ యూనివర్సిటీ భాషాశాస్త్రాధ్యాపకులైన Valdis Zeps గారు. అప్పుడప్పుడు భద్రిరాజు కృష్ణమూర్తి, జెరల్డ్ కెలీ గార్లతో జరిపిన గోష్ఠులు కూడా ఈ వ్యాసాని కుపకరించినై. వీరందరికీ వ్యాసకర్త కృతజ్ఞుడు. ఈ వ్యాసంలో ఇంకా మిగిలిపోయిన లోపాలకు పైవారి బాధ్యత ఎంతమాత్రమూలేదు.]

ఈ వ్యాసంలో ఉపయోగించిన పరిభాష

స్థితి సూత్రాలు	Item and Arrangement (rules)
గతి సూత్రాలు	Item and Process (rules)
మూలరూపం	Underlying form; Base form
పరిసరాపేక్షకసూత్రం	Context sensitive rule
పరిసరనిరపేక్షకసూత్రం	Context free rule
నియతక్రమసూత్రాలు	Ordered rules
పదాంశ విధేయ సూత్రాలు	Morphologically Conditioned rules
వర్ణవిధేయ సూత్రాలు	Phonologically Conditioned rules
అంతస్సంధి	Internal Sandhi
బహిస్సంధి	External Sandhi

Bibliography

English

Arden, A. H.
(1955) A Progressive Grammar of Telugu, Christian Literature Society, Madras. (Second edition.)

Kelley, Gerald
(1959) Telugu Vowel Phonemes. Indian Linguistics. Turner Jubile Volume.

(1963) Vowel Phonemes and External Sandhi in Telugu. Journal of the American Oriental Society. Vol. 83. No. 1.

(1965) A grammar of Telugu. (Mimeographed.)

Krishnamurti, Bh.
(1957) Sandhi in Modern Colloquial Telugu. Indian Linguistics, Talaporewala Memorial Volume.

Ramarao, C.
(1969) A Grammatical Sketch of Telugu. (To be published by Governmen of India.)

తెలుగు

చిన్నయసూరి, పరవస్తు. బాలవ్యాకరణము.

కృష్ణమూర్తి, భద్రిరాజు.
(1959) నేటి తెలుగు—వర్ణసమామ్నాయం. భారతి.
(1970) పదం—పదాంశం. భారతి. ఏప్రిల్.

సీతారామాచార్యులు, బహుజనపల్లి, ప్రౌఢవ్యాకరణము.



నేనూ - సముద్రం

శ్రీమతి నాయని కృష్ణకుమారి

కడలి గర్భంలో
ఉద్భవించిన తొలిక్షణాన
అతి చిన్నది అల!
సన్నగా నాజూకుగా
తీగలా సాగి
నీటి ఒత్తిడికి
గాలి ఒరిపిడికి
కదలాడి రేగి
ఉవ్వెత్తుగా లేచిన మలిక్షణాన
అపలేనట్టిది!

మనిషి మనస్సులో
మసలిన తొలి ఘడియలోన
మరీ చిన్నది కోర్కె!
అందిన అవకాశాలకు
సందడిగా ముందుకు దూకి
అందని ఆలంబనాలను
నిందించి పేట్రేగి
అడ్డూ ఆపూ లేక
అడ్డదిడ్డంగా పెరిగిన
మలిగడియలోన
పట్టరానట్టిది!


కాంక్షా కల్లోలమై
మనస్సు లోపొరల లోపలి

నేనూ - సముద్రం

అపార పారావారాన్ని
అద్భుతంగా కదిలిస్తోంది.
నిర్విరామ కాంక్షా తాడనాన్ని
సుంతైనా సహించ లేని నన్ను
నిరభిమాన సైకత తీరాన్ని గా
మలిచి నిలబెడుతోంది.
అహల్యవై నైశ్చల్యాన్ని భజించమని
నిర్దాక్షిణ్యంగా శపిస్తోంది.

అందుకే
నిరంతర తరంగ తాడిత
సాగర తీరాన్ని
ఎప్పుడు చూచినా
నాకు నేను గుర్తుకు వస్తుంటాను
నన్ను నేను పోల్చుకుని
తత్తరపడి పోతాను.

— —



శనిగరం శిలాశాసనములు

శ్రీ బి. ఎన్. శాస్త్రి

శాసనము

ఈ శాసనము కరీంనగరం మండలములోని శనిగరం గ్రామమున నున్న పాతేశ్వర దేవాలయమున నున్నది. ఈ ఆలయము శిథిలమగుటవలన గ్రామీణులు చుట్టు గర్భగుడివంటి దానిని నిర్మించి, పైన రేకులు కప్పినారు. ఆలయమునకు ప్రాకారకుడ్యము నిర్మించినారు. ఆలయమునగల శివలింగము ఎత్తైనది. ఎత్తైన పానవట్టము కలిగి శివలింగము గంభీరముగ కనిపించుచున్నది. శనిగరం గ్రామమున శిథిల దేవాలయము లున్నవి. ఆలయము ముందు చిన్న అరుగు మంటపమువలె నిర్మింపబడినది. ఎత్తైన నంది విగ్రహము చూచుట కందముగ నున్నది. ఆలయ ఆవరణలో పశ్చిమ చాళుక్య ప్రభువగు ప్రతాప చక్రవర్తి రెండవ జగదేకమల్లుని కాలపు శిలా శాసనమున్నది. శాసనములందు శనిగరం గ్రామము శనిగరంగానే పేర్కొనబడినది. ఈ గ్రామము పూర్వము మహాసామంతాధిపతులకు రాజధానిగా నుండె ననుటకు నిదర్శనము లున్నవి.

హైదరాబాదు--కరీంనగర్ రోడ్డుపై హైదరాబాదుకు 78 మైళ్ల దూరమున శనిగరం గ్రామమున్నది. రోడ్డునుండి నాలుగు ఫర్లాంగులు దూరములో గ్రామమున్నది. గ్రామము హుస్నాబాదు పంచాయతీ సమితిలో నున్నది. పశ్చిమ చాళుక్యులనాటి మరియొక శాసనము గ్రామము వెలుపల పొలములో నున్నది.

ఆకారాదికములు

ఈ శాసనము తెల్లరాతిపై నాలుగు వైపుల చెక్కబడినది. శాసన శిల నాలుగు వైపుల నునుపుగా చెక్కబడినది. అక్షరములు అందముగ చెక్కబడినవి. శాసన శిల ఎత్తు 4'—9" లు. శాసనాక్షరములు ఒక్కొక్క ప్రక్క 3' లు చెక్కబడినవి. శాసనశిల వెడల్పు 1, 3 ప్రక్కలు 11" లు. 2, 4 ప్రక్కలు 12.5" లు. శాసనశిలను తవ్వించవలసిన అవసరము లేకుండ ప్రతిబింబములు తీయుటకు వీలైనది.

శాసనము మొదటి ప్రక్క సూర్య చంద్రులును, రెండవవైపు గోవు—లేగ, మూడవవైపు పానవట్టముతో కూడిన శివలింగము, నాలుగవ వైపు నంది విగ్రహము చెక్కబడినవి. శాసనము మొదటి ప్రక్క 23 పంక్తులు, రెండవప్రక్క 25, మూడవ ప్రక్క 27, నాల్గవప్రక్క 28 పంక్తులు మొత్తము 103 పంక్తులున్నవి.

లిపి

ఈ శాసనము నం వాంధ్రదేశమున ముఖ్యముగా తెలంగాణ ప్రాంతమున పంద్రెండవ శతాబ్ది పూర్వార్థమున వాడుకలోనున్న తెలుగు కన్నడ లిపి వాడబడినది. శాసన లిపి మేడెయభట్టు బొల్లెపల్లి శాసనము[1], బొల్లయనాయకుని పెద్దకడుమూరు శాసనము[2]ల లిపిని పోలియున్నది. శాసనాక్షరము లచ్చటచ్చట స్పష్టాస్పష్టముగ నున్నవి. కొన్నిచోట్ల ద్విత్వాక్షరములు క్రిందివరుసలోనికి వచ్చి ఆ రెండు వరుసలు కలిసియే యున్నట్లు కనిపించుచున్నవి. అక్షరములు కొన్ని పెద్దవిగను, మరికొన్ని చిన్నవిగను చెక్కబడినవి. ఈ శాసనశిల క్రిందివైపు వంకరగా నున్నది.

భాష

ఈ శాసనము కన్నడ భాషలో వేయింపబడినది. ఇందు మొదట చాళుక్యుల ప్రశస్తి యున్నది. కల్యాణి

1. భారతి — మార్చి 1969.
2. తెలంగాణ శాసనములు—Vol. II క. చా. శా. నం. 36.

చాళుక్య ప్రభువగు రెండవ జగదేకమల్లుని కాలమున వేయించినశాసనమిది. శాసనమును కమ్మ కులాభరణుడును ఆత్రేయ గోత్రీకుడును శ్రీమద్దండనాయక మేడ క్షేత్రసరు శ్రీ పాత్రేశ్వర దేవర నిత్యనివేద్యమునకు భూమిని దానమిచ్చు సందర్భమున వేయించెను. ఈ శాసనమున వరుసగా చాళుక్య చక్రవర్తి రెండవ జగదేకమల్లుడు, మహామండలేశ్వర కాకతి ప్రోలరాజు, శ్రీమతు సదసహ్రక్రమ సవదార రేపాల కుఱువరసర, శ్రీమద్దండ నాయక మేడక్షేత్రసరు పేర్కొనబడినారు. వీరు వరుసగా ఒకరి కొకరు సామంతులు.

రెండవ జగదేకమల్లుని సామంతుడు కాకతి ప్రోలరాజు మహా మండలేశ్వరుడు. ప్రోలరాజు సామంతుడు మహాసామంతుడైన రేపాల కుఱువరసర. అతని మహాసామంతాధిపతి మేడక్షేత్రసరు. శనిగరం ప్రాంతపాలకుడు. శనిగరం సబ్బిసాయిర మండలములోని భాగము. ఈ సబ్బినాట అనేక సామంతులు, సామంతాధిపులు, మహాసామంతాధిపులు ఉండిరి. అందు శనిగరం ప్రాంత పాలకుడు మహాసామంతాధిపతి. శాసనారంభమున శ్లోకములులేవు. మూడవప్రక్క 25 వ పంక్తినుండి వ్యాసగీతాశ్లోకము లారంభమై నాలుగవప్రక్క 22 వ పంక్తివరకున్నవి. శాసనాంతమున కన్నడ వచనమున్నది.

శాసనమున భాషా విశేషములు ప్రాచీన శాసనములలోవలె నున్నవి. ఇందు 'ఱ' వాడబడినది. ప్రవర్ధమాన బదులు—ప్రవద్ధఱ. ఆచంద్రార్క—ఆచంద్రాకఱ ఆదులు కనిపించుచున్నవి. ఆంధ్ర కర్ణాట భాషల కొకే లిపి ఈ కాలమున వాడబడినది. ప్రోలరాజు ఇతర శాసనములలోని భాషవలె ఈ శాసనభాష యున్నది. సంస్కృత పదములు ఎక్కువగానున్న ఈ శాసనమున ఒక్కొక్క మండలాధీశుని బిరుదములు తెలుపబడినవి. ఈ శాసనమువలన ఇద్దరు మహాసామంతాధిపతుల పేళ్లు తెలియుచున్నవి.

శాసన విషయము

ఈ శాసనమును మహాసామంతాధిపతి మేడ క్షేత్రసరు వేయించెను. శాసనమున కల్యాణి చాళుక్య ప్రభువగు రెండవ జగదేకమల్లుడు, అతని సామంతుడు మహామండలేశ్వరుడును ఐన కాకతిప్రోలరాజు మొదట పేర్కొనబడినారు. ప్రోలరాజు తరువాత సోదరరేపాల కుఱువరసర — అతని పాదపద్మోపజీవి క్షేత్రసరు పేర్కొనబడినారు. మేడక్షేత్రసరు కమ్మకులాభరణుడు. శ్రీ పాత్రేశ్వర దేవరకు నిత్య నైవేద్యములకు శకసంవత్సరము 1071—శుక్ల చైత్ర శుద్ధ 15 గురువారము విష్ణుసంక్రాంతి వ్యతీపాత సోమగ్రహణ నిమిత్తమున భూమిదానమిచ్చినట్లు శాసనమున వ్రాయబడినది. ఈ శాసనమున రెండవ జగదేకమల్లుడు ''స్వస్తి సమస్త భువనాశ్రయ శ్రీ పృథ్వీవల్లభ మహారాజాధిరాజపరమేశ్వర పరమభట్టారక సత్యాశ్రయ కులతిలక చాళుక్యాభరణ'' అని వర్ణింపబడినాడు.

కాకతి ప్రోలరాజు— ''తత్పాదపద్మోపజీవిత సమధిగతపంచమహాశబ్ద మహామండలేశ్వర నన్మకుండాపుర వరేశ్వర పరమమాహేశ్వర పతిహితచరితం శ్రీ మన్మహామండలేశ్వర కాకతీయ ప్రోలరసర'' అనియు, సోదర రేపాల కుఱువరసర ''తత్పాద పద్మోపజీవిత సమస్తోపేత సమధిగతపంచమహాశబ్ద మహాసామంత విజయలక్ష్మీకాంతకామనికామ నామాది సమస్త ప్రశస్తి సహితుడు''గాను, మేడక్షేత్రసరు ''తత్పాదపద్మోపజీవిత సమస్తోపేత సమధిగతపంచమహాశబ్ద మహాసామంతాధిపతి మహాప్రచండదండనాయక వస్తుగుణ వస్తునాయక కమ్మకులాభరణ ఆశ్రితదీనపోషణ సుజనపవిత్రయాత్రేయగోత్ర'' అని వర్ణింపబడినారు. శ్రీ మేడక్షేత్రసరు శ్రీ పాత్రేశ్వర దేవరకు దానమిచ్చు సందర్భమున ఈ శాసనమును వేయించెను.

తొలిమ్యాదగ యేనూరు నేలమఱ్తురు-కసుకడి పదిమర్తులు, మనికతడు 10 మర్తురులు. పురాదెనదె ౪ మన్నెరడు కొల్లచిత్తగాణ—శ్రీ చరణ పండిత దేవర కాలుగడిగి ధారాపూర్వకముగా దానమిచ్చెను. శాసనాంతమున దాన ఫలమును తెలుపు శ్లోకము లున్నవి. మూడవ ప్రక్క 25 వ పంక్తినుండి దాన శ్లోకము లారంభమై నాలుగవప్రక్క 22 వ పంక్తితో పూర్తి యగుచున్నవి. తరువాత ఆరు పంక్తులు కన్నడ వచనమున్నది. ఇంతటితో శాసనము ముగిసినది. శాసనము మేడ క్షేత్రసరు వేయించినది. అతడు తనపై అధిపతుల నందరిని పేర్కొనినాడు.

కాలనిర్ణయము

ఈ శాసనమున చాళుక్య ప్రతాప చక్రవర్తి బిరుదాంచితుడగు రెండవ జగదేకమల్లుడు పేర్కొనబడి నాడు. రెండవ జగదేకమల్లుడు క్రీ. శ. 1136—1155 వరకు కల్యాణి చాళుక్య రాజ్యమును పాలించెను. కాకతి రెండవ ప్రోలరాజు పాలించిన కాలము క్రీ. శ. 1115—1158. ఈ శాసనము వేయించిన సంవత్సరము శ. సం. 1071. అనగా క్రీ. శ. 1149. అగుచున్నది. కాకతి ప్రోలరాజు, రెండవ జగదేకమల్లుని సామంతుడుగా పాలించు కాలమున సబ్బి మండలమున ప్రోలరాజు అధీనములోనున్న మహాసామంతులు—కొన్ని ప్రాంతములను పాలించుచుండిరి. అందు రేపాల కుఱు వరసర, అతని సామంతుడు శ్రీ మేడక్షేత్రసరు ఆదిగా గలవారుండిరి. అందు శనిగరం ప్రాంత పాలకుడు మహాసామంతాధిపతి కమ్మకులాభరణుడుఐన మేడ క్షేత్రసరు. శ్రీ పాత్రేశ్వర దేవర నిత్య నైవేద్యములకు గాను క్రి శ. 1149 లో ఈ శాసనమును వేయించెను. శాసనమును మేడక్షేత్రసరు—వేయించుచు, చక్రవర్తిని, రాజును తనపైనున్న మహాసామంతాధిపతిని పేర్కొనుటవలన ఇతని ప్రభుభక్తి ఎట్టిదో తెలియుచున్నది.

1. శనిగరం శిలాశాసనము

శాసనము-మొదటిప్రక్క

1 స్వస్తి సమస్త భువ
2 నాశ్రయ శ్రీ
3 పృథ్వీ వల్లభ మహా
4 రాజాధిరాజ పరమే
5 శ్వర పరమభట్టారక
6 సత్యాశ్రయ కుల
7 తిలక చాళుక్యాభర
8 ణ శ్రీ మజ్జగదేక మ
9 ల్ల దేవర విజయ
10 రాజ్య ముత్తరోత్తరా
11 భివృద్ధి ప్రవర్ధమానమా
12 న మాచంద్రార్కతారా
13 రం సలుత్తమిరె త
14 త్పాద పద్మోపజీవి
15 త సమధిగత
16 పంచ మహా శబ్ద మ
17 హా మండలేశ్వర న
18 న్మకుండాపురవరేశ్వ
19 ర పరమ మహేశ్వ
20 ర పతిహిత చరితం
21 వినయవిభూషణం
22 శ్రీ మన్మహా మండ
23 లేశ్వర కాకతీయ

రెండవ ప్రక్క

1 ప్రోల ఒరసర తత్పాద
2 పద్మోపజీవిత సమ
3 స్తోపేత సమధిగత
4 పంచ మహా శబ్ద మ
5 హాసామంతా విజయ
6 లక్ష్మీకాంత కామ నికామ
7 దెంవమడెమనెకావనా
8 మాది సమస్త ప్రశస్తి సహి
9 తం శ్రీమతు సదసహ
10 క్రమ సవదొర రేపాల
11 కుఱువరసర తత్పాద
12 పద్మోపజీవిత సమ
13 స్తోపేత సమధిగత పంచ
14 మహా శబ్ద మహా సామం
15 తాధిపతి మహా ప్రచో
16 డ దండ నాయక వస్తు గ
17 ణ వస్తు నాయక కమ్మ
18 కులాభరణ యాత్రిత దీ
19 న పోషణ సుజన పవిత్ర
20 యాత్రేయగోత్ర శ్రీ
21 మద్దండ నాయక మేడ
22 క్షేత్రసరు శ్రీ పాత్రేశ్వర

23 దేవరిగె నిత్య నివేద్య
24 కునందాదినిగెత వి
25 షాదానరాహారక

మూడవ ప్రక్క

1 వ్వడదా నక్కం శక ప
2 షః 1071 నేయ
3 శుక్ల సంవత్సరద చై
4 త్ర శుద్ధ 15 యు గు
5 రువార విష్ణు సంక్రాం
6 తి వ్యతీపాత సోమ
7 గ్రహణ దిమ......
8 కనూయెబరాదెన
9 తా ఔరి వ్యాదగయె
10 నీరునేల మత్తరు క
11 ను కడడమత్తరు ప
12 త్తు మనికతడమత్త
13 రు పత్తు మరాదెనదె
14 ॥ రున్నెరడు కొల్గ బత్త
15 ముగా ణ ఎ యండు
16 శ్రీ చరణ పండిత దేవ
17 ర కాలు గడిగి ధారా పూ
18 ర్వక మాడి కొట్టయ
19 ణ శితగోమాత
20 నె దామ గ్రకాకచకన
21 స్థిత స్రప
22 జావిజాటపుణ్యగేవ
23 య్రాత్రేయ గోత్ర విధిమ
24 ట్టను మండపాయ్య ణా
25 సామాన్యోయం ధర్మ
26 సేతు నృపాణాం కా
27 లే కాలే పాలనీయోభ

నాలుగవ ప్రక్క

1 వద్భిః సర్వా నేతాన్ భావినః
2 పార్థివేంద్రాన్ భూయో
3 భూయో యాచతే రా
4 మభద్రః॥ బహుభి ర్వసు
5 ధా దత్తా రాజ భిస్సగరాది
6 భిః యస్య యస్య యదా భూ
7 మి స్తస్య తస్య తదా ఫలం॥
8 కపాలన॥ దానేన
9 ....గ సురయోనేన
10 రయదాల.....హ.....త
11 ....మతంపర........
12 ణపోత్తవాయోహరేతి. .....
13 ....ణ పద పాశురా
14 దొదె. ....సేస్థతే
15 యకల రుని కొళిత
16 ......దనరతిదద్విజయకాదకొట్ట
17 యేనెకాది శత్రుది కొడి
18 మహాదిన దొదెనె దావేతి
19 ....స్వదత్తా పరదత్తాంవా
20 యోహరేతి వసుంధర షష్టి
21 ర్వష సహస్రాణి విష్ఠాయాం
22 జాయతే క్రిమి
23 ధర్మా మనెత్తాను కడి దీ
24 యే డు బ గె డ డు నర స్మృతి
25 ద కుదుజన హేతుమత్
26 స్సద్దరిత వక్కమద—
27 కుళుసజదు పన
28 కొడెలు—సమస్తనన్తె.

2. శనిగరం శిలాశాసనము

శా స న ము

శనిగరం చెఱువు అలుగు ప్రక్క చెఱువుకట్ట మీద, కట్టమైసమ్మ గుడికి ఎదురుగా గోలకొండ నవాబగు అబ్దుల్లాకుతుబ్షా కాలమున వేయింపబడిన శిలాశాసనమున్నది. ఈశాసనము శనిగరం పెద్దచెఱువు పొర్లుమత్తడి లేక అలుగు కట్టించిన సందర్భమున వేయింపబడినది. శాసనము శ. సం. 1786 అనగా క్రీ. శ. 1864 లో వేయింపబడినట్లు చెక్క

బడినది. కాని గోలకొండ రాజ్యము క్రీ. శ. 1687 లో మొగలు సామ్రాజ్యమున చేర్చబడినది. శాసనమును చెక్కిన శిల్పి శ. సం. 1786 ను, 1586 కు బదులుగా చెక్కినట్లు భావింపవచ్చును. శ. సం. 1586 క్రీ. శ. 1664 కు సమానము. కావున శ. సం. 1586 అబ్దుల్లా కుతుబ్షా కాలమునకు సరిపోవుచున్నది.

బహమనీ సామ్రాజ్యము మహమూదు సుల్తానుతో విచ్ఛిన్నమై బీజపూరు, అహమ్మదునగర్, గోలకొండ, బెరారు, బీదరు రాజ్యములుగా ఏర్పడినది. క్రీ. శ. 1512 లో మలిక్ కులీకుతుబుల్‌ముల్క్-సుల్తాన్‌కులీ కుతుబ్షాఅను పేరుతో రాజై గోలకొండ రాజ్యమును పాలించుచు, గజపతుల నోడించి, రాచకొండ, దేవరకొండ దుర్గములను జయించెను. కాని విజయనగరాధీశు డగు శ్రీకృష్ణదేవరాయులచే నోడిపోయెను. ఇతని పరిపాలనాకాలము క్రీ. శ. 1512—1543. తరువాత ఇతని కుమారుడు జంషీద్‌కుతుబ్షా క్రీ. శ. 1543-1550 వరకు పాలించెను. జంషీద్‌కుతుబ్షా తరువాత సుభాన్‌కుతుబ్షా రాజయ్యెను. కాని జంషీద్ కుతుబ్షా తమ్ముడును, సుభాన్‌కుతుబ్షాకు పినతండ్రియునగు ఇబ్రహీం కుతుబ్షా విజయనగరమున కేగి అళియ రామరాజు సహాయమున గోలకొండ రాజ్యమాక్రమించి క్రీ. శ. 1550—1580 వరకు పాలించెను. ఇతడాంధ్రభాషాభిమాని. తెలుగు కవులను పోషించెను. ప్రజా సౌకర్యము లేర్పరచెను. తల్లికోట యుద్ధమున రామరాజు మరణింప, ఇబ్రహీంకుతుబ్షా పరిసరరాజ్యములను జయించి గోలకొండ రాజ్యమును విస్తరింపజేసెను. ఇతడనేక పండితులను పోషించెను. మసీదులను కట్టించెను.

ఇబ్రహీం కుతుబ్షా యనంతర మాతనికుమారుడు మహమ్మదుకులీకుతుబ్షా రాజయ్యెను. ఇతడు రాయలసీమ తూర్పు భాగమును జయించెను. ఈ రాజు భాగ్యవతి అను ప్రియురాలిపేర భాగ్యనగరమును నిర్మించెను. భాగ్యనగరమే నేటి హైదరాబాదు నగరము. క్రీ. శ. 1598 లో కులీకుతుబ్షా తన కుమారుడగు హైదర్‌పేర భాగ్యనగరమునకు హైదరాబాదు అనుపేరు పెట్టెను. ఇతడు చార్ మినార్, మక్కామసీదు, మొదలగు కట్టడముల నిర్మించెను. ప్రజలకు నీటి వసతి కల్పించెను.

మహమ్మద్ కులీ కుతుబ్షా తరువాత అతని సోదరుని కుమారుడు మహమ్మద్ కుతుబ్షా గోలకొండ నవాబయ్యెను. ఇతని పరిపాలనా కాలము క్రీ. శ. 1611—1626. అటుపిమ్మట అబ్దుల్లా హుసేన్ కుతుబ్షా సుల్తానయ్యెను. ఇతడు క్రీ. శ. 1626లో రాజ్యమునకువచ్చి సుమారు నలుబది సంవత్సరములు గోలకొండ రాజ్యమును పాలించెను. నేటి ఆంధ్రప్రదేశ్ ప్రాంతమంతయు ఈ సుల్తాను అధీనమందుండెను. ఇతని మంత్రి రాజ్యతంత్రజ్ఞుడైన మీర్‌జుమ్లా. ఇతడు ఢిల్లీ చక్రవర్తుల కొలువులోనుండి దక్కను చేరి గోలకొండరాజ్యమునకు మంత్రి యయ్యెను. రాజుతో ఇతనికి సరిపడలేదు. ఔరంగజేబు కుమారునితో మీర్‌జుమ్లా కుట్రచేసి గోలకొండ రాజ్యమును మొగలుల వశము చేయబూనెను. సమయము కని పెట్టి ఔరంగజేబు దండయాత్ర గావించి గోలకొండ నవాబు తనకు సామంతుడుగా నుండునట్లు చేసెను. అబ్దుల్లా హుసేన్ కుతుబ్షా అనంతరం మీాతని అల్లుడు అబుల్ హసన్ కుతుబ్షా రాజయ్యెను. కాని క్రీ. శ. 1687 లో ఔరంగజేబు గోలకొండను ముట్టడించి జయించి మొగలు సామ్రాజ్యమున చేర్చెను. ఇంతటితో గోలకొండ రాజ్య మంతరించెను.

శాసనము—ఆకారాదికములు

శనిగరం చెఱువు కట్టమీాద ఉన్న ఈ శాసనము పొడువు 4' లు వెడల్పు 1'. శాసనము తెలుగు భాషలో వేయింపబడినది. కాని ఇందు ఉరుదూ పదము లెక్కువగా నున్నవి. గోలకొండ నవాబులు పరిపాలనాకాలమున వెలసిన తెలుగు శాసనము లన్నింటిలోను ఉరుదూపదములు అన్య భాషా పదములు విశేషముగ నున్నవి. శాసనము తెల్ల రాతిపై చెక్కబడినది. శాసనాక్షరము లున్నంత వరకు శాసనశిల నునుపుగా చెక్కబడినది. శాసనము రెండు ప్రక్కల మాత్రమే చెక్కబడినది. శాసన శిల పై భాగమున 'శ్రీ' గుర్తును తరువాత అడ్డు గీతను చెక్కబడినవి. శనిగరం చెఱువు చాల పెద్దది. ఈ చెరువుక్రింద సుమారు 500 ఎకరముల భూమి సేద్యమగుచున్నది. మానేరు నదికి ఉపనదియైన పెద్ద వాగు లేక శనిగరంవాగుపై ఈ చెరువు నిర్మింపబడినది. చెరువు నిండిన పిదప, ఏరు పార్లిపోవుటకు

పీలుగా మత్తడి లేక కతువ లేక అలుగు నిర్మింపబడినది. శనిగరంచెరువు పొర్లుమత్తడి దేవాలయముల రాతితో నిర్మింపబడినది. చెరువు నిర్మించిన ప్రాంతమున ప్రాచీన దేవాలయము లుండెను. అవి శిథిలము కాగా, ఆ దేవాలయముల స్తంభములతోను, రాతితోను అలుగు నిర్మింపబడినది. ఆ ప్రాంతమున దేవాలయ శిథిల చిహ్నము లున్నవి. చెరువులో అలుగు దగ్గర శిథిల దేవాలయ చిహ్నములు కనిపించుచున్నవి. దేవాలయముల అడుగులు, పునాదులు, స్తంభములు కనిపించుచుండుటవలన ఆ ప్రాంతమున పూర్వము శనిగరం పట్టణముండి యుండునని భావింపవచ్చును.

శాసనారంభమున సూర్య చంద్రుల చిహ్నములు చెక్కబడినవి. శాసనము 34 పంక్తులలో చెక్కబడినది. మొదటిప్రక్క 16, రెండవప్రక్క 18 పంక్తులును ఉన్నవి. తెలంగాణమున పెద్ద పెద్ద చెరువులు నిర్మింపబడినచోట్లు పూర్వముప్రసిద్ధిగాంచిన పుణ్య క్షేత్రములు, నగరములు, దేవాలయములు శిథిలమైన ప్రాంతములలో చెరువులు నిర్మింపబడినవి. ప్రసిద్ధమైన స్థలములు ఎల్లప్పుడు ప్రజాహిత కార్యములకు ఉపయోగపడుచుండును. తెలంగాణమున ఓరుగల్లు మండలమునన్నున్న ప్రాచీన తటాకములలో పాకాల, రామప్ప, లక్నవరం ముఖ్యమైనవి. చారిత్రకదృష్టితో చూచినను ఆ ప్రాంతములు ముఖ్యమైనవే. అట్లే నల్లగొండ మండలమున, ఇంద్రపాలనగర శిథిల ప్రాంతమున ఆసఫ్‌నగర్ రిజర్వాయరు, పానుగల్లు సమీపమున ఉదయసముద్రము, ప్రొద్దుటూరు ప్రాంతమున సంగంకతువ పేర్కొనదగినవి. నాగార్జునసాగర్, శ్రీశైలము, పోచంపాడు ప్రాంతములు చరిత్ర ప్రసిద్ధిగన్నట్టివే. ఈ శాసనమున్న ప్రాంతము పూర్వము మహాసామంతాధిపతులకు రాజధాని నగరముగ వర్ధిల్లి యుండును.

లిపి

ఈ శాసనమున పదునేడవ శతాబ్ది ఉత్తరార్థమున తెలుగు దేశమున వాడుకలోనున్న లిపి వాడబడినది. నేటి తెలుగులిపికి సన్నిహితముగానున్న ఈ శాసన లిపిలో '∸' పొల్లు వాడబడినది. కొన్నిచోట్ల పూర్ణానుస్వారము అధికముగా వాడబడినది. అవసరములేనిచోట్ల ద్విత్వాక్షరములు వ్రాయబడినవి. శాసనము చిన్నది. శాసన విషయము కూడ కొద్దిది. ఈశాసనమున ఈ క్రింది పదములు గమనింపదగినవి—

శకవర్ష	—బదులు—	శకవర్షః
ప్లవంగ	—	ప్లవంగ్గ
సంవత్సర	—	సంవ్వత్సర
కట్టించిన	—	కట్టించ్చిన
పొర్లు	—	పొలుః
బ్రాహ్మణ	—	బ్రాంహ్మణ
నడ్పించవలె	—	నడ్పించ్చవలె

భాష

ఈ శాసనము తెలుగు భాషలో వేయింపబడినది. శాసనారంభమునగాని, శాసనాంతమునగాని వ్యాస గీతా శ్లోకములుగాని దానఫలమును చెప్పు శ్లోకములుగాని లేవు. శాసనమున ఉరుదూ పదములు ఎక్కువగానున్నవి. ఆ యా పదముల కర్థము ఈ క్రింద నీయబడుచున్నవి.

1. హజరతి సులుతాను=హజరత్ సుల్తాన్=హజరత్=ప్రభువునకుగాని గొప్పవానికిగాని చెప్పబడెడు బిరుదు. సుల్తాన్=రాజు లేక ప్రభువు.
2. అబ్దుల్లా కుతుబు శాహ = అబ్దుల్లా కుతుబ్షాహ=గోలకొండ నవాబు.
3. ఫర్మాను = ఫర్మాన్ = రాజాజ్ఞ
4. సైదు ముజాఫరు = సైదు (సయ్యద్) ముజఫర్ = వ్యక్తిపేరు.
5. సరిఖెలు = సర్ఖెల్ = సరిఖైల్=ఇమ్మడు, అనుగు.
6. శాహి = శాహ్ = షాహ్ = ప్రభువు: శాహి = గొప్ప.
7. శలవు = సెలవు = ఆజ్ఞ*
8. మొహది బెను హవాలుదారు = ఒక సైనికోద్యోగి లేక కరగ్రాహి. ఆరక్షకాధిపతి.
9. దివాణం=న్యాయస్థానము లేక ప్రభుత్వము.
10. శిపాయి = సిపాయి = సైనికుడు
11. హొన్నులు = బంగారు నాణెములు.
12. సన్ = సన్ = సంవత్సరము
13. అలపు = వెయ్యి

శాసన విషయము

ఈ శాసనము శనిగరం పెద్దచెఱువు పొర్ను మత్తడి కట్టించిన సందర్భమున వేయింపబడినది. శాసనము శా. శ. సం. 1586 ప్లవంగ సంవత్సర శ్రావణ మాసమున వేయబడినది. హజరత్ సుల్తాను అబ్దుల్లా కుతుబ్షా ఫర్మాను సెలవున సైదు ముజాఫరు శనిగరం చెరువు కట్టమీాద శాసన శిల వేయించెను. ఇందు మత్తడి నిర్మాణమునకు 540 హొన్నుల ఖర్చైనట్లు తెలుపబడినది. నరసింహ క్షేత్రమున దేవ బ్రాహ్మణ ధర్మవృత్తులు ముప్పది పెట్టబడినవి. ఈ శాసనము 1070 ఫసలీలో వేయింపబడినది. ఎవ్వరు ప్రభుత్వము చేసినా ఈ ధర్మము నడిపింప వలెనను కట్టడి చేయబడినది.

కాల నిర్ణయము

శాసనారంభమున 'వర్తమాన వ్యవహార చాంద్రమాన శాలివాహన శకవర్ష 1786 అగు ప్లవంగ్గ నామ సంవత్సర శ్రావణమాసం" అని చెక్కబడినది. ఇందు శా. శ. 1586 బదులు 1786 వ్రాయబడినది. అబ్దుల్లా కుతుబ్షా పరిపాలనా కాలము క్రీ. శ. 1626—1672. శ. సం. 1586 క్రీ. శ. 1664 కు సమానమగును. కావున శాసమున పేర్కొనబడిన శ. సం. 1786 క్రీ. శ. 1864 కు సమానము. అప్పటికి గోలకొండ రాజ్యము పతనమై 177 సంవత్సరము లగుచున్నది. కావున శాసనలేఖకుని పొరపాటువలన 1586 బదులు 1786 వ్రాయబడినది.

అబ్దుల్లా కుతుబ్షా-శాసనము

శాసనము—మూలము

మొదటి ప్రక్క

1. వర్తమానవ్య
2. వహార చాంద్ర
3. మాన శాలివా
4. హన శకవర్ష
5. 1786[1] అగు ప్ల
6. వంగ్గనామ సం
7. వ్వత్సర శ్రావణ
8. మాసం । హజ
9. రతి సులుతా
10. ను అబ్దుల్లా కు
11. తుబు శాహ
12. ఫర్మాను శల
13. వున సైదు ము
14. జాఫరు సరిఖె
15. లు శాహికా
16. ర కిద్దుర్తానను

రెండవ ప్రక్క

1. కట్టించ్చిన శన్గరం
2. పెద్ద చెరువు పొలర్
3. నుత్తడి, మెహది బె
4. ను హవాలుదారు దివా
5. ణం శిపాయి హరకా
6. రాయర్కను కట్టించ్చి
7. న లెఖ్ఖ హొన్నులు 540
8. ను॥ స్న సమాను జా
9. తైను అలఫు స్న 1070
10. యు నరసింహ క్షేత్ర
11. మున దేవ బ్రాంహ్మణ
12. ధర్మ వృత్తులు ము
13. ప్పయి వీలైనె యవ్వ
14. రు ప్రభుత్వంచేసి
15. నా నడ్పించ్చవలె
16. రాజా విభవ
17. ధర్మోజయతు
18. శవర్తాం ॥

---

1. 1586.

తివాచీ

శ్రీ 'పాత్రో'

చుట్టూ ప్రహరీ. ప్రహరీ నిండుకూ పూల తోట. దూరాని కాతోట స్పాంజ్ షీట్‌లా ఉంది. తోట మధ్య మేడ, స్పాంజ్ షీట్ మీద ఉంచిన సబ్బు పెట్టెలా. మేడముందు విరగబూసిన మల్లెగుబురు, ఒంటినిండా పూలు అలంకరించుకుని వచ్చే వాళ్ళకు స్వాగతం పలుకుతున్న కన్నెపడుచులా.

ఆ మేడలో ఒక ప్రక్క డ్రాయింగ్‌రూం, శిరస్సులో మెదడులా. ఆ మెదడులో పుట్టిన అందమైన ఊహల జంటలా రెండు ప్రాణులు. ఒక ప్రాణి అతడు., మరొక ప్రాణి ఆమె. అతడు భర్త. ఆమె భార్య. అప్పుడే పాలిష్ ఇచ్చినస్టీలుగ్లాసులా మెరుస్తున్నా డతడు. సీలు తీసిన సబ్బుబిళ్లలా నవనవలాడుతోంది ఆమె. స్టీలుగ్లాసుపేరు చంద్రం. సబ్బుబిళ్లపేరు సునంద.

"వాళ్ళు వస్తామన్నది తొమ్మిదికే గదండీ. తొమ్మిది కింక పది నిముషాలు మాత్రమే ఉంది" అన్నది సునంద, చేతిలో మెరుస్తున్న బంగారుచైన్ వాచ్ కేసి చూస్తూ.

"తొమ్మిదంటే తొమ్మిదికేనా? ఇండియాలో ఇంతవరకి చెప్పిన టైముకి ఎవరైనావచ్చి ఉన్నారేమిటి?" అన్నాడు చంద్రం, పెద్దగా నవ్వితే పర్సనాలిటీ దెబ్బతింటుందేమో నన్న భయంతో సగం నవ్వులో సగంమింగేసి సగంలో సగం తేలికగా నవ్వుతూ.

"నిన్న మనం వెళ్లలేదూ వాళ్లింటికి?" అన్నది, కాశ్మీర్ సిల్కుచీర నలగని కుచ్చెళ్లు నలక్కుండా సవరించుకుంటూ.

"మనమంటే—నువ్వూ నేను! నువ్వూనేనంటే మనమిద్దరమే. ఇద్దరంటే ఇద్దరమే. నేను తల, నువ్వు తోక. నాకు తలలేదు. నీకు తోకలేదు. అనుకోవడమూ, అప్పుడే టింగు రంగా మని చేతులు పట్టుకుని వెళ్ళి పోవడమూ. వాళ్ళో?" అన్నాడు ఆమెవేపుచూస్తూ.

ఆ చూపు ఖాళిగాఉంది.

"అవును లెండి! వాళ్లిద్దరూ, ఆ ఇద్దరి వెంట ముగ్గురు. మొత్తం ఐదుమంది. పంచేంద్రియాలు ఒక తాటిమీద నడవడమంటే మాటలా" అన్నది నిట్టూరుస్తూ. ఆ నిట్టూర్పులో నీటితో నిండిన మబ్బుబరువులోని బరువంత బరువు ఉంది.

"ఇష్ష్! లెక్కకట్టకు" అన్నాడు చిలిపిగా పెదిమల కడ్డం చూపుడువ్రేలుపెట్టి.

"ఏం?" అన్నది కళ్లు చిలికించి.

"దిష్టితగులుతుందని మా అమ్మమ్మ చెప్పేది"—పెదిమల చివరి వంపులో కొంటెతనం.

"ఇది అమ్మమ్మ కాలంగాదు. ఆకాశానికెగిరే కాలం. అది పోనీ—కానీయండి! వాళ్లగోపీనిచూశారూ, అబ్బ! ఎంతముద్దొస్తాడండి!" అన్నది తన్మయత్వంతో ముద్దుఅయిపోతూ.

"అవును. గోపీ వాళ్ళబిడ్డ కదూ! ఎందుకు రాడూ?"

"పెద్దమ్మాయి ఉంది చూశారూ? ఆరో తరగతి చదువుతుందట. ఇంగ్లీషు పొయ్ట్రీ ఎంత బాగా చెబుతుం దనుకున్నారు?"

"రెండో అమ్మాయి ఏం చేస్తుంది? ముద్దుముద్దుగా ఏడుస్తుందా?" అన్నాడు విసుగ్గా.

"అయ్యో! ఎంత అమాయకులండీ మీరు? రెండోది అమ్మాయి కాదు అబ్బాయండి." అన్నది, వెర్రిగా నవ్వుతూ.

"వాళ్లతల్లి తన మంచీ, మర్యాదా మరచి బిడ్డలే తన సర్వస్వం అనుకుని పెంచుతూంటే నీలాంటి వాళ్లకు వాళ్లు ముద్దొస్తున్నారు" అన్నాడు నిర్లిప్తంగా.

"అవునండి. మనం వెళ్లినప్పుడు కూడా ఆమె మాసిన చీరతోనే ఉంది."

"ఆమెచీర మాసినా, మాయని సంస్కారం—మచ్చలేని మాతృత్వం ఉన్నా యామెలో...... అద్సరేగానీ, మన టామీ ఏమో సడి చేస్తున్నాడు. వాళ్లొస్తున్నారేమో చూడు!" అన్నాడు.

"ఆఁ. టైమయిపోయింది. వాళ్లే అయి వుంటారు" అని ఆదుర్దాగా లేచి వరండాలోకి వచ్చింది. ఎవరూలేరు. రోడ్డుమీద ఏదోకుక్క మొరుగుతోంది. నీరసంగా వెనక్కి తిరిగి వచ్చింది.

"మీది మరీ పిచ్చండి! రోడ్డుమీద కుక్క మొరుగుతుంటే మన టామీ అంటారు" అని రేడియోగ్రాం ఆన్‌చేసివచ్చి ముందు కూర్చున్న సోఫా మీదనే కూర్చుంటూ— "ఇలాఎదురుచూపుల చూడాలంటే నాకు మహా విసుగేస్తుందంటే నమ్మండి. ఒక్కోరోజు మీరుకూడా ఆఫీసునుంచి ఎంతకూ రాక విసిగించేస్తారిలాగే". అన్నది.

సంగీత సౌరభం గది పునాదుల్ని సన్నగా కదిలిస్తోంది. సంగీతానికి, సాహిత్యానికి అద్భుతమైన ఒక శక్తి ఉంది. రెంటికీ పులిగోళ్లున్నాయి. ఆ గోళ్లతో గుండెను గీకి వేదనల నెత్తురును తోడుతాయి. నెత్తురుతో పాటు అలౌకికమైన అమృతాన్ని గూడా వెలికి తీస్తాయి.

"ఏమండీ! నేనొక విషయం చెప్పనా?" అన్నది ఉత్సాహంగా అతని ప్రక్కకు జరిగి.

"ఇప్పుడు చెప్పేవన్నీ నన్నడిగే చెబుతున్నావా? అలాగే ఇదీ చెప్పు!".

"పోండి! మీకు మాటికిముందు చిరాకు!", అని ముందున్న స్థానంలో కూర్చుంది మూతి ముడుచుకుని.

"నాకా చిరాకు? టామీని అడుగు. చిరాకు ఎవరికో దానిక్కూడా, బాగా తెలును....పోనీ చెప్పమంటున్నానుగా ఇంతలో ఆ అలక ఏమిటి?"అని భుజంమీద చెయ్యివేసి తనవైపు త్రిప్పుకున్నాడు.

"మీరు కోప్పడరు కదా?."

కోప్పడనని తలాడించాడు.

"మీరు ఆఫీసరు కదా!" అన్నది.

"ఇప్పుడెందు కొచ్చిం దా సందేహం?".

"మీ ఆఫీసులో పనిచేసే హెడ్‌క్లర్క్ కదా ఆయన?".

"అవును".

"ఆయన కింతమంది బిడ్డలూ, ఇంత సంసారముందికదా?".

"అవును."

"ఆయన కొచ్చేజీతం ఎక్కడికి చాలుతుందండి?".

"ఉహూ."

"మీరు ఆఫీసరైనందుకు ఇంకొంచెం జీతం ఎక్కించరాదూ?".

"ఆ!".

"మీకు కొంచెంకూడా జాలిలేదండీ!".

"అవును."

"ఏమిటి అవును?".

"నిజమే!".

"ఏమిటా ఊతపదాలు? ఆయన జీతం విషయం చెబుతుంటే అవును, నిజమే, ఆహా, ఉహూ అంటూ వంతపాట ప్రారంభించారూ?".

"అవును. నాది వంతపాట. నీది వింతమాట. ఆ ఆఫీసు మన తాతది. అంతా మన ఇష్టమే! దానికి రూల్సూ, పాడూ ఏమీలేవు".

"ఈ మగాళ్లెప్పుడూ ఇంతే! మాటకిముందు రూల్సూ, చట్టాలూ. వీళ్లమాత్రం వాటిని మహా పాటించి ఏడ్చినట్లు. అవిమాత్రం మనిషికి మేలు చేయవద్దంటాయా ఏమిటి".

"ఓహో! బండి మహావేగంతో వెడుతోందే? నువు ఆఫీసరైనప్పుడు అలాగే చేద్దువుగాని".

"పైగా ఇదొక్కటి నేర్చుకున్నారు. ఏం మాట్లాడినా నువ్వు చేద్దువుగానీ, నువు చూద్దువు గానీ అంటూ నా నోరు నొక్కేస్తారు. మన కెటూ పిల్లలు లేకపోయారు గదా! ఉన్నవారికైనా మేలు చేస్తే. . . . ."

"చెయ్యి, చెయ్యి, లోకంలో పిల్లలున్న వాళ్ల నంతా పిలుచుకువచ్చి వరసాకు మేలుచెయ్యి. లోకంలో ఎవరికి లేరు పిల్లలు, మనకి తప్ప!—" చివర అతని గొంతు జీరబోయింది.

ఆమె మాట్లాడలేదు. అతను మాట్లాడలేదు ఇద్దరూ మాట్లాడలేదు. సన్నటి సంగీతం హృదయాల్ని తేలిక పరచడానికి ప్రయత్నిస్తోంది. ఇద్దరి మధ్య మౌనంగా దూసుకుపోతున్న కాలపతంగం తన రెక్కల కుంచెలలో సంగీతంలోని కొత్త రంగుల్ని అద్ది వాళ్ల మనసులకు పూసుకుంటూపోతోంది.

"ఇది నాకేదో గమ్మత్తుగా ఉందండీ" అన్నది కొత్త ఉత్సాహంతో.

"ఏది?" అన్నాడు పరధ్యానంగా.

"ఇదేనండి, ఈ ప్లాను. మనం వాళ్లింటికి వెళ్లడం, వాళ్లింట్లో మనకు నచ్చింది చెప్పడం, వాళ్లు మనింటికి రావడం, మనింట్లో వాళ్లకి నచ్చింది చెప్పడం. ఇది తలచుకుంటే మీకుమాత్రం గమ్మత్తుగా లేదూ?......అవునూ, ఈ ప్లాను మొదట ఎవరు చెప్పారండి?" అన్నది ఉత్సాహంగా.

"అతనూ, నేనూ రోజూ క్లబ్బుకు వెళ్లే వాళ్లం ఆఫీసునుంచి అలాగే! ఆఫీసరూ, గుమాస్తా ఇంత అన్యోన్యంగా కలిసి ఉండడం చూస్తే అంద రకూ ఆశ్చర్యం వేసింది."

"ఎందుకండి ఆశ్చర్యం?".

"ఎందుకా నాకర్మ! ఆ మాట నీతో చెప్పాను, నీకేమో మహా అర్థమై ఏడ్చేటట్టు! అదంతా నీకు వద్దుగానీ అసలు విషయం విను. రోజూ క్లబ్బుకు వెళ డమండే మొహం మొత్తినట్లుండేది. ఇదీ ఎందు కని అడక్కు. క్లబ్బుమీద విసుగుపుట్టి మొన్ననో మాటు అలా పార్కుకు వెళ్లాం. పార్కులో కూర్చుని ఇద్దరం మాట్లాడుకుంటున్నాం. మాటలమధ్యలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. రెండురోజులు సెలవులు వస్తున్నాయి కదా, లైఫ్ ఒంటెద్దు గానుగ జీవితంలా డల్‌గా ఉంది, ఈ రెండురోజులు థ్రిల్‌గా గడపాలంటే ఏం చెయ్యాలో ఓ మంచి ప్లాన్ చెప్ప మన్నాను. అతనీ ప్లాను చెప్పాడు. నాకు నచ్చింది. అంతే!" అన్నాడు.

"నచ్చిందీ, ఎందుకు నచ్చదూ? మీరూ మీరూ అనుకోగానే సరిపోయిందా? ఇంట్లో ఆడ వాళ్లం మేమున్నామే!—మా అంగీకారమేమీ అక్కర లేదా?" అంది చిరుకోపంతో.

"ఇది పెద్ద చిక్కే. అయితే మీరిద్దరూ కలిసి ఒక పని చెయ్యండి." అన్నాడు సీరియస్‌గా.

"ఏమిటది?".

"ఇంటిముందు 'విప్లవం వర్థిల్లాల'ని బోర్డు కట్టి నిరాహారదీక్ష చెయ్యండి".

"చేస్తేగూడా పాపంలేదు" అన్నది బుంగ మూతితో.

"ఆ మొహంచూడు, కొండముచ్చుకు లాగా! మగాళ్లు చేసే ప్రతిపనీ ఆడాళ్లకు చెబుతూ కూర్చుంటే ఇక అన్నీ అయినట్టే!".

"ప్రతిపనీ అని నే ననలేదు. ఇది ఆడవాళ్లకు సంబంధించిన పని— ముందు మాకు చెప్పి తీరాలం టున్నాను."

"మీ జాతిని బాగా వెనకేసుకొస్తున్నావే! ఈసారి మహిళాసమాజానికి నిన్నే అధ్యక్షురాలిగా ఎన్నుకోమని చెబుతానులే!"

"నాభర్త ఆఫీసరైనప్పుడు మళ్లీ నాకెందు కింక పదవి?" అనిలేచి వంటింట్లోకి వెళ్లింది, వంట పనికెలా ఉపక్రమిస్తున్నారో కనుక్కోవడానికి.

వెళుతూ, వెళుతూ—

"దాదాపు పదికావస్తోంది. వీళ్లేం ఇంకారారే! అంటూ వెళ్లింది.

*　　*　　*

రావు వెలుపలి గేటు తీశాడు, లోపలికి ప్రవే శించడానికి!

"ఇదేనాండి వాళ్ల యిళ్లు?" అన్నది సీత చంక బిడ్డను క్రిందికి దించుతూ.

"ఇదే కానీ, ముందు వాడి ముక్కు తుడువు" అన్నాడు రావు, ముఖం చిట్లించుకుని.

"అబ్బ! ఎంతందంగా ఉందండి! ఇంత ఇంటిలో వాళ్లిద్దరేనా?" అన్నది ఆశ్చర్యంగా, చాలీ చాలని తమ అద్దె కొంపను తలచుకుంటూ.

చీర చెరగుతో గోపీ ముక్కు తుడిచింది.

"నీ బుద్ధి పోనిచ్చావుకావు.ఇంటిదగ్గరైతే ఎలా ఏడ్చినా ఫరవాలేదు. పెద్దవాళ్లింటికి వచ్చాము. ఇక్కడ కూడా చీరనల్లా ఖరాబు చేసుకుంటున్నావు. వాళ్లు చూస్తే ఏమనుకుంటారు? నే నిచ్చిన రుమాలెక్కడ?" అన్నాడు చిరాకుగా.

"ఇదిగో ఉందండి. ఏమిటో అలా అలవాటై పోయింది" అని చీరకట్టులో దోపుకున్న రుమాలు తీసి చూపింది.

"చాల్చాలు! నీ అవతారాలన్నీ కట్టిపెట్టి ఇక్కడున్న నాలుగ్గంటలసేపు కొంచెం శుభ్రంగా ఉండు. ఇంటికి వెళ్లింతర్వాత నీ విశ్వరూపం ప్రదర్శిద్దువుగాని" అన్నాడు, పెద్దమ్మాయి రాణి చేయి పట్టుకుని గేటుదాటి తోటలో నడుస్తూ.

సీతకు తన శుభ్రతకన్నా పిల్లల శుభ్రత ముఖ్యం. తను శుభ్రంగా ఉండాలనుకున్నా పిల్లలుండ నివ్వరు. పిల్లలు ఖరాబుగా ఉండాలనుకున్నా ఈమె ఉండ నివ్వదు.

సీత ముదురు రంగు హేండ్‌లూమ్ చీర కట్టు కుంది. అంతకంటె విలువైన చీర తన దగ్గరలేదు. ఉన్నా కట్టదు. కట్టినా ఖరాబైపోతుందని ఆమె భయం. అస లలాంటి వేవీ కోరదు గూడా. ఆమెకు ఏ చీర కట్టినా అందంగానే ఉంటుంది. ఎన్ని ఇబ్బందులలో నైనా వాడని చిరునగవుమోమే ఆమెకు పెట్టని ఆభరణం. జాకెట్టు కూడా చీర రంగే! ఆమె పెట్టుకున్న ఆభరణమల్లా మెడలో ఒక్కబంగారు గొలుసుమాత్రమే!

పిల్లలకిమాత్రం మడతలు నలగని అందమైన రెడీమేడ్ డ్రస్ తొడిగింది. చక్కగా తలలు దువ్వి ముస్తాబు చేసింది. ఆ డ్రస్సులో పిల్లలు ముగ్గురూ రబ్బరు బొమ్మల్లా, చూచేవాళ్లకి ముద్దొస్తున్నారు.

"నాన్నా! వీళ్ల కీ పూల మొక్కలన్నీ ఎక్కడివి నాన్నా? మా బడిలో కూడా లేవు ఇన్ని రకాలు" అన్నది రాణి.

"ఇక్కడేమీ అడక్కు. అన్నీ ఇంటికి వెళ్లిం తర్వాత చెబుతాను తీరిగ్గా" అన్నాడు రావు.

"ఇంటిముందు మల్లె గుబురు ఎంత నిండుగా విరగబూసి ఉందండీ?" అన్నది సీత, తను ఆగి, వెనక పడ్డ ప్రసన్నకుమార్‌ని ముందుకు నడిపిస్తూ.

వరండాలో ఉన్న కుక్క వీళ్లను చూడగానే సింహంలా లేచింది, 'భౌ—భౌ' మని అరుస్తూ. పిల్ల లందరూ దాని అరుపులకు అమ్మ నాన్నలకు అతుక్కు పోయారు, కంగారుతో.

"ఎద్దులా ఎంత ఎత్తుందండీ ఆ కుక్క? పిల్లలు భయపడిపోయారు. ఆ గొలుసే లేకుంటే ఇంతవరకు మన గతి ఏమయ్యుండేది?" అన్నది వొణుకుతూ పిల్లల్ని చేర్చి పట్టుకుంటూ.

"ఏమిటా అదురు? పిల్లలకంటె ముందు నిన్నే ఆస్పత్రికి చేర్చవలసినట్టుందే!" అన్నాడు తన కాళ్లు కతుక్కుపోయిన రాణి వీపు నిమురుతూ.

"ఏమో బాబు! నే నెప్పుడూ చూడలే దింత కుక్కను. అసలు దీన్ని కుక్కంటే నమ్మలేక పోతు న్నాను" అన్నది.

ఇంతలో ఇంట్లోనుంచి చంద్రం, సునంద వరండాలోకి వచ్చారు. వాళ్ల హెచ్చరికను వినగానే కుక్క నోరు మూసుకుని తోకాడించింది. తోకా డించడంలో కూడా దాని దర్జాను విడచిపెట్టలేదు.

"నమస్కారం సార్!" అన్నాడు రావు.

"నమస్కారం. రండి! రండి!" అన్నాడుచంద్రం.

"టామీని చూచి పిల్లలు భయపడుతున్న ట్టున్నారే! రండమ్మా! అదేమీ చెయ్యదు. నేనున్నాగా. రండి!" అంటూ ఆప్యాయంగా పిలిచింది సునంద. ముందుకొచ్చి గోపీని ఎత్తుకుంది.

"మీారింతవరకి ఆఫీసుకి లేటయ్యిందిలేదు. అలాంటి మీారు ఇవాళ ఇంత ఆలస్యం చేశారంటే ఇంక రారేమో అనుకున్నాను" అన్నాడు చంద్రం, సగం కొరుక్కున్న నవ్వుతో.

"ఎక్కడ సార్! పిల్లలతో ప్రయాణం. అడుక్కొక ఆటంకం. అందులోనూ ఈ ఆడవాళ్లతో ప్రయాణం ఉంది చూశారూ!" అన్నాడు రావు, సీత వేపు కొంటెగా చూస్తూ.

"ఆ మాటే నేనంటే మా ఆవిడ వినదే! ఈ కాలం ప్రయాణం కావడంలోమగవాళ్లకంటే ఆడవాళ్లే నయమంటుంది" అంటూ సునందవేపు చూశాడు చంద్రం.

"అప్పుడే ప్రారంభమైందీ, ఆడవాళ్లని ఆడిపోసుకోవడం? చాలు చాలు రండి లోపలికి" అని చంద్రంవేపు కొరకొరా చూచి డ్రాయింగ్ రూములోకి ప్రవేశించింది, సునంద.

ఆమె వెనకనే చంద్రం ప్రవేశించాడు.

రావు వరండాలోనే చెప్పులు తీసేశాడు. సీత గూడా చెప్పులు తీసేసి గడప ముందున్న తివాచీకి కాళ్లు తగలకుండా దాటుకోవడానికి తంటాలు పడుతోంది.

"వెర్రిమొహమా! ఏమిటా పులడుగు? కాళ్లు తుడుచుకునే తివాచీ అది. వీధి భాగోతం చాలించి నీ బంగారు కాళ్లు దానికి తుడుచుకుని లోపలికి పో!" అని గొంతు తగ్గించి కసురుకున్నాడు రావు, ముందు వాళ్లకి వినబడకుండా.

"ఇంతందంగా ఉంది. దీనిమీాద కాళ్లు ఎలా తుడవనండీ?" అన్నది ఏదో రహస్యం చెబుతున్నదానికి మల్లే.

"ఖర్మ! నిన్ను పిలుచుకువచ్చాను!" అని విసుగ్గా తివాచీకి కాళ్లు తుడుచుకుని వెళ్లాడు, డ్రాయింగు రూములోకి.

సీత తివాచీమీాద కాళ్లు తుడుచుకుంది. తుడుచుకుంటున్నప్పు డది మెత్తగా కాళ్లకు గిలిగింతలు పెట్టింది. 'కాళ్లు తుడుచుకోవడాని కింత విలువైనదాన్నా వీళ్లు ఉపయోగించుకొంటున్నా'రని ఆశ్చర్యపోయింది. దాన్ని దాటుకుని వెళ్లింది. మళ్లీ వెనక్కి తిరిగి చూచింది. తివాచీనిచూచి తన చీరను చూచుకుంది. రెండూ ఒకటే రంగు. ముదురు నీలం రంగు. రెంటికీ ఏదో సంబంధమున్నట్టుగా తోచిందామెకు.

సీత డ్రాయింగ్‌రూంలో అడుగు పెట్టింది. అందరిలాగే అడుగైతే పెట్టిందికానీ, ఆ గదిలోని విలువైన అలంకారాల్నీ, అంతకంటె అద్దంలా మెరిసిపోయే దాని శుభ్రతనీ చూడగానే అందులో అడుగు పెట్టడానికి తనకు అర్హత లేదేమో అనేంత బిడియమూ, పిరికితనమూ తన్ను స్తబ్ధురాల్ని చేసేశాయి. ఆ గదిని చూచి మళ్లీ వెనక్కి తిరిగి తివాచీని చూచింది. నిగనిగలాడే తివాచీమీాద అప్పుడేపడ్డ మరకలు తన్ను వెక్కిరించాయి.

"రండి! అలాగే నిలబడిపోయారేమిటి? ఇలా వచ్చి కూర్చోండి" అని సునంద సోఫా చూపింది.

ఆ మాటతో ఉలిక్కిపడ్డట్టుగా వాళ్లవేపు చూచింది. అందరూ అంతవరకే ఆసీనులై ఉన్నారు. తను కూడా వెళ్లి కూర్చుంది. తను కూర్చున్నచోట సోఫా మెత్తగా క్రిందికి వెళ్లిపోయింది. తనకేమో అదంతా ఏదో మయసభలా తోచింది.

ఇంతలో హొటల్లో సర్వర్‌లాగా ట్రేలో కాఫీలుతెచ్చి అద్దంలా నిగనిగలాడే టీపాయ్‌మీాద పెట్టారెవరో! సునంద అందరికీ కాఫీలు అందిస్తోంది. ఇదంతా ఆశ్చర్యంగా చూస్తున్న సీతకు గూడా ఒక కాఫీ కప్పు అందించింది. మారు మాట్లాడకుండా తీసుకుంది, సీత.

"నేను గోపీకి కాఫీ తాగిస్తాను. మీారు పెద్దబ్బాయికి తాగించండి" అన్నది సునంద సీతతో, గోపీని తన ప్రక్క సోఫాలో కూర్చోబెట్టుకుని కాఫీ చల్లార్చుతూ.

ఆమె ఆప్యాయతను చూస్తుంటే సీతకు ఆశ్చర్యం వేసింది.

రాణి, వాళ్లనాన్న ప్రక్క కూర్చుని బుద్ధిగా కాఫీ త్రాగుతోంది. ప్రసన్నకుమార్‌ని తన ఒడిలో కూర్చోబెట్టుకుని కాఫీ తాగిస్తోంది సీత!

"మల్లె గుబురు ఇంటిముందు చాల అందంగా ఉంది. దాని వాసన కిటికీలోంచి ఇక్కడికి గూడా వస్తోంది" అన్నది సీత, కిటికీవేపు చూస్తూ.

"సీతకు మల్లెపూవులుంటే చాలు. అవే ప్రాణం" అన్నాడు రావు.

"పెరట్లో ఒక మల్లెమొక్క నాటమంటే వినిపించుకోరు. మనం అద్దెకొంప జీవులం. రేపు ఈ ఇంట్లోనే ఉంటామనే నమ్మకమేముంది అని కొట్టి పారేస్తారు" అన్నది సీత.

"అదీ నిజమే!" అన్నాడు చంద్రం.

"ఇంతెందుకు? ఆ చూచేదేదో మల్లెచెట్టున్న ఇల్లే చూచుకుంటే సరిపోలే?"అన్నది తేలిగ్గా సునంద.

"చూడు. కత్తి లేకుండానే సొరకాయ ఎలా తెగిపోతున్నాయో?" అన్నాడు చంద్రం.

"అద్దెకొంపల సంగతి వారికెలా తెలుస్తుందండీ? చిన్నప్పటినుంచి ఏ కష్టమూ తెలియకుండా సుకుమారంగా పెరిగిన వారాయె!" అన్నాడు రావు సర్దిచెప్పే రీతిలో.

సీలింగ్ ఫేన్ మెత్తగా తిరుగుతోంది. రేడియోగ్రాం నుంచి సన్నటి సంగీతం వినవస్తోంది. చంద్రం, రావు ఏవో ఆఫీసు గొడవల్లో పడ్డారు.

"మీరు మొహం కడుక్కుంటారా?" అన్నది సునంద, సీతవేపు తిరిగి.

"ఇప్పుడేగా స్నానంచేసి వస్తున్నాం. ఏమీ వద్దులెండి" అన్నది సీత.

సునంద గోపీని ఒడిలో కూర్చోబెట్టుకుంది.

"బాబూ! నీ పేరేమిటి?" అన్నది, గోపీ ముద్దు ముద్దు మాటలు వినాలనే కోరికతో.

"గోపి" అన్నాడు.

"మరి అక్క పేరో?" అన్నది నవ్వుతూ.

"లాని".

సునంద నవ్వు ఆపుకోలేకపోయింది.

"వాళ్లన్న పేరడగండి!" అన్నది సీత కూడా నవ్వుతూ.

"నీకు అన్న పేరు తెలుసా?" అన్నది సునంద నవ్వాపుకుంటూ.

తెలుసన్నట్టు తల వూపాడు.

"ఏం పేరో చెప్పు చూద్దాం?".

"నాకు లాదు."

"అమ్మదొంగ! నువ్వు మంచి గోపీవి కదూ! చెప్పావంటే నీకు చాక్లెట్ ఇస్తాను" అన్నది, ముద్దుగా బుజ్జగిస్తూ.

"ఊఁలికేనే!" అన్నాడు నంగిగా.

"ఊఁలికేనా? అని పగలబడి నవ్వింది సునంద. అంతలోనే నవ్వాపుకుని— "ఊఁరికేకాదమ్మా! నిజంగానే! వెంకన్నా! బాబుకి చాక్లెట్లు తీసుకురా!" అని ఇంటివేపు తిరిగి కేక పెట్టింది..

మరుక్షణంలోనే వెంకన్న చాక్లెట్ డబ్బా తెచ్చి ఇచ్చాడు. డబ్బా తెరిచి ఒక చాక్లెట్‌తీసి గోపీ చేతికందివ్వబోయింది సునంద. గోపీ ఒప్పుకోలేదు. డబ్బానే కావాలన్నాడు. ఇచ్చేసింది. చాకెట్లు చూడగానే వాళ్లనాన్న దగ్గరున్న రాణి, తల్లిదగ్గరున్న ప్రసన్నకుమార్ అందరూ సునంద దగ్గరికి చేరారు.

"చాక్లెట్లు అక్కకూ, అన్నకూ ఇవ్వవూ" అన్నది సునంద.

గోపీయే డబ్బాలోంచి రెండు చాకెట్లుతీసి చెరొకటి ఇచ్చాడు.

"ఇప్పుడు చెప్పు, అన్న పేరేమిటో?" అన్నది సునంద.

"బతన్న" అన్నాడు గోపీ అతికష్టంమీద.

మళ్లీ నవ్వందుకుంది, సునంద.

"బతన్న కాదు గోపీ! ప్రసన్నకుమార్ అనాలి" అన్నది రాణి చాక్లెట్ చప్పరిస్తూ.

* * *

బిగ్ ఫియట్ ఆగింది, ఒక్క ఊపుతో. ఆ ఊపుకు రాణి వాళ్లనాన్నని పట్టుకుంది, ముందుకి పడబోయి. ప్రసన్న వాళ్లతల్లి ఒడిలో కూర్చున్నాడు.— గోపీ మాత్రం సునంద ఒడిలో ఉన్నాడు. వాడామెను వదల్లేదు. ఆమె వాణ్ణి వదల్లేదు.

తలా ఒక పొట్లం ఇప్పించింది. తనూ ఒకటి తీసు కుంది. భర్తను డబ్బులు ఇవ్వమంది. రావు ఇవ్వ డానికి జేబులో చెయ్యి వేశాడు. చంద్రం అతన్ని వారించి తనే ఇచ్చాడు.

''నిజానికి ముందు మీరు చెప్పాలి. తర్వాతే మేము'' అన్నాడు రావు పప్పులు తింటూ.

''విపర్యయం కాకూడదా ఏమిటి?'' అన్నాడు చంద్రం.

''కావచ్చు ననుకోండి. కానీ, ముందు మా యింటిని మీరు చూశారు. తర్వాత మీ యింటిని మేం చూశాం. విపర్యయానికి పోతే క్రమాలంకారం దెబ్బ తింటుంది.''

''క్రమాలంకారాన్ని దెబ్బతీయడంలోనే ఉంది నావర్టీ!'' అన్నాడు చంద్రం నవ్వుతూ.

''సరె! అలాగే చెబుతాను. మీ యింట్లో నాకు నచ్చింది మల్లెపందిరి'' అన్నాడు రావు.

''మేమూ అలాగే ఊహించాము, మీకు అదే నచ్చి ఉంటుందని!'' అన్నది సునంద.

''ఇప్పుడు మీరు చెప్పాలి'' అన్నాడు రావు చంద్రం వేపుచూసి.

''మీ శ్రీమతిగారు చెప్పాలి. ఆ తర్వాత మేము. మీ శ్రీమతికి గూడా అదే నచ్చి ఉంటుందను కుంటాను.'' అన్నాడు చంద్రం.

''నేను చివర చెబుతాను'' అన్నది సీత.

''పోనీ, సునందా! నువ్వు చెప్పు'' అన్నాడు చంద్రం, సునంద వేపు చూస్తూ.

''మీకు మా ఇంట్లో మల్లె పందిరి నచ్చిం దన్నారు. నాకు గూడా మీ ఇంట్లో మల్లిపందిరే నచ్చింది'' అన్నది సునంద నవ్వుతూ.

''అదేమిటి? మా యింట్లో మల్లె పంది రెక్కడిది? మీరేదో గమ్మత్తు చేస్తున్నారు'' అన్నది సీత అమాయికంగా.

''గమ్మత్తు కాదండి. నిజంగానే. ఈ పిల్లలే మీ ఇంట్లో మల్లెపందిరిలాంటివాళ్లు. వీళ్లు వాడని మల్లెపూలు. వీళ్ల నవ్వులు చెరగని పరిమళాలు'' అన్నది సునంద, తన ఒడిలో ఉన్న గోపీ పాలబుగ్గల్ని నిమురుతూ.

''మీ అభిప్రాయం చెప్పనేలేదు'' అన్నాడు రావు చంద్రంవేపు చూసి నవ్వుతూ.

''ఏముంది చెప్పడానికి? సునందతో డిటో'' అన్నాడు చంద్రం.

''తెలిగ్గా తప్పుకున్నారు'' అన్నాడు రావు నవ్వుతూ.

''ఆయనైనా ఫలానా అని చెప్పారు. మీ శ్రీమతిగా రసలు చివర చెబుతానని వాయిదా వేస్తు న్నారు'' అన్నది సునంద.

''చెప్పు సీతా! అందరూ అయ్యారుగా, నువ్వే మిగిలావు, నీకు నచ్చిందేదో చెప్పు'' అన్నాడు రావు సీత వేపు తిరిగి.

గోపీ పప్పులు తిని అయిపోయింది. సునంద ఒడిలోంచి లేచి సీత దగ్గరకు వచ్చాడు. సీత గోపీని అందుకుని దగ్గరికి తీసుకుంది. పప్పులు తినే తొందరలో మొహమంతా ఖరాబు చేసుకుని ఉన్నాడు.

''చెప్పరా?'' అన్నది సునంద.

''చెప్పకపోతే వదులుతారా?''

''మరెందుకీ సస్పెన్సు?'' అన్నది సునంద ఆలస్యాన్ని భరించలేక.

''మీ యిల్లు అంత శుభ్రంగా ఉందంటే దానికి మీ జాగ్రత్త కొంత కారణం. మీ జాగ్రత్తతో పాటు వరండాలోఉన్న తివాచీ గూడ కొంత కారణం. ఇతర్ల శుభ్రతకోసం అంత అందమైన తివాచీ తన్ను మలినపరచుకొంటోంది. అది అలా మలినపరచుకోవడం లోనే దానికెంతో ఆనందం ఉందని గూడా అనుకుం టాను'' అన్నది సీత, తన చీర చెరగుతో గోపీ మరకల ముఖాన్ని తుడుస్తూ.

''అంటే—మీ కా తివాచీ నచ్చిందన్నమాట!'' అన్నది సునంద ఆశ్చర్యంగా.

రావు, సీతను తివాచీని చూచినట్లు చూశాడు, ఆక్షణంలో.

అందరూ కారులోంచి దిగారు.

ఇసుకలో నడుస్తున్నారు.

"జనం మరీ ఎక్కువగా ఉన్నా రివాళ" అన్నది సునంద.

"ఏమండీ! ఈ బీచ్, ముదురు నీలంరంగు చీరకి రంగు రంగుల డిజైన్ వచ్చిన తెల్లనరిగంచులా లేదూ?" అన్నది సీత భర్తతో.

"నీవు రచయిత్రివై వుండవలసింది. పొరబాటున నా పెళ్ళానివై పోయావు." అన్నాడు రావు.

"మీ కంతా వేళాకోళమే!"

"వేళాకోళం కాదు. నేడు సాహిత్య సామ్రాజ్యాన్ని స్త్రీలే ఏలుతున్నారు" అన్నాడు రావు, రాణి చెయ్యి పట్టుకుని నడుస్తూ.

రాణి, ప్రసన్న ఇసుకలో నడుస్తూంటే,తను గూడా వాళ్లలాగే నడవాలని సునంద చేతులో నుంచి దిగాలని మారాం చేస్తున్నాడు గోపి.

"వద్దు గోపీ! ఇసుకలో నువ్వు నడవలేవు" అన్నది సునంద.

"లానీ....ఊఁ..... బతన్న.....నలత్తాలు. నేను నలత్తాను" అన్నాడు గోపి నంగినంగిగా రాగంతీస్తూ.

"అమ్మో! అమ్మో! ఉపన్యాసం దంచేస్తున్నావే! నడవరా బాబూ నడువు!" అన్నది గోపీని క్రిందికి దింపుతూ సునంద.

"పట్టితే పట్టు అంతే! అప్పుడే వాళ్ల నాన్నను మించిపోతున్నాడు" అన్నది సీత.

"నీలాగా మొండిపట్టు కాదుగదా!" అన్నాడు రావు కొంటెగా.

అందరూ నడుస్తున్నారు. సీత చుట్టూ కలయజూస్తూ నడుస్తోంది. ఆమెకంతా ఆశ్చర్యంగా ఉంది. కొనేవాళ్లూ, తినేవాళ్లూ, తిరిగేవాళ్లూ, నవ్వేవాళ్లూ, అమ్మేవాళ్లూ, అరిచేవాళ్లూ, పక్కవాళ్లని కసురుకునే వాళ్లు, గుంపుగా కూర్చుని కబుర్లాడుకునేవాళ్లూ, ఖరీదైన బట్టల్లో అర్ధనగ్నంగా తమ అవయవాల సొంపును ప్రదర్శించే వాళ్లూ, చిరిగిన బట్టల్లో అవయవాలను దాచడానికి తంటాలు పడే వాళ్లూ, మంచివాళ్లూ, మంచి తెలియని వాళ్లూ, కూలీలు, గుమస్తాలు, కుంటివాళ్లు, ధనికులు, అధికారులు, గుడ్డివాళ్లు—అందరూ ఒక కప్పుక్రింద సోషలిజం కోసం ప్రాకులాడుతున్నట్టు— ఒకటే సందడి! సముద్రం ఒడ్డున ఎవరిదో పెళ్ళిజరుగుతున్నట్టు ఒకటే హడావిడి! ఎవరికీ తీరికలేదు.

"ఇక్కడ కూర్చుందాం" అంది సునంద.

"ఏం? కాళ్లు నొప్పులెట్టాయా?" అన్నాడు చంద్రం.

"మీకేం? పోక చెట్టులా వెళ్లిపోతారు." అన్నది సునంద కొంటెగా.

"నీకు కొమ్మలూ, రెమ్మలూ ఉన్నాయేమిటి?" అన్నాడు ఎత్తిపొడుస్తూ చంద్రం.

"గోపీ నడవలేకున్నాడు".

"ఎత్తుకో".

"ఏడుస్తాడు".

ఆమెతో వాదులాడుతూనే చంద్రం కాలితో ఇసుక చదును చేసి కూర్చున్నాడు. అందరూ గుండ్రని ఆకారంలో కూర్చున్నారు.

"మా ఇల్లంతా చూశారుగదా. ఇప్పుడు చెప్పండి—మా ఇంట్లో మీ కేం నచ్చిందో?" అన్నది సునంద, ప్రక్కన కూర్చున్న సీతకేసిచూస్తూ.

"మీ ఇల్లు ఇంద్రభవనంలా ఉంది. ఇది నచ్చిందని ఎలా చెప్పడం?" అన్నది సీత, చిరునవ్వుతో

"తప్పించుకునే మాట లివన్నీ. చెప్పేదాకా వదిలేదిలేదు." అన్నది సునంద పంతంతో.

"ఇల్లంతా నచ్చింది" అన్నది సీత బుడుంగున.

"ఇది మరీ బాగుంది" అన్నది సునంద నిష్ఠూరంగా.

"పోనీ, మీరు చెప్పండి?" అన్నది సీత, భర్తవేపు తిరిగి.

రావు ఏమీ మాట్లాడలేదు. మౌనంగా నవ్వుతో సీత మొహంలోకి చూస్తూ ఉండిపోయాడు.

ఇంతలో వేరుసెనగపప్పు అమ్మేవా డటువేపు వచ్చాడు. గోపీ వాడి వేపే ఆత్రంగా చూస్తున్నాడు. దాన్ని గమనించి సునంద పప్పులమ్మేవాడ్ని పిలిచింది.

బెర్ట్రండ్ రసెల్ - గాంధీజీ

శ్రీ కోడూరి శ్రీరామమూర్తి

నానాటికీ దానవత్వానికి చేరువవుతూ మంచినీ మానవత్వాన్నీ మరచిపోతున్న మనుషులను ఉద్ధరించడానికీ, వారిని మంచి మార్గంలోకి మళ్లించడానికి ఎందరెందరో మహామనీషులు అనాదిగా తమ జీవితాలను అంకితం చేస్తూనే వున్నారు. —వారిలో కొందరిని అవతారమూర్తులుగా, మరికొందరిని ప్రవక్తలుగా, యోగులుగా, ప్రపంచం గుర్తించింది.

భయంకరమైన రెండు యుద్ధాలతో కలుషితమైన ఈ ఇరవయ్యోశతాబ్దంలో విశ్వశాంతిని, మానవుల హక్కులనూ పరిరక్షించడం కోసం జీవితాంతమూ పోరాడిన మానవతావాదులు గాంధీ—రసెల్—లు. వర్గాలు, ఘోరాలు, తరతమ భేదాలు లేని వసుధైకకుటుంబాన్ని ఈ ఇద్దరు సామ్యవాదులూ ఆశించారు. భావాల్లో, ఆశయాల్లో ఇద్దరూ గొప్ప విప్లవాన్ని సృష్టించారు.

"హింసారహితమైన స్వాతంత్ర్యానికి ఆర్థిక సమానత్వం కీలకం—. దేశంలో లక్షలాది బీద ప్రజలు ఉప్పువేసిన చపాతీ తినడానికి వీలులేని దారిద్ర్యంలో ప్రమగ్గుతూ వున్నంతకాలమూ నీకూ, నాకూ, ఏ వస్తువునూ దాచుకునే హక్కులేదు— నీ అవసరాలకు అధికంగా వున్న వస్తువులను నువ్వు దాచుకునే హక్కులేదు—. నీ అవసరాలకు అధికంగా వున్న వస్తువులను నువ్వు దాచుకున్నావంటే అది ఇతరులనునచి దొంగిలించినట్టే అర్థం —. ఆ విధంగా ఈనాడు ధనికులుగా కనబడే వారందరూ దొంగలనే అర్థం చెప్పుకోవాలి—. స్వచ్ఛందంగా ధనికులు తమ సంపదలను విడనాడకపోతే మహాఘోరం, హింసాత్మకం, అయిన విప్లవం ఏ నాటికయినా వచ్చితీరుతుంది. —బీదవాడి శాపం దేశాలను నాశనం చేసింది—సార్వభౌములను పదభ్రష్టులను చేసింది— ధనికుల సంపదలను కొల్లగొట్టింది. ఈ, విషయాన్ని మనం మరచిపోకూడదు—' అన్నాడు కొల్లాయి గట్టుకున్న వార్ధాయోగి—

"పెట్టుబాడి దారీ విధానం—వేతనాల విధానం ఈ రెండింటినీ పూర్తిగా తుడిచి వెయ్యాలి— ప్రపంచ ప్రజల జీవితాలను ఈ ఇద్దరు రాక్షసులూ కబళించి వేస్తున్నారు—. పెట్టుబడిపైనా, భూమిపైనా వ్యక్తిగతమైన హక్కులు వుండటాన్ని న్యాయ దృష్టితో పరిశీలించినప్పుడు అంగీకరించలేము—" అన్నాడు పశ్చిమ ప్రపంచంలోని మహామేధావి రసెల్—.

రసెల్—గాంధీ— ఇద్దరూ సామ్యవాద వ్యవస్థ ఒక్కటే ఆర్థిక సమస్యలను పరిష్కరించగలదని విశ్వసించారు. అయితే— ఈ ఇద్దరిలో ఏ ఒక్కరి సిద్ధాంతం కూడా "మార్క్సిజమ్"కు సన్నిహితంగా కనబడదు—. "చరిత్రలో ఏహ్యదాయకమైన విషయాల్లో చాలామటుకు బలహీనులపై బలవంతులు అధికారాన్ని చెలాయించడమే చెబుతున్నాయి—" అంటూ చరిత్ర ప్రగతిని పరిశీలించిన రసెల్ దృక్పథం మార్క్స్ వర్గపోరాటచరిత్రను జ్ఞాపకం తెస్తున్నా — దీనినిబట్టి ఆయన మిగతా సోషలిస్టులలాగా "హింసాపూరితమైన విప్లవాన్ని" వాంఛించాడనుకుంటే అది పొరబాటే అవుతుంది.

గాంధీలాగానే రసెల్ కూడా హింసారహితమైన విప్లవాన్ని వాంఛించాడు —. "బోల్షివిజమ్ సిద్ధాంతం— కార్యాచరణ" అనే గ్రంథంలో రసెల్ తన దృక్పథాన్ని ఇలా వివరించాడు— "రక్తపాతం లేకుండా సామ్యవాద వ్యవస్థను ఇంగ్లాండులో సాధించవచ్చునని నేను అన్నప్పుడు లెనిన్ నవ్వాడు— రక్తపాతంతోకూడిన విప్లవం కేవలం దురదృష్టకరమయిన పరిస్థితుల్లో మాత్రమే వాంఛనీయమవు

తుంది. ఆర్భాటం ఆట్టేలేని పద్ధతుల్లో మెల్లి మెల్లిగా క్రొత్త ప్రపంచాన్ని సృష్టించాలి''—అని—

''పొలిటికల్ ఐడియల్స్'' అనే మరో గ్రంథంలో రసెల్ తన అభిప్రాయాన్ని స్పష్టంగా ఇలా చెప్పారు— ''విప్లవాత్మక కార్యాచరణ అనవసరమే కావచ్చు—కాని, విప్లవాత్మకమైన దృక్పథం మాత్రం తప్పనిసరి అవుతుంది — తత్ఫలితంగా ఒక నిర్మాణాత్మకమైన ఆశ చిగురిస్తుంది—''

దీనినిబట్టి చూస్తే— ''గాంధియన్ సోషలిజమ్''ను వివరిస్తూ కె. జి. మశ్రూవాలా చెప్పిన ''కమ్యూనిజమ్ — హింస = గాంధియన్ సోషలిజము—''అనే ఈక్వేషన్‌ను రసెల్ సిద్ధాంతానికి కూడా అన్వయించవచ్చునని తెలుస్తుంది.

అంతమాత్రాన — రసెల్, గాంధీల, సామ్యవాద సిద్ధాంతాలు ఒక్కటే అనుకుంటే పొరబాటవుతుంది. గాంధీజీ హింసాత్మకమైన చర్యలనుమాత్రమే గాక—వ్యక్తిగత ఆస్తిపాస్తులను ప్రభుత్వం బలవంతాన్న స్వాధీనం చేసుకోవటాన్ని కూడా వ్యతిరేకించారు. గాంధీజీ చాలా స్వేచ్ఛావాది — ఆయన సిద్ధాంతాలు చదువుతూంటే జాన్‌స్టూవార్టుమిల్ లాంటి ''ఇండివిడ్యువలిస్ట్'' తత్త్వవేత్తలు ఒక్కోసందర్భంలో జ్ఞాపకం వస్తూంటారు. ఈ దృక్పథంలోనే గాంధీ ''ట్రస్టీషిప్‌కాన్‌సెప్ట్''ను ప్రవచించారు. గాంధీజీ దృష్టిలో ఏ నాటికయినా ధనికులలో మానసిక పరివర్తన కలుగుతుంది— తమ ఆస్తిపాస్తులకు వారు ధర్మకర్తలుగా వ్యవహరిస్తూ తమ సిరిసంపదలనన్నింటినీ బీదసాదలకు అభివృద్ధికోసమై వారు వినియోగించడం ప్రారంభిస్తారు— ఈ మార్పు ప్రభుత్వ చర్యలవల్ల జరగదు— అంటే— ఏ విధమైన ఒత్తిడీలేకుండానే ధనికులు తమ మనసు మార్చుకుని (ప్రజ) శ్రేయోదాయకమైన మార్గంలో పడతారన్నమాట. — గాంధీజీకి మనుషుల మీద అపారమైన నమ్మకం వున్నది— మనుషులలో వున్న మంచితనాన్ని గాంధీజీ నమ్మినంతగా మరే మేధావీ ఈ శతాబ్దంలో విశ్వసించలేదని చెప్పినా అతిశయోక్తి కాదు.

రసెల్‌కూడా గాంధీజీలాగానే స్వేచ్ఛావాది— ఇంకా చెప్పాలంటే రసెల్ సిద్ధాంతాల్లో స్వేచ్ఛావిధానం ప్రధాన విషయం కూడా—. అందుకే చాలామంది రసెల్‌ను వోల్టేరుతో సరిపోలుస్తూవుంటారు. అయితే—రసెల్‌కు గాంధీజీలాగా మనుషుల మీద ఇంత విశ్వాసంలేదు. మనుషులలోవున్న బలహీనతలు, స్వార్థం, అతనికి తెలుసు—. ప్రతి మనిషిలోను, ''పొజిసివ్ ఇంపల్స్''కు కొద్దో గొప్పో స్థాన ముంటుందన్నాడు రసెల్—. 'నాది' అని చెప్పుకునే ఆస్తిపాస్తుల్ని పెంపొందింప చేసుకోవడాన్ని— సూక్ష్మంగా ''పొజిసివ్‌ఇంపల్స్''కు అర్థంగా చెప్పుకోవచ్చు— ఈ ''పొజిసివ్‌ఇంపల్స్''ను అదుపులోకి తేవడానికి ప్రభుత్వం జోక్యం చేసుకొనడం రసెల్‌కి అభ్యంతరంలేదు—. వ్యక్తికి స్వాతంత్ర్యం కావాలని వాదిస్తూ, రాజ్యం వ్యక్తిపై అధికారాన్ని చెలాయించకూడదనే రసెల్, ఈ విషయంలో రాజ్యానికి ప్రాధాన్యత ఈయబట్టి అతడు ''రాజ్యం''యొక్క గొప్పతనాన్ని ఒప్పుకున్నాడని అర్థం చెప్పుకోకూడదు. మనుషులలో వున్న బలహీనతలన్నీ తెలుసుకాబట్టి ఆయన తన భావతీవ్రతను ఈ విషయంలో కొంచెం తగ్గించుకున్నాడని మాత్రమే అర్థం చెప్పుకోవాలి—

నిజానికి— రసెల్‌ను ''ఏనార్కిస్టు'' అనేందుకు అవకాశాలు చాలా తక్కువ—. ఓ వైపు వ్యక్తి ప్రాధాన్యం గురించి చెబుతూనే మరొక వైపు రాజ్యానికి బాధ్యతలు అప్పగిస్తూ వుండటం రసెల్‌లో చిత్రంగా కనబడుతూ వుంటుంది —. బహుశా— రసెల్ ఆర్టిస్ట్ కూడా అయివుండటం ఇందుకు ఓ కారణం అనుకుంటాను—''రోడ్ టు ఫ్రీడమ్'' అనే గ్రంథంలో రసెల్ అన్నట్టు ''కళ'' అనేది ''wild and anarchic side of human nature'' లోంచి పుడుతుంది—.''కళ'' మాత్రమేకాదు—మనిషిలోని ''క్రియేటివ్ ఇంపల్స్''లన్నీకూడా తత్తుల్యమైన అవస్థలోంచే ఉద్భవిస్తాయి. ఇక్కడ—రసెల్ ''క్రియేటివ్ ఇంపల్స్'' అనేమాటకు ఇచ్చిన అర్థం చెప్పుకోవాలి—. 'నా ఒక్కడికే' అని కాకుండా నలుగురితో పంచుకోడానికి అవకాశం వుండేవన్నీ ''క్రియేటివ్ ఇంపల్స్''లోకే వస్తాయి. ఉదాహరణకి సాహిత్యం, సంగీతం, విద్య, మొదలయిన వాటి

బహిరంగంగా చెప్పుకున్నారు గాంధీజీ. ఈ విష యంలో గాంధీజీకి రసెల్ పూర్తిగా వ్యతిరేకి—. "నాకు తెలిసిన మతాలన్నింటికీ నేను వ్యతిరేకిని— అదీగాక, అన్ని మతాల విశ్వాసాలూ మరణించేవని నా నమ్మకం—" అన్న రసెల్ గ్రంథాలు చదివిన వారిలో అనేకమంది అతని రచనల్లో మతానికి స్థానం లేదని వాదిస్తారు. రసెల్ బహిరంగంగా అనేక సందర్భాల్లో నాస్తికత్వాన్ని సమర్థించాడు— "మొదట ప్రపంచ యుద్ధానికి కారణభూతులయినవారిలో చాలా మంది క్రయిస్తవులున్నారు. అయితే యుద్ధాన్ని వ్యతి రేకించినవారిలోమాత్రం నాస్తికులున్నారు. యుద్ధాన్ని వ్యతిరేకించిన జీన్‌జారస్‌అనే సోషలిస్టును ఫ్రాన్సు లోని క్రయిస్తవులందరి అంగీకారంతో వురితీయడం జరిగింది— యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ఇంగ్లాండ్ కేబినేట్ నించి రాజీనామా చేసింది లార్డ్ మూర్లే అనే నాస్తికుడు— ఇక— జర్మనీలో కూడా యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని తీసుకొచ్చింది. నాస్తి కులే—" అంటూ నాస్తికుల మానవతాధోరణిని తెలియజెప్పాడు రసెల్— 'హ్యూమన్ సొసైటీ ఇన్ ఎథిక్స్ అండ్ పొలిటిక్స్' అనే పుస్తకంలో.

రసెల్ దృష్టిలో మానవత్వానికి విలువ ఈయని మతం మతంకాదు— మానవత్వం నిజ మైన మతం— ఈ నిజాన్ని నిరూపించడానికి రసెల్ తనముందున్న మత వ్యవస్థను కాలదన్నాడు—కాని గాంధీజీ హిందూమతవ్యవస్థలో వున్న లోపాలను సరిచేస్తేచాలు— మతవ్యవస్థను కూలద్రోయ నక్కరలేదు—అని భావించారు—. గాంధీజీ ప్రతి పలుకులోనూ మనకు ఈ తాపత్రయం కనపడు తుంది. వర్ణాశ్రమవ్యవస్థవల్ల వచ్చిన లోపాలను ఓ వైపు నించి అంగీకరిస్తూనే దానిని కూల ద్రోయడానికి అంగీకరించనివాడు గాంధీజీ.

— నీతి విషయంలో గాంధీజీకీ, రసెల్‌కూ పోలికేమిటి అంటారు కొంతమంది. భార్యను సోదరిగా చూచుకుని నలభైఏళ్ల వయస్సులోనే సన్యసించిన యోగి గాంధీజీ. అనేకసార్లు పెళ్లిచేసుకున్న వ్యక్తి రసెల్—. రసెల్ రచించిన "మేరేజ్ అండ్ మోరల్స్" చదివిన వాళ్లు ముక్కున వేలువేసుకోక తప్పదు. ఆ గ్రంథంలో రసెల్ స్త్రీ, పురుషులకు వివాహపూర్వం 'సెక్సు' అనుభవం వుండాలనీ, — అవసరం అయితే— వివాహంఅయిన తర్వాత కూడా భార్యాభర్తలకు ఇతరులతో సెక్సు సంబంధం పెట్టుకునే స్వాతంత్ర్యం వుండాలనీ వాది స్తాడు—. ఈ పుస్తకాన్ని ఆ రోజుల్లో "ప్రపంచంలో కల్లా అసభ్యమైన గ్రంథం—"గా పరిగణించారు.

నీతి విషయంలో రసెల్‌కు స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. బలవంతుడిన్యాయం నీతిగా చలామనీ అవుతుందంటాడు రసెల్. ఒకప్పుడు చర్చి లలో వడ్డీకి డబ్బు అప్పుగా ఇవ్వడం అవినీతిగా చెప్పేవారు. కాని—ఆ తర్వాత ధనికుల ప్రాబల్యం చర్చిలపై పడటంతో—అప్పుగా పుచ్చుకున్నడబ్బును సక్రమంగా తిరిగి ఇవ్వడమే నీతి అంటూ మతాధి కారులు చెప్పడం ప్రారంభించారు అంటూ నీతుల పుట్టుకను హేళన చేసాడు రసెల్—

ఇలా—నీతి విషయంలో రసెల్ భావాలన్నీ చదివి రసెల్‌కు నీతి అనేది ఏమీలేదు—; ఈ విష యంలో రసెల్‌ను గాంధీజీతో సరిపోల్చడం అసందర్భం అనుకుంటే అది పొరబాటే అవుతుంది.

నిజానికి—గాంధీజీ కూడా మనం అనుకునే టట్టుగా పాతనీతులను పట్టుకుని వ్రేళ్లాడినమనిషికాడు— ఆచారనీతిశాస్త్రంపై గాంధీజీ చేసిన తిరుగుబాటును ఎందుచేతనో మనం మరచిపోతూవుంటాం. గాంధీజీ నీతిని ఎంతగా ఆరాధించారో, నీతిపేరిట చెలామణి అయ్యే అమానుషత్వాన్ని అంతగా నిరసించారు. గాంధీజీ దృష్టిలో పడుపుకత్తెలపై జాలి చూపించి వారిని కూడా మనుషుల్లాగా చూడగలగటం నీతి— పొరబాటున భార్య చేసిన అవినీతిచర్యకు భర్త క్షమా భిక్ష ఇచ్చి ఆమెను భర్త మంచి మార్గంలోకి మళ్లిం చడం నీతి—ఇవన్నీ నీతులపై తిరుగుబాటు కాదని చెప్పగలమా?—"బలాత్కారం వల్లగానీ, భయంవల్లగానీ ఇతరులు చెప్పినట్టు చెయ్యడం నీతికాదు. నీ మార్గాన్ని నువ్వే ఏర్పరుచుకుని నిర్భ యంగా దానివెంట నడవటమే నీతి. సాంప్రదాయ ప్రవర్తన అయినంతమాత్రాన అది నీతి అనిపించు కోదు"—అన్న గాంధీజీని తిరుగుబాటుదారుడు కాదని ఎలా చెప్పగలం?—

నేన్నిటినయినా చెప్పుకోవచ్చు—ఈ "క్రియేటివ్ ఇంపల్స్"లకు దెబ్బతగిలే రీతిలోవుండే ప్రభుత్వం జోక్యం మాత్రం రసెల్‌కు ఇష్టం వుండదు. ప్రజల విద్యావిధానాన్ని శాసించడం ప్రారంభించారనీ, వాక్స్వాతంత్ర్యానికి ఆనకట్టకట్టారనీ, తెలియగానే ఇందువల్లనే బొల్షివిక్‌లమీద మండిపడ్డాడు రసెల్—.

— "పొజెసివ్‌ఇంపల్స్"ను తగ్గించడం రసెల్‌కు ఇష్టమయినప్పటికీ— అది "స్టేట్ సోషలిజమ్"గా మారిపోవడం ఆయనకు సహించదు—. పరిశ్రమలన్నీ ప్రభుత్వం చేతిలోకి వెళ్ళిపోయి ప్రజలందరూ ప్రభుత్వానికి కూలీలయి పోవడం రసెల్‌కు ఇష్టంలేదు. చెడ్డ యజమానివల్ల ఎంత ప్రమాదం వున్నదో — చెడ్డ ప్రభుత్వంవల్ల కూడా అంత ప్రమాదం వుందంటాడు రసెల్—. ఇంకా చెప్పాలంటే— తన బాగోగులు చూడని యజమానిపై శ్రామికులు తిరుగుబాటు చెయ్యడం సులభం కానీ, ప్రభుత్వంతో తగవు పడాలంటే శ్రామికులు ప్రభుత్వం వెనకాతలనున్న సైనికబలాన్నంతా ఎదుర్కోనాలి. అందుచేత — ప్రభుత్వ సంస్థలలో శ్రామికులు తిరుగుబాటు చెయ్యలేరు. చేసినా విజయాన్ని సాధించలేరు—అంటాడు రసెల్—

రసెల్ దృష్టిలో పరిశ్రమల యాజమాన్యం శ్రామికులచేతిలోనే వుండాలి — ఫ్యాక్టరీకి సంబంధించిన అంతరంగిక వ్యవహారాలన్నిటిలోనూ శ్రామిక సంఘాలకు స్వయంనిర్ణయాధికారం వుండాలి. — లాభాలు కూడా ఆ శ్రామిక సంఘానికే చెందుతాయి. ఈ తరహాకు చెందిన సామ్యవాద వ్యవస్థ "సిండికలిజమ్" పేరుతో వాడుకలోవుంది. అయితే— దానికీ రసెల్‌సిద్ధాంతానికీ ఓ తేడా వుంది. సిండికలిస్టులందరిలాగా రసెల్ శ్రామిక సంఘాలకు సర్వస్వతంత్రప్రతిపత్తి వుండాలని వాదించడు—. శ్రామిక సంఘాలమధ్య శాంతిభద్రతలు వుండటానికీ, స్వార్థం విజృంభించకుండా వుంటానికీ, ఈ శ్రామిక సంఘాలపై ప్రభుత్వపు అదుపు అవసరం అంటాడు రసెల్—.

ఈ విధంగా అటు సోషలిజమ్‌కూ— ఇటు అనార్కిజమ్‌కూ మధ్య రసెల్ ఓ వారధిలాగా కనబడతాడు—. రసెల్ మాటల్లోనే చెప్పాలంటే 'ఏనార్కీ, నియంతృత్వమూ రెండూ మంచివికావు—మానవులను ఆనందంలో వుంచడానికి ఈ రెండింటిమధ్యన ఒక రాజీ ఏర్పడాల్సివుంది—"

ఈ 'రాజీవిధానం'లో అప్పుడప్పుడు రవ్వంత 'ఐడియలిజమ్'కూడా తొంగిచూస్తూండడం కద్దు—తన ఆదర్శసామ్రాజ్యంలో వేతనాలు ఎలా నిర్ణయించబడాలో 'రోడ్స్ టు ఫ్రీడమ్'అనే గ్రంథంలో రసెల్ ఇలా వ్రాశాడు— "దేశంలోవున్న ప్రజలందరికీ వాళ్ళుచేసే పనితో నిమిత్తం లేకుండా కనీస అవసరాల నిమిత్తం కొంతజీతం ఇవ్వాలి—. అయితే— జీతంపుచ్చుకుని వాళ్ళు ఫలానా పని చెయ్యాలని ఒత్తిడి చెయ్యకూడదు—". దీనిని 'వేగబాండ్ వేజ్' అంటాడు రసెల్. ఇక జీతం పుచ్చుకున్నందుకుగాను కష్టపడి పనిచేసే వాళ్ళుంటారు. వాళ్ళకు ఉత్సాహాన్ని కల్గించడం నిమిత్తం ఎక్కువ జీతాలు ఇవ్వాలి—. ఈ ఎక్కువ జీతం ఒక ఆకర్షణ అయి చివరకు అందరూ పని చెయ్యడం ప్రారంభిస్తారు. ఏ పనీ చెయ్యడానికి ఇష్టంలేని వాళ్ళు 'వేగబాండ్‌జీతం' పుచ్చుకుంటూ తమ పూర్తికాలాన్నంతా కళ సృష్టికి వినియోగించడానికి అవకాశం వుందంటాడు రసెల్—. మన ప్రభుత్వాలు రసెల్ చెప్పినట్టుగా 'వేగబాండ్ జీతాలు' ఇవ్వడం ప్రారంభిస్తే ఆర్థికవిధానం ఎంత అవకతవకగా తయారవుతుందో చెప్పనక్కరలేదు.

ఇలా — రసెల్ గాంధీజీలాగానే ఒక క్రొత్త తరహా సోషలిజాన్ని సృష్టించాడు.

ఇక— గాంధిజీలాగానే రసెల్ రచనల్లో కూడా తిరుగుబాటు స్వభావం స్పష్టంగా కనబడుతుంది—. సాంఘిక, నైతిక, రాజకీయ, మత, విద్యావిధానాలన్నింటిలోనూ ఇద్దరూ తిరుగుబాట చేశారు. హిందూమతంలోని దురాచారాలను దుయ్యబట్టడానికి గాంధిజీ ఎలా పూనుకున్నాడో అదేవిధంగా క్రైస్తవమతంపై రసెల్ తిరుగుబాటు చేశాడు—.

అయితే— ఇక్కడ మనం ఓ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి, గాంధీజీ ఆస్తికుడు— ఆయనకు మతంపై దురభిమానంలేదు గాని, అపారమైన గౌరవభావం వున్నది— "నేను చెప్పిన ప్రతి మాటలోనూ మత ప్రసక్తి వున్నది—" అంటూ

ఈ ఇద్దరు తిరుగుబాటుదార్ల భావ తీవ్రత లలో తేడా ఉన్నప్పటికీ గమ్యాలు మాత్రం ఒక్కటే— ఇద్దరికీ మానవత్వానికిమించిన నీతి లేదు. అయితే— రసెల్ గాంధీజీకన్నా ఎక్కువ స్వేచ్ఛావాది కావడం చేత—మానవుని ప్రవర్తన చుట్టూ అడ్డుగోడలు కడుతూ, అతని నడవడికప్పై నియమాలను విధించే నీతులపట్ల కొంచెం ఎక్కువ కోపాన్ని చూపించాడు.

గాంధీజీలాగానే రసెల్ కూడా విద్యా విధానంలో విప్లవాత్మకమయిన మార్పులు రావాలని ఆశించాడు. మనుషులందరినీ మూసపోసిన బొమ్మల్లాగా తయారుచేసే విద్యావిధానాన్ని రసెల్ నిరసించాడు. ఎలాంటి విద్యలు నేర్చుకోవాలి, ఎలా నేర్చుకోవాలి మొదలయిన విషయాలన్నింటిలోనూ విద్యార్థులకు సంపూర్ణ స్వేచ్ఛ ఇవ్వాలంటాడు రసెల్—. "ఇంకొకళ్లు ఆలోచించినట్టు ఆలోచించడంకాక— తమ శక్తి మేరకు విద్యార్థులు ఆలోచించేందుకు విద్యా విధానం అవకాశం కల్పించాలి—"యూనిఫార్మిటీ" పేరుతో వాళ్ల "ఇనీషియేటివ్"ను చంపడం న్యాయంకాదు—ప్రభుత్వం చెప్పాల్సింది తమదేశంలో వున్న ప్రజలు ఏదో విద్యను నేర్చుకోవాలని. అంతేగాని విద్యావిధానాన్ని నిర్ణయించే హక్కు ప్రభుత్వానికి లేదు" అంటూ తన స్వేచ్ఛాసిద్ధాంతాన్ని విద్యా రంగంలో ప్రవచించాడు రసెల్—.

"అందరు మనుషులూ ఒకలాగ ఉండాలని నేను అనుకోను—తన అభిప్రాయాన్ని విద్యార్థుల నెత్తిమీదరుద్దే ఉపాధ్యాయుడు మంచి ఉపాధ్యాయుడు కాదు—అందరి చేతా ఒకే అభిప్రాయాన్ని చెప్పిద్దామనే వుద్దేశంతో అతడు వాళ్లఆలోచనా శక్తిని చంపుతున్నాడు— షేక్స్పియర్ నాటకాలన్నింటిలోనూ Troilus and Cressida గొప్ప నాటకం అని బెర్నార్డ్షా అన్నాడు—నేను ఆ అభిప్రాయంతో ఏకీభవించక పోయినప్పటికీ ఒక విద్యార్థి ఆ మాటలు అన్నప్పుడు ఆవాదాన్ని నేను సంతోషంతో ఆహ్వానించాలి—" అంటారు రసెల్.

చిన్న తనంనించి పిల్లలకు సెక్సువిజ్ఞానం గురించి వివరంగా బోధించాల్సిన అవసరంవుందనీ ఇది వారి సంపూర్ణవ్యక్తిత్వానికి తోడ్పడుతుందనీ కూడా రసెల్ భావించాడు.

ఇలా విద్య గురించి తనకున్న వివిధ అభిప్రాయాలనీ క్రోడీకరించి 1926 లో 'విద్య గురించి' అనే పుస్తకాన్ని వెలువరించాడు రసెల్. కొన్నాళ్లపాటు తన రెండో భార్య డోరా రసెల్‌తో కలిసి తన ఆశయాలకు ప్రతిబింబంగా ఒక విద్యాలయాన్ని కూడా రసెల్ నిర్వహించాడు.

రసెల్ లాగానే గాంధీజీకి కూడా విద్యావిధానం మీద నిర్దుష్టమైన అభిప్రాయాలున్నాయి. బ్రిటిషర్లు నిర్దేశించిన విద్యా విధానాన్ని ఆయన నిరసించాడు. "సమగ్రమైన శారీరక, మానసిక, ఆత్మిక వికాసమే విద్య—; చదువు విద్యకు మూలమూకాదు— అంతమూకాదు—; చదువు విద్యకు ఒక సాధనం మాత్రమే. చదవడం, వ్రాయటం వచ్చినంత మాత్రాన ఒక వ్యక్తి విద్యావంతుడయిపోడు—" అంటూ విద్యకు ఒక పరమార్థాన్ని గాంధీజీ ప్రతిపాదించారు. గాంధీజీదృష్టిలో నీతినిజాయితీలను, స్వయంపోషకశక్తినీ ఇవ్వలేని ఏవిద్యా విద్యకాదు. గాంధీజీకూడా విద్యార్థులకు స్వాతంత్ర్యం ఇవ్వాలనీ, వారి ఆలోచనాశక్తికి అవకాశం కల్పించాలనీ అంగీకరిస్తారు. ఈ ఉద్దేశంతోనే ఆయన తన ఆదర్శాలకు అనుగుణంగా దక్షిణాఫ్రికాలోని టాల్‌స్టాయి ఆశ్రమం లోనూ, ఫోనిక్స్ ఆశ్రమంలోనూ కొన్నాళ్లు విద్యాలయాలను నడిపారుకూడా. ఇక విద్యార్థులకు లైంగిక విజ్ఞానాన్ని కరపాలన్న విషయం గాంధిజీ కూడా అంగీకరిస్తారు—అయితే—ఆయన ధ్యేయం వేరు. గాంధీజీయే స్వయంగా ఇలా వ్రాసుకున్నారు— "కామవాంఛానిగ్రహముగాని, జయముగాని, మనము కనులు మూసుకొని కూర్చున్నంత మాత్రాన నెరవేరవు—. తమ జననేంద్రియాల పరమధర్మంగురించి నేటి యువజనులకు బోధించాల్సిన అవసరం వుందని నా అభిప్రాయం. ఇలాంటి శాస్త్ర విజ్ఞానాన్ని కలిగించడానికి నేను యధాశక్తి ప్రయత్నించాను—".

ఇలా ఇద్దరి విద్యావిధానాలలో ఉదాత్తమైన ఆశయాలు, ఆదర్శాలు, కనబడతాయి.

—గాంధిజీ, రసెల్ లను సరిపోల్చడానికి పూనుకున్నప్పుడు వీరి అంతర్జాతీయ విధానంగురించి కూడా ప్రస్తావించాలి. గాంధీజీ, బెర్ట్రాండ్ రసెల్, ఇద్దరూ విశ్వమానవులే. సంకుచితమైన దేశాభిమానం ఇద్దరిలోనూ కనబడదు. "గౌరవ నీయుడయిన వ్యక్తి దేశభక్తి దృక్పథంతోకాక మానవతాదృక్పథంతో ఆలోచించాలి—" అన్న టాల్‌స్టాయి పలుకులు ఇద్దరికీ ఆదర్శాన్ని చూపిస్తాయి.

"మనదేశాన్ని మాత్రమే ప్రేమించడం 'దేశభక్తి' అనేమాటకు అర్థమైనట్లయితే— 'దేశభక్తి' అనేది ఒక ఆదిమజాతికి చెందిన భావం. మానవాళి లోని ఒకభాగాన్ని మాత్రమే ప్రేమించమని ప్రబోధంచేసే దేశభక్తి ఒక తప్పుడు మతం. మన దేశంపై మనకున్నప్రేమ ఇతర దేశాలకు అన్యాయం చేసేదిగా వుండకూడదు—" అన్నాడు రసెల్—. "నేను—నాదేశం" అంటూ గిరిగీసుకోవటాన్ని ఇద్దరూ తీవ్రంగా నిరశించారు—. ఈభావం వల్లనే వారు యుద్ధాలపై అంతటి విముఖతను చూపించ గలిగారు—. "ఒక వ్యక్తిని మరొక వ్యక్తి చంపితే అది నేరమవుతుంది— కాని దేశభక్తిపేరుతో ఒక సైనికుడు మరొక సైనికుడిని చంపితే లోకం దృష్టిలో ఘనకార్యమవుతుంది— నిజానికి ఈ రెండింటి మధ్యా తేడా ఏమీలేదు" — అన్న గాంధిజీతో రసెల్ ఏకీభవిస్తారు.

"దేశాల మధ్య నున్న సరిహద్దులు రాష్ట్రాల మధ్య నుండే సరిహద్దుల్లాగా మారిపోతేతప్ప సరిఅయిన అంతర్జాతీయ విధానం రూపొందించ బడదు. ప్రజలు గర్వించాల్సింది తమదేశ విస్తీర్ణాన్ని చూచి కాదు—; తనదేశంలోవున్న కవులను చూచి—మానవతాదృక్పథాన్ని చూచి—న్యాయశీలాన్ని చూచి గర్వించాలి—. ఈ ఉదాత్తమైనభావనే అతడిని పశుత్వంనించి వేరుచేస్తుంది—" అనే రసెల్ చివరివరకూ విశ్వమానవ సౌభాగ్యంకోసం పోరాడాడు. భారతదేశంపై బ్రిటన్ ఆధిపత్యం చెలాయిస్తున్నప్పుడు రసెల్ ఇంగ్లాండ్‌లో భారతదేశ స్వాతంత్ర్యానికి పోరాటం సలిపే ఇండియా సొసైటీని స్థాపించాడు—. వియత్నాంలో అమెరికా దౌర్జన్యకాండ చేస్తున్నందుకు నిరసనగా, మరణించే వరకూ ఏదో ఒక ఉద్యమాన్ని సాగిస్తూనే వచ్చాడు.

బాపూజీలో కూడా ఇలాంటి విశ్వసౌభ్రాత్ర భావన అక్షరాలా కనబడుతుంది. "భారత దేశానికి స్వాతంత్ర్యసిద్ధిద్వారా సమస్త మానవ సౌభ్రాత్రాన్ని సాధించడం నా కర్తవ్యం—మాకు స్వాతంత్ర్యం రావడంవల్ల ఇంగ్లండ్‌దేశంగానీ, ఇంగ్లీషుప్రజలుగానీ అస్తమించిడం జరిగే టట్లయితే మాకు స్వాతంత్ర్యం అక్కర్లేదు—" అనే గాంధీజీ వాణి రస్సెల్‌లో కూడా ప్రతిధ్వనిస్తుంది.

"ప్రపంచంయొక్క మనుగడ, ఆశ, ప్రేమతో కూడిన కార్యాలలో మాత్రమే కనబడుతుంది—" అనే రసెల్ మాటల్లో గాంధీతత్వం వినబడుతుంది.

రెండు ప్రపంచ యుద్ధాలలోనూ జరిగిన ప్రాణ నష్టాన్ని ఇద్దరూ కళ్ళారా చూచారు. స్వార్థపు సుడి గుండాలలో చిక్కుకుపోయి ప్రపంచం ఎలా పతనమైపోయిందో అవగతం చేసుకుని ఇద్దరూ ఆవేదన చెందారు. ఈ ఆరాటం వల్లనే వసుధైక కటుంబాన్ని స్థాపించాలనే వ్యథ ఇద్దరిలోనూ ద్యోతకమైంది. అయితే రసెల్ మరో మెట్టు ముందుకుపోయి అంతర్జాతీయ ప్రభుత్వం కూడా కావాలన్నాడు. "విదేశ వ్యవహారాల విషయంలో రాజ్యాలు తమ సర్వ స్వతంత్ర ప్రవర్తనను విడనాడి ఆ బాధ్యతను ఒక అంతర్జాతీయ ప్రభుత్వానికి అప్పగిస్తేతప్ప ప్రపంచంలో శాంతి సుస్థిరంగా నిలబడదు—" అంటాడు రసెల్—. ఇక—ఈ అంతర్జాతీయ ప్రభుత్వపు బాధ్యత లేమిటో కూడా అతడు స్పష్టంగా చెప్పాడు—. "అంతర్జాతీయ ప్రభుత్వానికి శాసనసభ, న్యాయ విచారణ సభ (Judicial), కూడా ఉంటాయి—అంతర్జాతీయ చట్టాల్ని రూపొందించగల సామత, ఆ చట్టాల్ని ఆచరణలో పెట్టగల అధికారమూ ఈ ప్రభుత్వానికి ఉంటాయి. అవసరమైనప్పుడు, న్యాయసమ్మతమైనదిగా తోచినప్పుడు, ఒక దేశంలోని కొన్ని భాగాల్ని మరో దేశంలోకి మార్చగల అధికారం ఈ ప్రభుత్వానికిఉంటుంది. ఈ అంతర్జాతీయ ప్రభుత్వానికి సైనిక బలం, నావికా బలం ఉంటుంది—ఇట్లాంటి సాయుధ దళాలు ఈ

ఒక్క ప్రభుత్వానికి ఉంటే సరిపోతుంది. (అంటే మిగతా దేశాలకు అనవసరం అన్నమాట—రచయిత). రాజ్యాలు బలప్రయోగానికి దిగకుండా అంతర్జాతీయ ప్రభుత్వానికి ఈ సైనిక బలం తప్పనిసరిగా ఉండాల్సివస్తుంది. పౌరులు బలప్రయోగానికి దిగకుండా నివారించేందుకు రక్షకభటులు (Police) ఎలా అవసరమో—అదేవిధంగా వేర్వేరు రాజ్యాలు దౌర్జన్యానికి దిగకుండా నివారించేందుకు అంతర్జాతీయ రక్షక భటులు అవసరం—'' అని అన్నాడు రసెల్— ఈ అంతర్జాతీయ ప్రభుత్వంకోసం రసెల్ పడిన వేదన ఆయన రచన ఏది చదివినా స్పష్టంగా అర్థమవుతుంది. రసెల్ సాంప్రదాయక ''ఏనార్కిస్టు''ల కోవలోకి చేరడని రూఢిగా చెప్పడానికి ఇదొక ఉదాహరణ.

విశ్వమానవప్రేమలోనే గాక—నిరాడంబర జీవితాన్ని ప్రేమించడంలో కూడా రసెల్ గాంధీజీతో పోటీ పడతాడు. తొలిసారిగా చైనా వెళ్లినప్పుడు వారి నిరాడంబర జీవితాన్ని చూచి ముగ్ధుడయ్యాడు. ప్రపంచంలో సంకుల సమరం చెలరేగి పాశ్చాత్య దేశాలన్నీ నాశనమైపోయినా ఫర్వాలేదు, ప్రపంచాన్ని ఉద్ధరించడానికి చైనా వుంది అని రసెల్ అప్పట్లో అనడానికి కారణం అదే—. అయితే— ఆతర్వాత, చైనా ప్రపంచాన్ని ఎలా ఉద్ధరించడానికి పూనుకున్నదో మన మందరమూ ఎరిగినదే—. చైనాలో హిట్లర్, చంగిజ్‌ఖాన్, తైమూర్‌లు అదృశ్యంగా దాగివున్నారని రసెల్ అప్పట్లో గ్రహించలేకపోయాడు.

ఇలా—రసెల్, గాంధీజీలమధ్య ఎన్నిపోలికలయినా చెప్పవచ్చు. ఎన్నివిషయాలు వ్రాసినా మనకు చివరకు లభ్యమయ్యే సందేశంమాత్రం ఒకటే—ఇద్దరి జీవితాలలోని ఆవేదనా ఒకటే—

మానవతమూర్తీభవించిన ఇటువంటి మహనీయులకు సమకాలీనులయిన వారందరూ అదొక గొప్ప అదృష్టంగా భావించుకోవచ్చు—. గాంధీజీ గురించి చెబుతూ డాక్టర్ యస్. రాధాకృష్ణన్—''ప్రపంచ చరిత్రలో పేర్కొనదగిన మహాపురుషులలో ఒకడు. మనతరంలో పెరిగి, మనతో నడిచి, మనకు ధర్మోపదేష్ట కావడం మనకు గర్వకారణం—'' అన్నమాటలు రసెల్‌కు కూడా అక్షరాలా వర్తిస్తాయి.



పాపం!

శ్రీమతి ఆర్. వసుంధర

లక్ష్మీకాలనీ అనగానే 'ఆ గులాబీరంగు పెద్ద మేడ ఉంటుందే, అదేగదూ' అంటారు ప్రతి వాళ్ళూ. మా కాలనీలో చిన్నవీ షుమారుపాటివీ అయిన యాభైయిళ్ల మధ్య దేవప్రియా వాళ్ల దొక్కటే పెద్దమేడ. ఆధునాతనమైన డిజైనులో డాబుగా కన్పిస్తుంది. లోపల గదులన్నీ ఆధునికంగానేవున్నా, దేవప్రియ డాన్సు చెయ్యడానికని కట్టించిన పెద్ద హాలు ప్రత్యేకంగా చెప్పదగినది. అందమైన నమూనాలో పాలరాతి తాపడం చేసిన నేలతో చాలా బాగుంటుంది. అప్పుడప్పుడు వాళ్లనాన్నగారు—డాక్టర్ శరభయ్యగారు—తన క్లబ్బు స్నేహితులైన వాళ్లను పిలిచి విందుచేసినప్పుడు దేవప్రియచేత డాన్సు చేయిస్తుంటారు.

కాలేజిలో కూడా ఒకసారి డాన్సు చేసింది ఒక ఫంక్షన్‌లో. పదహారు సంవత్సరాలు నిండినా అతి కోమలంగా ఉండటాన చిన్నపిల్లలాగా కన్పించే దేవప్రియ డాన్సు . చేస్తుంటే చూడ ముచ్చటగా ఉంటుంది.

దేవప్రియ అంటే కాలేజిలో అందరికీ—లెక్చరర్లకీ, స్టూడెంట్సుకీ మాత్రమేకాదు, ప్యూన్సుకు కూడా—అభిమానం. డబ్బూ, అందమూ, తెలివీ—మనిషి కోరుకునేవన్నీ—వుండి సౌమ్యస్వభావం కల వ్యక్తి అందరి సదభిప్రాయమూ సులువుగా పొంద వచ్చును. కాని ప్రియ యెడల కలిగేది ఉత్త సదభిప్రాయం మాత్రమేకాదు. అది ఆత్మీయమైన అభిమానం. ఆ అమ్మాయి ముఖంలో ప్రపంచంలోని బాధ లన్నిటినీ ఆకళించుకున్నట్టి ఒక ప్రశాంతత ఉన్నది. కాని మితభాషిణి అయిన ప్రియ ఎవరివైపు చూచినా, ప్రేమపూర్ణమైన ప్రసన్నతా, స్నేహపూర్వకమైన చిరునవ్వూ ముందుగా పలుకరించేవి.

ప్రియ స్వభావం గురించి మా కందరికీ బాగా తెలియడానికి అవకాశం కలిగించింది మొదటి ఏడాదిలో బియస్సీ స్టూడెంట్సు అందరం కలసి వెళ్లిన ఒక బాటనీ ఎక్స్‌కర్షన్. బెంగుళూరులో గడిపిన ఆ మూడు రోజుల్లోనూ యితరుల ఎడల సానుభూతితో స్పందించే ఆ అమ్మాయి గుణం అందర్నీ ఆకర్షించింది. గుడ్డి ముసలివాడిని రోడ్డు దాటించాలన్నా, క్రిందపడి ఏడుస్తున్న చీమిడికారే మురికి పిల్లని లేవనెత్తి ఓదార్చాలన్నా అందరికంటే ముందుగా వుండేది. ఒక ముసలిబిచ్చగత్తెను చూచి జాలిపడి మా అందరి దగ్గరా పైసలు తనే యిప్పించుకొని తానూ కొంత చేర్చి ఆ ముసలిదాని కిచ్చిన ప్రియను మనసుల్లోనే అభినందించుకున్నాము....ఒక రోజున అందరూ సినిమా ప్రోగ్రాం వేసుకున్నారు. నాకు బాగా జ్వరం వచ్చింది. అందరికీ సినిమా చూడాలనుంది. నన్ను ఒంటరిగా ఒదిలివెళ్లటం ఎట్లాగని అనుకుంటుండగానే 'నాకు సినిమాలంటే ఎక్కువ ఆసక్తిలేదు. విమల దగ్గర నేనుంటాను. మీరందరూ వెళ్లండి' అని నాతో వుండిపోయిన ప్రియను నేను మరచిపోగలనా! ఆ ఎక్స్‌కర్షన్‌కు రాకుంటే ప్రియ గురించి మాకు అంతగా తెలిసివుండేదికాదు. ఎందుకంటే కాలేజిలోవున్న సమయం తప్పించి బయట ప్రియకూ మాకూ ఏవిధమైన సంబంధం ఉండేది కాదు. తొమ్మిదీయాభైకి టంచనుగా కాలేజిలో కారు దిగుతుంది. నాలుగ్గంటలకు కాలేజి విడిచే వేళకు తనను తీసుకువెళ్లడానికి కారు సిద్ధంగా వుంటుంది. అదీగాకుండా సహజంగా ఆ అమ్మాయి మితభాషిణి. వాళ్లుండే కాలనీలోనే యింకో ముగ్గురం ఆ క్లాసుఅమ్మాయిలంవున్నాకూడా మేము కలవడానికి అవకాశంలేదు. వాళ్లమ్మగారు యిలాంటి అనుబంధాల్ని ప్రోత్సహించేవారుకాదు. ఆమె ఒకరిం

టికి వెళ్లటంగానీ ఒకరిని పిలవడంగానీ వుండేది గాదు. ఐశ్వర్యగర్వంఅని కాలనీలో వాళ్ళు అనుకునే వాళ్ళు. డాక్టరు శరభయ్యగారు రోజులో చాలాభాగం క్లబ్బులోనే గడిపేవారు. ఆవిడమాదిరి 'ఒంటి పిల్లి రాకాసి' కాదు. వాళ్లయిల్లు ఆయన స్నేహితులకు తప్పించి అందుబాటులో ఉండేదికాదు. మూడేళ్లక్రితం గవర్నమెంటు డాక్టరుగా రిటైరయిన శరభయ్య గారు ఎందుకో యిక్కడ యిల్లుకట్టించుకుని స్థిర పడ్డారు. ఎక్కడినుండో వచ్చినవాళ్ళు కావడంవలన వాళ్ల గురించిన విశేషాలు అంతగా బయటకు రాలేదు. డాక్టరుగారు మిలటరీలో వున్నప్పుడు ఒక నర్సుతో చనవుగా వుండటం, ఆవిడ బంధువులు ధనవంతుడైన ఆయన్ను బెదిరించి ఆవిడ మెళ్లో తాళికట్టించటం జరిగిందనీ, వాళ్లకు పిల్లలు లేనందున డాక్టరుగారి స్నేహితుల తాలూకు పిల్లనుతెచ్చి పెంచుకున్నారనీ ఎవరి ద్వారానో కాలనీలో తెలిసింది. అతను డాక్టరుగా ఉన్నప్పుడు అవసరానవసరాలు ఎంచకుండా ఆపరేషన్ అంటూ అయినదానికీ కానిదానికీ మనుషుల్ని పరపరా కోసి పడేసేవాడనీ, అది ఆయనకు సరదాఅనీ, కారు నడుపుతున్నప్పుడు దారిలో అడ్డం వచ్చిన కోళ్ళ మీదుగా కుక్కలమీదుగా కారు పోనిచ్చేస్తాడనీ, ఆమె అతన్ని మించిన క్రూరాత్మురాలనీ అంటారు. వాళ్ల గుణగణాలు బేరీజు వెయ్యగలంత పరిచయం మా కాలనీలో ఎవరికీలేదు. మొత్తానికి వాళ్ల గురించి చాలా అపోహలున్నాయి. వాళ్లు ఎవరితోనూ కలవరు గనుక అవి తొలగిపోవడానికి అవకాశమూ లేదు.

చీమ దూర సందివ్వని ఆ కుటుంబ వాతావరణంలోనికి నేను ప్రవేశించడం ఎలా జరిగిందో నాకే అర్థంకాదు. వాళ్లమ్మగారికి నాలో ఒక ప్రత్యేక లక్షణం కనిపించి ఆకర్షించిందా అనుకోవటానికి నేను అతి సామాన్యురాలిని. చెప్పుకోదగ్గ తెలివిగాని అందంగాని లేవు. మాది పేద కుటుంబమనే అనాలి. ఒకసారి ఆమె నన్ను పిలిపించింది. అదే నేను వాళ్లింట్లో కాలుపెట్టిన మొదటిరోజు. ఆమె పొట్టి మనిషి. కొంచెం లావుగా నల్లగా మోటుగా ఉంటుంది. కాని శుభ్రమైనబట్టలు ధరించటంవలననూ, ఐశ్వర్యంవలన వచ్చిన హుందాతనంవలననూ ఆ లోపాలు కన్పించవు. ఏవో రెండు ప్రశ్నలు వేశాక రోజూ నన్ను దేవప్రియకు తోడుగా కాలేజికి వాళ్ల కారులోనే వస్తూ పోతూ వుండమనీ కాలేజిలో ప్రియ వెంటనే ఉండమనీ చెప్పింది. నాకు ఆశ్చర్యం కలిగింది యీ ఆదరానికి. మా కాలనీకి కాలేజీ చాలా దూరం అయినందున యీ అవకాశానికి సంతోషంగా ఒప్పుకున్నాను.

బయట కన్పించే దేవప్రియకూ యింట్లో మెసలే దేవప్రియకూ చాలా వ్యత్యాసం కనిపించింది నాకు. ఈ ప్రియ తన లోనికి తాను ముడుచుకుపోయిన పువ్వులాంటిది అనుకున్నాను. ఈ ప్రియ మొహంలో ఒక అసహజమైన శూన్యత ఉన్నది. బయట కన్పించే ప్రశాంతతా, సౌమ్యతా, స్నేహశీలతా కనుపించవు....ఈ మార్పును నొక్కి చెబుతున్నట్టి సంఘటన ఒకటి జరిగింది ఒకనాడు. వాళ్లమ్మగారు కుట్టుమిషనుదగ్గర ఏవో బట్టలు కుడుతోంది. బట్టను సూదిక్రిందకు సర్దుతూండగా పొరపాటున సూది క్రిందకు దిగింది. గోరులోంచీ వేలులోంచీ క్రిందకు దిగి యీవలకు వచ్చివేసింది. చూస్తుండగానే అంతా రెప్పపాటులో జరిగిపోయింది. 'అబ్బా' అని కేక వేసిందామె. ఆ దృశ్యం చూసి భయంవేసి 'అయ్యయ్యో' అని అరిచాను నేను. ప్రియ అంతా చూస్తూ కదలకుండా నిర్వికారంగా నిల్చున్నది.ఆమె సూదినుంచి వేలినిమెల్లగా విడిపించుకున్నది. ప్రియను కోపంగా చూస్తూ "నాకు గుచ్చుకున్నదని సంతోషిస్తూ నిలుచున్నావా?.....డెట్టాల్ తీసుకురా పో" అంటూ కసిరింది. వేలు గట్టిగా పట్టుకొని యింకా ఆవేశంలోనే నన్ను చూసి 'అది- అలా మంచి దానిలా నటిస్తుందిగాని నిజానికి రాక్షసి. ఇంత జరుగుతూంటే నీకున్నమాత్రం అక్కర గూడా లేకుండా మొండి పిశాచిలాగా ఎట్లా నిలుచున్నదో చూశావుగదా' అన్నది. ఆమెమాటలూ ప్రియ ప్రవర్తనా రెండూ నాకు చాలా ఆశ్చర్యం కలిగించాయి. మేము కాలేజిలో ఎరిగిన దయామయి అయిన అమ్మాయేనా తాను! పైకి కన్పించే సామాన్యత వెనుక ఆ విచిత్ర కుటుంబంలో దాగివున్న సుడిగుండాలతోనూ, అసహనంతోనూ, ద్వేషం

తోనూ, క్రౌర్యంతోనూ నాకు కలిగిన ప్రథమ పరిచయం అది.

నేను వాళ్లింటికి వెళ్లటం ప్రారంభించాక కొన్నాళ్లకు వాళ్లమ్మగారోసారి అడిగారు— 'ప్రియ కాలేజీలో అబ్బాయిలతోగాని లెక్చరర్లతోగాని ఎక్కువ మాట్లాడుతుందా' అని. ఆమె అలా ఎందుకు అడుగు అడుగుతుందో నాకు అర్థంకాలేదు. 'ప్రియయింట్లో ఎలా వుంటుందో కాలేజిలోనూ అలానే వుంటుందండీ. ఎవరితోనూ ఎక్కువ మాట్లాడదు' అన్నాను. తన ప్రశ్న నా కర్థంకాలేదన్నట్లుగా మొఖం పెట్టిందామె. 'అదికాదు విమలా......... ఆహా......... ఎవరితోనైనా ఒక్కరితో ఎక్కువగా మాట్లాడుతుందా అని..... మన జాగ్రత్తలో మనం వుండాలి కదా....... ఎందుకైనా మంచిది అన్నది. ఆ నసుగుడంతా తెలియకపోయినా ప్రశ్నమాత్రం బాగానే బోధపడ్డదనుకున్నాను. 'ఆ.... మాట్లాడితే నాతోనే ఎక్కువగా మాట్లాడుతుందండీ. ఇంకెవరితోనూ మాట్లాడదు?' అన్నాను. ఆమె క్కోపం వచ్చింది. 'నీ సంగతికాదు......... మగవాళ్లతో.... అబ్బాయిలూ లెక్చరర్లూ వాళ్లతో' అన్నది ప్రతిమాటా నొక్కి పలుకుతూ. అప్పటికి నా మందబుద్ధికి ఆమె ప్రశ్న అర్థం అయింది. ఆశ్చర్యంతో వెంటనే సమాధానం చెప్పలేకపోయాను. ప్రియ విషయంలోనేనా ఈ ప్రశ్న! 'అట్లాంటిదేమీ లేదండీ' అని ఖచ్చితంగా చెప్పాను సిగ్గుతో తలవంచుకొని. 'నీవు ఎప్పుడూ వెంటనుంటావు గనుక అన్ని విషయాలూ నాతో చెబుతుండాలి' అన్నదామె. ఇదంతా బాధ్యతాయుతురాలైన తల్లిగా ఆమె కనుక్కుంటూ వుండవలసిన వివరాలేమో నాకు తెలియదు....... అప్పట్లో వాళ్ల కుటుంబం విషయంలో నాకర్థంకాని మరో విషయం యిది.

ఇటువంటి విషయాలు కొన్ని నా ముందరే జరిగినప్పటికీ, నాలో కొన్ని ప్రశ్నలు రేకెత్తినప్పటికీ వాటిగురించి ప్రియను ప్రశ్నించలేదు నేను. అట్లా వాళ్ల స్వంత విషయాల గురించి వాళ్లంతట వాళ్లు చెప్తే ఫరవాలేదు గాని బయటివాళ్లు అడగటం ఉచితం కాదనుకున్నాను. రానురాను ఒక్క విషయం స్పష్టమైంది. క్రొత్తవాళ్లముందు పూర్తికే బయటపడిపోకుండా జాగ్రత్తగానే వున్నా, వాళ్లిద్దరి మధ్యన సుహృద్భావం అనేదిలేదు.

కొన్నాళ్లు గడిచాక ప్రియ నాకు కొంత సన్నిహితురాలైంది. తన కష్టసుఖాల్నీ, తన మనసులో గూడు కట్టుకున్న బాధనూ నాతో చెప్పేది. ప్రియ తల్లిదండ్రులు పిల్లలులేని డాక్టర్ శరభయ్య గారికి ప్రియను పెంచుకోవడానికి యిచ్చారు. ఇది డాక్టరుగారి భార్యకు యిష్టంలేదు. ఆమెకు యిష్టంలేదుగాబట్టి ప్రియను పెంచారు డాక్టరుగారు. ప్రియమీద ప్రేమకొద్దీగాని పిల్లలుకావాలనే ఆశకొద్దీగాని కాదు. ఆమెమీద కక్షవలననే ప్రియను చదివిస్తున్నారు, డాన్సు నేర్పించారు. అన్ని సౌకర్యాలూ కలిగిస్తున్నారు. ఆమె మాట జరిగివుంటే ఆ యింట్లో ప్రియ కేవలం పనిపిల్లగా వుండేది. ఇంతకూ కారణమైన ప్రియను ఆమె క్షమించలేదు. లోకం దృష్టిలో ప్రియకు తల్లిదండ్రులుగా కనిపిస్తూ ప్రియను చక్కగా పెంచుతున్న వాళ్లిద్దరికీ ప్రియ ఏమీకాదు!— యిది ప్రియమనసులోని బాధ. ఇదంతా యథాతథంగా జరుగుతున్నదా లేక కేవలం ఊహాజనితమా అన్నది నేను నిర్ణయించుకోలేకపోయాను. బహుశా తన స్వంత తల్లిదండ్రులు దగ్గరనుండీ, అక్కడ పొందిన ప్రేమానురాగాలనుండీ వేరైపోవడం ఆ చిన్నతనంలో మనసును తీవ్రంగా గాయపరచి చెరగని ముద్రవేసి వుండాలి అనుకున్నాను. అందుకే ఆ అమ్మాయి మాటల్ని అంతగా పట్టించుకోలేదు. తన బాధలో పాలుపంచుకోలేదు. కష్టాలు మనుష్యులందరికీ వుండేవేనని సర్దిచెప్ప యత్నించాను.

'నేనెంత అభాగ్యురాలినో ఎవరూ ఊహించలేరు, విమలా..... మిమ్మల్నందరినీ చూస్తుంటే నాకు నామీద ఎంతో జాలి కలుగుతుంది. మీ అందరికీ వున్నట్లు మంచి, చెడ్డలన్నింటిలోనూ ప్రేమించగల అమ్మ, కడుపులోదాచుకుని కాపాడగల అమ్మ నాకెందుకు లేదు?......' అంటూ ఏడ్చిందొకనాడు. 'అసలు అమ్మనే ఎరగని వాళ్లూ ఎందరో వున్నారు. వాళ్లంతా నీలాగా బాధపడటంలేదు' అన్నాను. 'అమ్మని ఎరగని వాళ్లు అమ్మని ఊహించుకుంటారు. నాకు

ఏదీలేదు' అన్నది. ఇదంతా కేవలం అనవసరమైన ఆవేశంగా తోచింది నాకు. అమ్మ! అమ్మ! కావలసినవి సమకూర్చుతుంది అమ్మ. అంతేకదా. అన్నీవున్న ప్రియకి యింత ఆరాటం దేనికి? ప్రియ బాధపడుతోంది. నిజమే. తాను బాధపడటం నాకు యిష్టం లేదు. ప్రతివాళ్లూ ఏదో ఒక అసంతృప్తిని ముందు పెట్టుకొని బాధపడుతూ వుంటారు. 'నాకు అన్నీ వున్నై. నేను సుఖంగా వున్నాను' అనుకునే వాళ్లెవరైనా వుంటారా? ఈ ప్రపంచంలోని అనేకమైన విచిత్రాల్లో యిదీ ఒకటి అనుకున్నాను. 'నీ కంటే ఎన్నో విధాలుగా అభాగ్యులైన వాళ్లు అనేకులున్నారు. నీకున్నట్టి అవకాశాలు లేని వాళ్లెందరో వున్నారు' అన్నాను. 'భాగ్యం! అవకాశం!..... నేను చెప్పేది నీవు అర్థంచేసుకోవు! ఈ ప్రపంచంలో డబ్బూ, అందమూ, తెలివీ అనేవే ముఖ్యమైతే నా కన్నీ వున్నట్లే. కాని అది నిజంకాదు..... ఇక్కడుండే సుఖదుఃఖాల్నీ కష్టనిష్ఠూరాల్నీ భరించే శక్తి వాటిల్లోంచి రావడంలేదు! ఆ స్థైర్యం, ఆ జీవశక్తి నాలోలేవు...... బ్రతుకనేది అర్థంలేనిదిగానూ, పెద్ద బరువుగానూ వున్నది నాకు' అన్నది.

.... దురదృష్టకరమైన ఆ రోజును నేను ఎప్పటికీ మరచిపోలేను.సంక్రాంతి సెలవులు పూర్తి వస్తున్నాయి. చలికి దుప్పటి గట్టిగా ముసుగు పెట్టుకొని పడుకున్నాను. బయటి వాతావరణంలోని కరుడు గట్టించే చలినుండీ కాపాడుతూ తల్లి గర్భంలా నన్ను వెచ్చగా కౌగలించుకొని వున్నది దుప్పటి. నన్నావరించిన నిద్రమత్తు హాయిలోంచీ అమ్మమాటలు లీలగా చెవికి సోకాయి. 'ఏయ్, పాపా, ...లే, లే.... మీ దేవప్రియకు ఏమిటో అయిందట....లే, లే'' అంటోంది అమ్మ. గభాల్న లేచి కూర్చున్నాను. నెమ్మదిగా చెప్పింది అమ్మ. 'దేవప్రియ చచ్చిపోయిందట. చాలా గోలగా వున్నది వీధిలో' అన్నది. అప్పుడే తెలతెల్లవారుతోంది. నీలమైన ఆకాశంలోంచి పలచని వెల్తురు వ్యాపిస్తోంది. గేటు దగ్గరకు పరుగెట్టాను. తెల్లటి దట్టమైన పొగమంచు ప్రపంచాన్ని కప్పివేసింది. అల్లంత దూరంలో ప్రియావాళ్ల గులాబీరంగుమేడ పొగమంచు లోంచీ మసగ్గా కన్పిస్తోంది.....ప్రియ చచ్చిపోయిందా. నిజమేనా? ఎందుకు?..... నాకు నమ్మకం కలగలేదు. 'నీవు వెళ్లొద్దు' అంటున్న అమ్మమాటల్ని వెనక్కి తోసేస్తూ ఆ యింటివేపు పరుగెట్టాను.

ప్రత్యేకంగా ప్రియ డాన్సు చెయ్యడానికని నిర్మింపబడ్డ అందమైన హాల్లో నల్లటి పాలరాతి పద్మంమీద అస్తవ్యస్తంగా పడిపోయి వున్నది ప్రియ. చుట్టుప్రక్కల రక్తపు వాంతులు నాలుగైదు మరకలుగా వున్నై. ఆ రక్తం పులుముకుపోయిన ముఖంమీద జుట్టు చిందరవందరగా అతుక్కుపోయి వున్నది. సన్నటి నాజూకైన చేతులమీద నల్లటి చారల్లాంటివి కన్పిస్తున్నాయి. అట్లా పడిపోయివున్న ప్రియను చూస్తే ఏడుపొచ్చింది. గుండెమీద ఏదో బరువు పెట్టినట్లైంది. గట్టిగా ప్రియకు విన్పించేలా పిలవా లనిపించింది..... పిలిచినా ప్రియ యిహ నాతో ఎట్లా మాట్లాడుతుంది? ఇహ కాలేజి క్కూడారాదు నాతో అనుకున్నాను......నిస్సహాయంగా చుట్టూ చూశాను. గదిలో డాక్టరుగారూ ఆయన భార్యతప్పించి ఎవరూలేరు. చూడవచ్చిన వాళ్లంతా బయట గుంపుగా నిలబడి మాట్లాడుకొంటున్నారు. డాక్టరుగారు తనకేమీ సంబంధం లేనట్లుగా నిర్లక్ష్యంగా నిల్చొని కిటికీలోంచీ బయటకు చూస్తూ సిగరెట్టు కాలుస్తున్నారు. దూరంగా కుర్చీలో కూర్చున్న ఆమె ముఖంలో కోపం చీకాకు కన్పిస్తున్నాయి. 'తడి గుడ్డతో మొహం తుడిచి సరిగ్గా పడుకోబెట్టితే బాగుంటుంది' అన్నాను. ఎవరూ మాట్లాడలేదు.

ప్రక్కవీధిలో వుండే శ్రీనివాసరావు మేష్టారూ నాలుగిళ్లవతల వుండే చంద్రయ్యమేష్టారూ కొంతమంది కాలేజీ అబ్బాయిలూ బయటనిలబడి పెద్దగా తర్కిస్తున్నారు.

'చేతిమీద నల్లటి చారలన్నీ వాతల్లాగా వున్నాయే.'

'బాగా కొట్టినట్లున్నారు.....'

'అసలు విషం తనే తీసుకున్నదా? ఎక్కడ దొరికి వుంటుందీ?.'

'ఎంతమంచి పిల్ల! నమ్మలేకుండా వున్నాం.'

వ్యాఖ్యలు అనేకరకాలుగా సాగుతూ కిటికీ తోంచి లోపలకు వస్తున్నాయి. లోకులు పలు గాకులు అనే సామెతను బుజువు చేస్తున్నాయి.

వంటమనిషి వాళ్లిద్దరికీ టీ తెచ్చింది. టీ తీసుకుంటూ 'వంటిల్లు సర్ది తాళంవేశావా?' అనడిగిం దామె. 'త్వరగా బయల్దేరాలి' అన్నారు డాక్టరుగారు.

'ఎక్కడికండీ' అనడిగా నామెను కళ్లు తుడుచు కుంటూ.

'ఈ పిల్లను మ్రద్రాసులో వాళ్లమ్మా నాన్న లకు ఒప్పగించాలి' అన్నదామె విసుగ్గా.

'అసలేమైంది? ప్రియ ఎందుకు చచ్చి పోయింది?' అనడిగాను.

'ఎందుకా? పెంచిన నేరానికి మమ్మల్ని రొష్టు పెట్టడానికి..... ఇన్నాళ్ళూ యీ పాపిష్టిదానితో వేగినందుకు కొంచెమైనా కృతజ్ఞత లేకుండా ఎం ‘పని చేసిందో చూడు!' అన్నదామె.

ఆమె ప్రియను గురించి మంచిగా మాట్లాడు తుందని ఆశించకపోయినా యీపరిసి తిలో అటా తిట్టడం నాకు సరిపడలేదు.

'చేతుల మీద ఆ నల్లటి చారలేమిటి?' అన్నాను. ఆమె సమాధానం యిస్తుందన్న నమ్మకం లేదు. ఈ విషయం యిందాకట్నుంచీ నా మస్సును తొలుస్తోంది. అందుకని అడిగాను. ఈ విప రీత పరిస్థితుల వలనన్నూ, సానుభూతి చూపే వారెవరూ లేనందుననూ, నా ఎడల దురభిప్రాయం గాని ఎటువంటి అనుమానంగాని లేకుండుట వలననూ ఆమె మనసు విప్పి సమాధానం చెప్పిం దనుకుంటాను. "అవా?.. దాని పాడు పనులకు ప్రతిఫలం.. ఈ చావుకీ వాటికీ సంబంధం లేదనుకో.. ఆ పిల్ల గురించి నేను చెప్పినా ఎవరూ నమ్మరు. అంత నంగనాచిలా కన్పిస్తుంది... ఆడపిల్లకు ఒక రాత్రి వేళ యింకోళ్ల యింటికి వెళ్లాల్సిన పనే మిటో చెప్పు.. అందులోనూ మేము ఒద్దన్నప్పుడు రహస్యంగా.. రాత్రి ఆ చంద్రయ్య మేష్టరింటి దగ్గర్నుంచీ వస్తుంటే నేనే చూశాను. దాని నంగతి చిన్నప్పట్నుండీ బాగా తెలిసినదాన్ని గనుక నాకేమీ ఆశ్చర్యం కలగలేదు. అడిగితే పెంకెగా పుస్తకం కోసం వెళ్లాను. నా యిష్టం అన్నది డాక్టరుగారు క్లబ్బు నుండి రాగానే చెప్పాను. తాడుతో కట్టేసి తిక్క ఒదిలేట్లు నాలు గంటిం చారు.. దానితో యింతకి తెగించింది." అన్నదామె.

ఆమె మాటలు విన్న నాకు నువ్వూ కోసమూ కూడా వచ్చాయి. ప్రియ యింకలేదు. ఆ మధుర మూర్తి, సుశీల యింత దారుణంగా హీనంగా చచ్చిపోవటానికి కారణం యింతహాస్యాస్పదంగా నిస్సారంగా వుంటుందని నాకు నమ్మకం కలుగ లేదు! చంద్రయ్య మేష్టరు యాభై ఏళ్ల వయసు గలవారు. భార్యలేదు. కూతురు ఎక్కడో దూరాన వున్నది. ఆయన ఒంటరిగాడు. ఎప్పుడూ ఎవరితోనో పేచీలూ తగవులూ పెట్టుకొని సతమతమాతూ వుండటం ఆయన సరదా అని ఎగతాళి చేస్తుం టారు. ఆయనకీ డాక్టరుగారికీ కూడా ఏదో తగవున్నదట. కాని క్లాసులో లెక్చరరుగా దేవ ప్రియ మీద అభిమానం చూపుతారు. ఎప్పుడైనా పలకరించి, తెలియనివేవైనావుంటే అడగమని హెచ్చరించి పుస్తకాలు యిస్తుంటారు. 'దూరాన వున్న కూతుర్ని ప్రియలో చూచుకొంటున్నానని' అన్నట్లు ప్రియ ఒకసారి నాతో చెప్పింది.. కేవలం యీామె అపోహ కారణంగా యీఘోరం జరిగిం దంటే ఎంత పిచ్చిగా అర్థరహితంగా వున్నది!

'ప్రియ అలాంటిది కాదు. మీరనుకుంటున్న దేమీలేదు. అన్యాయంగా మాట్లాడారు' అన్నాను.

ఆమె కొంచెంసేపు మౌనంగా వుండిపోయింది. ఆమె ముఖం కర్కశంగా వికృతంగా కన్పించింది. కొంచెంసేపుండి నావేపు నిరసనగా చూసి కొంచెం కోపంగా అన్నది: 'అది చాలా మంచిదనీ, దాని గుణా లన్నీ చాలా గొప్పవనీ నీ వనుకుంటున్నావు. అందరూ అనుకుంటారు. అంత బాగా వేషం వేస్తుంది అది. కాని దాని గురించి నీకేం తెలుసు?....నాకు తెలుసు నేను దాన్ని మూడేళ్ల పిల్లగా ఉన్నప్పటినుండి పెంచాను మంచిని చెడ్డగా చెడ్డనిమంచిగా మసిబూసి మారేడు కాయను చెయ్యటం అంత బాగా పట్టుబడని కాలం నుండీ, దాన్ని ఎరుగుదును. 'నీకేం తెలుసు? అడిగావు

కాబట్టి, స్నేహితురాలివి కాబట్టి, యిహ విను....'

ప్రియమీద ద్వేషాన్ని వెళ్ళగక్కుతున్న దామె. ఆమె మాటల్లో విజయగర్వం విన్పిస్తోంది. ఆమె చెప్పబోయేది నిజమవునో కాదో అన్న ఆలోచన నాకురాలేదు. ఆమె మాటలు వినకుండా తప్పించుకోవాలనుంది. ఈ ద్వేష వలయంలో చిక్కుబడకుండా పారిపోవాలనుంది. ప్రియ నాకు ఆత్మీయురాలు. ఆ అమ్మాయి నవ్వులోని తియ్యదనం, మాటలోని స్నేహం, అన్నిటినీ మించి ఆ మనసులోని తపన—యివన్నీ నాకు తెలుసు. ఆవిడ కేంతెలుసో ఆవిడఆలోచనలేమిటో నాకెందుకు కాని ఆమె చెప్పుకు పోతోంది.

'ఒక్కోళ్ళకి పుటకలో ఒచ్చేబుద్ధులని వుంటాయి. ఈ పిల్లవన్నీ నీచపు బుద్ధులు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందంటారు. ఈ పిల్లది చిన్నప్పట్నుండీ ఉత్త కంపే. మంచి యింట్లో పుడితే మంచి బుద్ధులుంటాయనుకున్నానుగాని యింత అన్యాయవుదనుకోలేదు. ఇందాక చంద్రయ్య మేష్టరు సంగతి చెప్తే ఏమన్నావూ!.....అయ్యయ్యో ఆ అమ్మాయి అల్లాంటిది కాదండీ అన్నావు. 'అల్లాంటి' పనులు ఆ పిల్ల ఎప్పుడు మొదలెట్టిందో తెలుసా?.....సరిగ్గా అయిదేళ్ళప్పుడు. మొగపిల్లల్తో కూడని పనికిమాలినమాటలు ఆటలూ....ఛీఛీ.....నేను చూసినప్పుడు గొడ్డును బాదినట్టు బాదేశాను. అప్పుడు దాని చెయ్యి విరిగితే ప్లాస్టరు వేశారు కూడానూ.....' ఆమె నవ్వింది, కోడి కెక్కిరించి నట్టుగా.

నాకు నోట మాట రాలేదు. మొద్దులా నిలబడిపోయాను. ఆమె యింకా చెప్పుకు పోతోంది.

'ఈ ఒక్కటే అనుకునేవు. దానికి పుట్టుకతో వచ్చిన యింకో గుణం దొంగతనం. అయితే నాముందు యిట్లాంటి వేవీ సాగనివ్వ'ననుకో. ఆ చిన్నతనంలోనే యింట్లో దొంగగా అలమారా పైకెక్కి డబ్బులు తీస్తుంటే ఓసారీ, డాక్టరుగారి జేబులు వెతుకుతుంటే ఓసారీ నేనే పట్టుకున్నాను. ఈ అవగుణాలన్నీ దాని సొంత తల్లికీ అప్పుడే చెప్పాను,ఎందుకైనా మంచిదని. వాళ్ళకీ తెలుసు దాని వెధవ బుద్ధులన్నీ. అప్పటి నుంచీ యిప్పటివరకూ అది ఎవరితో మాట్లాడినా ఏం చేసినా ఏ పాడు పని చేస్తుందోనని కాపలా కాసి కాసి విసుగు బుట్టింది. ఇప్పుడిది చచ్చినందుకు నాకు పీడ విరగడైనట్లే వున్నది.''

నా మనసు అల్లకల్లోలం అయిపోయింది. ప్రియ వేపు చూశాను. నలుపు తిరిగి ఉబ్బిన నాలుకా పెదాలూ రక్తపుమరకలూ వాతలూ మొహాన్ని వికృతం చేస్తుంటే 'యీపిల్ల' నిజంగా ప్రియేనా? అన్పించింది. నీలం రంగుకు తిరిగిపోతున్న చేతులూ కాళ్ళూ చిన్నపిల్లలకు లాగా మరీ సన్నగా పుల్లల్లాగా వుండి జాలి కలిగిస్తున్నాయి.' ప్రియా, నీవు నిజంగా దొంగవీ, పాపాత్మురాలివీ, పిశాచానివీనా?!' అనుకున్నాను.

ఉన్నట్టుండి నా ఎదురుగా మాట్లాడుతున్న ఆవిడ మీద పట్టరాని అసహ్యం పుట్టుకొచ్చింది. అందరి మంచినీ మన్ననీ సులువుగా పొందగలిగిన ప్రియను నలిపినాశనంచెయ్యగల యీక్షణం కోసం వెయ్యికళ్లతో ఎదురు చూసినట్లు పైశాచికమైన ఆనందంతో మిడిసిపడుతోంది.నా గుండెలో కోపం మంట లాగా లేచింది. 'పాపం, పుణ్యం గురించి మాట్లాడటానికి నీ వెవరు? ఒక డాక్టర్ని బలవంతంగా బెదిరించి వల్లో వేసుకున్న నర్సువి. పాపం గురించి నీ వెరగవూ? నిన్ను చూస్తేనే అసహ్యం వేస్తుంది' అని అరవా లనిపించింది. బయటకు వచ్చేశాను.

అక్కడున్న అబ్బాయిలూ మేష్టార్లూ నావేపు ప్రశ్నార్థకంగా చూశారు.

'ఆ అమ్మాయిని అన్యాయంగా చంపేశారు. సందేహంలేదు. ఇది హత్య. - రాత్రి ఎనిమిది గంటల వేళ మా యింటికి పుస్తకం కోసం వచ్చినప్పుడు బాగానే వున్నది' అన్నారు చంద్రయ్యగారు.

'వాళ్లేమంటున్నారు?' అనడిగారు శేఖరం మాష్టారు. ఈయనకూ ప్రియంటే మంచి అభిమానం వుండేది. ఈయన మా కెమిస్ట్రీ మాష్టారు. అందర్నీ నవ్విస్తూ సరదాగా హాస్యంగా మాట్లాడుతారు.

'ప్రియను మెడ్రాసు తీసుకువెళ్తారట. బయల్దేరుతున్నారు' అన్నాను.

నా మాట వినగానే చంద్రయ్య మేష్టారు గాబరాగా లేచారు. 'ఇందులో ఏదో మోసం వున్నది పోలీసు రిపోర్టివ్వాలి.' అంటూ గబగబా వెళ్లిపోయారు.

ఈ మాటలు విన్నారో లేదో గాని ఆయనటు వెళ్లగానే వాళ్లు ప్రియను తెచ్చి కారు వెనుక సీట్లో వేశారు. వాళ్లు ముందు కూర్చుని బయల్దేరి వెళ్లిపోయారు.

కారు వెళ్తుంటే నాకు పట్టరాని దుఃఖం వచ్చింది. 'ప్రియా నన్ను క్షమించు' అనుకున్నాను. ఎందుకో తెలియకుండానే.

ఇంటికి వెళ్లాక జరిగిన దాన్ని గురించి ఎంతో ఆలోచించాను. నా చిన్ననాటి జ్ఞాపకం ఒకటి స్మృతి పథంలోకి వచ్చింది. ఒకరోజున షాపులో ఒక దంతపు పైట పిన్ను చూశాను. నాకు పదేళ్లు కూడా వుండవు అప్పుడు. ఆ పిన్ను మీద చాలా యిష్టం కలిగింది. అమ్మావాళ్లు కొనివ్వరు. నాన్నగారి జేబులోంచీ రెండు రూపాయిలు తీసుకున్నాను. పిన్నుకొని చొక్కాకు పెట్టుకొని మహదానందంతో వూరంతా తిరిగి సాయంత్రం భోజనాలవేళకుముందుగా యింటి కొచ్చాను. రాగానే అమ్మ ఆ పిన్నును చూసింది. ఎక్కడిదని అడిగింది. కొట్టువాడు వూరికేనే యిచ్చాడని, చెప్పాను. కాని అమ్మ అసలు విషయం పసికట్టేసింది. నాన్నగారు రాగానే చెప్పింది. 'చెప్పకుండా యింట్లో డబ్బులు ఎత్తుకు పోతావా' అంటూ అయిదు వేళ్లూ ముద్ర పడేట్లుగా వీపు మీద ఒకటి వేశారు, అంతే. తరువాత నేను దొంగనని గానీ నాది దొంగబుద్ధి అని కానీ ఎవరూ నిర్ధారించ లేదు.. నేను దొంగనా? కాదా?... కాదని నాకు తెలుసు. నేను చేసింది దొంగతనంకాదు. మనసారా ఆశించిన దాన్ని కొనుక్కోవటం.. నేనూ ఒకప్పుడు అయిదేళ్ల పిల్లగా వున్నాను. ఆ వయసు పిల్లలు ఆడే ఆటలూ కౌతూహలంతో తెలుసుకునే, విషయాలూ నాకూ కొంతవరకు తెలుసు. జీవశాస్త్ర సంబంధమైన విషయాలు ఇతర దేశాల్లో వాళ్ల తలిదండ్రులూ టీచర్లూ చెప్తారట. ఇక్కడెవరూ చెప్పరు. తెలిసిన అయిదారేళ్ల పండితుల దగ్గర తెలియని అయిదారేళ్ల పిల్లలు తెలుసుకుంటారు. తెలుసుకునే పద్ధతుల్లో భేదం వుండొచ్చు. ఆ కుతూహలమే పాపమూ, అమాయకమైన ఆశే దొంగబుద్ధీ అంటే ..పాపం, పుణ్యం అన్నీ మనిషిలోని జీవశక్తికి మారుపేర్లు.

పాపం అనేది ఒకమాట.

పుణ్యం అనేది యింకో మాట.

మనిషిలోని దుష్టత్వం మాటల్ని ఆయుధాలుగా చేసుకొని అవతలి మనిషిని హింసిస్తున్నది.

Judge not others! Judge not others!!

పాపం పుణ్యం అనేవి మనిషి కంటే గొప్పవి కావు.

మనిషి చేసిన మాటలో మనిషే చిక్కుబడి పోతున్నాడు.. ఆ జీవశక్తి యితరుల్ని హింసించకుంటే చాలు. మనిషికి యింకే ధర్మమూ అక్కర్లేదు.

ఆనాటి యీ విషయాల్ని సాకుగా చేసుకొని తన మనసులోని మురికిని ప్రతినిముషమూ ప్రియకు పులుముతూ ప్రియ ప్రతిచేష్టనూ అనుమానిస్తూ అవమానిస్తూ హింసిస్తూ బ్రతుకునే నరకంగా చేసింది ఆమె.

'నాకు అమ్మ లేదు' అంటూ ప్రియ బాధపడింది ఇందుకన్న మాట!

నాతో యివన్నీ ఎందుకు చెప్పలేదు ప్రియ? అర్థం చేసుకోలేననుకున్నదా? తన నోటితో యిటువంటి మాటలు చెప్పలేక పోయిందా?

చెప్పి వుంటే యిద్దరం కలసి కూర్చొని ఆవిణ్ణిచూసీ ప్రపంచాన్నిచూసీ హాయిగా నవ్వుకొని వుండేవాళ్లం.

ప్రియ బ్రతికి వుండేది.

ఇక్కడి పోలీసుల రిపోర్టు మీద మద్రాసు పోలీసులు మద్రాసు సమీపంలో వాళ్ల కారును

ఆపివేశారనీ, ఆ పిల్ల తల్లిదండ్రుల దగ్గరకు తీసుకు వెళ్తున్నట్లు తెలిసి వెళ్లనిచ్చారనీ, పోస్ట్‌మార్టెమ్‌లో అది గుండెఆగి చనిపోవటంగా తేల్చారనీ తెలిసింది.

తరువాత చాలా విషయాలు జరిగాయి. డాక్టరుగారు చంద్రయ్యమేష్టారి మీద పగబట్టారు. తన కుమార్తెతో అక్రమ సంబంధం కలిగి వుండి ఆ అమ్మాయి చావుకు కారకుడయ్యాడనీ, తన మీద అబద్ధపు పోలీసు రిపోర్టు యిచ్చాడనీ లక్ష రూపాయిలకు పరువునష్టందావా వేశారు. చంద్రయ్య మేష్టారు వూరుకోదలచలేదు. డాక్టరుగా పూర్వం ఆయన చేసిన తప్పులూ, ఆయన క్రూర స్వభావం కోర్టులో సోదాహరణంగా విరూపించటానికీ, ప్రియ మరణానికీ ఆయన కొట్టిన దెబ్బలకీ వున్న సంబంధం స్పష్టం చెయ్యటానికీ పూనుకున్నారు. ఆ యుద్ధం యిలా వుండగా చంద్రయ్య మేష్టారి విషయమంతా అబద్ధమనీ, నిజంగా దేవప్రియ తననే ప్రేమించి ఆరాధించి తన కొరకే చనిపోయిందని చాలా మందితో చెప్పుకున్నారు శేఖరంగారు.

అనేకమైన స్వార్థాల ఆట యీ ప్రపంచపు పోకడ. ప్రియకు యిక్కడ స్థానంలేదు. ఒక్క అపవాదుగా దుష్టమైనకథగామారి మాయమైపోయింది దేవప్రియ.



స్వోపశమనం

శ్రీ పరిగి రాధాకృష్ణ

నేనొక్కణ్ణేకాదు
నాతోపాటు వేలాదిమంది
గాలిలేని గదుల్లో వున్నారు
జాలిలేని జీవితాల్నీడుస్తున్నారు
మనోధర్మాన్ననుసరించలేక
బుద్ధిని విధికి దత్తంచేసి
భావశూన్యతని భజిస్తున్నారు.
తామేనాటికీ చేరలేని శిఖరాల్ని
తల్చుకుని తల్చుకుని తృప్తిపడుతున్నారు.
ఎదలో పేరుకున్న సొదలనుండి విముక్తికై
ఎవరికి వారు స్వగతాలు చెప్పుకుని
స్వోపశమనాని కుద్యుక్తులైనారు.
విన్న సంగీతాన్నే వెయ్యోమారు వింటూ
వినుగుపుట్టి చెవులు మూసుకున్నారు.
పుట్టెడు దుఃఖాన్ని
ఎలా కట్టడి చేయాలో తెలీక
బ్రతుకు ముట్టడిలో
బందీలుగా పట్టుబడిపోయారు.

అటు చూస్తే
సూదిలోకి దారమెక్కించటానికే
సంధి ప్రేలాపని మించిన గందరగోళం
సాగిర గర్భంలోంచి మణుల్ని


శ్వా వ శే ష నం

వెలికి వెలికితీసినంత హంగామా
కదళీపాకానికే
కొండను ఢీకొన్నంత ఆపసోపాలు
ఊపిరి పీల్చి వదలటమే
ఉపకారమనుకునే ఔదార్యం
విపరీతాకృతులలో వూరేగే దురహంకార ప్రవృత్తి
ద్రవిందని హృదయాల శిలాస్థితి
కారుణ్యం చవిచూడని
కంటిరెప్పల జెండాల అవనత స్థితి.
అవతల వీథిలో
అంకుశాలకు లొంగని మత్తగజాలు
వాటినిచూసి జడుసుకుని
జడతను వరించిన జనాభా.
కనిపించే కదనకుతూహలం
ధర్మాచరణానికీ కాదు
దారిద్ర్య నిర్మూలనకీ కాదు
పంపకాలు కుదరక
తిన్నదరగక
ఏ ఇద్దరికీ పడక!

లేచింది మొదలు
పడుకునే దాకా
సమస్యా పూరణమే
పడిలేచే జీవనమే
నైరాశ్యావరణంలో
నింగిచూపులే
కొనవూపిరితో
తుకతుకలాడే కోరికలకి
ఆక్సిజన్ చికిత్సే!

బ్రతుకు నోటివెంట
ఎప్పుడూ నురుగే.
ఐనా మిరాకులస్‌గా
బ్రతుకులు బాగుపడి పోతాయని
ప్రతినిముషం ప్రతీక్షణమే.
స్వర్గానికెవరో నిచ్చెనలు వేస్తారనీ
సునాయాసంగా అపుడెక్కి పోవచ్చున
ఎప్పటికప్పుడే ఏదో భ్రమ
ఆ భ్రమలో ఆశాపరిభ్రమణం
హిరణ్యాక్షవరాల సంపుటీకరణం.

జీవితం
కొందరి నోళ్ళలో
అతిశయోక్త్యలంకార శోభితం.
నూటికి తొంభై మంది కది
సగటులో సగటు గీతాల సంకలనం
శోకతప్త సంగీత సంచలనం.



సంస్కృతభాషలో రచన చేసిన ఆంధ్ర వాగ్గేయకారులు

కుమారి యమ్ యస్. ఆర్. ప్రమీలాదేవి

భారతదేశమునకు సాహిత్య భాష సంస్కృతము. లెక్కకు మిక్కుటముగ సంస్కృత భాషలో వెలువడిన సాహిత్య గ్రంథములు, వివిధ శాస్త్ర గ్రంథములు ఈ విషయమునే స్పష్టీకరించుచున్నవి. సాహిత్య రచనలేగాక సంగీత రచనలును అనేకము గీర్వాణభాషలో వెలువడినవి.

సంగీతకావ్యములను రెండువిధములుగా చెప్పవచ్చును. లక్షణ గ్రంథములు (Theoritical) 2. లక్ష్య గ్రంథములు. (Practical)

గీర్వాణ భాషయం దీ రెండు విధములైన కావ్యనిర్మాణము జరిగినది. భరతుని నాట్యశాస్త్రము, మతంగుని బృహద్దేశి, శార్ఙ్గదేవుని సంగీతరత్నాకరము, గోవిందదీక్షితుని సంగీతసుధ, వెంకటమఖి రచించిన చతుర్దండి ప్రకాశిక, గోవిందామాత్యుని సంగీత శాస్త్ర సంక్షేపము మున్నగునవి సంస్కృత భాషలో రచింపబడిన లక్షణ గ్రంథములు.

భారతదేశమందలి అన్ని ప్రాంతముల వారును తమ అమూల్య రచనలచే గీర్వాణ సంగీత భారతి నలంకరించిరి. తమ కీర్తనా సుమములచేత గీర్వాణ సంగీత భారతి నర్చించి తరించిన పుణ్యమూర్తులలో అగ్రగణ్యుడు జయదేవ మహాకవి. ఆ తరువాత కాలము వాడైనను అంతకంటె ఉన్నత స్థాన మలంకరింప తగిన సంస్కృత వాగ్గేయకారుడు శ్రీ నారాయణ తీర్థులవారు. తీర్థులవారు చేసినంత విస్తార సంగీత రచన చేయకున్నను ఎన్నదగినంత సంస్కృతరచన చేసినవారు శ్రీ సుబ్రహ్మణ్యకవి, శ్రీ రామదాసు, శ్రీ త్యాగరాజస్వామివారలు.

వీరు నలుగురును సంస్కృతాంధ్ర భాషా విశారదులు. ఉభయభాషలలో కీర్తనల రచించిన వాగ్గేయ కార వరులు. నారాయణతీర్థులవారును, సుబ్రహ్మణ్య కవియు సంస్కృత కీర్తనలలో ప్రయోగించిన భాష ఎక్కడనోతప్ప సర్వసామాన్యముగ ఆంధ్రభాష వచ్చిన వారికి సుగ్రాహ్యముగ నుండును. శ్రీ త్యాగరాజస్వామి, భద్రాచల రామదాసుల సంస్కృత భాష సర్వత్ర గ్రాహ్యముగనే ఉండును.

శ్రీ కృష్ణ లీలా తరంగిణి లోని కృతులు తరంగము లనుపేర ప్రసిద్ధములై ఆ కీర్తనలును, వాని ద్వారా శ్రీ నారాయణతీర్థులవారును దక్షిణ భారతీయులకు సుపరిచితులు. ఆంధ్రులు, తమిళులు, కన్నడిగులు, మళయాళీలు మున్నగు దక్షిణ దేశీయులు తమ భాషాకృతులవలెనే వానిని అభిమానించి గాన సభలలోను, భజనకాలక్షేపము లందును గానము చేయుచున్నారు. తీర్థులవారి కృతులు కేవలము గానమునకేకాక నృత్యమునకును అనుకూలములైనవి. గానము చేయుటలో నృత్యముకూడ మేళవించుచున్న వారు ముఖ్యముగ ఆంధ్రదేశములో నేటికిని అక్కడక్కడ కానవచ్చుచుండుట ముదావహము.

శ్రీ నారాయణ తీర్థులవారు సంగీత శాస్త్ర పారంగతులు. కేవల సంగీత శాస్త్రమునందేకాక భరత శాస్త్రమునందును ప్రవీణులు. వీరి కృష్ణ లీలా తరంగిణి కేవల గానమునకేకాక నృత్తమునకు, అభినయమునకు అనుకూలముగ రచింపబడిన యక్షగాన శాఖకు చెందిన నాటకము. ఇందలి కీర్తనలు గానము చేయువారు విస్తారముగను, నృత్యము కూడ మేళ

వించువారు విరళముగను ఉన్నారు. కాని సంపూర్ణముగ రంగస్థలముపై ప్రదర్శించుట నేడు కనుపించుట లేదు. గడచిన శతాబ్దపు చివరి భాగము వరకు దీనిని సంపూర్ణముగ ప్రదర్శించుట కలదని పెద్దలవలన వినుచున్నాము.

దాక్షిణాత్యుల కిది సుపరిచితమైనను ఛాత్త్రాహుల కీ గ్రంథముతో పరిచయము లేదనియే చెప్పవచ్చును. గద్య, పద్య, కీర్తనాత్మకమై పఠన, గాన, నృత్యములకు అనుకూలముగనున్న కృష్ణలీలాతరంగిణితో ఛాత్త్రాహులకు కూడ పరిచయము కల్పించు నుద్దేశముతో పూజ్యులు శ్రీ నోరి నరసింహశాస్త్రిగారు విపులమైన ఆంగ్ల పీఠికతో ఇటీవలనే దేవనాగరి లిపిలో ప్రకటించి ప్రచారము చేయుచున్నారు. వారి ప్రయత్నమువలన మహారాష్ట్రమందును, ఉత్తరహిందూస్థానమందును పండితులును, పత్రికలవారును కొంత వరకు ఈ గ్రంథ ప్రాశస్త్యమును గుర్తించుచున్నట్లు తెలియవచ్చుట ప్రమోదావహము.

2

శ్రీ నారాయణ తీర్థులు సంస్కృత భాష యందేకాక, షట్ఛాస్త్రములందును పారంగతులని విద్వాంసుల ప్రశంశల నందినారు. ఈ క్రింది గ్రంథములను కూడ శ్రీ తీర్థులవారు రచించినట్లు తెలియ వచ్చుచున్నది.

1. భాట్ట భాషా ప్రకాశమను పూర్వ మీమాంసా గ్రంథము.
2. శాండిల్య భక్తిసూత్ర వ్యాఖ్య.
3. సాంఖ్య కారికా వ్యాఖ్య.
4. సాంఖ్య తత్వ కౌముదీ వ్యాఖ్య.
5. న్యాయ కుసుమాంజలీ టీక.
6. న్యాయ ముక్తావళీ టీక.
7. యోగ సూత్ర వ్యాఖ్య.
8. సిద్ధాంత బిందు లఘు చన్ద్రిక.
9. వేదాంత విభావనా టీక.
10. వేధస్తవ టీక.
11. హరి భక్త సుధార్ణము
12. భక్త్యధికరణమాల.
13. సురేశ్వరాచార్య కృత పంచీకరణ వార్త్తిక వివరణ దీపిక.

పై గ్రంథములేకాక ఆంధ్రమున పారిజాతాపహరణమను యక్షగానమును కూడ రచించిరి. దురదృష్టవశమున ఇది మనకు పూర్తిగా లభింప లేదు.

కృష్ణలీలాతరంగిణిలో శ్లోకములు, కీర్తనలు మాత్రమేకాక మధ్య మధ్య గద్యలు కూడ గలవు. గ్రంథ మందంతటనుగల 27 గద్యలు సంస్కృత భాషపై వీరికి గల అధికారమును ప్రకటించుచున్నవి.

"అవతీర్ణే భగవతి గోకుల భూమిభాగే తత్రత్య చందన మందార నాగ పున్నాగ చంపకాశోక పనస రసాల ప్రముఖాః కసుమ ఫల సంపదో దివ్య సౌగంధ గంధిత దిఙ్మండలాః విగళిత మార్ధ్వీ ఝరీ సంచర న్మత్త మధువ్రత ఝుంకారాలంకార రమణీయ కుసుమ ఫల భారానతశాఖాభిః అవనీగతాభిః అత్యంత భక్తి నమ్రా ఇవ భగవతో వాసుదేవస్య సాష్టాంగ లక్షణం ప్రణామం కుర్వాణాః తత్రత్య మాధవీ జాతీ మల్లికాది లతాః సంతత మంద పవన స్పందన విగళిత కుసుమభారైః అవతీర్ణస్య శ్రీ భగవతో నారాయణస్య పరమ ప్రేమ లక్షణాం భక్తిమా తన్వంత్యః పుష్పాంజలిం సమర్పయంత్య ఇవ........."

ఇట్లు ద్వితీయ తరంగమున బాల లీలలను చెప్పు సందర్భమున సమాసభూయిష్ఠమైన సంస్కృతభాషలో జగన్మంగళమగు రామకృష్ణలీలలను ఉపక్రమించుచు గద్యములో ప్రకృతి వర్ణనము మనోహరముగ చేసియున్నారు.

వీరి శ్లోకములు, కీర్తనలు కూడ సమాస సౌందర్యమును సంతరించుకొనియున్నవి. తీర్థులవారు ఆంధ్రులగుటవలన వీరి కావ్యములో ఆంధ్ర భాషా కావ్య రచనమున తరచుగ పాటింపబడు ద్వితీయాక్షర ప్రాస కనుపించును. ఉత్తరహిందూదేశపు కావ్యములలో విస్తారముగ కనుపించు అంత్యప్రాస కూడ ఈ కీర్తనలలో చూడగలము. ఇం దుపయోగింపబడు ద్వితీయాక్షర ప్రాస, అంత్యప్రాస, యమకాది శబ్దాలం

కారములు అందమగు గానఫణితుల నిర్మాణమునకు (Setting to music), ప్రస్తరించి గానము చేయుటకు మిక్కిలి అనుకూలముగ నున్నవి. వీనిని గానము చేయునపుడు శ్రోతలను రసానందమున నోల లాడించును.

ముఖారి రాగము—అటతాళము

పల్లవి:—రక్ష రక్షాసురశిక్ష . రాజీవదళాయతాక్ష

అనుపల్లవి:— అక్షీణకృపాకటాక్ష ఆశ్రితపక్షసంరక్ష.

చరణము:— సర్వమనోరథాధ్యక్ష సర్వలోకావనదక్ష
సర్వవేదాంతైకలక్ష సర్వయోగీంద్రసంరక్ష॥

ఇందలి అనుప్రాస, అక్షరమైత్రి, అంత్యప్రాసలు గానమునకు మృదంగము కూర్చిన కలుగు పరిపూర్ణత్వమును చేకూర్చుచున్నవి. కావ్యమంతయు మధురమై హృదయము నుఱ్ఱూతలూగించు ఇట్టి కృతులతో నిండి యున్నది.

సంగీత విషయమున కూడ . కృష్ణలీలా తరంగిణికి ప్రత్యేకత కలదు. దక్షిణదేశమున, పుట్టిన సంగీత కావ్యము కనుక ఇందలి కీర్తనలన్నియు రచన యందును, గేయ ఫణితుల నిర్మాణములోను కర్ణాటక సంగీత పద్ధతినే అవలంబించు చున్నవి. ఇందలి కీర్తనలలో చాలభాగము పల్లవి, అనుపల్లవి , చరణము అను విభాగమును కలిగి యున్నవి. గేయ ఫణితుల నిర్మాణమునందును అన్నమాచార్యుని కీర్తనల కంటె ఎంతయో పరిణతి పొందినట్టివి. అన్నమాచార్యుని నాటికి ఇట్టి విభజనము లేదు. పల్లవి, పల్లవి కంటె రెట్టింపుగాని, రెండు రెట్లుగాని ఉండు సాహిత్యము కల చరణము అను రెండు విభాగములు మాత్రమే తీర్థులవారికి పూర్వము ప్రచార మందుండెడివి. పల్లవి, అనుపల్లవి, చరణములను విభజనము వీరి కీర్తనలలో కనుపించుట వీరు కీర్తనా నిర్మాణమున ప్రదర్శించిన పరిణతియే. ఈ నిర్మాణము అన్నమాచార్యుల రచనా విధానమునకును క్షేత్రయ్య త్యాగరాజస్వామి వార్ల కృతి రచనా విధానమును అనుసంధించు వారధి తుల్యమైనది. జయదేవుని గీతగోవింద కావ్యమందలి అష్టపదులు ధ్రువము చరణము అను రెండు విభాగములు మాత్రమే కలిగియున్నవి. చరణము ముందు గానము చేయబడిన తదుపరి, క్రియాపదముతో కూడిన పల్లవి వంటి 'ధ్రువము' గానము చేయబడును. ఈ ధ్రువమునే అష్టపదిలోని ప్రతిచరణము తరువాత పల్లవి వలె గానము చేయుదురు. తీర్థులవారి కృతులట్లు గాక ఆధునిక కాలమున కర్ణాటక సంగీత రచన లెట్లు గానము చేయబడుచున్నవో అట్లే పల్లవి, అనుపల్లవి, చరణములు క్రమముగా గానము చేయబడుచున్నవి. కృతుల రచన యందు పల్లవిలోనే క్రియాపదములు నిముడ్చుట ద్వారా కర్ణాటక సంప్రదాయ గేయ ఫణితుల శైలినే అనుసరించినారు.

శ్రీ తీర్థులవారు రసౌచిత్యము నెరింగిన వాగ్గేయకారులు. రసానుగుణ్యముగను, సందర్భోచితముగను రాగముల నెన్నుకొన్న సంగీతజ్ఞులు. రుక్మిణీకల్యాణ ఘటములోని 'కల్యాణం భవతు సదా' అను కీర్తనను గానము చేయుటకు కళ్యాణి రాగమునే నిర్ణయించిరి. ప్రభాత సమయ వర్ణన చేయు కీర్తనకు ఆ సమయమున గానము చేయదగిన 'దేశాక్షి' రాగమును నిర్ణయించిరి. ఆ కీర్తనలోనే గోపికలు గోవిందుని భూపాల, దేశాక్షి, దేవగాంధారి, బిలహరి, వసంత రాగములలో గానము చేసినట్లు వర్ణించుట ఎంతయో సందర్భోచితముగ నున్నది.

'గీతం వాద్యం తథా నృత్తం త్రయం, సంగీత ముచ్యతే' అనునది 'సంగీత రత్నాకర' కారుడైన శార్ఙ్గదేవుడు 'సంగీత' శబ్దమునకు ఇచ్చిన పరిభాష. ఇది ఈ కావ్యమందలి కృతుల యెడల సంపూర్ణరూపమున వర్తించును. ఇందు కీర్తనా రూపమున గీతములును, కీర్తనలకు చేర్చబడిన జతులు, మృదంగాది లయవాద్య ధ్వనులు చేయుటకును, దాని కనుకూలముగ నృత్తము గావించుటకును యోగ్యముగ నుండి సంగీత లక్షణమును సార్థకము చేయుచున్నవి.

తరంగిణి పఠన, గాన, నృత్తములకే గాక అభినయమునకు కూడ ఉద్దేశింపబడినది.

మోహనరాగము— (రేగుప్తి)— అట తాళము.

పల్లవి :—బాలగోపాల మా ముద్ధర కృష్ణ—
పరమ కల్యాణ గుణాకర

అనుపల్లవి :—నీరద నీల కళేబర కృష్ణ
నిరుపమ కౌస్తుభ కంధర॥

చరణము :— నందనందన భక్తచందన—సుర
బృంద రచిత బహువందన

మందస్మిత సుందరానన కోటి మదన సుందర
జగన్మోహన

ఇందిరా మందిర భక్త సుందర హృదయారవింద
భృంగ భక్తి మకరందా నందిత గోపికా బృంద॥

తాం తాహత ధైదత్తత్తాం— తక్కతో
ఘమ్మిణాంగిణతో

ధిమ్మిరే— తక్కతో ధిమ్మిధిమికిటతో
ధిమ్మిరే—తక్కతో

దిగిణాంగం గిణత్తోం గధిర్గుడు ధధిగుడు
ధత్తోంగ—

తోధిగిణం గత్తి రుత్తోంగ— దదిర్గుడు
దధికిత కిటదధి గిణతోం: ॥బా॥

ఇందలి జతులు నృత్యమునకు మిక్కిలి అనుకూలముగ నుండి కీర్తనను ప్రస్తరించి బహు కాలము గానముచేసి ఆనందాబ్ధిలో నోలలాడుటకు, భక్తి తన్మయత్వమున నాట్యము చేయుటకును మిక్కిలి అనుకూలముగ నున్నవి. ఈ ఒక్క కీర్తననే ప్రస్తరించి, గానము చేసిన 'సంగతి'ని మరల గానము చేయకుండ, తెల్లవార్లువరకు గానము చేసెడి మహానుభావులగూర్చి పెద్దలు చెప్పెదరు.

శ్రీ తీర్థులవారు సంగీత, నాట్య శాస్త్రములను కూలంకషముగ నెరిగిన లక్షణవేత్త.

'ధ్రువ మత ముఖముఖ్యైస్తాళ భేదైరటంత్యో
వనభువి వరనార్యో రాసగోష్ఠీ గరిష్ఠాః
అలఘు లఘు పదాది న్యాస భేదైశ్చ నాట్యైః
పరస మభినయంత్యో నందసూనుం భజంతే.

అను శ్లోకములోను,

'త్రిపతాక పతాక సుకరైః కటకాముఖ శిలీముఖైః
పరభావ రసోత్కట పరై రపి వీక్షణ సుశిక్షితైః
తనుమధ్య వియోజిత కరై రపి నాట్య
రసోత్కటాః
. . . . —''

ఇందు అభినయమునకు అవసరమైన త్రిపతాక, పతాక, కటకాముఖ, శిలీముఖము అను ఐదు ముద్రలను పేర్కొనినారు. ఇట్లు సంగీత, నాట్య లక్షణమును ఛందోబద్ధముగ ప్రకటించుట సంగీత ఛ్ఛందో, నాట్య శాస్త్రకోవిదులైన శ్రీ తీర్థులవారికి వినా అన్యులకు సాధ్యముకాదు.

తీర్థులవారి కృష్ణలీలా తరంగిణిని అనుసరించి కొన్ని అనుకరణ కావ్యములును పుట్టినవి. అట్టి వానిలో శ్రీ వేంకటేశ్వరయజ్వచే రచింపబడిన 'రామలీలా తరంగిణి' అన్న కావ్యము ప్రధానమైనది. ఇందలి కీర్తనలు రచనాశైలిలోను, గేయఫణితుల లోను సర్వ విధముల కృష్ణలీలా తరంగిణిలోని కీర్తనల ననుకరించుచున్నవి.

శ్రీ తీర్థులవారు భాషావేత్త, కళాకోవిదులు, లక్షణవేత్తలేకాక బ్రహ్మజ్ఞానము మూర్తీభవించిన వేదాంతి. జ్ఞానమూర్తి. వీరి జ్ఞానముతో కూడిన భక్తి తత్పరతయు, గానకళాపరిపూర్ణత తరువాతి వారిని చేయెత్తి ప్రణమిల్లజేసినవి. తరువాతికాలమునకు చెందిన వాగ్గేయకారులకును, భక్త శిఖామణులకును, వీరి జీవితమును, వీరి కావ్యమును ఆదర్శప్రాయములైనవి. సంగీతబ్రహ్మయైన శ్రీ త్యాగరాజస్వామి స్వయముగ తన ప్రహ్లాద భక్తి విజయ సంగీత నాటకమున

'ఇష్ట దేవతాభివందనంబును, సద్గురు ధ్యానంబును సల్పి, పూర్వ భక్త వ్రాతంబును గొనియాడి, మరియు బాండురంగ.......శ్రీ నారాయణ తీర్థాది భగవద్దాసుల నెల్ల ప్రణమిల్లి'రి.

3

శ్రీ తీర్థులవారికి తరువాత కాలములోజన్మించి పాఠ్య గేయశైలులయందు వారితో దీటువచ్చు వాగ్గేయకారులు శ్రీ సుబ్రహ్మణ్యకవి. వీరు సంస్కృ

తాంధ్ర భాషా విశారదులు. అధ్యాత్మ రామాయణ కీర్తనలచే ఆంధ్ర గాయకులకును, భక్తులకును సుపరిచితులు. అధ్యాత్మ రామాయణము ప్రధానముగ ఆంధ్ర భాషా గేయ కావ్యమైనను ఇందు ఆరు సంస్కృత కీర్తనలును ఒక చూర్ణికయు గలవు.

సుబ్రహ్మణ్యకవికి గీర్వాణభాషపై గౌరవ మధికము. అందుచేతనే అధ్యాత్మ రామాయణమును "నమశ్శివాయతే నమోభవాయ" అను సంస్కృత కీర్తనతో ప్రారంభించిరి. పేరును బట్టియే అధ్యాత్మ రామాయణ గేయ కావ్యము రామకథను, రామతత్త్వమును తెలుపునది యను సంగతి విదితమగుచున్నది. ఇట్టి రామ కథా కావ్యమును సుబ్రహ్మణ్యకవి 'నమశ్శివాయ' అను శివస్తుతితో ప్రారంభించెను. శివకేశవుల యందభేదమును, నిశ్చలమునైన భక్తిగల శ్రీ సుబ్రహ్మణ్యకవిగాక అట్టి ప్రారంభమును అన్యులు చేయజాలరు.

ఇట్లు శివస్తుత్యాత్మకమైన సంస్కృత కీర్తనతో కావ్యము ప్రారంభించుటకు మన మూహించు కారణములలో వీరికి సంస్కృత భాషపై మిక్కుటమైన అభిమానముండుట అనునది మొదటిది.

"శబ్దానుశాసన జ్ఞానం అభిదాన ప్రవీణతా
ఛన్దః ప్రభేద వేదిత్వం అలంకారేషు కౌశలమ్
రసభావ పరిజ్ఞానం దేశస్థితిషు చాతురీ
అశేష భాషా విజ్ఞానం కలా శాస్త్రేషు కౌశలమ్

అనునవి ఉత్తమ వాగ్గేయకారునకు శార్ఙ్గదేవుడు చెప్పిన లక్షణములు. ఇందు 'అశేష భాషా కౌశలమ్' అనుదానికి అనుగుణ్యముగ తాను ఉత్తమ వాగ్గేయకారుడును, తన కావ్యము ఉత్తమ కావ్యము కావలెనని ఆశించుటచేతను సుబ్రహ్మణ్యకవి అధ్యాత్మ రామాయణమును సంస్కృత కీర్తనతో ప్రారంభించుటయేకాక ఇంకను కావ్యమంతటిలో ఐదు సంస్కృత కృతులను గూడ రచించిరి.

శ్రీ సుబ్రహ్మణ్యకవి శ్రీ కాళహస్తి ప్రభువులకు గురుస్థానీయుడుగా నుండెనను దానికంటె ఇతర విషయములేవియు మన కెక్కువగా తెలియవచ్చుట లేదు. తెలిసినది కేవలము వారి అధ్యాత్మ రామాయణ కావ్యము మాత్రమే.

సంగీతమందు ప్రత్యేకమైన అభిమానము, విద్వత్తుగల నిజమైన సంగీతజ్ఞులు శ్రీ సుబ్రహ్మణ్యకవి. అందుచేతనే పట్టాభిషేకాంతమైన రామాయణ గాథను, కీర్తనా రూపమున చెప్పినారు. సంగీతమునకును, నాట్యమునకును అధిపతియైన శివుని స్తుతించుచు కావ్యము నారంభించిరి. కావ్యమందలి ప్రథమ కీర్తనలోనే సంగీతాధిపతియైన శివుని 'సంగీతలోలాయ' అను పదము నుపయోగించి స్తుతించిరి. దీనికి శ్రోత్రిగానున్న పార్వతీదేవి గూడ 'వీణావాదన పటువాణీ సంగీత విద్యా ప్రవీణ, సంగీత భారతీ వినవే, వీణావాదనాభినయుత మస్తకా వినవే' అని సంబోధింపబడినది. కాబట్టి ఇది సంగీత ప్రవీణుడైన సదాశివునిచే, సంగీత విద్యాప్రవీణురాలైన పార్వతీదేవికి వినిపింపబడినది. సంస్కృతములో అధ్యాత్మ రామాయణమును విశ్వామిత్రుడు రచించెనని కొందరును, వ్యాసుడు రచించెనని వ్యాఖ్యాతయు నుడివిరి. దాని మూలమును సుబ్రహ్మణ్యకవి సుష్ఠుగా అనుసరించెను.

సేతు బంధన సమయమున చేసిన శివస్తోత్రము కూడ సంస్కృతములోనిదే.

సురటిరాగము — అటతాళము

పల్లవి:—రామలింగ వృషభతురంగ రాజితాంగ॥

అనుపల్లవి:—కామితప్రద సత్కరుణాపాంగ,
కామ గర్వభంగ, గంగోత్తమాంగ॥

చరణము:—బాలేందు కిరీట భవ్య జటాజూట
శ్రీల సలాట శ్రుతిచయ ఘోట త్రిపుర
దావ కృపీట
లీలా హాస నిర్మూలిత నిశాట
శూలాయుధ ఖేట సుజన హేమకూట
॥రామ॥

ఈ కృతి సంగీత సాహిత్యములు రెండింటి దృష్ట్యా కూడ పరిపూర్ణమైనది. ఇందలి భాష యథోచిత సమాసములతో హృదయంగమముగానున్న సంస్కృతము. కీర్తనలన్నియు ఆంధ్ర భాషా కీర్తనా సంప్రదాయమున నున్నవి. సంస్కృత కీర్తనలలో కూడ ఆంధ్ర భాషయందు విస్తారముగ పాటింపబడు ద్వితీయాక్షర ప్రాస పాటింపబడినది. రామలింగ, వృషభ తురంగ, రాజితాంగ అనుటలోని శబ్దాలంకార

ములు గానము చేయునపుడు మిక్కిలి శ్రావ్యముగ నుండును. దీని చివరి చరణము.

సోమార్కానల నేత్ర సుందరీ జన చైత్ర
హైమవతీ కళత్ర సన్నుత పాత్ర కామలతా లవిత్ర
సామజాసుర జైత్ర సకల లోక నుత శ్రీమచ్చరిత్ర
శేషాద్రీశ మిత్ర॥

ఇందలి వృత్త్యనుప్రాస గమనింపదగినది. ఇందు రామలింగని శేషాద్రీశ మిత్రునిచేసి ఇరువురి మధ్య స్నేహ సేతుబంధనము చేసినారు. శ్రీ సుబ్రహ్మణ్య కవి ఈ కావ్యమందలి ప్రథమ కీర్తన 'నమశ్శివా యతే' అను కీర్తనలోను ఇట్లే 'శేష శైలాధీశ మిత్రాయ' అనుచు ప్రయోగించెను. ఈ కీర్తనకు చివర

తాంకిట తక తకిట రిమరిస రీత హత ఝం
రిమపద
తకుంద ఝం తారి తధ పదమప తాహత కిటతక
ఝం
తా రిసరి మరీ సని సరీ సనిదప తాం తకిట పదమ
పనిదపమ ధళాంగు ధిమి తక దధి గిణ తోం ॥రా॥

స్వరాక్షరములతోను, జతులతో కూడిన ఈ శబ్దము తరువాత కాలములో, ప్రచారములోనికి వచ్చిన 'శోల్ కట్టు స్వరము'ను పోలియున్నది. ఈ చిట్ట స్వర శబ్దము రామలింగేశ్వర స్తోత్ర సందర్భమున చేయబడుటచే శివతాండవమునకు అనువుగ నుండి సందర్భోచితముగ నున్నది.

సుబ్రహ్మణ్యకవి చేసిన 'సంగీత విద్యా ప్రవీణ' వంటి పద ప్రయోగములు వీరికి అన్వయించును. ఈ కావ్యములోనున్న ఆరుసంస్కృతకృతులు ధన్యాసి,సురటి, పూరీ, రేగుప్తి, పున్నాగవరాళి, ఘంటా రాగములలోను, ఆది, అట,త్రిపుట, రూపక తాళములలోను నిబద్ధమై యున్నవి. ఆరు కృతులకు ఆరు రాగములను,నాలుగు, తాళములను ఉపయోగించిరి. దీనిని పరిశీలించిన వివిధ రాగ, తాళములను ప్రయోగించుటయందు వీరికిగల కళా కౌశలము, రాగ తాళములపై వీరికిగల అధికారము ప్రకటితమగుచున్నది. కావ్యమం దంతటను గల 104 కీర్తనలు 54 రాగములలో నిబద్ధమై యున్నవి. ఇంత రాగ విస్తృతి ఈ కవి విశిష్టత.

శ్రీ సుబ్రహ్మణ్యకవి వేదాంతము నెరింగిన జ్ఞాని. రామభక్తులు. రామపట్టాభిషేకమైన తరువాత చెప్పిన 'నమోస్తు శ్రీరామాయ, నారాయణాయ' అను ఘంటారాగ, రూపకతాళ కృతిలో

"మత్స్య, కూర్మ, వరాహ, నృసింహ, వామన,
భృగురామ శరీరో

వత్స్యసేహ శ్రీరామో భూత్వా, వాసుదేవ, బౌద్ధ, కల్కిభిః క్రీడసే ॥నమోస్తు॥

అనుచు దశావతారముల వర్ణించి ఆనందమును పొంది యున్నారు.

'ఇమం స్తవం నిత్యం సుశీలేన శృణ్వన్ వదన్ లిఖన్ యః సముక్తి సౌఖ్యం భవత్పదం యాతి, సాదరాత్తే శ్రీ శేషాచలపతే ॥నమోస్తు॥

అను చివరి చరణములో చెప్పినట్లు అధ్యాత్మ రామాయణమును వినిన వారికిని, గానము చేసిన వారికిని, వ్రాసిన వారికిని ముక్తి, సౌఖ్యము లబ్బుననునది నిశ్చయము.

4

సరళతరమైన శైలిలో సంస్కృతాంధ్రములయందు కీర్తనలచేసి ఆంధ్రజనతలో నేటికిని అమరుడై నిలిచియున్న మరియొక వాగ్గేయకారుడు శ్రీ భద్రాచల రామదాసు. 'రామదాసు కీర్తన' లనిన వెంటనే 'ఇక్ష్వాకు కులతిలక ఇకనైన పలుకవు రామచంద్రా', 'పలుకే బంగారమాయెనా' వంటి తెలుగు కీర్తనలే స్ఫురణకు వచ్చును. 'రామదాస, భద్రాచల రామదాస' అను ముద్రతో లభించు సంస్కృత కీర్తనలు, ఒక చూర్ణిక గూడ కలవు. కాని వీరి సంస్కృత కీర్తలేలనో బహుళ ప్రచారమును పొందలేదు. వీరి ముద్రతోనున్న 7 సంస్కృతకీర్తనలు కలవు. వీనిలో భాష మిక్కిలి సరళముగానుండి భక్త బృందముచే గానము చేయబడుచున్న కీర్తన యమునా రాగము చాపుతాళములో నున్నది.

పల్లవి:—దీన దయాళో దీనదయాళో
దీన దయాపర దేవ దయాళో

చరణము:—1. కనకాంబర ఘన శ్యామ దయాళో
సనకాది మునియోగి వినుత దయాళో

6. వరభద్రాద్రి నివాస దయాళో
పాలిత శ్రీరామ దాస దయాళో

ఇది అసంఖ్యాకమైన భక్త బృందములచే గానము చేయ బడుటకు అనువుగా ఇందుపయోగింపబడిన భాష సరళముగ నుండుటయేకాక సంగీత నరుస కూడ సులభముగ నుండి పండితులుకాని వారు సహితము గానము చేయుటకు తగియున్నది.

వీరి సంస్కృత కీర్తన లన్నింటియందును సావేరీ రాగము, అటతాళములోనున్న

పల్లవి:—కలయె గోపాలం కస్తూరి తిలక సుఫాలం
జలజ సన్నిభ కాంతికాంతం జగన్నాథపుర
నికాంతం

అనుపల్లవి:—అనుపమ రూపం మహితమాణిక్యకల్పం
విగత గోప వినుతానుతాప ముని మనో నిరేజతరక్షీం
కవచ సన్నిభ చారు చరణం

చరణము:—భా సిత భాసుర భద్రాద్రి నివాస నిదానం
దివ్యానంద భాసుర గానం రాసకేళీ విరాజమానం
రామదాస స్తుతి నిదానం
॥కలయె॥

ఈ కీర్తన తీర్థులవారి తరంగములను స్ఫురణకు తెచ్చును. 'రామచంద్రాయ జనక రాజజా మనోహరాయ మామకాభీష్టదాయ మహిత మంగళమ్' అను మంగళ గీతము కూడ సంస్కృతములోనిదే. ఈ కీర్తనలు కాక శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ భాండ........ ఇత్యాదిగా గల చతుర్వింశతినామ ప్రతిపాదకమైన చూర్ణిక కూడ కలదు.

5

సులభ తరము, సుబోధకము ఐన సంస్కృత భాషలో కీర్తనలను రచించిన వారిలో ప్రధానముగ పేర్కొన దగినవారు శ్రీ త్యాగరాజ స్వామి. ఈవ్యాసమున పేర్కొనిన వాగ్గేయకారు లందరిలోన్ను కాలమును బట్టి తరువాత జన్మించిన వారు ఐనను సంగీతకళాకౌశలములో ఎవరికిని వెనుక బడిన వారు కారు. సంస్కృతాంధ్రములలో కృతులను రచించిన వాగ్గేయకార సార్వభౌములు. వీరి సంస్కృత కృతులు మిక్కిలి సరళముగా నుండి సంస్కృత భాషా పాండిత్యము లేని వారికి సహితము బోధ పడునట్లుండును.

హిందోళరాగము—ఆదితాళము.

పల్లవి:—సామజ వరగమన! సాధు హృ
త్సారసాబ్జ పాల కాలా తీత విఖ్యాత ॥సా॥

అనుపల్లవి:—సామ నిగమజ సుధామయ గాన వి
చక్షణ గుణశీల దయాలవాల మాం
పాలయ ॥సా॥

చరణము:— వేదశిరో మాతృజ సప్త స్వర
నాదాచల దీప స్వీకృత
యాదవకుల మురళీ వాదన వి
నోదమోదకర త్యాగరాజ వందనీయ
॥సామజ॥

వీరి సంస్కృత కృతులు కొన్ని వినినప్పుడు అవి సంస్కృత భాషలో నున్నవా అని ఆశ్చర్య పడ వలసినంత సులభముగ వాని సాహిత్యముండును.

రవిచంద్రిక రాగము—ఆదితాళము

పల్లవి:—నిరవధి సుఖదా నిర్మలరూప!
నిర్జిత ముని శాప!

అనుపల్లవి:—శరధి బంధన! నతసంక్రందన!
శంకరాది గీయమాన సాధుజన సుసదన॥

ఇట్టివే 'సుజన జీవన' అను ఖమాస్‌రాగ కృతి 'శంభోమహాదేవ' అను పంతువరాళి కృతియును.

శ్రీ త్యాగరాజస్వామి కీర్తనలను, శ్లోకములను రచించిన వారేకాక సంస్కృత భాషలో ఒక చూర్ణికను గూడ రచించిరి. స్వామివారు ఆంధ్ర భాషా పాండిత్యముకలవారైనను వ్యావహారికాంధ్రమును అభిమానించిరి. అట్లే సంస్కృతములో మంచి పాండిత్యము కలవారైనను తమ కృతులు సుభోధకములై భక్తిపారవశ్యముచే గానము చేయుటకు అనువుగా సరళసంస్కృతముననే రచించిరి. వీరి పంచరత్న కృతులలో ప్రథమరత్నమనదగిన 'జగదానంద కారక' అను నాటరాగ కృతిని, ఇతర ఆంధ్రభాషా కృతులను పరిశీలించిన వీరికి సంస్కృత భాషయందు విశేష పాండిత్యము కలదనునది

ధ్రువపడును. ఈ క్రింద నుదాహరించిన కృతులును దీనినే బలపరచుచున్నవి.

కాంభోజిరాగము—చాపుతాళము

పల్లవి:— మహిమ ప్రవృద్ధ శ్రీమతి! గుహగణపతి జననీ ॥మ॥

అనుపల్లవి:— పాహి, వదనజిత సుధాకరే! శ్రీకరే! పాహి సుగుణ రత్నాకరి

చరణము:— దేహి చరణ భక్తి మఖిల— దేహిని, సదా శుభఫలదే,హిమగిరి తనయే! వైదేహీప సహోదరి! ॥మ॥

మరియు

చిత్తరంజని—ఆది

పల్లవి:— నాద తను మనిశమ్, శంకరమ్!
నమామి., మే మనసా శిరసా॥

అనుపల్లవి:— మోదకర నిగమోత్తమ సామ.
వేదసారం! వారమ్ వారమ్ ॥నాద॥

స్వామివారి సంస్కృత కృతులు 36, దివ్యనామ కీర్తనలు 13 లభించినవి. వందలాది ఆంధ్రభాషా కృతులు ప్రసిద్ధములు. ఇవి మాత్రమేకాక శ్రీ సీతా రామ విజయము., ప్రహ్లాదభక్తి విజయము., నౌకా చరిత్రమను సంగీత నాటకములను కూడ రచించిరి. ప్రహ్లాద భక్తివిజయములో ఆంధ్రభాషాకృతులు, కీర్తనలు, గద్య, పద్యములేకాక సంస్కృతములో ఒక కృతి, చూర్ణిక, కొన్ని శ్లోకములును రచించి యుండిరి.

శ్రీ స్వామివారు లక్షణయుక్తమైన శ్లోక రచనమునందును సమర్థులు. ప్రహ్లాదభక్తి విజయమున ప్రహ్లాదస్వామిని సముద్ర మహారాజు నాగపాశ విముక్తినిచేసి కానుక లొసగి పూజించు సందర్భమున

అభ్యర్చయిత్వా గోవిందమ్
తదీయాన్నార్చయంతి యే
నతే విష్ణోః ప్రసాదస్య
భాజనం డాంబికా జనాః

అను నిత్యాది శ్లోకములను చెప్పిరి. ఇంకను భగవంతుడు ప్రత్యక్షమగుట వంటి సందర్భముల ఎల్లెడలను సంస్కృతమును ప్రయోగించిరి. ప్రహ్లాద స్వామివారి చిత్తశుద్ధి లోకులకు తెలియజేయునపుడును,

'అరసిక జన సంభాషతో
రసిక జనేషు వాక్కలహం శ్రేయః'

అని శ్లోకరూపముననే పలికించిరి.

ఈ సంగీతనాటకముననే చతుర్థాంకమున శ్రీరామచంద్రుని సాక్షాత్కారము లభించినతరి షోడశోపచారములచే పూజించుచు బ్రహ్మానందపరవశుడై గానముచేయు మంగళగీతము సంస్కృత భాషలోనిదే.

ఘంటారాగము—ఝంపెతాళము

పల్లవి:— జయమంగళం నిత్య శుభ మంగళం

అనుపల్లవి:— కరుణా రసాఢ్యాయ కామారి వినుతాయ
తరుణారుణాభ సుందర పదాయ
నిరుపమ శరీరాయ నిఖిలాగమ చరాయ
సురవినుత చరితాయ సుందరాయ

చరణము:— కుందసమరదనాయ కుంభజనుగేయాయ
మందరాగ ధరాయ మాధవాయ
కందర్ప జనకాయ కామిత సుఫలదాయ
బృందారకారాతి భీకరాయ
సర్వలోకహితాయ సాకేతసదనాయ
నిర్వికారాయ మానిత గుణాయ
సార్వభౌమాయ పోషిత త్యాగరాజాయ
నిర్వాణ ఫలదాయ నిర్మలాయ॥

అని గానము చేసి చతుర్థాంకమును సమాప్తము చేయును. శ్రీ తీర్థులవారు కృష్ణలీలా తరంగిణిలో రుక్మిణీ పరిణయము తరువాత రచించిన 'జయ మంగళం నిత్య శుభ మంగళం'— అన్న గౌళీరాగ కీర్తనచేత మిక్కిలి సంతుష్టి చెందినవారై స్వామివారు దాని ననుకరించి వ్రాసిన ట్లూహింపవచ్చును. ఈ కీర్తన తీర్థులవారి కీర్తనలతో సరితూగుచున్నది. స్వామివారు సంస్కృతములో ఒక చూర్ణికను గూడ రచించియుండిరి.

'జయజయ! సకల నిగమాగమకుశల కిన్నర
కింపురుష సిద్ధ విద్యాధర గీయమాన
బహుజగ దుదయ రక్షణ లయ హేతుభూత
చతురానన హరిహర ప్రభృతి చింత్య
మానమణి ద్వీపే! జిత సాధు హృత్తాపే...'


ఈ చూర్ణికను పరిశీలించిన సంస్కృత భాషపై వీరికి గల అధికారము వెల్లడియగును.

శ్రీ స్వామివారు ఆంధ్రులై ఆంధ్రభాషను అధికముగ ప్రేమించి తమ ముక్తక రచనలను, సంగీత నాటకములను కూడ ఆంధ్రభాషలో రచించిరి. ఐనను వీరికి సంస్కృతముపై కూడ గౌరవము కలదు. అందువలననే ప్రహ్లాదభక్తి విజయమును

మంగళం జానకీశాయ మహారాజ సుతాయచ
మాయామానుషవేషాయ............మంగళమ్

అను మంగళ శ్లోకమును, ఈ క్రింది ఫలశ్రుతిని చెప్పి సమాప్తము చేసినారు.

శ్రీరామబ్రహ్మ తనయ త్యాగరాజేన నిర్మితమ్
ప్రహ్లాదభక్తి విజయ ప్రబంధం భుక్తి ముక్తిదమ్
యే గాయంతి సదా భక్త్యా యే శృణ్వంతి
చ శ్రద్ధయా
యే పఠంతి సదా ప్రీత్యా తేషాం సర్వాఘనాశనమ్



పాపం! నీ అడ్రసు దొరకటంలేదు!

శ్రీ భైరవయ్య

తల్లీ
కవితా కళామతల్లీ
నిజంగా నీ అడ్రసు దొరకటం లేదా?!
సాహితీ ధురంధరులు
పండితమ్మన్యులు
రాజుగారి మొల్లకన్ను ప్రేయసి పయోజాలమీద
నిన్ను నడిపించి
బండబూతులు సంస్కృతంలో నీ నోట పలికించి
దాన్ని రసికత్వమని, రసకవిత్వమని
రణభేరిలతో చాటించి
పరస్పర స్వోత్కర్ష సంఘాలలో తాతాచార్ల ముద్రవేసి
గతకాలపు చూర్లు పట్టుకుని గబ్బిలాల్లా వేళ్లాడుతూ—
కోట్లాది జనం గుండెల్లో మండుతున్న మంటల్నీ
వారి కళ్ళల్లో కొడిగడుతున్న ఆశల్నీ
వారిలో మసిబారుతున్న మానవత్వాన్ని
వారి అణువణువునా బ్రద్ధలవుతున్న అగ్నిపర్వతాలనీ
లావాలా సెగలు, పొగలు కక్కుతున్న నిత్యనూతన సత్యాల్నీ
గుర్తించక
గతంలో ఎక్కడో దారితప్పిన వీళ్లకి
ఏ అయినింటి జారిణి నిమ్నోన్నతాలలోనో
నిన్ను సజీవంగా బంధించామని విర్రవీగుతూ
బానిసత్వంతప్ప, స్వేచ్ఛ ఎరుగని ఈ పీతాంబరులకి
నవసమాజం వద్దు నవత వద్దు
నాణ్యమైన జీవనం వద్దు

పాపం! నీ అడ్రసు దొరకటం లేదు!

మార్పువద్దు, మారవద్దు
అంటూ కశ్మల భూయిష్ఠమైన కూపస్థాలలో
తమ జీవనం గడిపేస్తూ—
ఆ బురదతో నీఒంటికి సుగంధ లేపనాలు చేసి
తమ పాశవిక ప్రవృత్తుల్ని నీకు ఆభరణాలుగా వేసి
తెలుగుసీమని కలకాలంగా
నిజంగా పాపం చాలా కష్టపడి
తెగులుసీమగా తయారుచేసి
తెలుగుసీమకి ఆమడదూరంలో
బురదకంపు కొడుతుందన్న
ప్రతిభని, ప్రతిష్ఠని
అతిభద్రంగా కాపాడుకుంటూ
ఏ బురదగుంటలోనో కూరుకుపోయిన వీళ్లకి
నీ అడ్రసు దొరక్కపోవడంలో ఆశ్చర్యం లేదు.
అవును
పెదబాలశిక్షతప్ప మరేదీ తెలియక
మందలో గొర్రెల్లా
ఉత్తరదక్షిణాలు తెలియక
తమ ఉనికి తాము తెలుసుకోలేక
విశ్వరూపం దాల్చిన నిన్ను పోల్చుకోలేక
మారుతున్న కాలాన్ని గుర్తించలేక
తాము విసర్జించిన కశ్మలంతో
తమ భావిని పూడ్చుకుంటూ
పిచ్చికేకలు పెడుతున్న వీళ్లకి
పాపం నీ అడ్రసు దొరకటం లేదు.
జనం గుండెలు కుతకుత ఉడుకుతుంటే
నిత్యదైనందిన సమస్యలు పెనుభూతాల్లా పీడిస్తుంటే
నట్టనడివీధిలో బాహాటంగా మానభంగం చేస్తుంటే
మానవుడు మానవత్వాన్ని మరిచి పశువుగా మారుతుంటే
మాటకి విలువ తప్పి

మమతకీ-మంచితనానికి మనుగడ తప్పి
అడుగడుక్కీ నరాలు, ప్రేగులు, మెదళ్లు తూట్లు పడుతుంటే
ఈ భట్రాజులు
ఈ నాయకమ్మన్యులు
ఈ మతదురహంకారులు
ఈ స్వార్థపరులు
నిజాయితీని విసర్జించిన ఈ పెద్దలు
విరిగిన వజ్రాయుధాలతో
పగిలిన శంఖారావాలతో
చలిచీమల్లా, చెదపురుగుల్లా
జనతలో వ్యాపించి పీక్కుతింటుంటే
నిత్యనూతనస్రవంతివై, కారుణ్యవల్లివైన నీకు
ఆ ఆర్తనాదాలు వినిపించకూడదని
మానవుణ్ణి అధఃపాతాళానికి అణగద్రొక్కి
నిన్ను తమ కీర్తి దుర్గంధపేటికల్లో బంధించి
ఎన్ని లక్షల అగ్నిపర్వతాలు బ్రద్దలైనా
ఎన్ని కోట్ల దుష్టదుశ్శాసనులు మానభంగం చేస్తున్నా
నీ దిక్కే ఆర్తితో చూస్తున్న మాకూ
బంధాల్ని ఛేదించ యత్నిస్తున్న నీకూ
నీతివాక్యాలూ
ద్రౌపదీ, సావిత్రుల పతివ్రతాధర్మాలూ
బోధిస్తూ
నిన్ను నిజంగా
కలావరు రాణీగా
గజ్జెల గుర్రానివిగా
నకిలీ సైతానుగా
చివరకి
వెధవముండలా

మార్చారు.
కానీ, నువ్వు
దాస్యశృంఖలాలని త్రెంచుకుని
నిత్యనూతనంగా, దుర్నిరీక్ష్యంగా
నిలబడి
నీవారి ఆశలు నీలో ప్రతిబింబించి
వారి గుండెల్లో కరడుగట్టిన కష్టాలు కరగించి
వారి కళ్ళల్లో గూడుగట్టిన సూర్యుల్ని ప్రజ్వలించి
"కళ ప్రజలకోసం
కవిత్వం ప్రజలకోసం
ప్రజల ఘోషలు ప్రతిధ్వనించేదీ
ప్రజలు ఆశలు ప్రతిఫలించేదీ
క్రాంతిమార్గం చూపించేదీ కవిత్వం"
అంటూ దిక్కులు ప్రతిధ్వనిస్తూ
తుమ్మకంపల్నీ, కలుపు మొక్కల్నీ
కూకటి వేళ్లతో పెకలిస్తూ
సర్వమానవాళి జీవనం సస్యశ్యామలం గావిస్తూ
జలపాతంలా దూసుకువస్తున్న
నిన్ను జూసి
భయభ్రాంతులై
బతికుంటే బలుసాకంటూ
మీసాలు గొరిగించుకుని, పేడులై
కకావికలుగా
దిక్కులు తెలియక
పిక్కబలం చూపెడుతున్న
వీళ్లందరికీ
పాపం
ఎంత వెదికినా
ఎక్కడ వెదికినా
ఎదురుగా నిల్చిన
నీ అడ్రసు దొరకటం లేదు!!!

దిగంబర దిక్‌పథం :

ఒక మహత్తరమైన మార్పుకోసం

శ్రీ నిఖిలేశ్వర్

జిగేలున మెరిసే నాణేలా వెలుగులో పచ్చకాగితాల రెపరెపలలో తన హృదయ స్పందనను భూగోళం మూలల్లోకి నెట్టుతున్న విషయం మనిషి తెలుసుకున్నాడు. అందువల్లే 'నూతన ప్రపంచం కోసం' దోపిడిలేని మానవ సమాజంకోసం ఈనాడు మనిషి పోరాటం జరుపుతున్నాడు. ఈనాటి వ్యవస్థకు వ్యవస్థాపకులైనవాళ్లు అధికారమదాంధులై సామాన్యుల స్వేచ్ఛను అరికడుతున్నారని, సామూహిక క్షేమ జీవనాన్ని కొల్లగొడుతున్నారని తేలిపోయింది.

ఈ పోరాడుతున్న మనిషి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత యువకులది. ఈ యువకుల రక్తం పంచుకున్న యువకులు కాబట్టి దిగంబర కవులు ఒక మహత్తరమైన మార్పుకోసం విప్లవం కావాలంటున్నారు.

ఈ మహత్తరమైన మార్పు ఏమిటి?

దేశంలోని భూమి—డబ్బు—ఉత్పత్తి అందరికి చెందాలని, వ్యక్తిగత ఆస్తులను నిర్మూలించాలని దిక్కులేక మనిషి దిక్కులేని చావు చావడానికి వ్యవస్థ మార్గం చూపకూడదని, ప్రతి మనిషి జన్మ, జీవితం, మరణం సౌఖ్యప్రదం కావడానికి మార్గాలు ప్రశస్తం కావాలంటున్నారు. ఈనాటి విద్యా విధానం ఆధునిక సాహిత్య—విజ్ఞానం 'వర్తమాన జీవిత సమన్వయంతో రూపొందాలని కోరుతున్నారు. విద్యార్జన సమయంలో విద్యార్థులు కూడా సామాజిక బాధ్యతలను తెలుసుకొనేలా ఉత్పత్తిలో పాల్గొనాలని అంటున్నారు. వ్యక్తి ఏకాకితనాన్ని, సమాజంలో వ్యక్తి ఆగంతకుడిలా జీవించే లక్షణాన్ని రూపుమాపాలని కోరుతున్నారు. అవసరాలనుబట్టి అవకాశాలను సృష్టించి ఇస్తానవే ఈనాటి వ్యవస్థ ఉత్త బూటకంతప్ప మరొకటి కాదు. ధనికుల అవసరాలకు మరింత ధనమే అవసరం గనుక, దరిద్రుల చావుకు మరింత దారిద్ర్యమే కారణం గనుక—ఆ రెండు సమాన అవకాశాలనుమాత్రం ఈనాటి ఈ వ్యవస్థ సృష్టించి ఇచ్చింది. ఈ బూటక వలయంలోంచి మనం తప్పుకోవాలి.

ప్రాథమిక హక్కుల సాకుతో దోపిడికి అవకాశాలను ఇచ్చే రాజ్యాంగం—దాని నీడలో పెరిగే న్యాయ శాస్త్రం ఈనాటితరానికి అక్కరలేదు. రాబోయే సామ్యవాద ప్రజాస్వామ్యమనే వ్యవస్థలో కులాలు వుండవు. మతాలు వుండవు. బూటకపు దేవుడుండడు. మనుషులు అర్థంచేసుకునే వ్యవహారికభాషలు వుంటాయి. మనిషిని గౌరవంగా, శ్రమజీవిగా బ్రతికించే సమాజం వుంటుంది. వైజ్ఞానిక హేతువాదంతో నిజాన్ని అన్వేషిస్తున్న మనిషి—మనిషిలా జీవిస్తాడు.

ఈ మార్పుకు మార్గం ఏమిటి?

ఈ మార్పుకు ప్రస్తుతం కనపడుతున్న పరిష్కారమార్గాలలో ఒకటి సాయుధ విప్లవం. ఇది శస్త్ర చికిత్సలాంటిది. రోగ నిర్మూలనకు అవలంబించవలసిన అంతిమ మార్గమిది. వర్గ రహిత సమాజాన్ని ఏర్పర్చి దోపిడిలేని వ్యవస్థకు విప్లవం మార్గాన్ని ప్రశస్తం చేస్తుంది. అలాంటి విప్లవానికి ఈనాడు దేశంలో అన్ని విధాలా సంక్షోభం పరిపక్వమవుతోంది. ప్రస్తుతం ఈ మహత్తరమైన మార్పుకు సామాన్య జనం—యువకులు ముందుకు దూకుతున్నారు. విప్లవకరమైన మార్పులకోసం సామాన్య జనంలో కూడా విప్లవకరమైన ఆలోచనా విధానం పెంపొందు

తున్నది. ప్రజలు తమ పరిస్థితులను అర్థం చేసుకొంటున్నారు.

అందుకోసం దిగంబర కవిత్వం ప్రజల పరిస్థితుల నగ్న స్వరూపాన్ని చూపెట్టి నిరసనను— అసంతృప్తిని వెలిబుచ్చే సాధనంగా ముందుకువచ్చింది. ఈ సాధనం క్రమంగా మనిషిలో విప్లవ తత్వానికి వూపిరి పోస్తుంది. మనిషి మానసికభారాన్నిమోస్తుంది. అందుకే నిరంతరం వికసించే మనిషి జీవితంకోసం— సాహిత్య —సంస్కృతులకోసం దిగంబరుల పోరాటం. స్వతంత్ర ఆలోచనా విధానంతో విప్లవకరమైన వ్యవస్థకు తోడ్పడే ప్రతి ఆధునిక దృక్పథాన్ని ఆకళించుకొంటూ 'ఒకే ప్రపంచం'కోసం కృషి చేస్తూపోయే భావ చైతన్యంతో సజీవంగా వుండాలనే తపన వుంది. అంతే తప్ప ఈ కవితోద్యమం ఏ సంస్థకు— రాజకీయ పార్టీకి సాంస్కృతిక విభాగం కాదు.

బూతు అని అశ్లీలం అని ఏదో నిరర్థకమైన సాకులతో వక్రభాష్యాలు తలకురుద్ది దిగంబరకవుల ఆవేదనను— నిజాయితీని శంకించే వాళ్లందరూ ఈనాటి కుష్టు వ్యవస్థకు ప్రతినిధులు. అసలు భాషలోని బూతు పతితులకు— పదదళితులకు దగా పడిన తమ్ముళ్లకు— సామాన్య జనానికి ఈ దోపిడి వ్యవస్థ సాంస్కృతికంగా ఇచ్చిన వారసత్వం. అశ్లీలమనే ప్రత్యేక భాష ఎక్కడా లేదు. అంతరార్థాన్ని— ఉద్దేశాన్ని బట్టి భాష అశ్లీలం కావచ్చు. నిత్య జీవితంలోని భౌతిక— వాంఛలు, వాటి పరిపూర్ణత అశ్లీలమైతే మానవ జీవితమే అశ్లీలం. ఇది బూతును సమర్థించుకునే వైఖరి కాదు. కవికి వుండే భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ వివిధ రకాల భాషా సాధనాలను అవలంబిస్తుంది. దిగంబర కవిత్వం ఈ చారిత్రక సందర్భంలో అలాంటి బాధ్యతను నెరవేర్చింది.

ఈ నాటి మనిషి వ్యక్తిగా నటనకు లోబడి వ్యవహారంలో మోసం(బతుకు బ్రతుకుతున్నాడు. వ్యవహారవేత్తగా నటన— మోసం లేనిది జీవితంలేదని భ్రమ పడు తున్నాడు. ఈ నటన— కృత్రిమత్వంతో అన్ని అవినీతులతో రాజీపడి మనిషి వ్యక్తిగా తన స్వరూపాన్ని కోల్పోతున్నాడు. స్వరూపాన్ని కోల్పోయి రాజీపడుతున్న మనిషిని రక్షించే బాధ్యత ఈనాటి యువకులది.

ఈ బాధ్యతను నిర్వహించే ప్రయత్నంలోనే దిగంబర కవిత్వం అందర్నీ నిలదీసి ప్రశ్నిస్తున్నది. ఈనాటి భీకరమైన కుత్సిత వ్యవస్థ విరాట్ స్వరూపాన్ని మీా కళ్ల ఎదుట నిలువుతున్నది. ప్రతి యుగానికి సమస్యలు వుంటాయి. ఆ సమస్యలను కవులు— రచయితలు చిత్రించి సాంఘిక యథార్థానికి సన్నిహితమైన మార్గాలు చూపెడుతారు. ఆ మార్గాలలో ఏ యుగానికి ఆ యుగం తన పరిష్కారాలను వెతుక్కోవలసి వుంటుంది.

మార్పుకోసం కావలసిన చైతన్యం :

స్వాతంత్ర్యానికి పూర్వం సర్వస్వం అర్పించి దేశంకోసం నిలబడ్డామనే వృద్ధులతరం, స్వాతంత్ర్యం తర్వాత పాలనాయంత్రాంగాన్ని తిప్పుతున్న ప్రౌఢుల తరం ఒక రకంగా వర్తమానంలో జీవించడంలేదు. ఆ రెండు తరాలకు వర్తమానం అక్కరలేదు. ఆ రెండు తరాలలో ఒకటి స్వార్థంలో కూరుకపోయి ఈ నాటి తరం భవిష్యత్తును ఘోరమైన అయోమయంలో వదిలివేసింది. ఈ అయోమయంలోంచి తేరుకొని ఈ తరం కనీసం ముఖంపై ప్రశ్నించి నిలదీసి నిరసన తెలిపి తిరగబడేందుకు ఆయత్తం అవుతుంది.— ఇది చారిత్రక సత్యం. ఈనాటితరం భవిష్యత్తులో ఎదుర్కోవలసిన మరో చేదుచారిత్రక సత్యం ఒకటి వుంది. ఈనాడు స్కూళ్లలో రోడ్లపై వున్నవున్న తరుణతరం రేపు మన అసమర్థతను నిస్పృహను— నిర్లక్ష్యాన్ని క్షమించదు. నడిరోడ్డుపై బట్టలు వూడదీసి మన అసమర్థతను, నిర్ణయించుకోలేని తనాన్ని వూరేగించి అవమానిస్తుంది. తిరుగుబాటుకు అక్కడ రాజీ అనే ప్రసక్తి లేదు.

మరో విధంగా ఈనాడు గతవైభవ స్వప్నాలలో జీవిస్తూ వర్తమానాన్ని కొల్లగొడుతున్న నడిమి తరాన్ని ఎదుర్కొంటూ ఈనాటి యువతరం గతంతో రాజీపడని· వ్యవస్థను తీర్చి దిద్దుకోవాలి. ఆ మార్పుకోసం కావలసిన చైతన్యాన్ని ఆరిపోనీకుండా, నిర్భయంగా ఈ నాడు కొన్ని అంశాలను పునఃపరిశీలించి ఎక్కడ మొగమాటం లేకుండా వర్తమానంలోంచి భవిష్యత్ రూపాన్ని రూపొందించాలి.

కారణం "మనం వర్తమానంలో ఏనాడు

సంపూర్ణ సమకాలీన తత్వంతో జీవించలేదు'' (We are never completely contemporaneous with our present) అని రెజిస్ ద బ్రె (Regis De Brev) రాబోయే నూతన విప్లవ సందర్భంలో అంటున్న వాక్యాన్ని వర్తింప చేసుకుంటే ఒక విషయం బోధపడుతుంది. ఈ నాడు మనం కూడా నిజంగానే అవసరమైనంతగా ఈనాటి అవసరాల కనుగుణంగా జీవించడంలేదు. అందులో ఈ దేశంలో మన తరం తలలపై గడిచిన కాలాల విపరీతమైన భారం నిత్యం విలయతాండవం చేస్తూనే వుంది. మరి సంపూర్ణ సమకాలీనత్వంతో జీవితానికి అర్థం వెతుక్కొని— కావలసిన స్ఫూర్తిని, దీప్తిని పొంది ఒక మహా చైతన్యాన్ని సంతరించు కుంటున్న ఈనాటి తరుణంలో—.....

మూడు రాజకీయ వ్యవస్థలు మన ఎదుట వున్నాయి. ఒకటి పెట్టుబడిదారి వ్యవస్థ. రెండోది తటస్థ విధానమనే ప్రజాస్వామిక వ్యవస్థ. మూడోది కమ్యూనిస్టు వ్యవస్థ.

ఒకటి— పెట్టుబడిదారి వ్యవస్థలో వ్యక్తికి ఎంత స్వేచ్ఛవున్నా, ఆర్థికంగా ఉన్నతమైన స్థితికి చేరుకునే అవకాశాలున్నా సంపత్తిని, ధనాన్ని కొందరు కోటీశ్వరులు మాత్రమే చేజిక్కించుకొని వ్యవస్థను మొత్తం పరోక్షంగా శాసిస్తు వుంటారు. స్వేచ్ఛగా జరిగే పోటీలో వ్యక్తి స్వేచ్ఛ కావలసినంత వున్నా చివరికి సామాన్యుడైన వ్యక్తి పోటీకి తట్టుకోలేక అడవిలో తోడేళ్ల మధ్య మిగిలిపోతాడు. చివరికి ఆత్మహత్య చేసుకొనే స్వేచ్ఛమాత్రం మిగులుతుంది.

రెండోది— తటస్థంగా వుండాలని ప్రయత్నిస్తున్న ప్రజాస్వామిక వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవడం సాధ్యం కాదు. రెండు శక్తివంతమైన వ్యవస్థల మధ్య చిక్కి రెండింటిని ఒక సమఉజ్జిలో నిలపగలిగే అంతేశక్తి ఈ తటస్థ వ్యవస్థకు లేదు. ఫలితంగా రెండు బలమైన చేతులలో ఏదో ఒక చేతి నీడన బ్రతకక తప్పడంలేదు. అలాగే ప్రజాస్వామిక దేశమనే భారతదేశంలో అన్ని శక్తులు తమ ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాయి కాబట్టి పరిస్థితి ఈనాడు గందరగోళంలో విషమించి దిక్కులేని స్థితిలో నిలుచుంది. అదే దిక్కులేనితనం ఈనాటి తరానికి కూడా దాపురించింది. ప్రజాస్వామ్యాన్ని ధనికులు కొల్లగొట్టగలిగే వ్యవస్థగా మారింది.

మూడోది— మార్క్సు కలలుగనిన వ్యవస్థ ఈ నాటికి ఇంకా ఏర్పడలేదు. 'State whtihers away' అనే స్వప్నం నిజం కావలసివుంది. కొన్ని కమ్యూనిస్టు దేశాలలో విప్లవం ఒక వ్యవస్థను సుస్థిరం చేసి పాలక వర్గమనే ఒక కొత్త వర్గాన్ని సృష్టించింది. ఈ కొత్తవర్గం మళ్లీ అధికార వర్గంగా స్థిర పడిపోయి బ్యూరోక్రాటిక్‌మనస్తత్వాన్ని పెంచు కొంటోంది. ఈ బ్యూరోక్రాటిక్ మనస్తత్వాన్ని ఆ దేశాలలోని యువకవులు కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

ఒక దేశ సౌభాగ్యం సమిష్టికృషిపై ఆధార పడితే వ్యక్తి స్వేచ్ఛామానసంపై గాలి పీల్చుకోగలుగుతుంది. వ్యక్తి స్వేచ్ఛ— సమిష్టి సంక్షేమం తరచుగా ఘర్షణ పడుతుంటాయి. ఈ ఘర్షణలో వ్యక్తి సమిష్టి లక్ష్యంకోసం తనపై కొంతమేర ఆంక్షలను విధించుకోక తప్పదు. ఇలా సమిష్టికి లోబడిన వ్యక్తి అతిసామాన్య మానవుల సంక్షేమం అనే మహాలక్ష్యం కోసం జీవించి సార్థకత పొందుతాడు.

ఒక విధంగా మార్క్సిజం నిరంతరం ప్రయోగాల ద్వారా అభివృద్ధి చెందే భౌతికశాస్త్రంగా పరిణామం చెందుతూ వుంది.

పెట్టుబడిదారి వ్యవస్థలో వుండే సాంఘిక— ఆర్థిక సంబంధాలను కార్ల్‌మార్క్సు దూరదృష్టితో విశ్లేషణ జరిపితే, లెనిన్ అదే దృష్టితో సామ్రాజ్యవాద వ్యవస్థ తెచ్చే పరిణామాలను ప్రపంచ దృష్టికి తెచ్చాడు. మార్క్సిజం ఆధారంగా అనుభవాల్ని జోడించి మావో ఇప్పుడు వెనకబడిన దేశాల విముక్తికి విప్లవ పంథాను చూపిస్తున్నాడు. లాటిన్ అమెరికన్ దేశాలలో వచ్చే విప్లవాన్ని క్యూబా విజయాన్ని ఆధారంగా తీసుకొని ఫ్రెంచి రచయిత రెజిస్ ద బ్రే విప్లవ మార్గాన్ని ఛీగువేరా సంఘర్షణలో దర్శిస్తున్నాడు.

అలా కాకుండా జర్మన్ తత్వవేత్త హేర్బర్ట్— మార్క్యూస్ అభివృద్ధి చెందిన దేశాల యాంత్రిక నాగరికత ఆధారంగా మార్క్సిజానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపించాలని ప్రయత్నిస్తున్నాడు. ఓటమి

హోన్ని కూల్చే సశక్తమైన మూడోశక్తి ఇక్కడే జీవం పోసుకుంటుంది. సుఖ సంతోషాలతో హాయిగా గాలి పీల్చుకునే హక్కు ప్రతిమానవుడికి వుంది కాబట్టి ఆ హక్కును ప్రతి సగటు పౌరుడు సాధించుకునే మార్గాన్ని అది సంతరించి పెడుతుంది.

చైతన్యంలోంచి మూడోశక్తి:

చరిత్రకు అందుతున్న అత్యంత ప్రాచీన యధార్థాలనాటి నుండి 'సగటు పౌరుడనే' సామాన్య వ్యక్తి అమానుషమైన యాతననే అనుభవిస్తూ వస్తున్నాడు. ప్రాణాల్ని కాపాడుకునే సమరంలో తిండికి— బట్టకి మొత్తం జీవితాన్ని అర్పిస్తున్నాడు. చివరకు ఆ తిండీ— బట్టకూడా కరువై పెత్తనం వహించే వర్గాలకింద సామాన్య మానవుడి ప్రాణం ఆవిరై పోతోంది. సామూహికంగా అత్యధిక సంఖ్యలో వున్నా ఈ సగటు పౌరుడు సామూహిక ధైర్యం— తిరుగుబాటు కొరవడి తరతరాలుగా మట్టిలో కలసి పోయి నమసి పోతున్నాడు.

'మాలపల్లి' నవలలో ఉన్నవ లక్ష్మీనారాయణ గారు సంగదాసుతో చెప్పించినట్టు ఈ జనం—"కప్పల వలె ఎండి, జీవంతో వున్నవాండ్లు చినుకులు పడంగానే బెకబెకలాడి, ఆసాములకు పంటలు పండించడానికి వస్తారు."

అక్షరాల కప్పల్లా జీవించే ఈ సామాన్య జనం కప్ప జీవితానికి ఎవరు బాధ్యులు?

పెట్టుబడిదారి వ్యవస్థలో వ్యాపార మనస్తత్వం గల వ్యక్తులు, దోపిడి సాగిస్తూ అధికారాన్ని అనుభవించే పాలకులు, బ్యూరోక్రాటిక్ వ్యవస్థను స్థాపించిన కొత్త జమీందారులైన ప్రభుత్వ అధికారులు బాధ్యత వహిస్తారు.

ఎప్పుడూ తమ సుఖభోగాలే— తమ కుటుంబాల సంక్షేమం మాత్రమే చూసుకునే ఈ కుళ్లు వ్యవస్థలోని వ్యక్తుల— పాలకుల మనస్సు అంత సులభంగా మారదు.

అందువల్ల దోపిడిని ప్రోత్సాహించే వ్యవస్థను సమూలంగా నిర్మూలించే సాంస్కృతిక చైతన్యం ఆచరణలోకి రావాలి.

ఆ చైతన్యమే సామాన్యజనం సామూహికంగా అగ్నిపర్వతంలా విరజిమ్మే లావా— అదే విప్లవం.

విప్లవానికి సాహిత్య రూపేణ పర్యాయపదంగా ఇవ్వదగిన పదం 'చైతన్యం.' ప్రపంచంలోని మట్టిని గాలిని సొంతం పంచుకొంటున్న సామాన్య జనం అన్ని హక్కుల్ని అనుభవించే అవకాశం ఇచ్చేది ఈ మహాచైతన్యం.

ఈ మహా చైతన్యంలోంచి వెనుకబడిన ఆఫ్రికన్— లాటిన్ అమెరికన్— ఆశియాదేశాలు, ఆ దేశాలలోని సామాన్యజనం మహావర్గ మానవ సమాజంగా క్రమంగా వర్గరహిత సమాజంవైపు పురోగమించే ఉద్దేశంతో మేల్కొన్నాయి. అటు సామ్రాజ్య తత్వంతో అభివృద్ధి చెందిన దేశాల శక్తి ఇటు పెట్టుబడిదారి వ్యవస్థలోకి అడుగు పెడుతున్న కొన్ని కమ్యూనిస్టు దేశాల శక్తి పరస్పరం సంధి ఏర్పర్చుకొని వెనుకబడిన దేశాలను వలసలుగా పంచుకోడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ కుట్రలోంచి బయటపడి తన బలాన్ని విప్లవం ద్వారా సాధించుకుని అణచబడిన దేశాలు మూడోశక్తిగా రూపొందే అవకాశం స్పష్టంగా కనపడుతుంది. ఈ ఆశతోనే ఫ్రాంజుఫెనన్ అనే నీగ్రో మేధావి స్వయంగా అల్జీరియా విముక్తి పోరాటంలో పాల్గొని వలస విధానాన్ని సమూలంగా నాశనం చేయాలని కృషి చేశాడు. చీకటిఖండంలోంచి మూడో ప్రపంచాన్ని అన్వేషించాలని కలలు కన్నాడు. భూమిపై వున్న నికృష్టపు జీవులైన నల్లవాళ్లను ఆహ్వానిస్తూ అపరిమితమైన ఆశతో ఇలా అన్నాడు— "పశ్చిమ దేశాలను అనుకరించవలసిన అవసరం లేదు. దివారాత్రులు మనమంతా వివేకంతో, దృఢనిశ్చయంతో ప్రపంచంలోని మనుష్యజాతితో భుజం— భుజం కలిపి ముందుకు మరీ - ముందుకు వెళ్లాలి."

ఈనాడు భారతదేశం కూడా పెట్టుబడిదారి వ్యవస్థకింద వూడలు చాచి భూమిలోకి పాతుకొని సామాన్యజనానికి చోటు లేకుండా చేస్తున్నది. ఆర్థికంగా అమెరికా తదితర దేశాలకు వలసగానే మిగిలి పోయింది. అందువల్ల ఆ వూడల్ని నరికి వేయాలి. నరికి వేసినంతమాత్రాన పెట్టుబడిదారి వ్యవస్థ కూలిపోదు. ఆ వ్యవస్థ మర్రిచెట్టును కూకటివేళ్లతో సహా పెరికివేయాలి.

— అసంతృప్తి— నిస్పృహ— విసుగు మొదలైన వాటిని దూరంచేసి వర్తమాన— భవిష్యత్తులను సమన్వయంచేసే ఏ ఒక్క సిద్ధాంతం లేదని - అందువల్ల ఒక మహత్తరమైన నిరాకరణ (Great refusal)లో జీవిస్తూ ప్రజలు తిరుగుబాటు చేస్తుండాలనే మార్క్యూస్ వాదంలో బలం లేదు. అది యధార్థాన్ని కేవలం తాత్విక ధోరణితో చూడడం అనిపించుకుంటుంది. వెనుకబడిన దేశాలకు అది ఏమాత్రం వర్తించదు. అయితే పాతుకున్న వ్యవస్థను కూల్చడానికి ఎందువల్ల హింసకూడా సాధనం కావలసి వస్తుందో మార్క్యూస్ చెప్పిన ఈ మాటలు సహేతుకంగా వున్నాయి— "శాసనాలు, చట్టం సాధారణంగా పాతుకపోయిన వ్యవస్థను రక్షించే ప్రయత్నం చేస్తాయి. అందువల్ల రాజ్యాంగ పద్ధతులు న్యాయాన్ని సమకూర్చని పక్షంలో పదదళితులు రాజ్యాంగ వ్యతిరేక పద్ధతులను అవలంబించే అవకాశం సహజంగా వుంటుంది. ఈ ప్రయత్నంలో హింసను అవలంబించినా అది అంతకుముందే వున్న సంకెళ్లను తెంచి— వేయడంకోసం అవలంబించే పద్ధతి మాత్రమే."

సాంఘిక విప్లవంకోసం గాంధిజీ స్వాతంత్ర్యానికి పూర్వం సూచించిన పద్ధతులు ఈనాడు ఏమాత్రం సామాన్య జనానికి హక్కులను సాధించి పెట్టలేవు. పెట్టుబడిదారులకు పరోక్షంగా మేలు చేసిన గాంధిజీ సిద్ధాంతాలు ప్రజలను కర్మ (మాయ)వాదులను, చేతగానివాళ్లనుగా చేశాయి. ఆయన సమూలంగా ఆనాడే రాజకీయంగా రావలసిన సాంఘిక విప్లవానికి ద్రోహం చేశాడు.

ప్రస్తుతం మనం మళ్లీ ఆ తప్పిపోయిన రాజకీయ— సాంఘిక విప్లవంకోసం పాటుపడాలి. సాంస్కృతికంగా పునరాలోచించి సమూలంగా వ్యవస్థను మార్చే విప్లవానికి ప్రజలను ఆయత్తంచేయాలి. ప్రజాస్వామిక దేశమనుకునే భారతదేశంలో సగటు పౌరుడి చైతన్యం కేవలం వస్తుపరంగా మారిపోయింది. ఈ వ్యవస్థ కేవలం స్వార్థాన్ని పెచ్చరిల్ల చేసింది. రాజకీయ చైతన్యం అనేది కనీస అవసరాలను సాధించేవరకే పరిమితమైపోయింది. ఈ పరిస్థితుల్లో నినాదాల వెంబడి పరిగెత్తినా, తాత్కాలికంగా ఏదో ఒక పార్టీ చైతన్యాన్ని ప్రదర్శించినా ఆ సామాన్యుడి జీవితాన్ని శాసించే వర్గం ఎప్పుడూ తలపైన పగ్గాలు పట్టుకొని అదిలిస్తూ వుంటుందనే వాస్తవాన్ని విస్మరించలేము. ఈ తలపై నిలుచున్నవర్గం ఎంత బలంగా రాక్షసంగా పాతుకొని దేశాన్ని ఆడిస్తూ వుందో అంతే బలంగా రాజకీయపార్టీల నాయకులు ఆ వర్గం చెప్పు చేతుల్లో దేశ భవిష్యత్తును నిలిపి సామాన్యుల జీవితాన్ని బలి చేస్తున్నారు.

ధనికవర్గం తన స్వార్థంకోసం ఎలాంటి అఘాయిత్యానికైనా వెనుదీయదు. చట్టాన్ని, పోలీసు బలగాన్ని తన రక్షణకు అడ్డంగా ఉపయోగించుకుంటుంది. 'అందరికీ సమానన్యాయం,(Rule of law) అనేది నామమాత్రంగా మాత్రమే న్యాయాన్ని సమకూరుస్తుంది.

ఈ బలమైనవర్గం పెత్తనాన్ని సమూలంగా కదిలించి వేయడానికి ఒక మార్గం కనపడుతుంది. ఈమార్గం పెట్టుబడిదారి వ్యవస్థ-ధనాఢ్యులవర్గాఢ్యం సృష్టించి ఇచ్చిందే. తమస్వార్థం—తమ భోగభాగ్యాల రక్షణకు హింసామార్గాన్ని— సాయుధ దోపిడిని ఈ వర్గాలు ఆచరణరీత్యా నిరూపించాయి. పరోక్షంగా పాలనా యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నాయి. హింసాయుతమైన ధోరణిలో దేశ సంపత్తిని కొల్లగొట్టే ఈ వర్గం తన స్వార్థాన్ని మాత్రమేచూస్తుంది. సామాన్యుల సంక్షేమం ఈ వర్గం చేతుల్లో వుండే సాయుధ బలగం ముందు, వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి వుంటుంది. అందువల్ల సామాన్యుడు తన జన్మహక్కును సాధించుకోడానికి హింసాయుతంగానే తిరగబడుతాడు. ఆత్మరక్షణకోసం సాయుధ బలగాన్ని పెంపొందించుకుంటాడు. ఇందులోంచి సాయుధ విప్లవం అనే ఆశారేఖ సామాన్యునికి ప్రత్యామ్నాయ మార్గంగా నిలుస్తున్నది. అది ఈ దేశంలో ఈనాటి పరిస్థితుల కనుగుణంగా రూపొందుతూ ప్రయోగావస్థలో వున్నది.

ఈ విప్లవాన్ని అనుసరించి భవిష్యత్ రూపురేఖలు, రాబోయే వ్యవస్థ క్రమానుగతంగా ఏర్పడుతాయి. ఈ దేశం మట్టిలోంచి ఆశక్తి ఉద్భవించి తన బలాన్ని నిరూపించుకుంటుంది. క్రూరమైన పెట్టుబడిదారి వ్యవస్థను, పాలకుల అధికార వ్యామో

ఒక మహత్తరమైన మార్పుకోసం

ఆ పెరికివేసే మహోద్యమానికి సాహిత్యం అన్ని విధాలా బలం ఇవ్వాలి. 'దిగంబర కవిత్వం' ఈ చైతన్య జ్వాలను రగుల్కొల్పడానికి ముందుకు వచ్చింది. రాబోయే మహత్తర విప్లవాన్ని దర్శించే ప్రయత్నం చేస్తున్నది. అన్యాయం— అమానుషత్వం ఎక్కడ పెచ్చరిల్లినా ఖండిస్తున్నది. వియత్నాంలో అమెరికా సాగిస్తున్న పాశవిక దమనకాండను అదే దృష్టితో నిరసించింది. దానికి తార్కాణం మూడో సంపుటంలోని కొన్ని దిక్కులు. వీటిని తెలుగు విమర్శక మహానుభావులు గ్రహించలేకపోయారు. బూతులని— బరితెగించారని పెడమార్గం పట్టించే డొంక తిరుగుడు వ్యాఖ్యానాలు చేశారు.

ఒక క్రమబద్ధమైన నవ సమ సమాజం ఏర్పడాలంటే సాహిత్యం తన వివిధ ఆధునిక ప్రక్రియల ద్వారా విప్లవ చైతన్యాన్ని ప్రజల్లో ఆరిపోకుండా చూడాలి. సృజనాత్మక రచయితలు తమ సామాజిక బాధ్యతను ఆ విధంగా నెరవేర్చుకో గలిగాలి— లేని పక్షంలో కవులు— రచయితలు కేవలం 'కాలక్షేపాన్ని సమకూర్చే కళాకారుల్లా' మిగిలిపోతారు.

విప్లవమనేది అత్యంత శక్తివంతమైన జ్వాల. ఈ జ్వాలనే ప్రపంచాన్ని ఒక క్రమానుగతిలో సజీవంగా వుంచేశక్తి. ఇదేశక్తి సామాన్య జనానికి ప్రాణం లాంటిది. ఈ ప్రాణాలను సజీవంగా వుంచేది విప్లవ చైతన్యం. ఇదే చైతన్యంలో వ్యక్తి అనుభవాలు— అనుభూతులు రూపు దిద్దుకుంటాయి. కళా ప్రయోజనానికి, శిల్పానికి ఈ చైతన్యమే ప్రాణం పోస్తూ వుంటుంది.

మూడోశక్తి బలాన్ని మళ్లీ ఒకసారి అంచనా వేసుకున్నప్పుడు ఈనాడు ప్రపంచంలో యువతరం జరుపుతున్న పోరాటాన్ని ఏమాత్రం మరచిపోలేము.

ఒకవైపు పెట్టుబడిదారీ వ్యవస్థలో కుళ్లిపోతున్న సామ్రాజ్యవాద దేశాల్లో యువకులు తిరగబడుతున్నారు. మరోవైపు పాలకుల అధికార మదాంధతను కాళ్లతో రాచే సామాన్యజనం మేల్కొంటున్నది.

ఈ విప్లవ ఆహ్వాన ఉద్యమంలో ''విప్లవకరమైన కళ'' ఉద్భవిస్తూ వుందని అమెరికన్ కవి— రచయిత ఇర్విన్ సిల్బర్ అంటున్నాడు. కళ ఈనాడు ధ్వంస రచనకు పూనుకోవాలని తద్వారా సృజనాత్మక సమాజానికి జన్మ ఇవ్వాలని చెబుతున్నాడు.

సాహిత్యం ప్రశస్తమైన విప్లవ ప్రపంచాన్ని సృష్టించని పక్షంలో ఆ విధ్వంస కళ యధార్థాన్ని చిట్టగొట్టి స్వవినాశనానికే దారితీస్తుంది. ప్రత్యామ్నాయంగా మరో వ్యవస్థకు దారి చూపని సాహిత్యం నిష్ప్రయోజనమని దిగంబర కవులు మొదటినుండి నమ్ముతున్నారు. అందువల్ల దిగంబర కవిత్వానికి సర్రియలిజాన్ని అంటగట్టే మహాశయులను ఈ యధార్థాన్ని గమనించమంటున్నారు.

పెట్టుబడిదారి వ్యవస్థ సృష్టించిన వ్యక్తి మానసిక అశాంతికి— అసంతృప్తికి ఆదేశాల (ముఖ్యంగా అమెరికా) యువ సాహిత్యం కొన్ని ఇతర మార్గాలను—సూచిస్తున్నది.

పెట్టుబడిదారి వ్యవస్థ ఇచ్చే ద్వేషానికి మార్గాంతరం ఏమిటి?— ప్రేమ.

ఆ వ్యవస్థను సృష్టించే యుద్ధానికి మార్గాంతరం?— అహింస.

ఆ వ్యవస్థ నిలబెట్టుకోవాలనే సాంప్రదాయకమైన పద్ధతులకు మార్గాంతరం?— లైంగికస్వేచ్ఛ.

ఆ వ్యవస్థ కోరే నియమబద్ధమైన సమాజానికి మార్గాంతరం?— అల్లకల్లోలం.

ఆ వ్యవస్థ తయారుచేసే నాయకుల— మోసగాళ్లకు బదులు— అరాచకత్వం.


ఆ వ్యవస్థ నిర్మించే యాంత్రిక సమాజానికి ప్రత్యామ్నాయం?— పువ్వులు, ఆదిమ సంస్కృతి.

ఈ మార్గాంతరాలను బీట్నిక్కులు—హిప్పీలు తమ సాహిత్యం ద్వారా ప్రచారం చేస్తున్నారు. అక్కడి క్యాపిటలిస్టు వ్యవస్థ ఈ మార్గాంతరాలనే సినిమా తదితర ప్రచార సాధనాల ద్వారా ప్రోత్సహిస్తున్నది. తనకు ఏ విధంగాను హాని తలపెట్టని హిప్పీజీవన పద్ధతికి తోడ్పడుతున్నది. పలాయన వాదంలోకి బాధ్యతారాహిత్యంలోకి యువతరాన్ని తరిమి ఓటమిని నిస్పృహను— ఆగంతుక లక్షణాన్ని (Alienated) తత్వం కింద ప్రచారం చేసే బీట్నిక్కు సాహిత్యం పై సూచనలను కొత్త ప్రపంచానికి మెట్లని భ్రమ

పడుతున్నది. పాలక వర్గాల మూలాన్ని ఛేదించని ఏ మార్గమైనా నిష్ప్రయోజనమే అనే సత్యాన్ని వారు గ్రహించడంలేదు. అయితే ఇర్విన్ సిల్బర్ ఆశిస్తున్నట్టు ఈ మార్గాంతరాలన్ని రాబోయే విప్లవ మార్గాన్ని ప్రశస్తం చేయవచ్చు. ఈ బీట్నిక్కుల ఆధునిక మానవుని (పెట్టుబడి దేశాలలోని)నిస్సహాయతను హాస్యాస్పదమైన ఉనికిని ఒకవిధంగా జీవించి చూపెడుతున్నారు. కాని అది ఆ వ్యవస్థ కళ్లు తెరిపించే బదులు వినోద సాధనమై కూర్చుంది. అయితే అక్కడే 'బ్లాక్ పాంథీర్' (Black Panther) అనే నీగ్రోయువకుల విప్లవ ముఠా ఆచరణరీత్యా ఆ రోగగ్రస్తమైన శ్వేత అమెరికన్ యాంత్రిక సమాజానికి మార్గం చూపెడుతున్నది.

ఒక రకంగా పెట్టుబడిదారి వ్యవస్థను, ఆ సంస్కృతిని, వాటి ప్రత్యామ్నాయ మార్గాలను భారత దేశం అనుకరిస్తున్నది. అందువల్లే పై అంశాల ప్రస్తావన తేవడం జరిగింది.

చారిత్రకమైన అవసరాల కొలిమిలో కాలి ఈ నాటితరం నూతనోత్తేజాన్ని పొందుతూ వుండక తప్పదు. ఈనాడు అభ్యుదయ దృక్పథంగల పార్టీలు చీలిపోవడంవల్ల ఫాసిస్టుతత్వంగల పార్టీలు బలాన్ని పుంజుకుంటున్నాయి. ఈ స్థితిలో చాలామంది యువకుల మెదళ్లను శూన్యం ఆవరించి వుంది. ఈ శూన్యాన్ని 'ప్రత్యేక తెలంగాణా', 'శివసేన' లాంటి ఆత్మహత్యా సదృశ్యమైన ఉద్యమాలు పూరించుతున్నాయి. నాయకత్వం ఫ్యూడల్ మనస్తత్వంగల వ్యక్తుల చేతుల్లో, ప్రాంతీయ సంకుచితత్వంలోపడి ఒక ప్రాంతం యువకులను సులభంగా రెచ్చగొట్టి దోపిడి వర్గాల పెత్తనానికి అవకాశం ఇస్తున్నది. క్రమంగా ఫాసిస్టు పద్ధతులతో అభ్యుదయ దృక్పథంగల వర్గాలను నోరు మూయించి ఫ్యూడల్ పాలనను విధించి దేశాన్ని మళ్లీ 30-40 సంవత్సరాల వెనక్కి తోయాలని తీవ్రంగా యత్నిస్తున్నది. అందువల్ల 'నూతన ప్రపంచాన్ని' నిర్మించే విప్లవాత్మకమైన ఆలోచనా విధానాన్ని అవగాహన చేసుకొని జరుగుతున్న పోరాటాన్ని గుర్తించడం సాహిత్యకంగా ఈనాటి అవసరం.



గ్రంథ విమర్శలు

రవీంద్రుని నాటకాలు

(ద్వితీయ సంపుటము)

(రారాజా, పోస్టాఫీసు, ముక్తధార, రక్తకరవీరం; అనువాదకులు : శ్రీ అబ్బూరి రామకృష్ణారావు; ప్రకాశకులు : సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ—1; డెమీ 1/8 పేజీలు 308. వెల రు. 8 లు.)

ఆధునిక భారతీయ సాహిత్యరంగా లన్నిటిలో ఆదర్శవంతులైన యువకులను స్థవిరులను నిన్న మొన్నటివరకు సమానముగా ఆకర్షించిన మహాకవి రవీంద్రుడు. తాత్కాలిక వ్యామోహాలకు వశంవదులు కాని సహృదయుల నందరినీ ఏకాలానసైనా ఆకర్షించి ఆనందపరచగల కవీశ్వరు డాయన.

ఆయన అనేక ఖండకావ్యాలు, చిన్నకథలు, నవలలు, చిన్న పెద్ద రూపకములూ నిర్మించినాడు. బాగా 'వయస్సు మళ్లిన తర్వాత కూడా నూతన వధూవరులకు 'మధూక పుష్పములు' అను కావ్య సందోహము రచించి అందించిన నిత్య యౌవనుడు. మధూకపుష్పము (ఇప్పపువ్వు) భరత భూమిలో ప్రేమమధువుకు చిహ్నమగుటచే స్వయంవరములో వధువు మధూకమాలతో వరుని కంఠ మలంకరించుట ఆచారమని గుర్తుంచుకొనవలెను. వంగదేశములో కవి కెప్పుడూ ఇరవై యైదేళ్లే అనే వ్యవహార మున్నదని ఆయనయే తెలిపినారు. కవి దివ్యపురుషుడు కనుక అతనికి ఆ జన్మాంతము ఇరవై యైదేండ్లే, దేవతలకు వలె! రవీంద్రుల రచన లన్నిటిలో— వ్యాసములలో ఉపన్యాసములలో కూడా—నిత్యయౌవనము గల ఆయన కవితా ధర్మమే ప్రాధాన్యము వహిస్తుంది.

ఆయనకు సహజమైన ఈ కవితాశక్తి మంత్రద్రష్టలైన వేదర్షుల వద్దనుంచి సంక్రమించినది. అది వంగదేశములోని, భిక్షుక పాఠకుల గీతాశ్రవణముతో రూపుకట్టినది. స్వల్పపరిధిలో రాణించిన ట్లది విస్తృత పరిధిలో రాణింపదు. అందువల్లనే ఆయన నవలలకంటె చిన్నకథలు ఎక్కువ హృదయంగమమైనవి. దీర్ఘకావ్య రచన చేసినట్లు తోచదు. ఆయన నాటకాలలో మాత్రము కొంతవరకు విస్తృత పరిధి సాధించి సఫలీకృతుడైనాడు.

ఇంతకుపూర్వము ఈ నాటకాలను ఆంగ్లములో చేసిన స్వేచ్ఛానువాదాలు మాత్రమే చదివి ఆనందించిన ఆంధ్రులకు సరాసరి వంగభాషనుండి అందించిన ఈ నాటక సంపుటి ఎంతో సమ్మోదావహముగా ఉన్నది. వీనిలో తరుచుగా వచ్చే పాటల వంగమూలములు అనుబంధములో ఆంధ్ర లిపిలో ముద్రించుటచేత వాటిని చదివి పాడుకొని వాటి గేయ మాధుర్యము కూడా అనుభవించే అవకాశము లభించినది. అవి సంస్కృత పద ప్రచురముగా ఉన్నందున ఆంధ్రీకృత గేయములతో కలిపి చదివినప్పుడు వంగభాష రానివారు కూడా మూలభావము గ్రహించే వీలు కలుగుతున్నది.

రవీంద్రుని నాటకములు తరుచుగా స్వేచ్ఛను ఉద్బోధిస్తూ ఉంటవి. పోస్టాఫీసులో అమాయిక బాలుని స్వేచ్ఛా పిపాస ఈ దేహమునుండి విముక్తిగా పరిణమిస్తుంది. ఇది చాలా ప్రసిద్ధి పొంది జనసమ్మతి సంపాదించిన చిన్న నాటకము. ఐనా ఇందులో దేహత్యాగముకంటె వేరుగా ఆశయసిద్ధి ఏమీ లేనందున ప్రౌఢపాఠకులకు విచారమే కాని సంతృప్తి కలిగిరపదు.

రక్తకరవీరములో యాంత్రికశక్తి అనురత్వానికి ఆహుతి కావడముతో ఆ శక్తిని బట్టబయలు చేయడము కనిపిస్తుంది. నేటి కాలములో జగద్వ్యాప్తమై విలయతాండవానికి ఉన్ముఖముగా లోకమును యాత్ర సాగింపజేస్తున్న పారిశ్రామిక వ్యవస్థ రవీంద్రుని సుకుమార హృదయానికి

ఎట్టి వేదనను నిరాశను నిస్పృహను కలిగించినదో అది ప్రతిబింబిస్తున్నది.

జగన్మంగళకరమైన స్వాతంత్ర్య సిద్ధిని సంపూర్ణ స్వరూపములో చిత్రించినది 'ముక్తధార'. స్వతంత్రమై తాను ప్రవహించే అన్నిప్రదేశాలకూ సమానంగా సుఖసంపదలు ప్రసాదించే గొప్ప సెలయేటి ప్రవాహాన్ని, స్థపతి ఒకడు, తాను నిర్మించిన మహాయంత్రము సహాయముతో బంధింపజేసి, దిగువనున్న శివతరాయి వాసులకు నీరు లేకుండా చేసి బాధించి రాజును సంతోషపెడతాడు. కాని సర్వప్రజల క్షేమము కోరే యువరాజు దానిలో ఛిద్రము కనిపెట్టి ఆనకట్టను పగుల గొట్టి ఆ మహాప్రవాహానికి తాను బలి ఔతాడు. యువరాజు సాహస చర్యవల్ల ముక్తధార యథా ప్రకారము సార్థకనామ ఔతుంది. పరపక్షము మీాద విజయము సాధించుటకు మాత్రమే ఉద్దేశింపక, సర్వజగచ్ఛ్రేయస్సు ఆకాంక్షించి స్వాతంత్ర్య సిద్ధికి పరితపించి వ్యవహరించే పుణ్యాత్ముల కందరికి సర్వదేశాలలో సర్వకాలాలలో ప్రతీకగా నిల్వగలుగునట్లు యువరాజును అద్భుతముగా చిత్రించిన ఉత్తమ నాటిక 'ముక్తధార'. వైష్ణవ సంప్రదాయములచే ప్రభావితుడై పరిణతుడైన రవీంద్రకవి ఈ నాటకమును భైరవభక్తులు పాడిన శంకరగీతముతో ముగించుట గమనింప దగినది.

"జయ భైరవ! జయ శంకర!
జయ జయ ప్రళయంకర!

* *

"వజ్రఘోష వాణీ
రుద్ర శూల పాణీ
మృత్యుసింధు సంతర
శంకర! శంకర!"

ఈ గీత మంతా ఆంధ్రానువాదములోనూ వంగమూలములోనూ ఒకే విధముగా ఉండుట ప్రత్యేకముగా గమనింప దగినది. అది వంగభాషా అనవచ్చు, ఆంధ్రభాషా అనవచ్చు. హిందీ, గుజరాతీ మహారాష్ట్రము, కన్నడము, మళయాళము, బహుశః తమిళము కూడా, అనవచ్చు. సంబోధనాంతాలు కొన్ని కించిత్తు మార్పు చేస్తే సంస్కృతమే అవుతుం దది! భారతీయభాషల కన్నిటికి సంస్కృత మీా నాటికీ ఎంతగా మూలభాషగా ఉన్నదో బుద్ధిమంతులకు సందర్భవశాత్తుగా దీనివల్ల విదిత మవుతుంది.

రవీంద్రుని రచన లన్నిటిలో మార్మికత్వము ప్రాధాన్యము వహిస్తుంగి. అది 'రారాజు'లో ప్రత్యక్ష మవుతుంది. ఇందులో రారాజు భగవంతునికే ప్రతీక. ఆయన కనబడడు. కలడు కలండనెడు వాడు కలడో, లేడో అని సుదర్శనారాణికే సందేహము కలుగుతుంది. ఆయన చీకటిలో గాని కనబడడు. ఆయన వికృతభయంకరాకారు డేమో అన్న అనుమానము కలుగుతుంది. అయినా బహుసైన్యబలంతో వచ్చిన రాజులంతా ఆ కనబడని రాజుచేత నిర్జితు లౌతారు. చివరి వరకు ధైర్యముతో ప్రతిఘటించిన కాంచీ రాజే తుదకాయన కరుణావిశేషానికి పాత్రు డౌతాడు. సుదర్శనారాణి మాయరాజు మాయా సుందర రూపానికి ముందు విమోహితురాలైనా తుదకు పశ్చాత్తప్తయై రారాజుకు చరణదాసి ఔతుంది. రారాజు రూపము వికృతమూ కాదు, సుందరమూకాదు. అది అనుపమము! ఈ విషయము ఆమె అనుభవానికి వచ్చిన తర్వాత రారాజు అంధకార గృహ ద్వారములుపూర్తిగా తెరిచి వేసి బాహ్య ప్రపంచంలోకి, వెలుగులోకి రమ్మంటాడు. అప్పుడు సుదర్శనారాణి పలికే ఈ మాటలతో నాటకము ముగుస్తుంది.

"వాచ్చేముందు, నా అంధకార ప్రభువుకు, నానిమ్మర, భయానక ప్రభువు కోమారు ప్రణమిల్లుతాను.".

భగవత్స్వరూప భావన చేయగల వారి కీనాటకము రవీంద్రునిరచనలలో అనుపమమై హిమాలయ శిఖరాలవంటి ఆయన రచనలలో కాంచన గంగా శిఖరమువలె ప్రకాశిస్తుంది.

ఉత్తమ భాషాంతరీకరణ మార్గమవలంబించి శ్రీ రామకృష్ణారావు ఈ అనువాదాలు చేసినారు. వంగభాష రాని ఆంధ్రులు, రవీంద్రుని మూల రచనలు చదివి అర్థము చేసుకోగలవారు పొందే కావ్యా

వందానికి ఎంత సన్నిహితమైన ఆనందము సాధ్యమో అంత ఆనందము అనుభవించేట్లు ఈ అనువాదాలు రూపొందించినారు. అనువాదము కేవలస్వతంత్ర నాటకమువలె ఉండవలెననే వ్యామోహానికి వశులు కాక మూలానికి సాధ్యమైనంత సన్నిహితముగా ఉండేందుకు ప్రయత్నము చేసినారు. అందువల్ల కొంత వంగభాషాచ్ఛాయ రాక తప్పదు. అట్టిది లోపము కాక అలంకారమే అవుతుంది.

ఇందులో శిష్టవ్యావహారిక మెంతో జాగ్రత్తగా ప్రయోగించినారు. నూటికి కోటికి ఎక్కడనో తప్ప ప్రమాదములు దొర్లలేదు.

శబ్దరూపములకు వర్ణరూపము ఇయ్యడములో ఇందులో ఒక విస్పష్టమైన పంథా త్రొక్కినారు. కొన్ని ఉదాహరిస్తాము:

"యీ యింట్లో వొక్క నాడూ దీపం వెలగదు....

"యెక్కడైతే మాత్రం అంధకార మెందుకుండాలి?

"యీ యిల్లు కట్టింది...

"యేవీ అర్థం కావు..

"వొక్కరూ స్పష్టంగా జవాబు చెప్పరు....

"యింటి దాకా వొచ్చి...

"ఒక్కసారి కాదు.

"యేమండోయ్!

"యెందుకండీ?

"యెటు పోవాలి...

"ఎక్కడికి పోయేదారి?

"యిక్కడా, అన్ని దార్లూ వొకటే— యెటు పోయినా సరే.

"అయితే వొస్తున్నా రన్నమాట..."

శిష్టుల ఉచ్చారణ కేవలము అచ్చూ కాదు హల్లూకాదు. అట్టి స్థలాలలో శ్రీరామకృష్ణారావు హల్లును అభిమానించినారు. అయితే మధ్య మధ్య వారు అచ్చునే అప్రయత్నంగా ప్రయోగించినారు.

"ఒక్కసారి..... ఎక్కడికి" ఇత్యాదిగా లోకములో ఉన్న ఉచ్చారణ సందేహాస్పదంగా ఉన్నప్పుడు మూల పద స్వరూపమునే గ్రహించడము భావ్యమని సూచిస్తున్నాము. 'యెక్కడికి' అనక 'ఎక్కడికి' అనీ, 'వొచ్చాను' అనక 'వచ్చాను' అనీ, 'వున్నాను' అనక 'ఉన్నాను' అనీ 'వొచ్చాడు' అనక 'వచ్చాడు' అనీ— ఇత్యాదిగా వ్రాయడము యుక్తతర మనిపిస్తుంది.

"యకారంబును వు వూ వొ వోలును దెలుఁగు మాటలకు మొదట లేవు" అను సూరి సూత్రమును ఉల్లంఘించుటే వ్యావహారిక భాషాభిమానుల ఆదర్శము కాదు గదా! గ్రంథమంతా ఇట్టి ఉల్లంఘనతో నిండి ఉండడము శిష్టవ్యవహారభాష నభిమానించే మాబోంట్లకే ఎబ్బెట్టుగా కనిపించినది.

గ్రంథానికి ముందు 'రవీంద్ర నాటకాల సంక్షిప్త సమీక్ష,' శ్రీ ప్రమథనాథ బిశి వ్రాసినది ఆంధ్రీకరించి చేర్చినారు. ఆ సమీక్ష ఎంతో సున్నితమైనది. అందులో ఈ నాటకప్రదర్శనములను గూర్చి వ్రాసిన ఈ మాటలు మన విమర్శకులును, నాటకకర్తలును, ప్రదర్శకులును గమనింపదగినవి:

"రవీంద్రుడి నాటకా లప్పు డప్పుడు వ్యాపార రంగస్థలాల మీద ప్రదర్శిస్తూ వొచ్చారు...కొన్ని నాటకాలు తాత్కాలికంగా మాత్రమే ప్రేక్షకుల ఆదరానికి పాత్రమయినాయి. అయినా వ్యాపార రంగస్థలాల నాటక ప్రయోగ పద్ధతికీ రవీంద్ర నాటకాలకూ యెన్నడూ పొత్తు కలియలేదనే చెప్పాలి. యెందుకని? బహుశా ప్రేక్షకులు అలవాటు పడలేదేమో?

"నాటకంలో వున్న సాహిత్య మూల్యాన్ని అప్రధానంగా భావించే విమర్శకు లెందరో వున్నారు. వాళ్ల అభిప్రాయంలో కేవలం ప్రేక్షకుల్ని రంజింప చేయడమే నాటకాల యేకైక ప్రయోజనం. యీ అభిప్రాయాన్ని ఆమోదించటానికి వీల్లేదు. నాటకం ముఖ్యంగా సాహిత్యం..."

ఆంధ్రభాషలో ఈ కాలములో ఎన్నో నాటకాలు ఉత్తమ సాహిత్య మనదగినవి పుట్టినవి.

పరిమితమైన మన రంగస్థలము మీద, పూర్ణ పరిపక్వము పొందని ప్రేక్షకుల సమక్షములో రాణించ వనుభావముతో మన విమర్శకులు అట్టి ఉత్తమ సాహిత్యాన్ని 'ప్రదర్శన యోగ్యములు కా'వని ఒక్క మాటతో త్రోసి వేస్తున్నారు. అందువల్లనే ఆంధ్ర భాషలో పుట్టిన ఉత్తమ నాటికలు ప్రసిద్ధికి రావడము లేదు. ఉత్తమ నాటకాలు ప్రధానముగా సహృదయవరేణ్యుల హృదయరంగము మీదనే ప్రదర్శన యోగ్యములని గుర్తించినప్పుడే మన నాటక రచన ఉత్తమ స్థాయి నందుకోగలదని సూచిస్తున్నాము.

విశ్వసాహిత్యములో ఉన్నతస్థాన మలంకరించే ఈ నాటకాలను మన సాధారణ రంగస్థలం మీద ప్రదర్శించి మన సాధారణ ప్రేక్షకులను ఆకర్షించ లేమనడం అతిశయోక్తి కాదు. దీనిని బట్టి మన నాటకరంగ స్థలమూ, ప్రదర్శనా పద్ధతులూ, ప్రేక్షకుల స్థాయి ఎంతగా పెరుగవలసి ఉన్నదో బుద్ధిమంతులు నిదానముగా మననము చేయుదురు గాక!

అకాడెమీవారి పుస్తకాలు ఎక్కువగా ఈ విధమైన బైండింగుతోనే వెలువడుతున్నందున ఆ విషయము ప్రస్తావింపవలసి వచ్చినది. గట్టి అట్ట మీద, కాలికో పూర్తిగా గాని సగము కాని లేకుండా, అంతా కాగితమే వేసి తయారు చేసినారు. ఎంతో ఆకర్షకముగా ఉన్నది. పుస్తకప్రేమగల మేము గ్రంథ మొక్కసారి చదువునప్పటికే, వెనుక భాగము అంగుళము మేర పగిలిపోయినది. నాలుగు కాలాల పాటు నిలిచి, లైబ్రరీని అలంకరించే ఇటువంటి ఉత్తమ గ్రంథాలు నాలుగు కాలాల పాటు నిలిచే బైండింగుతో అందిస్తేనే, పెట్టిన రు. 8 ల ఖరీదు న్యాయమనిపిస్తుంది.

గ్రంథము అచ్చూ, కూర్పు తీరు తెన్నులూ, అందముగా వున్నవి.

రవీంద్రుని నాటకాలలో ఉత్తమమైన ఈ నాలుగింటిని చక్కగా అనువదించిన శ్రీ రామకృష్ణారావును, ఇటువంటి విందు ఆంధ్రపాఠకులకు చేకూర్చిన సాహిత్య అకాడెమీవారిని హృదయపూర్వకముగా అభినందిస్తున్నాము.

శ్రీ శుక్లపక్షః

(గ్రంథకర్త : శ్రీ ముదిగొండ జ్వాలాపతి లింగశాస్త్రి; ప్రకాశకులు : గ్రంథకర్త, ఈమని (గుంటూరు జిల్లా); క్రౌను 1/8 పేజీలు 70; వెల : రు. 1-25.)

శ్రీ ముదిగొండ జ్వాలాపతిలింగశాస్త్రిగారు శతావధానులు, జ్యోతిర్విద్యావిశారదులు, సంస్కృతాంధ్రములలో అనేక గ్రంథములు రచించి ప్రచురించిన విద్వత్కవులు. ఇది సరలము సలక్షణము ఐన సంస్కృత భాషలో రచించిన లఘుకృతుల సంపుటము. ఇందులో పుష్పాఞ్జలిః, విజ్ఞప్తిః, శ్రీ శుక్లపక్షః అను శీర్షికల తర్వాత వరుసగా కాళిదాసు, భవభూతి, కాళిదాస భవభూతులు, దణ్డి, భోజరాజు, జగన్నాథపణ్డితరాజు, విద్యానాథుడు, విశాఖదత్తుడు, సుబంధుడు, రాజా శ్రీహర్షకవి, శూద్రకుడు, మురారి, భారవి, బాణుడు, మాఘుడు, కవి శ్రీహర్షుడు, శ్రీ సంగమేశ్వరారాధ్యులు— వరుసగా ఆయా శీర్షికలలో స్తుతింపబడినారు. మొత్తము పదునారు మంది కవులను చంద్రుని షోడశకలామూర్తులుగా భావించి కవి యీ గ్రంథమునకు శుక్లపక్షమని నామకరణము చేసినట్లు తోచును. యావద్భారత మందును లబ్ధప్రతిష్ఠులైన తక్కిన పదునైదు మంది సంస్కృత కవిపుంగవులతోపాటు ఆంధ్రదేశములో మాత్రమే కొంత ప్రసిద్ధులైన పాపయారాధ్యులను నామాంతరముగల సంగమేశ్వరారాధ్యులను గూడ నిందులో చేర్చుట కవికి గల ఆంధ్రాభిమానమునకును అందును శివభక్తుల యందు గల ఆత్మీయతకును నిదర్శనము.

ఈ క్రింది పద్య మెంతయు హృదయంగమమైనది.

"త్వయి వర్షతి పూర్ణకౌముదీం
ప్రమదాలోకనతత్పరో జనః
ప్రమదానయనే ష్వలం త్వయా
నిహితా కిం తవ కౌముదీనిధిః"

ఇట్టివి గ్రంథమం దంతట నెన్నియో కలవు.

గ్రంథ విమర్శలు

సంస్కృత భాషయందు మంచి యధికారము గల యీకవి గ్రంథములో నక్కడక్కడ యతి విషయమున విరమణము పాటింపక పోవుట సహృదయ పరిగ్రాహ్యము కాదని సూచించుచున్నాము. ఈ విషయమునే శ్రీ సూరి రామకోటిశాస్త్రి ప్రభృతులు చేసిన పరిచయములో "ఛన్దోవిషయేషు విమర్శకవరైః రేఖిః కాశ్చన ఆన్ధ్ర భాషా మర్యాదాః ప్రవేశితాః'' అని మృదువుగా సూచించినట్లు తోచుచున్నది. ఆంధ్రేతరులు అట్టివానిని ఛందోదోషములుగా పరిగణించుట కవకాశమున్నది గనుక అట్టివానిని పరిహరించుట ఉచితమని సూచన చేయుచున్నాము.

"జన్మనా భారతీయత్వం వాచా సంస్కృత భారతీ
వర్త్మనా శ్రుతిసంస్కారో నాల్పస్య తపసః ఫలమ్''

అని కవి సూచించినట్లు వారి తపఃఫలమువలన వారు విజ్ఞప్తిలో నాకాంక్షించినట్లు

"విద్వాంసః కవయ స్తథా కరుణయా
మా మ్రాదియన్తాం కృతిమ్''

కవులు విద్వాంసులు నీకృతి నాదరింతురు గాక!

—శ్రీ నోరి నరసింహ శాస్త్రి.

లేడీ డాకరు

(శ్రీ నండూరి విఠల్. నవల. ఎమెస్కో ప్రచురణ 46.)

"వ్రేరితలలు వేసిన—వేస్తున్న (మనదికాని) ఈనాటి నవీన నాగరికతకూ— ఆ నాగరికతను కరగించి వంటికీ జీవితానికీ పూసుకుంటున్న జీవితాలకూ— అరుణ జీవితం ఒక విమర్శ. ఒక దర్పణం''. ఈ మాటలు, ఇటువంటి చాలా మాటలు నవలలో అనేక పర్యాయాలు ఎదురవుతాయి. అరుణ జీవిత పతనానికి ఆధునిక నాగరికత మూలహేతువు అని నవల సారాంశం.

నాగరికత మనది అయినదీ, మనది కానిది అంటూ వుండదు. సంస్కృతి మనది అయిందో కాందో వుంటుంది. చాలామంది ఈ పదాల విషయంలో పొరపాటు పడుతున్నారని ఆచార్యుల అభిప్రాయం. మానవజీవిత నైతికోన్నతి లేదా పతనం నాగరికత కంటే సంస్కృతి మీద ఎక్కువ ఆధారపడుతుంది. నాగరికత బాహిరమయింది. సంస్కృతి ఆంతరమయింది. సమాజం వెలుపలి వేషం నాగరికత. ఆంతర తేజస్సు సంస్కృతి. ఆంగ్లేయులు మనల్ని పరిపాలింపకపోయినా, మన మిప్పుడున్న నాగరికతకు తప్పకుండా చేరుకొనే వాళ్ళం! తెల్లవాళ్ళు పరిపాలించని దేశాలలోనూ, మనం ఏది నాగరికత అనుకొంటున్నామో అది వుంది. నాగరికత మనిషిని త్వరగా లొంగదీసుకొంటుంది. లొంగిపోవటం, పోకపోవటం హృదయ సంస్కార బలంమీద ఆధారపడి వుంది. వ్యక్తి సంస్కారం, సంఘ సంస్కారం, జాతి సంస్కారం పటిష్ఠమయిన పునాదులమీద నిర్మింపబడకపోతే, ఆంతర దీప్తి తక్కువయితే, కల్లోల కార్కశ్యం సంస్కృతి అంతరంగా సవాలు చేస్తుంటే, నాగరికత మనిషిని సమాజాన్ని జాతిని లొంగదీసుకొన్నంత తొందరగా మరేది లొంగదీసుకోలేదు.

ఈ నాగరికత ప్రభావంవల్ల సమాజం మత్తుపానీయాలు సేవిస్తూ వుంది—మన ప్రాచీన నాగరికతలో మత్తు పానీయాల సేవనం లేదా? ఈ నాగరికతవల్ల చెడ్డ అలవాట్లు వస్తాయను కొంటే, సిగరెట్టు తాగుతారు కొందరు. అలవాటు చెడ్డదే కావచ్చు! అందరూ తాగరేం? ఈ నాగరికత లేనప్పుడు చుట్ట తాగలేదా జనం?

ఈ నాగరికత మనిషిని చెడ్డవాణ్ణి చేయలేదు. సమాజాన్ని పతనం చేయలేదు. మనిషిలో పతనోన్ముఖత, కొందరిని చూచి అయినా లేదనటం సాధ్యం కాకపోవచ్చు. అది నాగరికత ప్రభావం కాదు. ఆత్మప్రభావం. ఆంతర చైతన్యం, బాహిర చైతన్యాన్ని గౌరవిస్తే పరాభవిస్తే మంచిచెడ్డలు పుట్టుతాయి.

అరుణ పతనమయింది. ఎందుకు? నాగరికత వల్ల? అనుకొంటే శ్రమలేదు. నేరం ఎవరి మీదనో మోపి నాజూకుగా తప్పించుకొనే పద్ధతి అది. ఆత్మబలం వుండి, బాగు చేసుకోవాలన్న పట్టుదల ఉండి పరికిస్తే మన ఆత్మగతంగా, సమాజాత్మ

గతంగా, జాత్యాత్మగతంగా పైపై మెరుగులకు అశాశ్వత సుఖాలకు లొంగిపోయే గుణం వుందను కొంటే, తీవ్ర ఆవేదన కలిగి, సంస్కరణోద్యమం ప్రారంభం కావచ్చు.

నాగరికత ఏం చేస్తుంది పాపం! విద్యుత్తు లాగా సరీగ్గా స్విచ్ ఆన్ చేసుకొంటే వెలుతురు నిస్తుంది. ప్లగ్ పీకేసి అందులో వేలు పెడితే షాక్ కొడుతుంది. చంపుతుంది. వరద లాగా, వూరు కొంటే వూరూ వాడా దులుపుకొంటూ పోయి సముద్రంలో పడుతుంది. కాదంటే ఆనకట మహా పటిష్ఠంగా కట్టుకొంటే క్షేత్రాలు సుక్షేత్రా లవుతాయి. ప్లగ్ పీకి వేలుపెట్టటం ఊరికే వుండటం మానసిక వ్యాపారాలు. మానసిక స్థాయి పెరిగితే నాగరికత బానిస. మానసిక సంస్కారం లేకపోతే నాగరికత యజమాని. మనం మానసికంగా ఉన్నతులం కావాలి గానీ, నాగరికత నాశనం చేసిం దని బాధ పడకూడదు. నాగరికతను ఎప్పుడూ సంస్కారానికి బానిసను చేసే వుంచాలి.

అరుణ పతనమయింది! ఆమె పతనానికి ఆమే బాధ్యురాలు. ఎవరూ, ఎవరినీ ఏమీ అనలేరు. ఆమె ఈ లోకంలో ఒక శతాబ్దం ముందు, పుట్టిందేమో ననిపిస్తుంది. ఆమెకు మరణశిక్ష రావచ్చునని అందరూ అనుకొంటారు. అప్పుడు బాధ వుండేదికాదు. మరణశిక్ష పడకపోవటమే బాధ! అరుణ జీవితం అందమయిన అమాయిక బాధ!

ఆనంద్ మరణం పాఠకుల గుండెలు పిండు తుంది. అతను మరణించటం ఎవరికీ యిష్టం వుండదు! ఇష్టంలేని దైవ సృష్టిలోలాగా మానవ సృష్టిలోనూ చాలా జరుగుతాయి. అంత మంచి తనం మూర్తికట్టిన ఈ మనిషి వంటి వాళ్లు, మనుష్యుల్లో అరుదుగా, దేవతల్లో అధికంగా వుండ వచ్చు.

పురుషుడికి స్త్రీ అర్థంకాని కసికి అరుణ పాత్ర చిత్రీకరణ.

నవలలో ఒకటిరెండు విషయాలు పూర్వాపర సంబంధం కోల్పోయాయి. అరుణ ఆఫ్రికా పోయిం దనీ పోలేదనీ చెబితే ఏది నిజమని నమ్మేటట్లు? బాబుకు అరుణ చిన్నతనంలో తెలుసునని మొదట్లో పాఠకులకు తెలియదు. తెలియదనే అనిపిస్తుంది. చిన్ననాడు బాబును బాబు అని అరుణ పిలచేదని మధ్యలోనూ తెలియదు. ఆ తర్వాత ఎప్పుడో తెలుస్తుంది. ఈ నవల అరుణ తనజీవితం న్యాయాలయంలో చెప్పుకొన్నట్టుగా కాక, జరుగు తున్నది జరుగుతున్నట్లు ఆమే సంఘటనలు వ్రాసి వుంటే ఉత్సుకత పాఠకుల్లో చాలా ఎక్కువ అయ్యేది.

రచయిత నవలలో చాలా పదునయిన వచనం వ్రాయటం చూడవచ్చు. ఎవరయినా నవల జ్వరం తొందరగా చదువుతారు. సాంఘిక సమస్య పరి ష్కారాపేక్షితంగా వున్నా సమస్యకోసం చదువుతారు. ఆలోచింపజేసే నవల. అందరూ చదవదగింది.

వెలుగులో వేది

(శ్రీ గంధం యాజ్ఞవల్క్యశర్మ. నవల. ఎమెస్కో ప్రచురణ. 57.)

చైతన్య దృష్టితో,

భవాని కూలంకషంగా ప్రవహించే సెలయేరు.

కృష్ణమూర్తి చుట్టూ గట్లు చూచుకొంటూ నిర్బంధింపబడి నిలిచే సరస్సు.

సెలయేరులో పశుపక్ష్యాదులు ఎప్పుడయినా కొట్టుకుపోవచ్చు. దానివల్ల పొలాలలో బంగారం పండవచ్చు.

సరస్సులో నిశ్చింతగా నీళ్లు తాగవచ్చు. తెచ్చుకోవచ్చు.

అది సంచలనం! ఇది స్తబ్ధం!

తేజో దృష్టితో,

భవాని పేరుకొన్న చీకటి.

కృష్ణమూర్తి సాంద్రమయిన వెలుతురు.

చీకటికి వెలుతురు అవసరమే! వెలుతురు శోభించటానికి చీకటీ కావాలి!

ఈ రెండూ కలుసుకొనేది రెండు సార్లే.

ఉదయం సాయంకాలం. ఒకసారి వెలుగు

వస్తూ వుంటే చీకటి దూరమవుతూ వుంటుంది. మరొకసారి చీకటి వస్తుంటే వెలుతురు వెళుతూ వుంటుంది.

ఎప్పుడో ముహూర్తమాత్రంగా అవి కలుసుకొంటాయి, కొంచెం నల్లగా కొంచెం తెల్లగా అది సంధ్యా సంఘర్షణ!

తొలి సంజ కళాశాల. భవాని కృష్ణమూర్తికి చేరువయింది. పెళ్లయింది. క్రమక్రమంగా దూరమయ్యారు.

మధ్యాహ్న మయింది. విడిపోయారు.

మలిసంజ మద్రాసు. క్రమంగా దగ్గరయ్యారు. వెలుగు చీకట్లు కలిశాయి. ఆక్షణం కొన్ని సంవత్సరాలుంటుంది.

భవాని కాలేజీలో కృష్ణమూర్తిని గౌరవించింది. జాలి పడింది. పెళ్లి చేసుకొంది. పిల్లతల్లయింది. ట్యూషన్లు చెప్పసాగింది. ప్రవేటుగా ఎం. ఎ. పాసయింది. భర్తచేత ట్యూటోరియల్ కాలేజీ పెట్టించింది. ప్రిన్సిపాల్ అయింది. భవనాలు కట్టించింది. భర్తను పోగొట్టుకొంది. పశ్చాత్తాప పడింధి.

కృష్ణమూర్తి భవాని ప్రేమకు అర్హుణ్ణి కాననుకొన్నాడు. ఆలోచించుకో మన్నాడు. పెళ్లి చేసుకొన్నాడు. నిశ్చింతగా, నిశ్చలంగా బ్రతకటం నిశ్చయంగా గలవాడు. భార్య ప్రిన్సిపాల్ అయిన చోట అసోసియేట్ ప్రిన్సిపాల్‌గా, ఆపైన టీచర్‌గా, ఆతర్వాత ఎక్స్ టీచర్‌గా, ఇంకో ట్యుటోరియల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, ఆధ్యాత్మిక చింతన పూర్తిగా కలవాడుగా అయిపోయాడు. చివరకు భార్యను కలుసుకొన్నాడు.

వీళ్లద్దరి మధ్య అసహనం ఎందుకు పెరిగి పెద్దదయింది! ఇది పెద్ద సమస్య!

ఎందరు హెచ్చుతగ్గుల స్థాయి, మనస్సు ఆలోచన కలవాళ్లు భార్యాభర్తలుగా ఉండటం లేదు. వీళ్లద్దరికి ఏమొచ్చింది?

మనస్తత్వవేత్తలు శృంగార జీవితం ఆనందంగా ఉన్నంతవరకు సంసారం చక్కగా సాగుతుందంటారు. వీళ్లద్దరిమధ్య కారణం అదేనేమో అనిపిస్తుంది. రచయిత ఇంకొంచెం ఆలోచింపవలసింది! భవానిలో కారణంలేని ఎగుర్లాట పాఠకులకు అర్థంకాదు.

స్త్రీ సహజంగా గొప్పలకు పోతుంది. పురుషులూ పోతారు. చైతన్య పదార్థం గొప్పదనం కోరుకొంటుంది. మరి కృష్ణమూర్తి ఎందుకంత స్తబ్ధంగా వుంటాడు. కొందరు, ఆ లోకం కోసం ఈలోకందృష్టి వదిలి నీరసంగా వుండవచ్చు. అంత మాత్రాన భవాని అతిశయపడుతుందా?

రావు లేకపోతే భవాని అంతదూరం పెడసరంగా పోయేదికాదు. రమ లేకపోతే మళ్లీ మార్పు వచ్చేది కాదు. తాగుడు వ్యభిచారం కూడబలుక్కొనివస్తే ముద్రితుడయిన రావు ఆకలికి ఏడ్పుకు భవాని బలి కాకపోవటం, లొంగిపోకపోవటం గొప్ప వింత! ఆమె అలా వుండటం పాఠకులకు నచ్చుతుంది. వాస్తవంగా జరుగుతుందా? ఆలోచింపవచ్చు.

ఎంత స్తబ్ధుడయితేమాత్రం తను గాఢంగా ప్రేమించే భార్యను పరాయివాడి ఎదుట 'మీాయిష్టం' అంటూ వదిలిపోతాడా కృష్ణమూర్తి? అంతదూరం వచ్చాక కూడా వూరుకొంటాడా! ఆధ్యాత్మిక చింతన కలవాడు లోకంలో మనిషిగా జీవించలేడు కాబోలు!

మహాకాంతిగల కృష్ణమూర్తిని చూడలేని భవాని, కళ్లు పోగొట్టుకొన్న భవాని, దీపంకాంతి వంటి రమను చూచి కాంతిని చూడటం నేర్చుకొని,

సూర్యకాంతివంటి కృష్ణమూర్తిని చూడటంకోసం ఆశపడి, పెంజీకటి కవ్వల వెలిగే పరమార్థ కాంతి దర్శనార్థం ఆశించే అబల దయనీయమయిన కన్నీటి కథ 'వెలుగులో వెలది'.

తను లేకపోతే పాప ఉండలేదని, గుంటూరులో ఉండలేని కృష్ణమూర్తి మద్రాసుపోయి అక్కడ పాపను వదిలి ఎక్కడికోపోవటం ఎందుకు? పాప రమ చేత చూడబడి కథ ముగింపుకు రావటానికా?

పాప వాళ్లిద్దరినీ ఒక్కచోటకు తేగలిగిన కాంతి—అంటే—గతాగత శృంగారం జీవితం. పాప లేకపోతే వాళ్లేమయ్యేవాళ్లో వూహించటం కష్టమే అవుతుంది.

చివరికి వాళ్లిద్దరూ—భవాని కృష్ణమూర్తి కలవటం నాటకీయంగా వుంది. పాప కావాలనుకొనే ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు సన్యాసుల్లో-ఒంటరిగా మావెంటనే—కలవటం ఖాయమనుకొనేవాళ్లు, పాప లేకపోతే పిచ్చిగంగర్లు ఎత్తుతుందని చెప్పేవాళ్లు, పాపను ఎలా వదిలిపోవాలనుకొన్నారు? అందుకే పోలేకపోయారు. సినిమాలోలాగా— రైలుపోవటం, మద్రాసు సెంట్రల్ స్టేషన్‌లో వాళ్లు నిలచిపోవటం— సరదాగా ముగుస్తుంది నవల!

రచయితకు ప్రతి క్షణమూ పాఠకులు—అన్ని తరగతులవాళ్లు—దృష్టిలో ఉన్నారు. పాఠకులచేత ఉత్సుకతతో ఈ నవల చదవబడుతుంది.

రచనలో కొంతవరకు జీవిత పరిశీలన నిక్షిప్తమయివుంది. సంభాషణలు సహజంగా బరువుగా ఉన్నాయి.

పాత్రల స్వభావాల విషయంలో అసహజం, సహజం మాట ఎలా వున్నా వ్రాసినంతవరకు చేసిన పరిశీలనలో శైథిల్యంవుంది.

రెండు భిన్న దృక్పథాల మధ్య సంఘర్షణ 'ఈ నవలకు ఆయువు పట్టు! ఆ సంఘర్షణ సృష్ట్యాది నుంచి సాగుతున్నదే! అందుచేత ఈ నవల హాయిగా చదువుకోవచ్చు.

—మనోరాణి.

కవిజనాశ్రయము

(సంగ్రహ వ్యాఖ్య)

(గ్రంథనామము:-కవిజనాశ్రయము. సంగ్రహ వ్యాఖ్యాత:—శ్రీ టి. భాస్కరరావు. ప్రతులకు:-- మహతీ గ్రంథమాల, గుంటూరు. వెల:—2—00)

నేడు విద్యార్థుల పాఠ్య గ్రంథముల నాధారముగా చేసికొని వెలువడు గ్రంథములు రెండు విధములుగా ఉన్నవి. (1) గైడులు (2) లఘు టీకలు లేదా సంగ్రహవ్యాఖ్యలు. గైడులన్నవి పరీక్షా పత్రముల దృష్టితో సమగ్రముగా వ్రాయబడి విద్యార్థుల కుపయోగపడుచున్నవనుట జగద్విదితము. ఇవి తమ పాత్రను సమర్థనీయముగా నిర్వహించుచు నాలుగు రాళ్లు చేసికొనుచున్నవి. ఇక లఘు టీకల పేరను, సంగ్రహవ్యాఖ్యల పేరను వెలువడు గ్రంథములు ఆ యా మూల గ్రంథములకు తగిన వ్యాఖ్యానములా? కావు. పోనీ! పరీక్షార్థులగు విద్యార్థుల కుపయోగపడు గైడులవంటివా? అన్న అట్టివియు కావు. మరి యేల వ్రాయబడుచున్నట్లు? ఇవి చెలామణీ అగుచుండుటకు హేతువులు :1. పట్టి మూలము కంటె ఏవో నాలుగు ముక్కలు గీకిన పుస్తకములుమేలుకదాఅనివిద్యార్థులనుకొనుట 2. మూల్యము అందుబాటులో ఉండుట. ఇట్లే పెద్ద పెద్ద గ్రంథములలోని విషయములను సంగ్రహించి వ్రాయు గ్రంథములు, పెద్ద పెద్ద వ్యాఖ్యలలోని విషయములు క్రోడీకరించి కలగాయ పులగము చేసి తయారు చేయు గ్రంథములు వ్యాపార దృష్టితో గ్రంథకర్తృత్వ లోభముతో వెలువడుచున్నవనిపించుచున్నది. ఇట్టివి స్వతంత్ర గ్రంథము లనిపించుకొనవు. ఇట్టి గ్రంథముల కన్న గైడులే యోగ్యములు.

ప్రస్తుత సంగ్రహ వ్యాఖ్య అసమగ్రము, లోప భూయిష్ఠమునై ఉన్నది. (1) వృత్తములు గణ సమక నిబద్ధములు, జాతులు మాత్రాసమక నిబద్ధములు—అని మూలము. మూలమెంత బోధపడునో వర్ణ గణ సమూహములు, మాత్రాగణ సమూహములు, అన్న వ్యాఖ్య అంతే బోధపడును. వర్ణ గణములు, మాత్రాగణములు అనువానిని సోదాహరణముగా వివరించుట ఆవశ్యకము.

2. ప్రాదియతి కిచ్చిన స్వీయోదాహరణ మిట్లున్నది.

"దీన జనముల పాలి యధీశ్వరుండు
మహిత గుణశాలి రాధా సమన్వితుఁడు"

ఇట రెండు లక్ష్యములు హల్లునకే చూపబడినవి. అచ్చుకు చూపకపోవుట అసమగ్రత. ఇట్లు సొంత పద్యములను చూపు ఉబలాటము కన్న వేరే లక్షణ గ్రంథములనుండి లక్ష్యములను తీసి చూపుట యుక్తము.

3. "సంయుక్తాక్షరముల నెది యైనను వడిగా నిడ వచ్చున్" అను దానికి వ్రాసిన సంగ్రహ వ్యాఖ్య సూటిగా సక్రమముగా లేదు. దురర్థస్ఫోరకముగా ఉన్నది.

4. పోలిక వడి శీల ముల్లమున కెనయనఁగా, భూలోకం బమర లోకమున కెనయనఁగా—అనుచోట్ల "ము విభక్తితో యతి చెల్లుచున్నది" ఇత్యాదిగా కలదు. బ్రేకెట్టులో వ్రాసిన దానిని బట్టి యిందలిది ము విభక్తి కాదని సంగ్రహ వ్యాఖ్యాతలు గుర్తించినట్లు కనబడును. కాని లక్ష్య సమన్వయమున ము విభక్తియే యని తప్పుగా చెప్పబడినది.

5. "దోసంబు లేక వస్తు ని,వాసంబై" అను ద్విప్రాస పద్యము కవిజనాశ్రయమున కలదు. "మీది పద్యము ప్రాస స్థానమునందు 'సం' అను నక్షరముతో ష్టాటుగ 'బ' వర్ణము కూడ నున్నది" అని వ్యాఖ్యలో చెప్పబడెను. ప్రాసస్థానమున నున్నది స కారము కాని 'సం' అన్నది కాదు.

6. "దానమున సత్యమున నభి
మానమునం బోల్ప నీ సమానము ధరణిం
గానమనం ద్రిప్రాసము
దాన మనోహర మగును బుధస్తుత చరితా'

అని కవిజనాశ్రయమున త్రిప్రాసమునకు లక్ష్యము చూపబడినది. "మీది పద్యమున ప్రాసమునందు వరుసగా నమున, నమునం, నమనం, నమనో— అని యుండి" అని వ్యాఖ్య. ఇట పూర్ణబిందువులతో చూపుట పొరపాటు.

7. "చ ఛ జ ఝ శ ష స అను నేడక్షరముల నొకదానికొకటి మిత్రాక్షరములుగా యతులయందు వాడబడును" అని సరసయతి వ్యాఖ్యలో కలదు. దీనిని బట్టి చ ఛ జ ఝలు, ఒకదానికొకటిమిత్రాక్షరములుగా యతులయందు వాడినను సరసయతి కావలసివచ్చును. కనుక ఈ వ్యాఖ్య అనాలోచితము.

8. వృత్తాధికారములో వ్రాసిన వ్యాఖ్య మూల పద్యముల నర్థము చేసికొనుట కుపకరించు పద్ధతిలో లేదు. ఏ లక్షణ గ్రంథ పద్యముల క్రిందనైనను చేర్చవచ్చు నన్నట్లున్నది.

9. పాదము నాద్యము భాద్విరేఫావళిన్—అనుచో "పాదములన్నియు పదమూడక్షరముల ప్రమాణము గలిగి యున్నవి. అతి జగతీ ఛందమున పుట్టినది" అనుట పొరపాటు. ఈ స్వాస్థాన విషమ వృత్తమున ప్రతిపాదమునందు పండ్రెండు అక్షరములే ఉన్నవి. ఇది జగతీ ఛందములోనిది.

10. వినుత ద్విత్రి చతుర్గురు—అను పద్యమును అర్థము చేసికొనకపోవుటచే పెక్కు అనర్థములు ఏర్పడినవి. ఒకటి— "నల నగ సల భరతలలో, వల నాఱును మీఁద రెండు పద్మాప్త గణంబులుగా" అను ప్రక్షిప్త పద్యము అసలు పాఠముగా ముద్రింపబడినది. అసలు పద్యము ప్రక్షిప్తముగా అడుగు పట్టినది. రెండు— సీసము, తరువోజ, ఎత్తుగీతి, ప్రగీతి, మేలనగీతి, తేటగీతి, ఆటవెలది, అను పద్యముల లక్షణము భగ్నమయినది. మూడు— మహాక్కర, మధ్యాక్కర, మధురాక్కర, అంతరాక్కర, అల్పాక్కర, ద్విపద, త్రిపద, షట్పద, అనువాని గణముల విషయము సరిగా తెలుపబడలేదు. నాలుగు— "భరత నగ నల సలంబులు,వరుసనె యియ్యాఱు నెన్న వాసవ గణముల్" అనునది ప్రక్షిప్తమని గ్రహింపబడలేదు.

11. త్రిపద లక్షణము చెప్పు పద్యమున కర్థము సరిపడుచున్నదా? లేదా? అను విషయము పట్టించుకొనక కిట్టింపు వ్రాత వ్రాయబడినది.

12. దోషాధికారములో కొన్ని పద్యములు పరిశీలన నపేక్షించును. అట్టి చోట్ల తోచినట్లెల్ల వ్రాసి దాటిపోవుట జరిగినది.

13. సమ సీసముల వివరణ ఒకటి రెండు చోట్ల తిన్నగా లేదు.

14. రెండుచోట్ల గణభంగములు ముద్రితము' "గణా, క్షరముఁ దద్గణము రెండుగా నెన్నఁబడున్". ఇట గణ భంగము కలిగెను. 1917 పరిషత్ప్రతిలో, 'గణాక్షరములు' ప్రధాన పాఠముగను, 'క్షరమును' పాఠాంతరముగాను కలదు. రెండు పాఠములు సరిగానే యున్నవి. "జయదేవచ్ఛందో—"అను చోటను. గణము చెడెను. "జయదేవాది చ్ఛందో" అను పూర్వ ముద్రణ పాఠములో గణభంగము లేదు.

"ముద్రిత ప్రతుల పాఠములను, అముద్రిత ప్రతుల యందలి భిన్న భిన్న పాఠములను బోల్చి మంచి చెడ్డలను దేల్చి ప్రస్తుత ప్రతిని సమకూర్చి" నట్లు అవతారికలో కలదు. అన్ని ముద్రిత ప్రతుల వరకు ఎందుకు, 1917 లో పరిషత్తువారు ప్రకటించిన దన్న ప్రతిలోని పాఠములయినను అన్నియు ఇందెక్కలేదు. అముద్రిత ప్రతు లెక్కడివో వాటిలో లభించిన పాఠములేవో దురూహ్యము.

సుష్ఠుగా పరిష్కరించి, యోగ్యమయిన వ్యాఖ్యతో కవిజనాశ్రయమును ప్రకటింపవలసిన ఆవశ్యకత కలదని యీ సంగ్రహవ్యాఖ్య లోకమునకు వెల్లడి చేయుచున్నది.

భూషణ కిరణావళి

(ప్రచురణ:— శ్రీరామరాజభూషణ సాహిత్య పరిషత్తు, భీమవరము. వెల: 5—00. డెమ్మీ 244 పుటలు.)

వసుచరిత్రపై సమీక్షా వ్యాసములు వ్రాయించి శ్రీ రామరాజభూషణ పరిషత్తు వారు 'భూషణ కిరణావళి' పేర గ్రంథ రూపమున ముద్రించినారు. దీనిలో ఐదు సమీక్షా వ్యాసా లున్నవి. చివర వసుచరిత్ర ప్రశంసావేశ మున్నది. ఆదిని ఆప్తవాక్య మనుపేర కొంత వ్రాయబడి యున్నది.

1. రామరాజభూషణుని సాహితీ శక్తులు: ఈ వ్యాసమును రచించినవారు శ్రీ వెంపరాల సూర్య నారాయణ శాస్త్రిగారు. 52 పుటల వ్యాసము. ఈ వ్యాసములో రామరాజభూషణుని శబ్దాలంకార రచన, విదూషకుని సంధానచాతుర్యము, మొదలయిన విషయములను సోదాహరణముగా వ్రాసినారు. శ్రీ శిష్ట్లా కృష్ణమూర్తిశాస్త్రిగారు 'స్వైవిరహార ధీరలు'అను పద్యములో చెప్పిన విశేషార్థములను తమ గురువులు శ్రీ చావలి లక్ష్మీనరసింహ శాస్త్రుల వారివలన విని శ్రీ వెంపరాలవారు, ఇందు పొందుపరచినారు. ఇది చదువదగిన విషయము. తక్కిన వ్యాసము ఇంచు మించు పాతపాటయే. "ముసలిమానుల్" అను ప్రయోగము శ్లేషానురోధమున నైనదనుట శ్రీ శాస్త్రిగారి వంటి గ్రాంథిక భాషావేత్తలకు తగినదికాదు. మహా కవులు ఛందో యతి ప్రాస శ్లేషాదుల నిర్బంధవశన అప్రయోగాలు చేయుదురన్నచో "ప్రయోగమూలం వ్యాకరణమ్" అనుట హాస్యాస్పదమగును. ఇట్టి ప్రయోగాలు శ్లేష నిర్బంధము లేనిచోట్లను ఉన్నవి. యతి స్థానములలో పడ్డవి. ఒకటి రెండున్నవి. వాటిని యతి నిర్బంధమన్నచో దారి యేమి? వ్యవస్థ ఎట్లు? ఇతరత్ర ఉన్న ప్రయోగాలను గుర్తించక పోవడము వల్ల తాత్కాలికముగా ఇటువంటి అభిప్రాయము వెల్లడించి ఉందురు. కనుక విస్తర మనవసరము.

2. వసుచరిత్ర తత్త్వము: రామరాజభూషణుని బ్రహ్మానుభూతి రాసిక్యము.—ఇది యీ గ్రంథములో రెండవ వ్యాసము. వ్యాసకర్త శ్రీ వాసిలి వేంకట లక్ష్మీ నరసింహారావుగారు. ఇది మంచి ఆలోచనాత్మకమయిన 74 పుటల వ్యాసము. "ఒక వంక శృంగార ప్రబంధ ముగా రూపొందించుచునే, మరొకవంక వసురాజ తత్త్వములో నిక్షేపింపబడిన భారతార్థమును వ్యంగ్య ముగా దీపింప జేయుచు కథను సానలదీరిన జాతి రత్నముగా" రామరాజభూషణు డెట్లు మలచెనో యీ వ్యాసమున వివరింపబడినది. యోగశాస్త్ర విషయ ములు చక్కగా సమన్వయించి చూపబడినవి.

3. వసుచరిత్రలోని కబ్బపు తెలుగు: వ్యాస కర్తలు శ్రీ. విశ్వనాథ సత్యనారాయణగారు. "తెలుగు మాటలు, తెలుగు మాటల కూర్పు, కొన్ని తెలుగు సమాసములు చేయుట్లు, పద్యములలో తెలుగు మాట లెచ్చట పెట్టినచో నందము వచ్చును? ఎంతవరకు పెట్టవచ్చును? అవి పెట్టినచో నెట్లు పెట్టవలెను? మొదలైన విద్య సర్వంకషముగా నేర్చినవాడు రామ రాజభూషణు డన్న విషయము ఈ వ్యాసములో వివ రింప బడినది.

4. సంగీత కళా రహస్యనిధి : ఈ వ్యాసమును రచించినవారు శ్రీ పంతుల లక్ష్మీనారాయణ శాస్త్రిగారు. ఇది 79 పుటల వ్యాసము. రాఘురాజభూషణుని సంగీత కళా రహస్య నిధిత్వమును సమగ్రముగా చర్చించి నిర్ణయించిన గొప్ప పరిశోధనాత్మక వ్యాసమిది. దీనిలో బృందాగాన పద్ధతి, వసంతరాగపు మహా సంపూర్ణ రాగత్వము మొదలయిన విశేషాంశము లెన్నో సప్రమాణముగా నిరూపింపబడినవి. వ్యాసకర్తల కృషి ప్రశంసాపాత్రముగ ఉన్నది.

5. వసుచరిత్రయందలి నాటకరీతులు : ఈ వ్యాసకర్త, శ్రీ దివాకర్ల వేంకటావధానిగారు. 17 పుటల వ్యాసమిది. వసు చరిత్రలోని నాటక రీతులను తెలుపుచున్నది. విద్యార్థుల కుపయోగపడును.

6. వసుచరిత్ర ప్రశంసావేశము : శ్రీ M. R అప్పారావుగారు దీనిని రచించినారు. "రమాకుమార" అన్న శబ్దములో వసుచరిత్రకారుడు చూపిన గొప్పతనమును ఇట్లు వివరించినారు. "రమాకుమార— అంటే మన్మథుడు. మాకుమార— అంటే మన్మథుడు. కుమార— అంటే మన్మథుడు. మార— అంటే మన్మథుడు. పదం తీసి పదం వేస్తే మన్మథుడు అన్నమాట. పోనీ వెనక్కు తిరిగి పోదామా అంటే వెనక్కు తిరిగినా మన్మథుడే. అంటే ఆ శబ్దాన్ని వెనక్కు త్రిప్పి చదవండి. రమాకుమార— అన్నది వెనక్కు త్రిప్పి చదివినా రమాకుమార— అనే అవుతుంది. ఇందులో ఒక్కొక్క అక్షరం వదిలి పెట్టినా మిగిలున్న పదమూ మన్మథుడే అవుతున్నాడు. ఈ రమాకుమారుడు ఎంత నిర్దయముగా చుట్టుముట్టి వేధిస్తున్నాడో చూడండి ఆ అబలను'. ఈ వివరణ శ్రీ యమ్. ఆర్. అప్పారావుగారి సాహిత్య వేతృత్వమునకు చక్కని నిదర్శన మనవచ్చును. దీనికి మరొక మాట జోడించ దగును. "మార— అంటే మన్మథుడు." అన్నంతవరకే శ్రీ అప్పారావుగారు వ్రాసి పూరకొన్నారు. 'మా' తీసివేసి 'ర' అన్నను మన్మథుడే.

అప్తవాక్యము:— రచయిత శ్రీ దిగుమర్తి సీతారామస్వామిగారు. వీరు "తమ అమూల్యములైన సలహాలనే గాకుండా ఆప్తవాక్యము వ్రాసి యిచ్చినారు.' 6 పుటలలో కావలసినన్ని కంకరరాళ్లు రామరాజభూషణుని మీద, అతని అభిమానుల మీద, విసరినారు.

(1) "ఆంధ్ర కవి స్తుతిలో రామరాజభూషణుడు ఎఱ్ఱన నను త్యజించుట అతివేలమైన శ్లేషవ్యామోహము గాక మరేమనగలదు." అన్నారు. శ్రీనాథుడు భీమ ఖండములో ఎఱ్ఱన నను వదలుటకు శ్లేష వ్యామోహమే అడ్డు వచ్చిన దందురు కాబోలు. హరవిలాసములో కవి స్తుతినే వదలుటకు ఏమి వ్యామోహము వచ్చి పడినదో కదా! "శ్రీనాథ కవిరాజశేఖరుండల పెద్దన కవిత్వమునకుఁ బ్రాణమ్ము పోసె" కదా! అతని పేర యిన పెద్దన తలపెట్టక పోవుటకు శ్లేష వ్యామోహమేనా? అడ్డపడినది.

(2) "భావనా శ్రమ మక్కర లేకయే గతానుగతిక ధోరణుల కలవాటుపడి హస్తచాలన మస్తకంపనములతో తృప్తిపడు శాబ్దికులకు వసుచరిత్ర అభిమాన కావ్యరాజము" అన్నారు. అనగా వసుచరిత్రలో భావనకు కావలసిన దేదియు లేదు. గతానుగతిక ధోరణికి చెందినది. శాబ్దిక జీవులు హస్త చాలన మస్త కంపనములతో దీనిని చదివి తృప్తిపడుదురు— అని తేల్చినారు. ఇక వసుచరిత్ర నభిమానించు పండితులు భావనా బలము లేనివారు. గతానుగతిక ధోరణుల కలవాటు పడినవారు. హస్త చాలన మస్త కంపనములతో తృప్తిపడు శాబ్దిక జీవులు— అని తేల్చినారు. అడిగిన పుణ్యమునకు కాబోలు ఈ అప్తవాక్యమును దానిని పరిషత్తు వారు ముద్రించినారు. "ఈ పరిషత్తు వారికి రామరాజభూషణుడు అభిమానకవి". కనుక పై దూషణములు ఈ పరిషత్తువారికివి చెందవలసినవే కదా! ఒక్కొక్క ప్రబంధములో ఒక్కొక్క విశిష్ట లక్షణ ముండును. ఆ విశిష్ట లక్షణము వల్లనే ఆ ప్రబంధము జీవించి యుండును. ఆ ప్రత్యేక లక్షణములో ఆ ప్రబంధమును మించి వ్రాయుట దుర్ఘటమనిపించును. ఆ ప్రబంధ మహత్వమునకు హేతుభూతములైన గుణ విశేషములను వివరించుట కర్తవ్యము.

ఈ గ్రంథము ప్రభుత్వపు ద్రవ్య సాహాయ్యముతో ముద్రితము. వేయి ప్రతులు వేసిరి. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమివారు ద్రవ్య సహాయ్యము చేసినచో మరికొన్ని ప్రతులు వేయుదురట. మరికొన్ని

ప్రతులు ఇవే వేయుట కన్న హరిశ్చంద్రదనలోపాఖ్యానముపై ఇటువంటి సమీక్షా వ్యాసముల సంకలనమును వేయుట మేలని తోచును.

—"రావి".

రెండు నాటికలు

దీనిలో రైల్వేలు జాతీయాదాయాలు—, ఇది నాటకం— అనే రెండు నాటిక లున్నాయి. రచయితలు— శ్రీయుతులు కె. వీరభద్రశాస్త్రి, మురళీకృష్ణ. పుటలు—84. వెల 1—50 ప్రాప్తిస్థానం— శ్రీ కె. వీరభద్రశాస్త్రి, జి. డి. వి. —1, రైల్వే క్వార్టర్స్, గుడివాడ. (కృష్ణా జిల్లా.)

ఏ రా జి త

1968 లో నెఫ్జా ఉత్తమ నాటిక. రచయిత— శ్రీ మద్దినీడి రాధాకృష్ణమూర్తి. పుటలు—58. వెల—ఒక రూపాయి. ప్రాప్తిస్థానం — శ్రీ పద్మశ్రీ పబ్లికేషన్స్, చిలుకలూరిపేట, గుంటూరు జిల్లా.

కళ - మూడవ సంపుటి

శ్రీ చలసాని ప్రసాదరావు సంపాదకత్వాన వెలువడుతున్న కళాపత్రిక, మూడవ సంపుటి యిది— పుటలు— 138. వెల 5—00. ప్రాప్తిస్థానం 70/2 ఆర్. టి. ప్రకాశంనగర్, హైదరాబాద్—18.

దీనిలో ప్రాచీన సాహిత్యంలో చిత్రకళ ప్రస్తావన— శ్రీ దేవులపల్లి ప్రభాకరరావు, ఆంధ్రుల ఆది చిత్రకళ— శ్రీ రాంభట్ల కృష్ణమూర్తి, బౌద్ధ యుగపు కళా సృష్టి— శ్రీ నార్ల వేంకటేశ్వరరావు, హిందూకళవికాసదశ— శ్రీ పి. పి. ఎస్. రెడ్డి, కాకతీయ శిల్పం -- శ్రీ చలసాని ప్రసాదరావు, విజయనగర చిత్రలేఖనం — శ్రీ అబ్బూరి గోపాలకృష్ణ, బ్రిటిష్ పాలన కాలపు చిత్రకళ— శ్రీ ఆచంట జానకిరామ్, పునరుజ్జీవనోద్యమ కాలపు చిత్రకళ— శ్రీ వేలూరి రాధాకృష్ణ, స్వాతంత్ర్యానంతర ఆంధ్ర చిత్రకళ—శ్రీ మనోహర్‌దత్, సమకాలీన చిత్రకళ— శ్రీ ఎం. రాజాజీ— అనే పరిశోధనాత్మకమయిన వ్యాసాలున్నాయి.

భా గ వ తా మృ త ము

1958 లో రాయలసీమ సాహిత్య పరిషత్తు పక్షాన ప్రొద్దుటూరులో జరిగిన శరన్నవరాత్రోత్సవంలో శ్రీ బూదూరు రామానుజులు రెడ్డి చదివిన వ్యాసం. పుటలు—64. వెల—1—50. ప్రాప్తిస్థానం— శ్రీ బూదూరు రామానుజులు రెడ్డి, గాంధి రోడ్డు, తిరుత్తణి, చెంగల్పట్టు జిల్లా, తమిళనాడు.

శ్రీ స త్యా న్వే షి

గాంధిజీ చరిత్ర పద్యకావ్యం. రచయిత— శ్రీ నారు నాగనార్య, పుటలు—170. వెల- 2—00 ప్రాప్తిస్థానం—శ్రీ నాగు నాగనార్య, నాగవరం, కడప జిల్లా.

మూంవత చావదు

మూకాభినయం కోసం శ్రీ కవిరాజమూర్తి రచించినది. పుటలు—36. వెల— లేదు. ప్రాప్తిస్థానం, తెలంగాణా ప్రజాసమితి, ఖమ్మంశాఖ, ఖమ్మం.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7, Thambu chetty Street Madras 1. Editor : S. Sambhu Prasad.